GRT JEWELLERS Since 1964

ఈనాడు

BRIDES
THE BRIDAL COLLECTION

విజయవాడ 21-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 161

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ANDHRA PRADESH | TELANGANA | KARNATAKA | TAMIL NADU | PUDUCHERRY || SINGAPORE

SCAN THE QR CODE TO WATCH VIDEO

Shop online at: www.grtjewels.com | GRT LIVE VIDEO SHOPPING Shop from the comfort of your home | : 1800 203 1000 / 1800 599 1515 | Follow us:

SCAN THE QR CODE FOR STORE LOCATOR

(c) eenadu

ఛాంపియన్



2024 చివర్లో సొంతగడ్డపై టీమ్‌ఇండియాను న్యూజిలాండ్ కొట్టిన దెబ్బను అభిమానులు అంత సులువుగా మరిచిపోలేరు. స్వదేశంలో అప్రతిహత విజయాలతో సాగిపోతున్న భారత్‌ను టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్ చేసి సంచలనం సృష్టించింది కివీస్. 15 నెలల విరామం తర్వాత పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్ కోసం మళ్లీ ఇక్కడికి వచ్చిన న్యూజిలాండ్‌పై టీమ్‌ఇండియా ఘనంగా ప్రతీకారం తీర్చుకుంటుందని ఆశించారు అభిమానులు. కానీ వన్డే సిరీస్ కూడా చేజారింది. ఇప్పుడిక ఆ జట్టుతో టీ20 సమరానికి సమయం ఆసన్నమైంది. సొంతగడ్డపై పొట్టి ప్రపంచ కప్ ముంగిట ఈ సిరీస్ సూర్యకుమార్ సేనకు ఎంతో కీలకం. మరి ఇప్పుడైనా కివీస్‌కు టీమ్‌ఇండియా బదులిస్తుందా?



రాత్రి 7 నుంచి

- ప్రపంచకప్ ముంగిట భారత్‌కు కీలక పోరు
- న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్ నేటి నుంచే

ఇప్పుడైనా బదులిస్తారా?

నాగ్‌పుర్

భారత గడ్డపై టెస్టు, వన్డే సిరీస్‌లు గెలవని లోటును 15 నెలల వ్యవధిలో తీర్చుకున్న న్యూజిలాండ్.. ఇప్పుడు టీమ్‌ఇండియాకు మరో సవాల్ విసురుతోంది. టీ20 ప్రపంచకప్ ముంగిట జరిగే చివరి సిరీస్‌ను ఆ జట్టుతోనే ఆడబోతోంది సూర్యకుమార్ సేన. అయిదు టీ20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ బుధవారం నాగ్‌పుర్‌లో జరగనుంది. వన్డే సిరీస్ జరిగిన తీరు చూస్తే.. టీ20 పోరు కూడా హోరాహోరీగా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

శ్రేయస్ ఆడతాడా?: సొంతగడ్డపై టీ20 ప్రపంచ కప్ ముంగిట జరుగుతున్న చివరి సిరీస్ కావడంతో భారత్‌కు ఇది ఎంతో కీలకం. టెస్టులు, వన్డేల్లో ఎలాంటి ఫలితాలు వస్తున్నప్పటికీ.. టీ20ల్లో టీమ్‌ఇండియా వరుస సిరీస్ విజయాలతో దూసుకెళ్తుండడం శుభ సూచకం. 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత్ ఈ ఫార్మాట్లో ఒక్క సిరీసూ ఓడిపోలేదు. గత నెలలో దక్షిణాఫ్రికాను ఓడించిన సూర్యకుమార్ సేన.. అంతకుముందు ఆస్ట్రేలియాను దాని సొంతగడ్డపై మట్టికరిపించింది. ఇదే ఊపులో కివీస్‌నూ ఓడించి పొట్టి ప్రపంచకప్‌నకు ఆత్మవిశ్వాసంతో సిద్ధం కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. శస్త్రచికిత్స కారణంగా ఈ సిరీస్‌కు తిలక్ వర్మ దూరం కావడంతో శ్రేయస్ అయ్యర్‌కు జట్టులో చోటు దక్కింది. అతను తొలి టీ20లో బరిలోకి దిగే అవకాశాలున్నాయి. మూడేళ్లకు పైగా టీ20ల్లో ఆడని శ్రేయస్.. ఇప్పుడు తుది జట్టులో అవకాశం లభిస్తే ఎలా ఉపయోగించుకుంటాడో చూడాలి. ప్రమాదకర ఓపెనర్ అభిషేక్ శర్మపై భారత్ చాలా ఆశలు పెట్టుకుంది. అతను పవర్ ప్లే అయ్యే వరకు నిలిస్తే జట్టుకు బలమైన పునాదే పడుతుంది. అభిషేక్‌తో కలిసి సంజు శాంసన్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. అతను మంచి లయలోనే ఉన్నాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అదరగొట్టి జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్ మూడో స్థానంలో బరిలో దిగనున్నాడు. కానీ సారథి ఫామే జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ఈ సిరీస్‌లో అయినా సూర్య జోరందుకుంటాడేమో చూడాలి. హార్దిక్ పాండ్య మిడిలార్డర్‌కు అతి పెద్ద బలం. అతడితో పాటు మరో ఆల్‌రౌండర్ శివమ్ దూబె కూడా తుది జట్టులో ఉండే అవకాశముంది. వీళ్లిద్దరూ బౌలింగ్‌లోనూ కీలకమే. నాగ్‌పుర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలం కాబట్టి బుమ్రా ఒక్కడే తుది జట్టులో స్పెషలిస్టు పేసర్‌గా ఉండొచ్చు. అక్షర్ పటేల్‌కు తోడు కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి స్పిన్ బాధ్యతలు పంచుకుంటారు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శ్రేయస్ అయ్యర్/రింకు సింగ్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, శివమ్ దూబె, కుల్‌దీప్, జస్‌ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి.

న్యూజిలాండ్: టిమ్ రాబిన్సన్, డెవాన్ కాన్వే (వికెట్ కీపర్), రచిన్ రవీంద్ర, డరెల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, మార్క్ చాప్‌మన్, జేమ్స్ నీషమ్, మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), మ్యాట్ హెన్రీ, ఇష్ సోధి, జాకబ్ డఫీ.



శాంట్నర్

25

న్యూజిలాండ్‌తో భారత్ ఆడిన టీ20లు. 12 మ్యాచ్‌ల్లో గెలిచి, 10 ఓడింది. 3 మ్యాచ్‌లు టై అయ్యాయి. స్వదేశంలో ఆ జట్టుతో 11 మ్యాచ్‌లు ఆడిన భారత్.. 7 నెగ్గి, 4 ఓడింది.

బలమైన బ్యాటింగ్‌తో..: వన్డే సిరీస్ గెలిచిన కివీస్.. టీ20ల్లో ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. భీకర ఫామ్‌లో ఉన్న మిచెల్‌కు తోడు ఫిలిప్స్, కాన్వే, టిమ్ రాబిన్సన్, రచిన్ రవీంద్ర, చాప్‌మన్, నీషమ్‌లతో ఆ జట్టు బ్యాటింగ్ చాలా బలంగా కనిపిస్తోంది. స్పెషలిస్టు స్పిన్నర్లు శాంట్నర్, ఇష్ సోధిలకు తోడు పార్ట్‌టైమర్లు రచిన్, ఫిలిప్స్‌లతో స్పిన్ విభాగం కూడా మెరుగ్గా ఉంది. మ్యాట్ హెన్రీ, జాకబ్ డఫీ, నీషమ్ పేస్ బాధ్యతలు పంచుకుంటారు.

ఆ వేదికలో చేదు జ్ఞాపకం: న్యూజిలాండ్‌తో తొలి టీ20కి వేదికగా నిలవనున్న నాగ్‌పుర్ స్టేడియంలో ఇదే ప్రత్యర్థి చేతిలో పదేళ్ల ముందు ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది టీమ్‌ఇండియా. 2016లో ధోని నాయకత్వంలోని భారత జట్టు 47 పరుగుల తేడాతో ఓడింది. స్పిన్‌కు విపరీతంగా సహకరించిన పిచ్‌పై మొదట కివీస్ 7 వికెట్లకు 126 పరుగులే చేయగలిగింది. దీంతో టీమ్‌ఇండియా అలవోకగా లక్ష్యాన్ని ఛేదించేస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ శాంట్నర్ (4/11), ఇష్ సోధి (3/18)ల ధాటికి విలవిలలాడిన భారత్.. 18.1 ఓవర్లలో కేవలం 79 పరుగులకే కుప్పకూలింది. ప్రస్తుత మ్యాచ్‌లోనూ స్పిన్నర్ల జోరు కొనసాగుతుందనే అంచనాలున్నాయి. నాడు భారత్‌ను దెబ్బ కొట్టిన శాంట్నర్, సోధి ఇప్పుడు కూడా కివీస్ జట్టులో ఉన్నారు. వీరికి తోడు పార్ట్‌టైమ్ స్పిన్నర్లు గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్రల అండ కూడా ఆ జట్టుకుంది. భారత్ కూడా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశముంది. ఇరు జట్ల బ్యాటర్లు స్పిన్నర్లను ఎలా ఎదుర్కొంటారన్న దాని మీదే మ్యాచ్ ఫలితం ఆధారపడి ఉంటుందనడంలో సందేహం లేదు. రాత్రయ్యే కొద్దీ మంచు ప్రభావం పెరిగి బంతిపై పట్టు దొరకడం కష్టమవుతుంది కాబట్టి టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ చేసే అవకాశముంది.

నాలుగు మ్యాచ్‌ల్లో మూడు ఓటములు.. పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానం.. మరో మ్యాచ్ ఓడితే ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టమయ్యే స్థితిలో దిల్లీ క్యాపిటల్స్ సవాలుకు నిలిచింది. బలమైన ముంబయిని ఓడించి డబ్ల్యూపీఎల్-4లో రెండో విజయాన్ని ఖాతాలో వేసుకుంది. బౌలింగ్‌లో మరిజేన్ కాప్, శ్రీ చరణి ప్రత్యర్థిని కట్టడి చేస్తే.. బ్యాటింగ్‌లో లిజెలీ లీ, జెమీమా రాణించారు.

దిల్లీ నిలిచింది

- మెరిసిన కాప్, జెమీమా, లిజెలీ
- ముంబయిపై ఘనవిజయం



జెమీమా

వడోదర

డబ్ల్యూపీఎల్-4లో మంగళవారం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ 7 వికెట్ల తేడాతో ముంబయి ఇండియన్స్‌ను ఓడించింది. మొదట నాట్ సీవర్ (65 నాటౌట్; 45 బంతుల్లో 6×4, 2×6), హర్మన్‌ప్రీత్ కౌర్ (41; 33 బంతుల్లో 7×4) రాణించడంతో ముంబయి 5 వికెట్లకు 154 పరుగులు సాధించింది. దిల్లీ పేసర్ మరిజేన్ కాప్ (4-0-8-1) గొప్పగా బౌలింగ్ చేసింది. తెలుగమ్మాయి శ్రీ చరణి 3 వికెట్లు పడగొట్టింది.



శ్రీ చరణి

అనంతరం డీసీ 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. జెమీమా రోడ్రిగ్స్ (51 నాటౌట్; 37 బంతుల్లో 5×4, 1×6) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. లిజెలీ లీ (46; 28 బంతుల్లో 7×4, 1×6), షెఫాలి వర్మ (29; 24 బంతుల్లో 6×4) ఛేదనలో దిల్లీకి బలమైన పునాది వేశారు. అయితే ఓపెనర్లు ఔటయ్యాక దిల్లీ కొంచెం ఇబ్బంది పడింది. ముఖ్యంగా లిజెలీ వివాదాస్పద రీతిలో స్టంపౌట్ అయ్యాక డీసీ ఒత్తిడిని ఎదుర్కొంది. కానీ పట్టుదలతో చివరి వరకు క్రీజులో నిలిచిన జెమీమా.. లారా వోల్వార్ట్ (17), మరిజేన్ కాప్ (10 నాటౌట్)ల సహకారంతో జట్టును గెలిపించింది.

మరిజేన్ అదరహో: మొదట టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబయి.. ఇన్నింగ్స్‌ను ఆరంభించిన తీరు చూస్తే, ఆ జట్టు 150 దాటడం గొప్పే. మరిజేన్ కాప్ అద్భుత స్పెల్‌తో ముంబయి బ్యాటర్లను కట్టి పడేసింది. వరుసగా నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసిన ఆమె.. కేవలం 8 పరుగులే ఇచ్చి ప్రమాదకర ఓపెనర్ హేలీ మాథ్యూస్ (12)ను బౌల్డ్ చేసింది. మరో ఓపెనర్ సజన (9)ను నందని శర్మ బౌల్డ్ చేయగా.. పవర్‌ప్లే ముగిసేసరికి 23/2తో ముంబయి తీవ్ర ఇబ్బందికర స్థితికి చేరుకుంది. అయితే ఈ స్థితిలో మరోసారి ముంబయిని నాట్ సీవర్, హర్మన్‌ప్రీత్ జోడీ ఆదుకుంది. ఫామ్‌ను కొనసాగిస్తూ సీవర్ మెరుపు ఇన్నింగ్స్ ఆడగా.. హర్మన్ కూడా నిలకడగా బ్యాటింగ్ చేసింది. మూడో వికెట్‌కు 78 పరుగులు జోడించాక హర్మన్ ఔట్ కాగా.. తర్వాత నాట్‌సీవర్‌కు మరో ఎండ్ నుంచి సహకారం అందలేదు. హర్మన్‌ను ఔట్ చేసిన తెలుగమ్మాయి శ్రీ చరణి.. నికోలా కేరీ (12), అమన్‌జ్యోత్ (3)లనూ పెవిలియన్ చేర్చింది. కానీ సీవర్ చివరి వరకు క్రీజులో నిలిచి స్కోరును 150 దాటించింది.

ముంబయి ఇండియన్స్ ఇన్నింగ్స్: సజన (బి) నందని 9; హేలీ మాథ్యూస్ (బి) మరిజేన్ 12; నాట్ సీవర్ నాటౌట్ 65; హర్మన్‌ప్రీత్ (సి) లూసీ (బి) శ్రీ చరణి 41; నికోలా (సి) స్నేహ్ (బి) శ్రీ చరణి 12; అమన్‌జ్యోత్ (సి) లిజెలీ (బి) శ్రీ చరణి 3; సంస్కృతి నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **154; వికెట్ల పతనం:** 1-21, 2-21, 3-99, 4-130, 5-134; **బౌలింగ్:** మరిజేన్ కాప్ 4-0-8-1; లూసీ హామిల్టన్ 4-0-36-0; నందని శర్మ 4-0-36-1; శ్రీ చరణి 4-0-33-3; స్నేహ్ రాణా 3-0-27-0; షెఫాలి వర్మ 1-0-14-0

దిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: షెఫాలి (బి) వైష్ణవి 29; లిజెలీ (స్టంప్డ్) రహిల (బి) అమన్‌జ్యోత్ 46; లారా వోల్వార్ట్ రనౌట్ 17; జెమీమా నాటౌట్ 51; మరిజేన్ కాప్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 2 **మొత్తం:** (19 ఓవర్లలో 3 వికెట్లకు) **155; వికెట్ల పతనం:** 1-63, 2-84, 3-118; **బౌలింగ్:** షబ్నిమ్ ఇస్మాయిల్ 4-0-26-0; నికోలా కేరీ 1-0-13-0; నాట్ సీవర్ 4-0-42-0; సంస్కృతి 1-0-13-0; అమన్‌జ్యోత్ 3-0-21-1; వైష్ణవి 4-0-20-1; హేలీ మాథ్యూస్ 2-0-19-0

పోల్‌వాల్ట్ ఛాంపియన్‌కు చేదు అనుభవం



దేవ్‌కుమార్, కుల్దీప్

దిల్లీ: భారత మేటి పోల్‌వాల్టర్, జాతీయ రికార్డు కూడా నెలకొల్పిన దేవ్‌కుమార్ మీనాకు రైల్వే స్టేషన్‌లో చేదు అనుభవం ఎదురైంది. క్రీడా పరికరాల (పోల్స్)ను వెంట తీసుకెళ్లేందుకు అనుమతించకుండా దేవ్‌కుమార్‌ను రైల్వే సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. పన్వేల్ రైల్వే స్టేషన్‌లో ఈ సంఘటన చోటుచేసుకోగా.. చివరికి జరిమానా చెల్లించిన తర్వాతే దేవ్‌కుమార్ ప్రయాణానికి అనుమతి లభించింది. గత ఏడాది జులైలో జర్మనీలో జరిగిన ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో 5.40 మీటర్ల ఎత్తు దూకి.. వరుసగా మూడోసారి తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును దేవ్‌కుమార్ తిరగరాశాడు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చిన క్రీడాకారుడికి ఇలాంటి అవమానం జరగడంపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. మంగళూరులో జరిగిన అఖిల భారత అంతర్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అనంతరం దేవ్‌కుమార్.. తన కోచ్ ఘన్‌శ్యామ్, తోటి ఆటగాడు కుల్దీప్‌తో కలిసి భోపాల్ వెళ్లేందుకు పన్వేల్ చేరుకున్నాడు. స్టేషన్‌లో పోల్స్‌తో వేచి ఉన్న సమయంలో టీటీఈ వచ్చి.. క్రీడా పరికరాలను తీసేయాలని ఆదేశించాడు. తాము క్రీడాకారులమని, పతకాలు సాధించామని చెప్పినా వినని అధికారి.. క్రీడా పరికరాలను లగేజీ కంపార్ట్‌మెంట్‌లోకి పంపాలని పట్టుబట్టాడు. 4-5 గంటల పాటు వాదించినా అధికారి వినలేదు. దీంతో 80 కిలోల బరువుకు రూ.1,875 జరిమానా చెల్లించిన తర్వాతే రైలులో వెళ్లనిచ్చాడు. ఫైబర్ గ్లాస్‌తో తయారయ్యే సున్నితమైన పోల్ ఒక్కోటి రూ.2 లక్షలు ఖరీదని, లగేజీతో పాటు వేస్తే విరిగిపోయే ప్రమాదం ఉంటుందని.. ఒక అంతర్జాతీయ అథ్లెట్‌కు ఇలాంటి పరిస్థితి ఎదురైతే జూనియర్ల సంగతేంటని దేవ్‌కుమార్ ప్రశ్నించాడు.

ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికాకు హర్మన్ సేన

జొహానెస్‌బర్గ్: టీ20 ప్రపంచకప్ సన్నాహంలో భాగంగా భారత మహిళల జట్టు ఏప్రిల్‌లో దక్షిణాఫ్రికాలో పర్యటించనుంది. ఆతిథ్య దక్షిణాఫ్రికాతో అయిదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పోటీపడనుంది. ఏప్రిల్ 17న ఈ సిరీస్ ఆరంభమవుతుంది. మ్యాచ్‌ల వివరాలను క్రికెట్ దక్షిణాఫ్రికా (సీఎస్‌ఏ) మంగళవారం ప్రకటించింది. ఏప్రిల్ 17, 19న జరిగే మ్యాచ్‌లకు డర్బన్‌లోని కింగ్స్‌మీడ్, ఏప్రిల్ 22, 25న మ్యాచ్‌లకు వాండరర్స్ (జొహానెస్‌బర్గ్) ఆతిథ్యమిస్తాయి. 27న జరిగే ఆఖరి మ్యాచ్ బెనోనిలోని విల్లోమూర్ పార్క్‌లో జరుగుతుంది. ఇంగ్లాండ్‌లో జూన్ 12న టీ20 ప్రపంచకప్ ఆరంభంకానుంది.

ఐసీసీ ఒత్తిడికి తలవంచం

బంగ్లా ప్రభుత్వ సలహాదారు

ఢాకా: టీ20 ప్రపంచకప్ కోసం తమ జట్టు భారత్‌కు వెళ్లదని బంగ్లాదేశ్ ప్రభుత్వ క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ అన్నాడు. ఐసీసీ ఒత్తిడికి తలవంచబోమని తెలిపాడు. భారత్‌కు వెళ్లాలా? లేదా? అన్నది బుధవారంలోపు తేల్చుకోవాలంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఐసీసీ అల్టిమేటం జారీచేసిన సంగతి తెలిసిందే. 20 జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీకి బంగ్లా రాకపోతే.. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌ను ఆడించే అవకాశముంది. "మా స్థానంలో స్కాట్లాండ్‌ను తీసుకుంటారన్న విషయం నాకు తెలియదు. భారత బోర్డు ఒత్తిడికి ఐసీసీ తలొగ్గి అసమంజసమైన షరతులు విధిస్తే మేం ఒప్పుకోం. మాపై ఒత్తిడి తీసుకురావాలని ప్రయత్నిస్తే అంగీకరించం. గతంలో భారత్‌కు వెళ్లబోమని పాకిస్థాన్ చెప్పినప్పుడు ఐసీసీ వేదికను మార్చిన ఉదంతాలు ఉన్నాయి. మేం సహేతుక కారణాలతోనే వేదికను మార్చాలని కోరాం. భారత్‌లో ఆడాలంటూ మాపై ఒత్తిడి తీసుకురాలేరు" అని నజ్రుల్ తెలిపాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్



సినర్

అగ్రశ్రేణి ఆటగాడు, ఫేవరెట్లలో ఒకడు యానిక్ సినర్.. ఏడాదిలో తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను ఘనవిజయంతో ఆరంభించాడు. అతడి ధాటికి తాళలేక తొలి రెండు రెండు సెట్లలో చిత్తయిన ప్రత్యర్థి.. మూడో సెట్ ఆడకుండానే రిటైరైపోయాడు. ఫ్రాన్స్ వెటరన్ ఆటగాడు మోన్‌ఫిల్స్.. తన చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండో రౌండైనా చేరకుండానే నిష్క్రమించాడు. మూడో రోజు మిగతా స్టార్ ప్లేయర్లందరూ విజయాలు సాధించారు.

సినర్ మొదలెట్టాడు

- తొలి రౌండ్లో అలవోక విజయం

ఓటమితో మోన్‌ఫిల్స్ వీడ్కోలు



మోన్‌ఫిల్స్

మెల్‌బోర్న్: డిఫెండింగ్ ఛాంపియన్ యానిక్ సినర్.. ఆస్ట్రేలియన్ ఓపెన్‌ను ఘనంగా మొదలుపెట్టాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఈ రెండో సీడ్ ఆటగాడు 6-2, 6-1తో ఆధిక్యంలో ఉండగా.. ప్రత్యర్థి హ్యూగో గాస్టన్ (ఫ్రాన్స్) రిటైరైపోయాడు. రెండు సెట్లలోనూ రెండేసిసార్లు తన సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్‌కు గాస్టన్ నుంచి ప్రతిఘటనే లేకపోయింది. మూడో సెట్ ఆరంభానికి ముందు గాయం కారణంగా ప్రత్యర్థి తప్పుకున్నాడు. కానీ ఏం గాయం అన్నది అతను వెల్లడించలేదు. ఇక ఇదే తన చివరి ఆస్ట్రేలియన్ ఓపెన్ అని టోర్నీ ఆరంభానికి ముందే ప్రకటించిన ఫ్రాన్స్ స్టార్ మోన్‌ఫిల్స్‌కు చేదు అనుభవం ఎదురైంది. 39 ఏళ్ల మోన్‌ఫిల్స్ 7-6 (7-3), 5-7, 6-4-6, 5-7తో క్వాలిఫయర్ డేన్ స్వీనీ (ఆస్ట్రేలియా) చేతిలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అయిదో సీడ్ ముసెటి (ఇటలీ) ముందంజ వేశాడు. అతను 4-6, 7-6 (7-3), 7-5, 3-2తో ఆధిక్యంలో ఉండగా.. ప్రత్యర్థి రఫెల్ కొలిగ్నన్ (బెల్జియం) మ్యాచ్ నుంచి తప్పుకొన్నాడు. 8వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా) 6-3, 7-6 (7-2), 7-6 (7-5)తో యుగో హంబర్ట్ (ఫ్రాన్స్)పై చెమటోడ్చి నెగ్గగా.. 9వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 7-6 (7-5), 5-7, 6-1, 6-3తో వాలెంటిన్ (ఫ్రాన్స్)ను ఓడించాడు. 15వ సీడ్ కరెన్ కచనోవ్, 16వ సీడ్ మెన్సిక్ (చెక్ రిపబ్లిక్), సిట్సిపాస్ (గ్రీస్), డార్డెరి (ఇటలీ) తర్వాతి రౌండ్ చేరారు.

కీస్ ముందంజ: మహిళల సింగిల్స్‌లో తొమ్మిదో సీడ్ మ్యాడిసన్ కీస్ (అమెరికా) శుభారంభం చేసింది. తొలి రౌండ్లో ఆమె 7-6 (8-6), 6-1తో ఒలినికోవా (ఉక్రెయిన్)పై విజయం సాధించింది. 16వ సీడ్ నవోమి ఒసాకా (జపాన్) 6-3, 3-6, 6-4తో ఆంటోనియా రుజిక్ (క్రొయేషియా)పై నెగ్గగా.. అయిదో సీడ్ ఎలీనా రిబకినా 6-4, 6-3తో కాజా జువాన్ (స్లొవేనియా)ను, పదో సీడ్ బెలిండా బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 6-0, 7-5తో కేటీ బౌల్టర్ (బ్రిటన్)ను, వొస్త్రాపెంకో (లాత్వియా) 6-4, 6-4తో రెబెకా (స్లొవేకియా)ను, 22వ సీడ్ లేలా ఫెర్నాండెజ్ (కెనడా) 2-6, 6-7 (1-7)తో జానిస్ (ఇండొనేసియా)ను, కరోలినా ప్లిస్కోవా (చెక్ రిపబ్లిక్) 7-6 (9-7), 6-2తో స్లొవేన్ స్టీఫెన్స్ (అమెరికా)ను ఓడించారు.

నిక్కి జోడీ ఔట్: ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ నుంచి భారత కుర్రాడు నిక్కి పూనాచా తొలి రౌండ్లోనే నిష్క్రమించాడు. నిక్కి, ప్రుచ్యా ఇసారో (థాయ్‌లాండ్) జోడీ తొలి రౌండ్లో 6-7 (3-7), 5-7తో పెడ్రో-జేమ్ (స్పెయిన్) జంట చేతిలో ఓడింది.



ఆస్ట్రేలియన్ ఓపెన్ తొలి రౌండ్ ఆడేందుకు ఒసాకా వచ్చిందిలా..



సానియా

క్రీడాకారిణులకు అండగా సానియా

ఈనాడు, హైదరాబాద్: భారత్‌లో అగ్రశ్రేణి, వర్ధమాన క్రీడాకారిణులకు భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా అండగా నిలవనుంది. ఇందుకోసం 'ది నెక్ట్స్ సెట్'ను ప్రారంభిస్తున్నట్లు మంగళవారం సానియా ప్రకటించింది. మొదట టెన్నిస్‌తో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపింది. అత్యున్నత స్థాయిలో మహిళా అథ్లెట్లకు నిర్మాణాత్మక మద్దతు, ప్రొఫెషనల్ క్రీడల్లో అవసరాలకు తగ్గట్లు సహాయం అందించడం 'ది నెక్ట్స్ సెట్' ముఖ్య ఉద్దేశం. టోర్నీల్లో పాల్గొనే క్రీడాకారిణులకు కోచ్‌లు, ఫిజియోథెరపిస్టులు, ట్రెయినర్ల సేవల్ని అందివ్వడం ఇందులో ప్రధానమైనది. దాంతోపాటు సానియా ఆధ్వర్యంలో అకాడమీలో టెన్నిస్ శిక్షణ శిబిరాలు, కోచింగ్ క్లినిక్‌లు నిర్వహిస్తారు. "ది నెక్ట్స్ సెట్‌తో నాది ప్రత్యేక అనుబంధం. కెరీర్‌లో ఎన్నో ఒడుదొడుకులను అనుభవించిన నాకు సరైన సమయంలో మార్గనిర్దేశం ఎంతగా పనికొస్తుందో ప్రత్యక్షంగా తెలుసు. భారత మహిళా టెన్నిస్‌లో ప్రతిభకు కొదవలేదు. సరైన మద్దతుతో మన క్రీడాకారిణులు ప్రపంచ వేదికపై పోటీపడొచ్చు. భవిష్యత్తు తరానికి బలమైన బాట వేయడమే నా ఉద్దేశం" అని సానియా వివరించింది.

ఎ+ గ్రేడ్ తొలగించనున్న బీసీసీఐ

దిల్లీ: ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్టుల్ని క్రమబద్ధీకరించాలని బీసీసీఐ నిర్ణయించింది. 2018లో ప్రవేశపెట్టిన ఎ+ గ్రేడ్‌ను తొలగించాలని బోర్డు భావిస్తోంది. ప్రస్తుత విధానం ప్రకారం ఎ+ కేటగిరీలో ఆటగాడికి యేటా రూ.7 కోట్లు, ఎ గ్రేడ్‌లో రూ.5 కోట్లు, బి విభాగంలో రూ.3 కోట్లు, సి కేటగిరీలో రూ.1 కోటి చెల్లిస్తున్నారు. 2025-26 సీజన్ నుంచి ఎ, బి, సి గ్రేడ్‌లు మాత్రమే ఉండనున్నాయి. గత సీజన్‌లో రోహిత్‌శర్మ, విరాట్ కోహ్లి, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజాలకు మాత్రమే బీసీసీఐ ఎ+ గ్రేడ్ కాంట్రాక్టులు ఇచ్చింది. ఈ నలుగురిలో ప్రస్తుతం బుమ్రా ఒక్కడే మూడు ఫార్మాట్లలో ఆడుతున్నాడు. టెస్టులు, వన్డేలకు జడేజా అందుబాటులో ఉన్నాడు. ఎ గ్రేడ్‌లో ఉన్నవారికి ఈసారి రూ. 7 కోట్లు దక్కొచ్చు.. బి కేటగిరి ఆటగాళ్ల ఫీజును పెంచే అవకాశముంది. కోహ్లి, రోహిత్ బి విభాగంలో ఉండొచ్చు.

విండీస్‌పై అఫ్గాన్ విజయం

దుబాయ్: వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో విండీస్‌ను ఓడించి సిరీస్‌లో 1-0 ఆధిక్యం సంపాదించింది. ఇబ్రహీం జద్రాన్ (87 నాటౌట్; 56 బంతుల్లో 8×4, 3×6), 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దార్విష్ రసూలి (84; 59 బంతుల్లో 8×4, 2×6) చెలరేగడంతో మొదట అఫ్గాన్ 3 వికెట్లకు 181 పరుగులు చేసింది. రసూలి, జద్రాన్ మూడో వికెట్‌కు 162 పరుగులు జోడించి జట్టుకు భారీ స్కోరు అందించారు. అనంతరం విండీస్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 143 పరుగులే చేయగలిగింది. జాన్సన్ ఛార్లెస్ (27; 16 బంతుల్లో 3×4, 2×6), క్వెంటిన్ సాంప్సన్ (30; 24 బంతుల్లో 2×4, 2×6), గుడాకేశ్ మోటీ (28; 15 బంతుల్లో 2×4, 1×6) పోరాడినా ఫలితం లేకపోయింది. ముజిబుర్ రెహమాన్ (2/29), జియావుర్ రెహమాన్ (3/36), రషీద్ ఖాన్ (2/19), నూర్ అహ్మద్ (2/34) అఫ్గాన్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

51 బంతుల్లో సెంచరీ

అండర్-19లో మలచెక్ రికార్డు

విండ్‌హోక్ (నమీబియా): అండర్-19 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్ విల్ మలచెక్ వేగవంతమైన శతకం నమోదు చేశాడు. మంగళవారం గ్రూప్-ఎలో జపాన్‌తో మ్యాచ్‌లో 51 బంతుల్లోనే సెంచరీ నమోదు చేశాడు. 202 పరుగుల ఛేదనలో మలచెక్ (102; 55 బంతుల్లో 12×4, 5×6) చెలరేగడంతో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా 2 వికెట్లు కోల్పోయి 29.1 ఓవర్లలో అలవోకగా విజయాన్ని అందుకుంది. 23 బంతుల్లో అర్ధసెంచరీ చేసి మలచెక్.. మరో 28 బంతుల్లో సెంచరీ మార్కును చేరుకున్నాడు. అంతకుముందు జపాన్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. గ్రూప్-బిలో రెండు విజయాలు సాధించిన భారత్.. శనివారం తన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను ఢీకొంటుంది.

(c) eenadu

అందమైన రేపటికోసం
మీ అరచేతిలోనే
అవకాశం
యాప్ డౌన్‌లోడ్ కోసం
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి
www.epratibha.net

ఈనాడు

విజయవాడ 21-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 161

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

55 మసాలాలు ఒక్క ప్రియ
మటన్ రోగన్ జోష్ మసాలా
Follow on www.priyafoods.com Order on Whatsapp 9949000722

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చూశాకే
పెట్టుబడులు పెట్టండి

1,054 కి.మీ తీరం, పోర్టులు, ఎయిర్‌పోర్టులే ఏపీకి బలం

దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25% మా రాష్ట్రానికే

దావోస్ 'ఏపీ ఎడ్వాంటేజ్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ఏపీలో గ్రీన్ ఎనర్జీ, టెక్నాలజీ, ఇంధనం, డిజిటల్ ఇన్‌ఫ్రా, లాజిస్టిక్స్, తయారీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులకు అవకాశాలున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పరిశ్రమలకు అనుకూలంగా మలుస్తున్నామని వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు చూశాకే పెట్టుబడులపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. 1,054 కిలోమీటర్ల తీరం, పోర్టులు, ఎయిర్‌పోర్టులే రాష్ట్రానికి బలమని ఉద్ఘాటించారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా మంగళవారం బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో జరిగిన 'ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' అంశంపై చంద్రబాబు ప్రసంగించారు. 2047 నాటికి భారత్ ప్రపంచశక్తిగా మారుతుందని, అందులో ఏపీ ముందంజలో ఉంటుందని వివరించారు. 'దావోస్ వచ్చిన ప్రతిసారీ పారిశ్రామికవేత్తలు, నిపుణుల నుంచి కొత్త విషయాలు తెలుసుకుంటాను. మార్పులకు అనుగుణంగా కొత్త పాలసీలు రూపొందిస్తాం. టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారతీయులు, అందులోనూ తెలుగు ప్రజలు ముందుంటారు' అని చెప్పారు.

పారిశ్రామికవేత్తలకు అతిపెద్ద మార్కెట్‌గా ఏపీ

పెట్టుబడులకు ఏపీని మించిన అత్యుత్తమ గమ్యస్థానం మరోటి లేదని, పారిశ్రామికవేత్తలకు అతిపెద్ద మార్కెట్ తమ రాష్ట్రమే అవుతుందని చంద్రబాబు చెప్పారు. వ్యవసాయ, వైద్య రంగాల్లో డ్రోన్ల (మిగతా 3లో)



'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' అంశంపై దావోస్‌లో మంగళవారం నిర్వహించిన సీఐఐ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. వేదికపై ఫిలిప్ ఆస్మస్, రిచర్డ్ వర్మ, సంజీవ్ బజాజ్, రాజీవ్ మేమాని, చంద్రజిత్ బెనర్జీ, మార్లిన్ బ్లాట్‌నర్ హోయ్‌లె

రాష్ట్రంలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత

యూఏఈ మంత్రి అబ్దుల్లా, చంద్రబాబు భేటీలో నిర్ణయం 3లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹ 75	ఫారం దగ్గర లైవ్ బర్డ్	157 కిలో	డ్రస్డ్ స్కిన్‌తో	267 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్	184 కిలో	స్కిన్‌లెస్	304 కిలో

Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది



హరిత ఇంధన రంగంలో
రూ.10లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

- పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో 2.7 లక్షల ఉద్యోగాల కల్పన
- ఏపీలో 6 గిగావాట్ల డేటా సెంటర్లను నెలకొల్పుతున్నాం
- సీఐఐ రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: హరిత ఇంధన (గ్రీన్ ఎనర్జీ) రంగంలో 2029 నాటికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఏపీ ఇప్పటికే రూ.5.22 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందని, దీంతో పునరుత్పాదక శక్తి, అనుబంధ రంగాల్లో 2.7 లక్షల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు. 'సుస్థిరతను విస్తృతస్థాయిలో అమలుచేయడం- ప్రపంచ పరివర్తనకు మార్గాలు' అనే అంశంపై సీఐఐ ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. "ఏపీలో 6 గిగావాట్ల డేటాసెంటర్లను నెలకొల్పుతున్నాం. ఇందుకు అవసరమైన విద్యుత్తును కాలుష్య రహితంగా అందించడానికి (మిగతా 2లో)

రూ.లక్ష కోట్ల పెట్టుబడి.. లక్ష ఉద్యోగాలు

- విశాఖ కాపులుప్పాడలో 10 మిలియన్ చదరపు అడుగుల్లో జీసీసీ పార్క్
- దావోస్‌లో మంత్రి లోకేశ్ సమక్షంలో ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్‌మెండా ప్రకటన

3లో

ట్రంప్ కల్లోలం

ఐరోపాపై విరుచుకుపడిన అమెరికా అధ్యక్షుడు

- నేతల ప్రైవేటు సందేశాలను బయటపెట్టిన డొనాల్డ్
- ఫ్రాన్స్‌పై 200% సుంకాల హెచ్చరిక
- జీ7 భేటీకి మెక్రాన్ పిలుపు
- కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు
- మన దేశంలో రూ.9.86 లక్షల కోట్ల సంపద ఆవిరి



వాషింగ్టన్, దావోస్, లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఐరోపాలో కల్లోలం సృష్టిస్తున్నారు. గ్రీన్‌లాండ్‌కు మద్దతుగా నిలుస్తున్న దేశాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గతంలో తీసుకున్న నిర్ణయాలను తిరగదోడుతున్నారు. ఐరోపా నేతల ప్రైవేటు సంభాషణలనూ బయట పెడుతున్నారు. ఫ్రాన్స్‌పై ఏకంగా 200 శాతం సుంకాలను విధిస్తానని బెదిరించారు. చాగోస్‌ను మారిషస్‌కు అప్పగించాలని బ్రిటన్ గత ఏడాది తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టారు. వీటిపై ఐరోపా దేశాలూ దీటుగానే స్పందిస్తున్నాయి. ప్రతి సుంకాలను ప్రకటిస్తామని హెచ్చరించాయి. ఈయూ-అమెరికాల వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసుకుంటామని తేల్చి చెప్పాయి. జీ7 భేటీకి సిద్ధమని ఫ్రాన్స్ ప్రకటించింది. ఐరోపా, అమెరికా దౌత్య ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ స్టాక్ మార్కెట్లు పడిపోయాయి. మన దేశంలోని బీఎస్ఈ, ఎన్ఎస్ఈ నేలచూపులు చూశాయి. దాదాపు రూ.9.86 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది.

చాగోస్‌పై యూటర్న్

గతంలో మారిషస్‌కు చాగోస్ ద్వీపాల అప్పగింతపై సానుకూలంగా స్పందించిన ట్రంప్ యూటర్న్ తీసుకున్నారు. 'ఆశ్చర్యకరంగా మన తెలివైన నాటో భాగస్వామి అయిన బ్రిటన్.. హిందూ మహా సముద్రంలో ఉన్న డీగో గార్షియా ద్వీపాన్ని మారిషస్‌కు అప్పగించడానికి ప్రణాళిక రూపొందించింది. అది అమెరికా బాంబర్లకు, నేవీకి కీలక స్థావరం. కారణం లేకుండానే బ్రిటన్ ఆ పని చేస్తోంది. ఈ చర్యను కచ్చితంగా చైనా, రష్యా మన బలహీనత అనే అనుకుంటాయి. అత్యంత కీలకమైన భూభాగాన్ని బ్రిటన్ అప్పగించడం తెలివి తక్కువతనమే. దాని అప్పగింత కారణంగానే గ్రీన్‌లాండ్‌ను అమెరికా కావాలనుకుంటోంది' అని ట్రంప్ మంగళవారం పేర్కొన్నారు. (మిగతా 2లో)

ప్రసంగంలో కొన్ని పేరాలు చదవని కేరళ గవర్నర్

అసెంబ్లీలో సీఎం విజయన్ అసహనం

లోపలి పేజీల్లో

కేంద్ర ఉద్యోగిపై అవినీతి ఆరోపణలను

రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయవచ్చు

సుప్రీంకోర్టు తీర్పు

వివేకా హత్యకేసులో తదుపరి దర్యాప్తు అవసరమా.. కాదా?

- కచ్చితంగా ఏదో ఒకటి చెప్పండి
- ఇప్పటివరకూ మీరు అస్పష్టంగా మాట్లాడటమే సమస్య
- సీబీఐని ఉద్దేశించి సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంఎం సుందరేష్ వ్యాఖ్య

ఈనాడు - దిల్లీ

మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించాలా.. అక్కర్లేదా అన్నది సీబీఐ స్పష్టంగా చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో సీబీఐ ఎప్పుడూ అస్పష్టంగా వ్యవహరిస్తోందని వ్యాఖ్యానించింది. ఇప్పటికైనా స్పష్టంగా ఏం కావాలో చెబితే దాని ప్రకారం తాము ముందుకెళ్తామని స్పష్టం చేసింది. ఏ విషయం రెండువారాల్లో చెప్పాలని జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేసింది. తన తండ్రి వివేకానందరెడ్డి హత్యకేసులో విస్తృత కుట్రకోణం వెలికితీసే వరకూ దర్యాప్తు జరిపేలా సీబీఐని ఆదేశించాలని కోరినా సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం కేవలం కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డి అనే ఇద్దరి పాత్రపైనే దర్యాప్తునకు అనుమతిస్తూ డిసెంబర్ 10న వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ సునీతా నర్రెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యకాలీన దరఖాస్తుపై విచారణ సందర్భంగా ధర్మాసనం సీబీఐకి ఈ ఆదేశాలిచ్చింది.

కాల్ రికార్డులతో ప్రయోజనం లేదని కోర్టెలా చెబుతుంది?

విచారణ ప్రారంభమైన వెంటనే సునీతా నర్రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు ప్రారంభించారు. "మేం అడగని అంశాలను సీబీఐ కోర్టు పరిగణనలోకి తీసుకొని నిర్ణయం వెలువరించింది. రూ.4కోట్ల మనీట్రయల్‌పై దర్యాప్తు అసంపూర్తిగా జరిగింది. దానిపై లోతుగా పరిశీలించాలి. సీబీఐ కూడా అదే చెప్పింది. నిందితుల కాల్ రికార్డులను సేకరించడం వల్ల తదుపరి ప్రయోజనం ఏమీ నెరవేరదని సీబీఐ కోర్టు అభిప్రాయపడింది. ఈ అంశాన్ని కోర్టు ఎలా నిర్ధారిస్తుంది? హతుడి కుమార్తె తదుపరి దర్యాప్తు కోరుతున్నారు. కోర్టు ఉత్తర్వుల అమలుకు అభ్యంతరం లేదని సీబీఐ చెప్పింది" అని పేర్కొన్నారు. ట్రయల్ కోర్టు మాత్రం ఈ విషయాల్లో తదుపరి దర్యాప్తు అక్కర్లేదని ముందే ఒక నిర్ణయానికి (మిగతా 2లో)



లోపలి పేజీల్లో

కేసు ఫైళ్లను మూడో పక్షానికి ఇవ్వం

కోర్టు ఉత్తర్వులు కోరిన పిటిషనర్‌కు హైకోర్టు స్పష్టీకరణ

తిరుగు ప్రయాణాల వేళ ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం


19న ఒక్కరోజే రూ.27.68 కోట్ల రాబడి

50.60 లక్షల మంది ప్రయాణం

గ్యాప్ 2 ప్రధాన డ్యాం ఆకృతులపై విదేశీ నిపుణుల చర్చలు

పోలవరం ప్రాజెక్ట్

గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులనూ పర్యవేక్షించిన బృందం



భాజపా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌ని అభినందిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, బీఎల్ సంతోష్

నితిన్ నబీన్ నాకు బాస్

- పార్టీలో నేనొక కార్యకర్తను
- తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం
- ఓటమిని సమీక్షించుకునే ధైర్యం కాంగ్రెస్‌కు లేదు
- నూతన కమల దళపతి బాధ్యతల స్వీకరణలో మోదీ

దిల్లీ: పార్టీకి సంబంధించిన విషయాల్లో తానొక కార్యకర్తను మాత్రమేనని, తనకు బాస్ నితిన్ నబీన్ అని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. 'కార్యకర్తగా పార్టీలో నా పనితీరు నివేదికను కొత్త అధ్యక్షుడికి ఇస్తున్నా. నా సీఆర్ (పనితీరుపై రహస్య నివేదిక)ను ఇప్పుడు ఆయన రాస్తారు. ఆయన మార్గదర్శనం కోసం నిరీక్షిస్తున్నా. భాజపాతోపాటు ఎన్డీయే పక్షాలన్నింటి సమన్వయ బాధ్యత ఆయనదే' అని చెప్పారు. భాజపా జాతీయాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన 45 ఏళ్ల నితిన్ నబీన్ మంగళవారం దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. బూత్ నుంచి జాతీయ స్థాయి వరకు వివిధ పదవులకు జరిగిన ఎన్నికల ఫలితాలను రిటర్నింగ్ అధికారి, (మిగతా 2లో)

24న విశాఖ ఉత్సవ్ ప్రారంభం

20 ప్రధాన కేంద్రాల్లో నిర్వహణ

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రుల బృందం




పోస్టర్ విడుదల చేస్తున్న మంత్రులు కొల్లు రవీంద్ర, డోలా వీరాంజనేయస్వామి, కందుల దుర్గేష్, సంధ్యారాణి, అనిత. చిత్రంలో ఎంపీ శ్రీభరత్ తదితరులు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని చాటి చెప్పేలా ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు 'విశాఖ ఉత్సవ్'ను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రుల బృందం తెలిపింది. 'సాగరం నుంచి శిఖరం వరకు' అనే నినాదంతో నిర్వహించే ఈ ఉత్సవ్ ఏర్పాట్లపై మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో మంత్రుల బృందం సమీక్షించింది. అనంతరం వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి, కొల్లు రవీంద్ర, (మిగతా 2లో)

పైపైకి పసిడి

10 గ్రాములు రూ.1.50 లక్షలకుపైగా..

ఈనాడు వాణిజ్య విభాగం: బంగారం, వెండి ధరలు మంగళవారం మరింత పెరిగాయి. మేలిమి (24 క్యారెట్లు) బంగారం 10 గ్రాముల ధర తొలిసారిగా రూ.1.50 లక్షలను అధిగమించింది. గ్రీన్‌లాండ్ స్వాధీనానికి, గాజా శాంతిమండలిలో సభ్యత్వానికి సహకరించడం లేదంటూ ఐరోపా దేశాలపై, ఫ్రాన్స్‌పై భారీ సుంకాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతో, అంతర్జాతీయంగా వాణిజ్యయుద్ధ భయాలు పెరిగాయి. ఫలితంగా సురక్షితమని భావించే పసిడి, వెండిపై పెట్టుబడులు మరింత పెరిగాయి. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) బంగారం ధర మంగళవారం 85 డాలర్లు పెరిగి 4763 డాలర్లకు చేరింది. హైదరాబాద్ బులియన్ విపణిలో రాత్రి 11.55 గంటలకు 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,52,800 వద్ద, కిలో వెండి ధర రూ.3,16,300 వద్ద స్థిరపడ్డాయి.



శ్రీశైలం మరమ్మతులపై కదలిక

సాంకేతిక నిపుణుల గ్రూపు ఏర్పాటు • ఎన్‌డీఎస్‌ఏ సిఫార్సుల నేపథ్యంలో సీడబ్ల్యూసీ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాలకు కీలకమైన శ్రీశైలం ప్రాజెక్టు ప్లంజ్‌పూల్‌తో పాటు డ్యాంకు చేయాల్సిన మరమ్మతులపై ఎట్టకేలకు కదలిక మొదలైంది. ఆరేడేళ్లుగా నిపుణుల కమిటీలు చేసిన సిఫార్సులు కాగితాలకే పరిమితం కాగా... గత ఏడాది మే నెలలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) చేసిన సిఫార్సులు, ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ విజ్ఞప్తి మేరకు సాంకేతిక నిపుణుల గ్రూపును ఏర్పాటు చేస్తూ కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) నిర్ణయం తీసుకుంది. ఇందులో సీడబ్ల్యూసీ, సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్(సీఎస్ఎంఆర్ఎస్), సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సీడబ్ల్యూపీఆర్ఎస్) సంస్థలకు చెందిన వారు సహా రెండు రాష్ట్రాల ఇంజినీర్లు, కృష్ణా బోర్డు నుంచి డైరెక్టర్ స్థాయి అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ మేరకు (మిగతా 2లో)



శ్రీశైలం డ్యాం దిగువన దెబ్బతిన్న అప్రాన్, భారీ గుంతగా మారిన ప్లంజ్‌పూల్



ఉగాది నుంచి పచ్చదనం ప్రాజెక్టు

అన్ని శాఖలూ కార్యాచరణ సిద్ధం చేయాలి

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'రాష్ట్రాన్ని 50% పచ్చదనం(గ్రీన్ కవర్)తో నింపే ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధితో భాగస్వాములు కావాలి. ఉగాదిలోపు ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఉగాది నుంచి కార్యాచరణ ప్రారంభించాలి' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో మంగళవారం అన్ని శాఖల ఉన్నతాధికారులతో పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు. గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. 'పరిశ్రమల శాఖ కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీరప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కలను నాటేందుకు సిద్ధం కావాలి. స్వదేశీ మొక్కలను ఈ ప్రాజెక్టులో నాటేలా చూడాలి. రాష్ట్రంలో పచ్చదనం పెంపునకు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రం మొత్తం భూభాగంలో 2047 నాటికి సగం పచ్చదనంతో నిండిపోవాలనేది లక్ష్యం. ఇందుకు 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాలి. ప్రస్తుతం 30% పచ్చదనం ఉంది. 2030 నాటికి 37% లక్ష్యం సాధించాలి. ఇందుకు 9 లక్షల హెక్టార్లలో చెట్లను పెంచాలి. ఇందులో ఉద్యానశాఖ 12% మొక్కలు నాటే లక్ష్యం తీసుకోవాలి. జాతీయ రహదారుల్లో రహదారుల వెంట మొక్కలు నాటినట్లే రాష్ట్ర రహదారుల వెంట కూడా (మిగతా 2లో)

(c) eenadu

ట్రంప్ కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

■ గ్రీన్‌లాండ్ విషయంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు కృషి చేస్తున్న బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌కు ట్రంప్ వ్యాఖ్యలు షాకిచ్చాయి. గ్రీన్‌లాండ్ స్వాధీనం చేసుకుంటానని ట్రంప్ ప్రకటించడం పూర్తిగా తప్పని, అయితే చర్చల ద్వారా ఈ సమస్యకు పరిష్కారం కనుగొంటామని ఆయన సోమవారం ప్రకటించారు.

■ చాగోస్‌ను మారిషస్‌కు అప్పగించినా మరో వందేళ్లపాటు డీగో గార్షియాలో అమెరికా స్థావరం కొనసాగుతుందని బ్రిటన్ మంత్రి డారెన్ జోన్స్ మంగళవారం స్పష్టం చేశారు.



ప్రైవేటు సందేశాల వెల్లడి

గ్రీన్‌లాండ్‌పై ఐరోపా నేతలు పంపిన ప్రైవేటు సందేశాలను ట్రంప్ బయటపెట్టారు. దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు సందర్భంగా తాను ఐరోపా నేతలతో సమావేశమవుతానని ఆయన వెల్లడించారు. అమెరికా జాతీయ, ప్రపంచ భద్రత కోసం గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుని తీరతామని స్పష్టం చేశారు.

■ మెక్రాన్ తనకు పంపిన ప్రైవేటు సందేశాన్ని ట్రంప్ బయటపెట్టారు. 'సిరియా విషయంలో ఒకేలా వ్యవహరించాం. ఇరాన్ విషయంలోనూ గొప్పగా పని చేశాం. కానీ గ్రీన్‌లాండ్ విషయంలో మీరేం చేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు' అని ఆంగ్లంలో మెక్రాన్ ట్రంప్‌నకు సందేశం పంపారు.

■ దావోస్‌కు వచ్చిన ట్రంప్‌తో భేటీకి సిద్ధమని, జీ7 దేశాల నేతలను ఆహ్వానిస్తానని, వారితోపాటు ఉక్రెయిన్, డెన్మార్క్, సిరియా, రష్యా వారినీ పిలుస్తానని మెక్రాన్ తాజాగా తెలిపారు. గురువారం ట్రంప్‌ను విందుకు తీసుకెళ్తానని చెప్పారు.

■ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రూట్ పంపిన సందేశాన్నీ ట్రంప్ బయటపెట్టారు. 'గ్రీన్‌లాండ్‌కు పరిష్కార మార్గం చూసేందుకు కట్టుబడి ఉన్నా. మిమ్మల్ని చూసేందుకు ఎదురుచూస్తున్నా' అని రూట్ తన సందేశంలో పేర్కొన్నారు.

■ నోబెల్ గురించి పట్టించుకోనని, అది నార్వే ప్రభుత్వం ఇస్తున్న అవార్డని ట్రంప్ వ్యాఖ్యానించారు.

ఏఐ జనరేటెడ్ చిత్రాలతో..

రెండు ఏఐ జనరేటెడ్ చిత్రాలను ట్రంప్ సోమవారం రాత్రి పోస్టు చేశారు. ఒక దాంట్లో ఐరోపా నేతలతో గ్రీన్‌లాండ్ గురించి చర్చిస్తున్నట్లుగా ఉంది. ఈ సందర్భంగా అమెరికా, కెనడా, వెనెజువెలా, గ్రీన్‌లాండ్ మ్యాప్‌లపై అమెరికా జాతీయ జెండాలు ఇంపోజ్ చేసిన చిత్రం కనిపించింది. మరో దాంట్లో గ్రీన్‌లాండ్‌లోని మంచుకొండల్లో అమెరికా జెండాతో ట్రంప్ ఉన్నారు. ఆయన వెనుక ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో ఉన్నారు. ఈ చిత్రానికి 'గ్రీన్‌లాండ్ అమెరికా భూభాగం. 2026లో ఏర్పాటైంది' అని క్యాప్షన్ కూడా ఉంది.

ముప్పేట దాడికి ఈయూ సిద్ధం

ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో ముప్పేట దాడికి ఐరోపా కూటమి సిద్ధమైంది. ప్రతీకార చర్యలకు ఉన్న పలు అవకాశాలను పరిశీలిస్తోంది. అందులో ముఖ్యంగా మూడింటిపై దృష్టి పెడుతోంది. అందులో.. 1. ప్రతీకార సుంకాలు, 2. ఈయూ-అమెరికా వాణిజ్య ఒప్పందం నిలిపివేత, 3. అమెరికా సంస్థలు, వ్యక్తులపై ఆంక్షలున్నాయి.

■ గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌కు ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లేయెన్ గట్టిగా మద్దతిచ్చారు. ఆ దేశ సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత విషయంలో ఎటువంటి చర్చలకు తావులేదని మంగళవారం దావోస్‌లో స్పష్టం చేశారు. ఆర్కిటిక్ ప్రాంత రక్షణకు ఐరోపా కట్టుబడి ఉందని తేల్చి చెప్పారు. ట్రంప్ విధిస్తానన్న అదనపు సుంకాలు తప్పని వ్యాఖ్యానించారు.

■ సుంకాల అంశంలో ఐరోపా దేశాలకు కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ (డెమోక్రాట్) మద్దతు తెలిపారు. అయితే ఐరోపా నేతల స్పందన పేలవంగా ఉందని, వారంతా గట్టిగా నిలవాలని సూచించారు.

■ ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో ఐరోపా స్టాక్ మార్కెట్లు పడిపోయాయి.

■ ఒకవైపు అమెరికా, ఐరోపా బంధం బలంగానే ఉందని అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ స్పష్టం చేశారు. 'వారు గట్టిగా ఊపిరి పీల్చుకోవచ్చు. గ్రీన్‌లాండ్ నేపథ్యంగా ట్రంప్ విధించిన సుంకాల హెచ్చరిక తేలిపోవాలని కోరుకుంటున్నా' అని దావోస్‌లో వ్యాఖ్యానించారు.

ఫ్రాన్స్‌పై సుంకాల దాడి

గ్రీన్‌లాండ్‌కు గట్టి మద్దతుదారుగా నిలుస్తున్న ఫ్రాన్స్‌పై ట్రంప్ సుంకాలతో విరుచుకుపడ్డారు. 200 శాతం సుంకాలను విధిస్తానని బెదిరించారు. అంతేకాకుండా ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తనకు పంపిన ప్రైవేటు సందేశాన్ని బయటపెట్టారు. 'ఫ్రాన్స్ వైన్, షాంపేన్‌లపై 200 శాతం సుంకాలను విధిస్తా. గాజా అభివృద్ధి బోర్డులో మెక్రాన్ చేరతానని చెప్పినా అవసరం లేదు' అని ట్రూత్ సోషల్ మీడియా వేదికలో ట్రంప్ పేర్కొన్నారు. గాజా బోర్డులో చేరబోమని అంతకుముందు మెక్రాన్ ప్రకటించారు.

గ్రీన్‌లాండ్ స్థావరానికి ప్రత్యేక యుద్ధ విమానం

గ్రీన్‌లాండ్ చుట్టూ అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ తన ప్రత్యేక విమానాన్ని గ్రీన్‌లాండ్‌లోని పిటుఫిక్ స్పేస్ బేస్‌లో మోహరించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ విమానం దీర్ఘకాల రక్షణ కార్యకలాపాల్లో భాగంగా మోహరించనున్నట్లు వెల్లడించింది. ఈ విమానం త్వరలో అక్కడికి చేరుకోనుంది.

నితిన్ నబీన్ నాకు బాస్

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ లాంఛనంగా ఈ వేదికపై ప్రకటించి, నితిన్‌కు ధ్రువపత్రాన్ని అందజేశారు. తర్వాత మోదీ, కేంద్ర మంత్రులు ఆయన్ని ఛాంబర్‌కు తోడ్కొనివెళ్లారు. అనంతరం ప్రధాని మాట్లాడుతూ.. అపార అనుభవం, ఎంతో శక్తిసామర్థ్యాలు నితిన్‌కు ఉన్నాయని చెప్పారు. ఆయన నిర్దేశకత్వం అమూల్యమైన ఆస్తి అని తెలిపారు.

సున్నా నుంచి శిఖరాగ్రానికి

"భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. పార్టీలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. గతంలో వాజ్‌పేయీ, ఆడ్వాణీ, వెంకయ్యనాయుడు, మురళీమనోహర్ జోషిల నేతృత్వంలో మనం సున్నా నుంచి శిఖరాగ్రం వరకు చేరి ఘన విజయాలు సాధించాం. ఈ శతాబ్దంలో వెంకయ్యనాయుడు, గడ్కరీ తదితర నేతలు పార్టీని విస్తరించారు. రాజ్‌నాథ్ నేతృత్వంలో కేంద్రంలో మొదటిసారి సొంతంగా మనం మెజార్టీ సాధించాం. అమిత్‌షా హయాంలో అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేయడంతోపాటు రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చాం. నడ్డా నేతృత్వంలో పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు బలపడ్డాం.

కార్యకర్తను అనిపించుకోవడమే గర్వకారణం

భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. ప్రతి కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. గతంలో గెలవని రాష్ట్రాల్లోనూ ఈ పన్నెండేళ్లలో గెలిచి చూపించాం. బెంగాల్, తెలంగాణలో కూడా బలపడుతున్నాం. కేరళలోనూ గెలిచే అవకాశాలున్నాయి' అని మోదీ చెప్పారు.

కాంగ్రెస్ తప్పిదాలను మనం చేయొద్దు

కాంగ్రెస్ చేస్తున్న తప్పిదాల నుంచి భాజపా కార్యకర్తలు పాఠాలు నేర్చుకుని అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని మోదీ సూచించారు. 1984లో 400 పైగా లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న ఆ పార్టీ ఇప్పుడు 100 మార్కును దాటడానికి ఆపసోపాలు పడుతోందని ఎద్దేవా చేశారు. సమీక్షించుకునే ధైర్యమే ఆ పార్టీకి లేదన్నారు. 'భాజపా అంటే ఒక సంప్రదాయం.. ఒక కుటుంబం. సభ్యత్వాల కంటే సంబంధాలకు మనం విలువిస్తాం. పనిచేయడం జీవితకాల బాధ్యత' అని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ దిగ్గజాలుగా చెప్పుకొనే దేశాలు కూడా అక్రమ వలసదారుల్ని గుర్తించి వెళ్లగొడుతున్నాయని, దానిని ఎవరూ ప్రశ్నించడం లేదని చెప్పారు. మన దేశంలోనూ ఇలా జరగాలన్నారు. అర్బన్ నక్సల్స్‌తోనూ సవాళ్లు ఉన్నాయని చెప్పారు.

యువత రావాలి: నబీన్

నబీన్ మాట్లాడుతూ యువత రాజకీయాలకు దూరంగా ఉండటం పరిష్కారం కాదని, ఈ రంగంలోకి వచ్చి క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్త చేసే ప్రయత్నాన్ని పార్టీ గుర్తిస్తుందని చెప్పారు. భారతీయ సంప్రదాయాలకు ఆటంకం కలిగించే పార్టీలను ఓడించాల్సిన అవసరం ఉందన్నారు.




నితిన్ నబీన్‌ను సత్కరించిన శ్రీనివాసవర్మ, పీవీఎన్ మాధవ్, సత్యకుమార్
★ నబీన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ పురందేశ్వరి

ఏపీ నేతల అభినందన

ఈనాడు, దిల్లీ: భాజపా జాతీయ అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు ఏపీ భాజపా అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎంపీ పురందేశ్వరి అభినందించారు. పార్టీ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ మంగళవారం ప్రకటించిన అనంతరం బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఈ నలుగురు నేతలు పార్టీ ప్రధాన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పర్యటనకు రావాలని ఆహ్వానించారు.

■ నబీన్ పార్టీ పగ్గాలు అందుకున్న సందర్భంగా దిల్లీలో, బిహార్‌లో సంబరాలు జరిగాయి. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బాంకీపుర్ అసెంబ్లీ నియోజకవర్గం పట్నాలో ఉండటంతో కార్యకర్తలు వాయిద్యాలతో హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తూ మిఠాయిలు పంచుకున్నారు.

జడ్ కేటగిరీ భద్రత

కమల దళపతికి వీవీపీల మాదిరిగా సీఆర్‌పీఎఫ్ ద్వారా జడ్ కేటగిరీ భద్రత కల్పించనున్నారు. ఆయన దేశంలో ఎక్కడకు వెళ్లినా సీఆర్‌పీఎఫ్ కమాండోల రక్షణ లభిస్తుంది.

ఇవి ఎన్నికలా? బిగ్‌బాస్ ఆటా?: కాంగ్రెస్

ముందుగానే అధ్యక్షుడిని ప్రకటించి, దానిని ఎన్నికగా భాజపా చూపిస్తోందని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. ఇవి ఎన్నికలా.. బిగ్‌బాస్ ఆటా అని పార్టీ ప్రచార విభాగాధిపతి పవన్ ఖేడా ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో మతలబులు చేయడానికి అవకాశం రానందుకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ అసంతృప్తితో ఉండి ఉంటారని వ్యంగ్యంగా అన్నారు.

వామపక్షాలు బలపడితేనే ప్రజాస్వామ్యం పదిలం: డి.రాజా

ఈనాడు- ఖమ్మం; న్యూస్‌టుడే, ఖమ్మం మామిళ్లగూడెం: ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే కమ్యూనిస్టులు బలోపేతం కావాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలన్నీ ఏకతాటిపై నిలిచి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ఓటుహక్కు సహా ప్రజల హక్కులన్నింటినీ హరించివేస్తోందని, మోదీ సర్కారును గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఖమ్మంలో నిర్వహిస్తున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమాలు మంగళవారం మూడో రోజుకు చేరుకున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన 'నేటి భారతదేశం- వామపక్షాలు ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో రాజా ప్రసంగించారు. బ్రిటిష్ వలసవాదులతో రాజీపడిన ఆరెస్సెస్‌కు పోరాట చరిత్ర లేదని విమర్శించారు. కేరళలో వామపక్ష కూటమి తిరిగి అధికారంలోకి రావాలని, పశ్చిమబెంగాల్‌లో పుంజుకొని పాలనా పగ్గాలు చేపట్టాలని ఆకాంక్షించారు. తమిళనాడు, పుదుచ్చేరిలో లౌకికవాదాన్ని కాపాడాలని, భాజపాను అడుగుపెట్టనివ్వవద్దని కోరారు.

TRANSMISSION CORPORATION OF ANDHRA PRADESH LIMITED
(A Government of Andhra Pradesh Undertaking & an ISO 27001-2022 Certified Company)
VIDYUTH SOUDHA, VIJAYAWADA-520004.

e-Procurement Tender Notice

APTRANSCO invites bids online for the following work. Spec No.APT-e-10/2026 for Supply, Erection, Testing and Commissioning of i) 132 kV DC line by making LILO of 132KV Kandukur-Kavali SC line to 132 KVSS Ulavapadu ii)Replacement of ACSR Lynx with ACSS Lynx Conductor on 132KV Kandukur-Kavali SC line from Ulavapadu SS (LILO Point) to Kavali SS iii) Stringing of 2nd Circuit on 132 KV Kandukur-Kavali DC/SC Line iv) 3 Nos 132KV bays at Ulavapadu SS in SPSR Nellore district on turnkey basis."Date & availability of tenders in http://www.apeprocurement.gov.in from 21.01.2026. Phone: 7075270101.

RO. No : GMCC/APTRANSCO/25/26 Sd/- Chief Engineer/Projects

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు

నెం.31,32SE/2025-26 తేది: 17.01.2026

పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ వారి పరిధిలో గల అంచనా విలువ రూ. 213.40 లక్షలు మంజూరు కాబడిన పనులకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడం అయినది. టెండర్ షెడ్యూల్ లభించు తేది: 21.01.2026 నుండి 05.02.2026 సా. 5 గం.ల వరకు, తదుపరి వివరాలను www.apeprocurement.gov.in లో పొందగలరు. ఫోన్ నెం.08662575276. సం/- పర్యవేక్షక ఇంజనీరు, ఇరిగేషన్ సర్కిల్, విజయవాడ

DIPR. R.O.No.18834/CL/ADVT/1/1/2021-22

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన R.C. No.H1/112422/2026 Dt:18-01-2026

శ్రీ అమ్మవారి దేవస్థానము నందు ప్రసాదముల తయారికి, వడితరములకు మరియు అన్నదానమునకు అవసరమైన రసవర్గములను సప్లయి చేయుటకు గాను ది.01-04-2026 నుండి 30-09-2026 వరకు అనగా 6 నెలల కాలపరిమితికి గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వివరములకు https://apeprocurement.gov.in లో Endowments Department నందు చూడవలసినదిగా తెలియజేయడమైనది. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడు ది:21-01-2026 మ॥ 03.00 గం॥ల నుండి. టెండరు దాఖలు చేయు ఆఖరు తేది:04-02-2026 సా॥ 04.00 గం॥లు. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్:7799077238 ద్వారా సంప్రదించగలరు.

ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.

శ్రీ బొర్రా రాధాకృష్ణ — చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ — స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
ఆసక్తి వ్యక్తీకరణ (ఇఓఐ)

ఇఓఐ నెం.1/ RWS&S/CE.II/ఇన్‌హౌస్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్/2025, తేది: 13-1-2026

కనీసం 15 పరామితులలో విశ్లేషించే సామర్థ్యంగల ప్రి-ప్రోగ్రామ్డ్ మరియు ప్రి-క్యాలిబ్రేటెడ్ పోర్టబుల్ మల్టీపారామీటర్ వాటర్ క్వాలిటీ ఎనలైజర్ యొక్క సరఫరా, స్థాపన, పనిచేయించుట మరియు సమగ్ర వార్షిక నిర్వహణ కొరకు తయారీదార్లు/ అధీకృత సరఫరాదార్లు/ డీలర్ల ఎంప్యానెల్మెంట్ నిమిత్తం ఇఓఐ కోరబడుచున్నది. పాల్గొనుటకు ఆసక్తిగల ఏజెన్సీలు ఇ-ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫామ్: www.apeprocurement.gov.in నుండి 27-1-2026 నుండి డాక్యుమెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. సంప్రదించవల్సిన మొబైల్ నెం: 9100120535.

సం/- చీఫ్ ఇంజనీర్-II & ప్రాజెక్టు డైరెక్టర్, RWS&S శాఖ, విజయవాడ

DIPR. No. 18827/CL/ADVT/1/1/2021-22

ACHARYA N.G. RANGA AGRICULTURAL UNIVERSITY
Administrative Office, Lam, GUNTUR - 522 034. - A.P.

e-Procurement Tender Notice

Tenders are invited from the eligible contractors, for Tender Notice No. 28-35, dated 19-01-2026 Civil work - 8 Nos, through e-procurement. Details can be had from www.angrau.ac.in or from O/o the Estate Officer at the above address. Schedules can be downloaded through http://www.apeprocurement.gov.in. For the works 28-31, downloading starts from 21-01-2026 @ 04.00 P.M. onwards & ends on 28-01-2026 upto 04.00 P.M. For the works 32-35, downloading starts from 21-01-2026 @ 04.00 P.M. onwards & ends on 04-02-2026 upto 04.00 P.M. For details contact: TPA to Estate Officer: 94900 08945/ 86862 41222.

DIPR No. 4755PP/CL/Advt/1/1/2021-22 Sd/- ESTATE OFFICER

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Project Office, Rayapudi

NIT No. 114/MAU61-ADMN0IS(APWS)/01/2026-IS Dt. 19.01.2026

E Procurement Short Tender Notice

Name of Work: APCRDA - "RFP for Selection of Agency to Design, Develop, Host, Deploy and Maintain Website + Mobile Application along with Comprehensive and Interactive Dashboard for social Development Activities in APCRDA for the period of 3 years"

The bid can be downloaded on AP e-procurement portal from 21.01.2026 to 29.01.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 29.01.2026 up to 15.00 Hrs, Technical bid opening 29.01.2026 @ 16.00Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.

Sd/- Commissioner, APCRDA, Amaravati.

వివేకా హత్యకేసులో తదుపరి దర్యాప్తు అవసరమా.. కాదా?

(మొదటి పేజీ తరువాయి)

వచ్చిందన్నారు. హత్య గురించి బాహ్య ప్రపంచానికి తెలియకముందే జగన్‌కు తెలిసినందున ఆయన పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. అప్పుడు జస్టిస్ సుందరేష్ జోక్యం చేసుకుంటూ "మా నుంచి మీకేం కావాలి? ఇక్కడే మినీ ట్రయల్ నిర్వహించాలనుకుంటే అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని మేం మళ్లీ హైకోర్టుకు వెళ్లాలని చెబుతాం. దాంతో విషయం తేలడానికి మరో పదేళ్లు పడుతుంది. మేం ప్రాక్టికల్‌గా చూడాలి. ఇందులో ఏ అంశాలపై దర్యాప్తు చేస్తారో సీబీఐ అడుగుతూ.. వాళ్లేం చెప్పారో అంతవరకే మేం పరిగణనలోకి తీసుకుంటాం" అని పేర్కొన్నారు. అనంతరం సిద్ధార్థ లూథ్రా అంగీకరించారు.

ఇంకేమీ చేయలేమంటే ఇంతటితో ముగిస్తాం

అనంతరం జస్టిస్ సుందరేష్ సీబీఐ తరఫు న్యాయవాది అభిప్రాయాన్ని కోరారు. "సీబీఐ చెప్పినదాని ప్రకారం ముందుకెళ్లమని మేం ఇదివరకే చెప్పాం. మీరేం కావాలనుకుంటున్నారో స్పష్టంగా చెప్పండి. ట్రయల్‌కోర్టు ఇచ్చిన తీర్పుతో మీరు సంతృప్తిగా ఉన్నారా? మీకేం కావాలి? దాని ప్రకారం మేం విషయాన్ని పరిశీలిస్తాం. మీరెప్పుడూ అస్పష్టంగానే ఉన్నారు. ఇంకేమీ చేయలేమని మీరంటే కేసును ఇంతటితో ముగిస్తాం. ఈ వ్యవహారంలో ఎవరిని విచారించాలన్న అంశాలపై స్పష్టత ఇవ్వాలి. మేం అంతవరకే ఉత్తర్వులు ఇస్తాం. మీరు తదుపరి దర్యాప్తు కావాలని చెబితే ప్రతివాదుల వాదనలను విన్న తర్వాత దానిపై ఉత్తర్వులు జారీచేస్తాం. ఎవరెవరిని విచారించాలో కోర్టులోనే విడిగా అవసరమా.. లేదా అనేది పరిశీలిస్తాం. మేం ఇరువర్గాల నుంచి వాస్తవాలు తెలుసుకోవాలనుకుంటున్నాం. అదే న్యాయంలో దర్యాప్తును అడ్డుకోవాలనుకుంటున్నాం. ఇది చాలా సున్నితమైన విషయం. అందువల్ల చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇది తార్కిక ముగింపునకు చేరాలి. కక్షిదారులకు కనీసం కచ్చితమైన న్యాయప్రక్రియ అనుసరించారన్న సంతృప్తి అయినా కలగాలి. అందుకే తదుపరి దర్యాప్తు అవసరం ఉందా.. లేదా? ఒకవేళ ఉంటే ఎంతవరకు ఉంది? తదుపరి దర్యాప్తు అవసరం ఉంటే నిందితులు బెయిల్, ముందస్తు బెయిల్ దరఖాస్తులను సవాలు చేస్తారు. దాఖలైన కేసు పరిస్థితి విమితనంతరం వరకు మేం పరిగణనలోకి తీసుకుంటాం. మేం సమతౌల్యం పాటించే క్రమంలో జారీచేసే ఉత్తర్వులు మీకు (కక్షిదారులకు) అనుకూలంగానో, వ్యతిరేకంగానో ఉండొచ్చు. ట్రయల్ కోర్టు తీర్పుతో ఎవరు విభేదించినా అప్పీల్ దాఖలు చేయాల్సిన అవసరం లేదని మేం ఇదివరకే చెప్పాం. అలా వెళ్తే మరో పదేళ్లు పడుతుంది. ఇప్పుడు మీ అందరి వాదనలు పరిగణనలోకి తీసుకుంటాం. అయితే ప్రధానంగా సీబీఐ ఏం కావాలనుకుంటోందన్న దాన్ని బట్టే ముందుకెళ్తాం. దర్యాప్తు చేసేది ఆ సంస్థే కాబట్టి ప్రస్తుత దశలో దాన్ని అనుమానించడానికి ఏమీ లేదు. మీరు మీ వాదనలు వినిపించినా.. మేం సీబీఐ అభిప్రాయం ఏంటన్నది స్పష్టంగా తెలుసుకోవాలి. దాని ఆధారంగా మీ వాదనలను విని ఉత్తర్వులు జారీ చేస్తాం" అని పేర్కొన్నారు. అందుకు సీబీఐ న్యాయవాది స్పందిస్తూ.. అధికారులను అడిగి సమాధానం చెప్పడానికి రెండువారాల సమయం ఇవ్వాలని కోరగా జస్టిస్ సుందరేష్ అందుకు అంగీకరించారు. తర్వాత జస్టిస్ ఎన్‌కే సింగ్ జోక్యంచేసుకుంటూ "ఈ కేసులో మీరు దర్యాప్తు చేస్తున్నారు కాబట్టి దానిగురించి స్పష్టత ఉండాలి. తదుపరి దర్యాప్తు అవసరమా.. కాదా అన్నది మీకు తెలియాలి. మీరు సంతృప్తి చెందితే మేం చేయడానికి ఏమీ ఉండదు. అందువల్ల ఏ విషయం స్పష్టంగా చెప్పండి" అని సీబీఐ న్యాయవాదికి సూచించారు. తర్వాత శివశంకర్‌రెడ్డి తరఫు న్యాయవాది నాగముత్తు వాదనలు కొనసాగిస్తూ "సీబీఐ కోర్టు ఉత్తర్వుల్లోని పేరా 93లో తదుపరి దర్యాప్తు కోరుతూ వారు దాఖలుచేసిన పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించినట్లు ఉంది. హత్య జరిగిన 15.3.2019 రాత్రి ఏ2 సోదరుడు కిరణ్‌యాదవ్, అర్జున్‌రెడ్డి మధ్య సంభాషణలు జరిగినందున ఇందులో వారి పాత్ర ఉంటే అంతవరకు సీబీఐ దర్యాప్తు జరపొచ్చని సీబీఐ కోర్టు చెప్పింది" అని పేర్కొన్నారు. ఈ లోపాల గురించే పిటిషనర్ సునీతారెడ్డి చెప్పారని, అంతవరకు కోర్టు అంగీకరించి అంతవరకూ దర్యాప్తునకు ఆదేశించిన తర్వాత వారికి ఇంకేం కావాలని ప్రశ్నించారు. అందుకు జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ "మేం ఎలాంటి అభిప్రాయాలూ వ్యక్తం చేయకుండా ఈ కేసును వినాలనుకుంటున్నాం. ప్రస్తుతం ఉన్న అపోహలన్నీ తొలగించి కనీసం ట్రయల్ నడిచేలా చేయాలి. అందుకే సీబీఐ నుంచి స్పష్టమైన ప్రకటన కోరుతున్నాం. ఇది అంత సులభమైన అంశమైతే ఎప్పుడో డిస్మిస్ చేసేవాళ్లం. మేం అన్ని కోణాలనూ పరిశీలించి సమతౌల్యం పాటించాలనుకుంటున్నాం. లేదంటే ఏదో ఒక నిర్ణయం తీసుకునేవాళ్లం. అప్పుడు మీ వాదనలు వినాల్సిన అవసరం ఉండేది కాదు' ' అంటూ విచారణ ముగించారు. తదుపరి విచారణను ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేశారు.

ఉగాది నుంచి 'పచ్చదనం' ప్రాజెక్టు

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేయాలి. రాష్ట్రంలోని 40% తీర ప్రాంతం అటవీశాఖ పరిధిలో ఉంది. మిగిలిన భూభాగంలో అవసరమైన ప్రణాళికలు ఆయా శాఖలు రూపొందించి, అమలు చేయాలి. రైతుల భూముల్లో దీర్ఘకాలిక ప్రయోజనాలు ఇచ్చే పండ్ల రకాలు నాటాలి. ముఖ్యమంత్రితో బడ్జెట్ కేటాయింపులపై చర్చిస్తా. ఫిబ్రవరి 5న నిర్వహించే తదుపరి సమావేశానికి అన్నిశాఖల అధికారులు సరైన ప్రణాళికతో రావాలి' అని పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కాంతిలాల్ దండే, శశిభూషణ్ కుమార్, కృష్ణబాబు, రాజశేఖర్ అటవీశాఖ ప్రిన్సిపల్ కన్జర్వేటర్ పి.వి.చలపతిరావు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ రంజిత్ భాషా, ఏపీఐఐసీ ఉపాధ్యక్షుడు, ఎండీ అభిషిక్త్ కిషోర్ పాల్గొన్నారు.

24న విశాఖ ఉత్సవ్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

సంధ్యారాణి తదితరులు ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దుర్గేష్ మాట్లాడుతూ.. "24న విశాఖలో ఉత్సవాల ప్రారంభమై, ఫిబ్రవరి 1న అనకాపల్లిలో ముగుస్తాయి. ఉత్తరాంధ్రలో 20 ప్రధాన కేంద్రాల్లో 500కు పైగా సాంస్కృతిక, పర్యాటక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజు, కొణతాల రామకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

శ్రీశైలం మరమ్మతులపై కదలిక

(మొదటి పేజీ తరువాయి)

రెండు రాష్ట్రాలకు సీడబ్ల్యూసీ లేఖ రాసింది.

దెబ్బతిన్న ఆప్రాన్... ప్లంజ్ పూల్‌లో భారీ గొయ్యి

శ్రీశైలం డ్యాం దిగువ భాగంలో ఆప్రాన్ దెబ్బతినడం, ప్లంజ్ పూల్ (గేట్ల నుంచి నీటిని విడుదల చేసినపుడు కిందకు దూకిన తర్వాత ఎగిరిపడే ప్రాంతం)లో భారీ గొయ్యి ఏర్పడి డ్యాం భద్రతకే ప్రమాదం తలెత్తింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలోని బృందం గత ఏడాది డ్యాంను పరిశీలించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తీసుకోవాల్సిన చర్యలపై 2025 మే నెలలో నివేదిక ఇచ్చింది. కొన్నేళ్లుగా పలు కమిటీలు పరిశీలించి నివేదికలు ఇచ్చినా, సిఫార్సులు చేసినా... పునరుద్ధరణ పనులు జరగలేదని, డ్యాం భద్రత విషయంలో రాజీపడ్డారని ఆందోళన వ్యక్తం చేసింది. డ్యాం దిగువన ఆప్రాన్ చివరి నుంచి 50-220 మీటర్ల వరకు గుంత పడిందని, ప్లంజ్‌ పూల్‌లో లోతు 122 మీటర్ల నుంచి 160 మీటర్ల వరకు ఉందని పేర్కొంది. ప్లంజ్‌పూల్ మరింత కోతకు గురై స్పిల్‌వే దెబ్బతినకుండా ఏర్పాటు చేసిన సిలిండర్లలో ఒకటి నుంచి 39 వరకు మార్చాలని సూచించింది. డ్యాం మరమ్మతులకు చేపట్టాల్సిన స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలను ఎన్‌డీఎస్‌ఏ సూచించింది. ఎనిమిదో బ్లాక్ నుంచి 12వ బ్లాక్ వరకు స్టెబిలిటీ ఎనాలిసిస్ చేయాలంది. దీర్ఘకాలిక చర్యలకు కేంద్ర జల సంఘాన్ని సంప్రదించాలని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖకు తెలిపింది.

కమిటీ బాధ్యతలివే...

శ్రీశైలం ప్రాజెక్టు... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిర్వహణలో ఉంది. ఎన్‌డీఎస్‌ఏ సిఫార్సు మేరకు ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ పలు దఫాలు కేంద్ర జల సంఘంతో చర్చించిన తర్వాత నిపుణుల కమిటీని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్లంజ్‌పూల్‌కు జరిగిన నష్టాన్ని అంచనా వేయడంతోపాటు సాంకేతిక సమీక్ష, ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ఘటనలపై జరిపిన అధ్యయనాల కేస్ స్టడీస్ పరిశీలన, వాటి నుంచి గుణపాఠాలు తీసుకోవడం, ఉత్తమ పద్ధతులను అవలంబించి ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకోవడం, అవసరమైన ఇన్వెస్టిగేషన్స్ చేయడం, పునరుద్ధరణ చర్యలను సిఫార్సు చేయడం, అమలు ప్రణాళిక, డిజైన్స్, డ్రాయింగ్స్ ఇవ్వడం, నిరంతర సాంకేతిక సలహాలు ఇవ్వడం... కమిటీ బాధ్యతలని కేంద్ర జల సంఘం పేర్కొంది.



దెబ్బతిన్న సిలిండర్లు

ఛైర్మన్‌గా వివేక్ త్రిపాఠీ

నిపుణుల కమిటీకి కేంద్ర జల సంఘంలోని డిజైన్స్ విభాగం చీఫ్ ఇంజినీర్ వివేక్ త్రిపాఠీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. సభ్యులుగా సీడబ్ల్యూసీలోని వివిధ డైరెక్టరేట్‌ల నుంచి సోమేశ్‌కుమార్, సమర్థ్ అగర్వాల్, అరుణ్‌ప్రతాప్ సింగ్, మధుకాంత్ గోయల్, సీఎస్‌ఎంఆర్‌ఎస్ నుంచి మనీశ్ గుప్తా, సీడబ్ల్యూపీఆర్‌ఎస్ నుంచి ఎం.కె.వర్మ, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) నుంచి శైలేంద్ర సింగ్ ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కర్నూలు జిల్లా ప్రాజెక్టుల చీఫ్ ఇంజినీర్ ఉంటారు. ఇందులో తమ సభ్యుల పేర్లు తెలపాలంటూ తెలంగాణ నీటిపారుదల శాఖను, కృష్ణా నదీ యాజమాన్య బోర్డును సీడబ్ల్యూసీ కోరింది.

హరిత ఇంధన రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం 24 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాం. భారతదేశ టాప్ 10 సౌర పరికరాల తయారీసంస్థల్లో 5 ఏపీలోనే ఉన్నాయి. టాటా పవర్ 7 గిగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టులను ప్రారంభించి, 10 గిగావాట్ల ప్రాజెక్టు ఏర్పాటుకు వస్తోంది. ఎనర్జీ ట్రాన్సిషన్ కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటుకు యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్‌వేల్స్, ఐఐటీ తిరుపతితో ఒప్పందం కుదుర్చుకుంటున్నాం" అని తెలిపారు.

విశాఖపట్నంలో డేటాసెంటర్ పనులు వేగవంతం చేయండి

విశాఖపట్నంలో డేటాసెంటర్ పనులను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. దావోస్‌లో బ్రూక్‌ఫీల్డ్ ఎసెట్ మేనేజ్‌మెంట్ ప్రెసిడెంట్ కానర్ టెస్కీతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇటీవల విశాఖ సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు గిగావాట్ స్కేల్ క్లీన్ ఎనర్జీ పవర్డ్ డేటాసెంటర్ ప్లాట్‌ఫాం పనులను వేగవంతం చేయండి. బ్రూక్‌ఫీల్డ్- ఏపీ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టులకు సహకరించేందుకు నిర్మాణాత్మక యంత్రాంగాన్ని ఏర్పాటుచేస్తాం" అని వెల్లడించారు. ఏపీ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని టెస్కీ పేర్కొన్నారు.



కానర్ టెస్కీతో చర్చిస్తున్న లోకేశ్

■ విశాఖపట్నంలో రీజనల్ టెక్నాలజీ ఆపరేషన్స్ హబ్ ఏర్పాటుచేయాలని మంత్రి లోకేశ్ కోరారు. ఐరన్ మౌంటెన్ ప్రెసిడెంట్, సీఈఓ విలియం ఎల్.మీనీతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఏపీలోని ప్రభుత్వరంగ యూనివర్సిటీల్లో అప్లయిడ్ ఇన్నోవేషన్, టాలెంట్ డెవలప్‌మెంట్, ఆర్‌అండ్‌డీ అభివృద్ధికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేయాలని మంత్రి కోరారు.

'పోలవరం' సంయుక్త సర్వే కమిటీకి పేర్లు ఇవ్వండి: పీపీఏ

ఈనాడు, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు వెనుక జలాల ముంపు ప్రభావాన్ని అంచనా వేయడానికి ఏర్పాటు చేసిన సంయుక్త సర్వే కమిటీకి ఇంజినీర్ల పేర్లు పంపాలని తెలుగు రాష్ట్రాలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ మంగళవారం ఒక లేఖలో కోరింది. 'తెలంగాణ విజ్ఞప్తి మేరకు సంయుక్త కమిటీ ఏర్పాటుకు నిర్ణయం జరిగింది. తెలంగాణ భూభాగంలోని ఆరు స్ట్రీంలు, భద్రాచలం పట్టణం నుంచి గోదావరిలోకి నీళ్లు వెళ్లే ఎనిమిది తూముల వద్ద నీటిమట్టాలను గుర్తించాల్సి ఉంది. దీనిపై పీపీఏ, ఏపీ, తెలంగాణలు సంయుక్తంగా సర్వే చేయాల్సి ఉంది' అని పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

21-1-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘమాసం, శుక్లపక్షం
తదియ: రా. 2-17 తదుపరి చవితి
ధనిష్ఠ: మ. 2-07 తదుపరి శతభిష
వర్జ్యం: రా. 9-21 నుంచి 10-58 వరకు
అమృత ఘడియలు: లేవు
దుర్ముహూర్తం: ఉ. 11-49 నుంచి 12-33 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.38; సూర్యాస్తమయం: సా.5.45

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	28.0
తిరుపతి	15.4	30.2
విశాఖపట్నం	16.2	29.6
శ్రీకాకుళం	17.0	28.0
కడప	17.0	31.0
అనంతపురం	17.0	34.2
తాడేపల్లిగూడెం	18.0	31.0
రాజమహేంద్రవరం	18.0	33.5
విజయవాడ	18.6	29.8
గుంటూరు	19.0	31.0
ఒంగోలు	19.6	30.4

బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ & రీసెర్చ్ ఇనిస్టిట్యూట్
రోడ్ నెం. 10, బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

ముఖ్య గమనిక
క్రియాశీలం కాని వైద్య రికార్డుల తొలగింపు

భారత వైద్య మండలి చట్టం, 1956లోని సెక్షన్ 20A ప్రకారం మరియు మెడికల్ ఎథిక్స్ రెగ్యులేషన్స్, 2002లోని అధ్యాయం 1.3.1 ప్రకారం, ఈ ద్వారా తెలియజేయడమైనది. 01 జనవరి 2015 నుండి 31 డిసెంబర్ 2020 మధ్య డిశ్చార్జ్ చేయబడి, గత 05 సంవత్సరాలుగా ఫాలో-అప్‌కు హాజరుకాని రోగుల క్రియాశీలం కాని వైద్య రికార్డులను చిన్న చిన్న ముక్కలుగా చించివేయడం/ముద్దగా చేసి ధ్వంసం చేయడం జరుగుతుంది. ఈ వైద్య రికార్డుల ప్రతులు కావాలనుకునే రోగులు / వారి సహాయకులు (అటెండెంట్లు) లేదా థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లు (TPA)సరైన గుర్తింపు ఆధారాలతో 21 ఫిబ్రవరి 2026లోపు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను సంప్రదించవలెను. ఆ తరువాత రికార్డులు పరిశీలనకు అందుబాటులో ఉండవు.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
9140-23551235 / 23556655 / 8977620533

(c) eenadu

విదేశీ పెట్టుబడులకు గమ్యస్థానం భారత్

- నేషన్ ఫస్ట్ స్ఫూర్తితో కలిసి సాగుదాం
- దావోస్‌లో ఇండియా లాంజ్ ప్రారంభం



దావోస్‌లో మంగళవారం జరిగిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో కేరళ మంత్రి పి.రాజీవ్, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్, ఉత్తర్‌ప్రదేశ్ మంత్రి సురేశ్‌కుమార్ ఖన్నా, కేంద్రమంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్‌నాయుడు, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు, గుజరాత్ ఉపముఖ్యమంత్రి హర్షకుమార్ సంఘవి

ఈనాడు, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా విదేశీ పెట్టుబడులకు భారత్ సురక్షిత గమ్యస్థానమని సీఎం చంద్రబాబు అన్నారు. 'పార్టనర్ విత్ ఇండియా' పేరిట దావోస్‌లో భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన లాంజ్‌ను పలువురు కేంద్రమంత్రులు, సీఎంలతో కలిసి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'నేషన్ ఫస్ట్... స్ఫూర్తిని చాటేలా కలిసి పనిచేద్దాం. దేశంలోని వేర్వేరు రాష్ట్రాల నుంచి వచ్చినా అందరం భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాం. రాష్ట్రాలుగా పోటీ పడినా.. దేశంగా ఒక్కటిగా సాగుదాం. పరస్పరం సహకరించుకుందాం. ప్రస్తుతం భారత్ బలమైన ఆర్థికవ్యవస్థగా వేగంగా రూపాంతరం చెందుతోంది. రాబోయే రెండేళ్లలో ప్రపంచంలో మూడో స్థానానికి చేరుతుంది. 2047 నాటికి అగ్రస్థానంలో నిలుస్తుంది. బలమైన నేత మోదీ ప్రధానిగా మన దేశ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పారు' అని అన్నారు.

జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తున్నాం

'అభివృద్ధిలో సంపద సృష్టి అత్యంత కీలకమే అయినా.. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలి. జీవన ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రపంచం ఎలా ముందుకు వెళ్తోందో తెలుసుకునేందుకు ఆర్థిక సదస్సులో వీలుంటుంది. ప్రస్తుతం గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంది' అని చంద్రబాబు చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్‌నాయుడు, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ, ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరేన్ తదితరులు పాల్గొన్నారు.



విశాఖలో గూగుల్ ఏఐ డేటాసెంటర్ ఏర్పాటుపై గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్‌తో సీఎం చర్చించారు. ఆయనకు జ్ఞాపిక అందించారు. డేటా సెంటర్ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని.. ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం

ప్రపంచ ఆర్థికసదస్సులో జరిగిన చర్చావేదికలో సీఎం చంద్రబాబు



ఈనాడు, అమరావతి: అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలన్న ఉద్దేశంతోనే 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' విధానాన్ని తీసుకొచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన చర్చావేదికలో ఆయన పాల్గొన్నారు. 'ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలకు మేలు జరగాలి. 10 ప్రయత్నాల్లో తొమ్మిది విఫలం కాకూడదు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా సక్సెస్ రేటు మెరుగుకు సూచనలు అందిస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటుచేసి ప్లగ్ అండ్ ప్లే విధానం అందుబాటులోకి తెస్తాం. పీ4 విధానాన్ని ప్రోత్సహించడం ద్వారా పేదరికాన్ని తగ్గించడంతో పాటు.. కొత్త ఆలోచనలు ఉన్న వారికి చేయూతను ఇచ్చే వ్యవస్థను తీర్చిదిద్దాం. కొంత సమయాన్ని కేటాయించి సరైన నిర్ణయం తీసుకునేలా కొన్ని కుటుంబాలకు సహకరించాలి. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే వారికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానంలో అనుమతులు ఇస్తాం' అని వివరించారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా..

'కనీసం లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతానని గత ఏడాది మహిళా దినోత్సవంనాడు ప్రకటించా. ఈ ఏడాది 5 లక్షల మందిని తీర్చిదిద్దాలని ప్రకటించబోతున్నా. దీన్ని సాధిస్తే ఆ తర్వాత 10 లక్షల మందిని పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్నది ఆలోచన. దీనికోసం మీరు ఇచ్చే సూచనలను అనుసరించేందుకు నేను సిద్ధంగా ఉన్నా' అని చంద్రబాబు అన్నారు.

బ్రాండింగ్ అవసరం

'ఏపీలో 10 లక్షల మందికి ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వాలని ఐబీఎంను కోరా. నైపుణ్య మానవ వనరులను కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రాష్ట్రాభివృద్ధితో పాటు..ప్రజలూ అభివృద్ధి సాధిస్తారు. అదనపు విలువ జోడింపు.. నాణ్యమైన ఉత్పత్తి రెండూ ముఖ్యమే. బ్రాండింగ్ కూడా అవసరం. ఏపీ ఉత్పత్తులకు బ్రాండింగ్ కోసం కృషి చేస్తున్నాం. డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

క్లీన్ ఎనర్జీ రంగంలో ఎన్నో అవకాశాలు

– సుమంత్ సిన్హా, సీఈవో, రెన్యూ ఎనర్జీ

ఇంధన రంగం.. క్లీన్ ఎనర్జీకి మారుతున్న దశలో చిన్న పారిశ్రామికవేత్తలకు విస్తృత అవకాశాలు ఉన్నాయి. ఈ రంగంలో కొత్తగా వచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధిని కల్పించాల్సిన అవసరం ఉంది. రూఫ్‌టాప్ ప్రాజెక్టుల ఏర్పాటు కోసం కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉపాధిని కల్పించే అవకాశం ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమలు, విద్యుత్ స్టోరేజీ ప్రాజెక్టులు వస్తున్నాయి. వాటిలో పనిచేసేవారి కోసం శిక్షణ ఇచ్చేందుకు ఏపీలో నైపుణ్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి పరిశీలించాలి.

రూ.లక్ష కోట్ల పెట్టుబడి.. లక్ష ఉద్యోగాలు

- విశాఖలో జీసీసీ పార్క్
- సీమలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ పార్క్
- ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్‌మెండా ప్రకటన



ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్ మెండాతో చర్చిస్తున్న లోకేశ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాలు కల్పించే ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నట్లు ఆర్ఎంజడ్ సంస్థ ప్రకటించింది. ఇందులోభాగంగా విశాఖపట్నంలోని కాపులుప్పాడ ఫేజ్-1 ఐటీ పార్కులో సుమారు 50 ఎకరాల్లో కోటి చదరపు అడుగుల విస్తీర్ణంలో జీసీసీ పార్క్ అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా.. ఆర్ఎంజడ్ ఛైర్మన్ మనోజ్‌మెండాతో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ జరిపిన చర్చలు ఫలించాయి. రాబోయే ఐదేళ్లలో సుమారు రూ.91వేల కోట్ల (10 బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టనున్నట్లు మనోజ్‌మెండా ప్రకటించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాయలసీమలో పారిశ్రామిక, లాజిస్టిక్స్ అభివృద్ధితో పాటు.. నెక్స్ట్‌జెన్ మిక్స్‌డ్ యూజ్ డిజిటల్ వసతుల కేంద్రంగా విశాఖ మారనుంది.

● విశాఖపట్నం ప్రాంతంలో దశలవారీగా ఒక గిగావాట్ సామర్థ్యంతో హైపర్‌స్కేల్ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఆర్ఎంజడ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపింది. ఆధునిక డిజిటల్, ఏఐ వర్క్‌లోడ్‌కు మద్దతిచ్చే ఈ ప్రాజెక్టుకు సుమారు 500-700 ఎకరాల భూమి అవసరం.

● రాయలసీమలోని శ్రీసత్యసాయి జిల్లా టేకులోడు వద్ద సుమారు వెయ్యి ఎకరాల్లో ఇండస్ట్రియల్, లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుకు ఆర్ఎంజడ్ ప్రతిపాదించింది. సింగిల్ విండో విధానం ద్వారా వేగంగా అనుమతులు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై ఏపీ ప్రభుత్వ నిబద్ధతే.. పెట్టుబడిదారుల విశ్వాసానికి బలం చేకూరుస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది.

జీసీసీ ఏర్పాటుకు ఎన్‌విడియా ఆసక్తి



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ (జీసీసీ) ఏర్పాటుతో పాటు హార్డ్‌వేర్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఎన్‌విడియా సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకొచ్చింది. ఎన్‌విడియా గ్లోబల్ ఏఐ ఇనీషియేటివ్స్ ఉపాధ్యక్షురాలు కాలిస్టా రెడ్మండ్‌తో దావోస్‌లో సీఎం సమావేశమయ్యారు. దేశంలో మొదటి ఏఐ విశ్వవిద్యాలయాన్ని అమరావతిలో ఏర్పాటుచేసే అంశంపై ఇరువురూ చర్చించారు. దీనిపై ఇప్పటికే సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది.

దీర్ఘకాలిక రాబడులు ఇచ్చే ఆవిష్కరణలపై దృష్టి

రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ప్రోత్సాహకాలు

ఏపీ యువత ప్రతిభపై పెట్టుబడి పెడుతున్నాం: లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలిక రాబడులు ఇచ్చే ఆవిష్కరణల ఎకోసిస్టమ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లకు ప్రోత్సాహం అందిస్తున్నామని వెల్లడించారు. దావోస్ కాంగ్రెస్ విలేజ్‌లో వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఆధ్వర్యంలో 'దృఢమైన ఆవిష్కరణల కోసం పెట్టుబడులను బలోపేతం చేయడంలో మనం ఎక్కడ?' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. "విశాఖలో గూగుల్ క్లౌడ్, సిస్కో, ఎల్అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్‌తో భాగస్వామ్యంతో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లతో పాటు ఆర్ అండ్‌డీపై ప్రత్యక్షంగా పెట్టుబడి పెడుతున్నాం. దీంతో ఆలోచనలు వేగంగా స్టార్టప్‌లుగా మారతాయి. పెట్టుబడులను ఆకర్షించడమంటే కేవలం సంస్థలను తీసుకురావడం కాదు. ఆవిష్కరణకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయడం" అని తెలిపారు.

ప్రపంచ సవాళ్లకు ఏపీ ప్రతిభతో పరిష్కారం

"ఏపీలోని ప్రతిభ ప్రపంచ సవాళ్లకు పరిష్కారం చూపుతుందని మేం భావిస్తున్నాం. పారిశ్రామిక క్లస్టర్లలో ఆర్అండ్‌డీని ఏకీకృతం చేస్తూ టాలెంట్‌పై పెట్టుబడి పెట్టి, ప్రపంచ భాగస్వామ్యాలకు విశ్వసనీయ యాంకర్‌గా పనిచేస్తున్నాం. క్లీన్ ఎనర్జీ రంగంలో రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు రాబట్టి, 167 గిగావాట్ల ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. క్వాంటమ్ వ్యాలీ, భారతదేశంలో మొట్టమొదటి డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను ఏర్పాటుచేస్తున్నాం" అని లోకేశ్ వెల్లడించారు. "త్రిముఖ వ్యూహంతో ముందుకు సాగుతున్నాం. వివిధ రంగాల్లో క్లస్టర్ల వారీ అభివృద్ధి, విశ్వవిద్యాలయాలు, నైపుణ్య సంస్థలతో పరిశ్రమల అనుసంధానం, దీర్ఘకాలిక విలువను సృష్టించే విధానాన్ని రూపొందించడంపై దృష్టిసారించాం. ప్రభుత్వం, పారిశ్రామిక సంస్థలు, విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయడంతో ఏపీలో అద్భుత ఫలితాలు సాధించాం. 18నెలల్లో రాష్ట్ర పెట్టుబడి ప్రమోషన్ బోర్డు రూ.8.75లక్షల కోట్ల విలువైన 211 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది' అని మంత్రి పేర్కొన్నారు. 'యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ ఆన్ ట్రేడ్ అండ్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం 2024లో అభివృద్ధి చెందుతున్న దేశాల్లో మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడులు తగ్గిపోయాయి. ఈ అంతరాన్ని భర్తీ చేసేందుకు పబ్లిక్ ఫైనాన్స్ ద్వారా గ్రాంట్లు, ఆర్అండ్‌డీ రాయితీలు, మిశ్రమ ఆర్థిక సహాయం, వ్యూహాత్మక రంగాలలో నేరుగా పెట్టుబడులు పెట్టాలి. ఆవిష్కరణలకు అవసరమైన ఎకోసిస్టమ్ నిర్మాణానికి నియంత్రిత చట్టాలు, డిజిటల్, ఫిజికల్, ఎడ్యుకేషనల్ మౌలికసదుపాయాలను ప్రభుత్వాలు కల్పించడం తప్పనిసరి" అని లోకేశ్ సూచించారు.

ఓడరేవులకు జపాన్ సహకారం



హషియామా షిగెటోను సత్కరించి, జ్ఞాపిక అందిస్తున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: ఏపీలో ఓడరేవుల ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధి.. ఇంధన భద్రత.. ఇతర రంగాలకు నిధులు సమకూర్చడంతో పాటు విదేశీ పెట్టుబడులను సులభతరం చేయడంలో రాష్ట్రంతో కలిసి పనిచేయాలని జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ (జేబీఐసీ)ను మంత్రి లోకేశ్ కోరారు. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎండీ హషియామా షిగెటోతో మంత్రి సమావేశమయ్యారు. లోకేశ్ మాట్లాడుతూ.. 'షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్లు, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, పారిశ్రామిక తయారీ రంగాల్లో జపాన్ పెట్టుబడులకు మార్గనిర్దేశం చేయడంలో సహకరించండి. రాష్ట్రంలో మూలపేట, మచిలీపట్నం, దుగరాజపట్నాల్లో ఏర్పాటు చేసే నౌకానిర్మాణ క్లస్టర్లలో పెట్టుబడులకు జపాన్ నౌకా నిర్మాణం, మారిటైమ్ ఇంజినీరింగ్ కంపెనీలను ప్రోత్సహించాలి. ఏపీలోని చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ వెంట జపనీస్ ఇండస్ట్రియల్ టౌన్‌షిప్ అభివృద్ధి చేసే ప్రతిపాదనను పరిశీలించాలి' అని కోరారు. జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయాల నిధుల ద్వారా ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భారత్‌లో పెట్టుబడులను జేబీఐసీ కొనసాగిస్తోందని సంస్థ ఎగ్జిక్యూటివ్ ఎండీ షిగెటో పేర్కొన్నారు. 'ఎన్‌టీపీసీకి విద్యుత్ సరఫరా చేసే ఎస్‌బీజీ క్లీన్‌టెక్ ప్రాజెక్టు, 350 మెగావాట్ల కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్కు (2017లో ఏర్పాటు చేసింది)కు జేబీఐసీ రుణాన్ని అందించింది. విశాఖలోని అచ్యుతాపురం పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న టైర్ల తయారీ కర్మాగారం విస్తరణకు పర్యావరణ పరిశీలన పూర్తయింది. భారత్‌లో వాహనాలు, ఎలక్ట్రానిక్స్, ఐటీ సేవలు, తయారీ, మౌలిక సదుపాయాల రంగాల్లో జపాన్ పెట్టుబడులు ఉన్నాయి. పునరుత్పాదక ఇంధన సామర్థ్య ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించేందుకు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌తో రూ.6,500 కోట్ల గ్రీన్ క్రెడిట్ లైన్‌ను జేబీఐసీ ఏర్పాటుచేసింది' అన్నారు.

రాష్ట్రంలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత



యూఏఈ మంత్రి అబ్దుల్లా బిన్‌కి జ్ఞాపిక అందిస్తున్న చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో దుబాయ్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు యూఏఈ సంసిద్ధత తెలిపింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో యూఏఈ ఆర్థిక, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. యూఏఈకి చెందిన 40 సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు తోడ్పాటు అందిస్తామని అల్ మార్రీ హామీ ఇచ్చారు. షరాఫ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏపీలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్కు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపైనా వారు చర్చించారు. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్, డీపీ వరల్డ్‌తో కలిసి పోర్టు టెర్మినల్స్, లాజిస్టిక్స్, ఏడీఎన్‌వోసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజీ, రీ గ్యాసిఫికేషన్ యూనిట్, లులు గ్రూప్ ఆధ్వర్యంలో విశాఖలో మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా కూడా చర్చలు జరిగాయి. ఏపీలో ఆహార భద్రత, లాజిస్టిక్స్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదకశక్తి, పట్టణాభివృద్ధి, పర్యాటకం, మౌలిక వసతుల రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాల్ని చంద్రబాబు వివరించారు.

ఐబీఎం, గూగుల్ ప్రాజెక్టులపై చర్చ

ఆ సంస్థల ప్రతినిధులతో చంద్రబాబు, లోకేశ్ భేటీ



ఐబీఎం ఛైర్మన్, సీఈవో అర్వింద్ కృష్ణతో భేటీ అయిన సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, లోకేశ్



వరల్డ్ ఇంటలెక్చువల్ ఫోరం డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్‌తో చంద్రబాబు కరచాలనం

ఈనాడు, అమరావతి: దావోస్ పర్యటనలో భాగంగా ఐబీఎం, గూగుల్, డబ్ల్యూఐపీవో సంస్థల ఛైర్మన్లు, సీఈవోలు, ప్రతినిధులతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

■ అమరావతిలో ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్ ఇన్నోవేషన్ సెంటర్ ఏర్పాటుచేయాలని సంస్థ సీఈవో అర్వింద్ కృష్ణను సీఎం చంద్రబాబు కోరారు. రాష్ట్ర యువతను కృత్రిమ మేధ, క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీ నిపుణులుగా తీర్చిదిద్దాలని కోరారు. సీఎం మాట్లాడుతూ.. 'రాష్ట్రంలోని 10 లక్షల మంది యువతకు ఏఐలో శిక్షణ ఇవ్వాలని సంస్థను కోరాం. దేశవ్యాప్తంగా 50 లక్షల మందికి క్వాంటమ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో శిక్షణ ఇవ్వాలని ఐబీఎం నిర్ణయించింది' అని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఐబీఎం సీఈవో సానుకూలంగా స్పందించారు.

■ వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఐపీవో) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, డైరెక్టర్ అనిల్‌మూర్తితో సీఎం సమావేశమయ్యారు. ఆర్థికాభివృద్ధికి ఆవిష్కరణలు కీలకమని.. ఏపీని నాలెడ్జ్ ఎకానమీ, ఇన్నోవేషన్ ఆధారిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని వారికి వివరించారు. రాష్ట్రంలో స్టార్టప్ వ్యవస్థకు సహకారం అందించాలని ప్రతిపాదించారు. ఏపీ పునరుత్పాదక విద్యుత్ మిషన్‌కు సహకరించాలని.. 2029 నాటికి అమరావతి, విశాఖపట్నం ప్రాంతాలను ఇన్నోవేషన్ క్లస్టర్లలో ప్రపంచంలో మొదటి స్థానంలో నిలపాలంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

విశాఖలో నైపుణ్యాభివృద్ధి క్యాంపస్

కాగ్నిజెంట్ బృందానికి మంత్రి లోకేశ్ విజ్ఞప్తి



సూర్య గుమ్మడి, జతిన్ దలాల్‌లతో భేటీ అయిన లోకేశ్

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో ఐటీ క్యాంపస్ ఏర్పాటు పనులు వేగవంతం చేయాలని మంత్రి లోకేశ్ కాగ్నిజెంట్ ప్రతినిధులను కోరారు. తాత్కాలిక క్యాంపస్‌లో సౌకర్యాలు పెంచడం ద్వారా ఉద్యోగుల సంఖ్య పెంచే అంశాన్ని పరిశీలించాలన్నారు. సంస్థ సీఈవో రవికుమార్ సింగిశెట్టి, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ జతిన్ దలాల్, ప్రెసిడెంట్ అమెరికాస్ సూర్య గుమ్మడిలతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. మంత్రి మాట్లాడుతూ 'ఏఐ, జెన్ ఏఐ, క్లౌడ్, డేటా, డిజిటల్ ఇంజినీరింగ్‌లో సంస్థ నియామకాల కోసం అవసరమైన సిబ్బందిని తీర్చిదిద్దేందుకు విశాఖలో డెడికేటెడ్ సెంట్రలైజ్డ్ నైపుణ్యాభివృద్ధి క్యాంపస్‌ను ఏర్పాటు చేయండి. ఏపీలో ఇన్నోవేషన్లు, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తోన్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో కలిసి పనిచేయండి. దీనివల్ల ఏఐ, డిజిటల్ ప్రొడక్ట్ స్టార్టప్‌లు, ఎంటర్‌ప్రైజ్ మెంటారింగ్, పైలట్ ప్రాజెక్టుల విస్తరణపై దృష్టి సారించవచ్చు. ఏపీలోని విశ్వవిద్యాలయాలతో కలిసి ఏఐ ల్యాబ్‌లు, పరిశోధన, ఇంటర్న్‌షిప్‌లు, హైర్-లింక్డ్ క్యాప్‌స్టోన్ ప్రోగ్రామ్‌లు తీర్చిదిద్దేందుకు సహకరించాలి' అని కోరారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చూశాకే పెట్టుబడులు పెట్టండి

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగిస్తామని.. 2026లో డ్రోన్ అంబులెన్స్ కూడా ఏపీ నుంచి ప్రారంభించే ఆలోచన చేస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలుచేస్తున్న విధానాలను ఆయన వివరించారు.

రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌కి ఇదే నిదర్శనం

'రాష్ట్రానికి గ్రీన్ అమ్మోనియా, గూగుల్ పెట్టుబడులు వచ్చాయి. విశాఖలో ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు నగరాన్ని నిర్మించబోతోంది. బీపీసీఎల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో చమురుశుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో ఎన్టీపీసీ భారీ ఎత్తున ఏపీలో పెట్టుబడులు పెడుతోంది. ఇవన్నీ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌కి నిదర్శనం. ఈ ఏడాది (గత 9 నెలల్లో) దేశానికి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25%ను ఏపీ ఆకర్షించింది. కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అన్నివిధాలా సహకరిస్తోంది. స్పేస్ సిటీ, పోర్టులు, విమానాశ్రయాలు, జాతీయ రహదారుల అనుసంధానం లాంటి అంశాలపై ప్రధానంగా దృష్టిపెట్టాం. ప్రతి 50 కి.మీ. పరిధిలో హబ్ అండ్ స్పోక్ విధానంలో పోర్టు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసే ప్రయత్నంలో ఉన్నాం. తూర్పుతీరంలో ఎగుమతులకు రాష్ట్రం గేట్ వేగా మారుతుంది. వచ్చే మూడు నాలుగేళ్లలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతిసేద్యం లక్ష్యం. ఉద్యాన పంటలు, ఆక్వా సాగులో మేం చాలా బలంగా ఉన్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' అంశంపై దావోస్‌లో మంగళవారం నిర్వహించిన సీఐఐ బ్రేక్‌ఫాస్ట్ సెషన్‌కు హాజరైన పారిశ్రామికవేత్తలు

పరిస్థితులు మారాయి

'పారిశ్రామికవేత్తలను గతంలో ఏపీకి తీసుకురావాలంటే చాలా కష్టపడాల్సి వచ్చేది. ప్రస్తుతం తెలుగు ప్రజల విజయాలు, ఏపీ బ్రాండ్ సానుకూలంగా మారాయి. ప్రతి రంగంలో నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేస్తున్నాం' అని చంద్రబాబు వివరించారు. 'కలిసి ఎదుగుదాం.. కలిసి పయనిద్దాం.. భవిష్యత్తు నిర్మిద్దాం' అని పిలుపు ఇచ్చారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, కాగ్నిజెంట్ సీఈఓ రవికుమార్, పలువురు విదేశీ సంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఏపీలో అవకాశాలు పరిశీలించండి

'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' సదస్సులో పారిశ్రామికవేత్తల ప్రశ్నలకు సీఎం సమాధానాలు

ఈనాడు, అమరావతి: పారిశ్రామికవేత్తలు ఏపీకి వచ్చి, తమ రాష్ట్ర విధానాలు పరిశీలించాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అమలు చేస్తున్నామని వారికి వివరించారు. 'ది ఆంధ్రప్రదేశ్ ఎడ్వాంటేజ్' పేరిట సీఐఐ నిర్వహించిన సదస్సులో వివిధ దేశాల పారిశ్రామికవేత్తల ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. భారత్, చైనా మధ్య ఆర్థికాభివృద్ధి విషయంలో పోలిక, మానవ వనరుల్లో కొత్త నైపుణ్యాలు తీర్చిదిద్దడం వంటి అంశాలపై సీఎం స్పష్టత ఇచ్చారు.

■ భారత్‌లో ఆర్థిక సంస్కరణలు 1991లో ప్రారంభం కావడానికి 13 ఏళ్ల ముందే (1978లో) చైనా ఆర్థిక సంస్కరణలు అమలుచేసింది. భారత్‌లో ప్రధాని మోదీ నేతృత్వంలో సుస్థిర ప్రభుత్వం ఉంది. దీనివల్ల స్థిరమైన అభివృద్ధి సాధ్యమైంది.

■ అమెరికా, చైనా, భారత్‌లలో ఏది బాగా ఎదుగుతుందనేది చెప్పడం సాధ్యం కాదు. ప్రస్తుతం మేం మిగిలిన రెండు దేశాలతో పోలిస్తే కిందిస్థాయిలో ఉన్నా.. వేగంగా అభివృద్ధి సాధిస్తున్నాం.

■ 1990లో ఐటీలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకున్నాం. అందుకే. . ప్రపంచ ప్రముఖ ఐటీ కంపెనీలకు భారత్‌కు చెందినవారే సారథ్యం వహిస్తున్నారు. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్ వల్ల కొన్ని ఉద్యోగాల్ని కోల్పోవాల్సి వస్తే.. మేం సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా ఇప్పుడు పర్యాటకరంగంపై దృష్టిపెట్టాం. జీడీపీలో 20% పర్యాటక రంగం నుంచే సాధించేలా పనిచేస్తున్నాం.

■ ఏపీలో అన్ని ప్రభుత్వ కార్యకలాపాలనూ డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్నాం. గతంలో ఎన్నడూలేని విధంగా ఫలితాలు వస్తున్నాయి.



(c) eenadu

ఈనాడు

వ్యూహాత్మక చెలిమికి కొత్త చివుళ్లు

దేశాధినేతలు ఎవరైనా సరే, సాధారణంగా విదేశాలకు సావధానంగా వెళ్తారు. అక్కడ ఒకటి రెండు రోజులు ఉండి ద్వైపాక్షిక అంశాలపై తీరిగ్గా చర్చలు సాగిస్తారు. అత్యవసర వేళల్లోనో లేదా ఆతిథ్య దేశంతో తమ సంబంధాల లోతును లోకానికి వెల్లడించాలనుకున్నప్పుడో మాత్రమే సుడిగాలి పర్యటనలు జరుపుతారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ అల్ నహ్యాన్ ఆ విధంగానే మొన్న సోమవారం స్వల్పకాలిక పర్యటనకు భారత్‌కు విచ్చేశారు. ప్రధాని మోదీ విమానాశ్రయం దగ్గరికి వెళ్లి ఆయనను స్వాగతించారు. ఇప్పటికే భిన్నరంగాల్లో పెనవేసుకున్న బాంధవ్యాన్ని వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యంగా విస్తరించాలని ఇరువురు నేతలు నిశ్చయించారు. ఈ విశేష పరిణామాలన్నీ ప్రపంచానికి ఓ స్పష్టమైన సందేశాన్ని అందించాయి. అనిశ్చిత అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాలు విసురుతున్న సవాళ్లను సమష్టిగా ఎదుర్కొంటూ, ఉమ్మడి ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అనువైన అద్భుత సాధనంగా ఇండియా, యూఏఈ మిత్రత్వం పటిష్ఠమవుతున్న క్రమాన్ని అవి కళ్లకుకట్టాయి!

భారత్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య 1972లోనే దౌత్య సంబంధాలు మొగ్గతొడిగినప్పటికీ గడచిన దశాబ్దంలోనే అవి సరికొత్త ఎత్తులకు చేరాయి. 34 ఏళ్ల విరామానంతరం యూఏఈలో పర్యటించిన భారత ప్రధానిగా 2015లో రికార్డు సృష్టించిన నరేంద్ర మోదీ- ఆపై ఎనిమిదేళ్లలో అయిదు సార్లు ఆ దేశాన్ని సందర్శించి స్నేహబంధాన్ని బలోపేతం చేశారు. ముఖ్యంగా 2022లో సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం ముడిపడిన తరవాత ద్వైపాక్షిక వాణిజ్యం వేగంగా వృద్ధిబాట పట్టింది. 2019-20లో 5900 కోట్ల డాలర్లుగా ఉన్న దాని విలువ 2024-25లో 10వేల కోట్ల డాలర్లకు పైబడింది. రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని వచ్చే ఆరేళ్లలో రెట్టింపు స్థాయికి తీసుకెళ్లాలని మోదీ, మహ్మద్ బిన్ జాయేద్ తాజాగా నిశ్చయించడం హర్షణీయం. ఇరుదేశాల్లోని ఎంఎస్ఎంఈలను పరస్పరం అనుసంధానించడం ద్వారా ఆ లక్ష్యాన్ని సాధించబూనడం స్థానికంగా ఉపాధి అవకాశాల పెంపునకు ఊతమిస్తుంది. 2028 మొదలు ఆపై పదేళ్లలో ఏడాదికి అయిదు లక్షల టన్నుల చొప్పున ద్రవీకృత సహజవాయువు సరఫరాకు యూఏఈతో కుదిరిన ఒప్పందం భారత ఇంధన భద్రతకు భరోసానిస్తుంది. కృత్రిమ మేధను అందిపుచ్చుకోవడంలో ముందున్న యూఏఈ- ఏఐ ఇండియా మిషన్‌లో భాగంగా సూపర్‌కంప్యూటింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సహకరించనుండటం మరో సానుకూలాంశం. మన దేశంలో ఏఐ పరిశోధనలు, అప్లికేషన్ల అభివృద్ధి, వాటిని వాణిజ్యపరంగా ఉపయోగించుకోవడానికి అది అక్కరకొస్తుంది!

ఇజ్రాయెల్-హమాస్ పోరు, ఇరాన్-అమెరికాల నడుమ ఉద్రిక్తతలు, యెమెన్‌లో సంక్షోభ పరిస్థితులతో పశ్చిమాసియా ఇప్పుడు రగులుతున్న అగ్నిగుండంలా ఉంది. యెమెన్ అంతర్యుద్ధ నేపథ్యంలో సౌదీ అరేబియాకూ తమకూ దూరం పెరుగుతుండటం, పాకిస్థాన్‌తో సౌదీ ఇటీవల 'నాటో తరహా' రక్షణ ఒప్పందం కుదుర్చుకోవడం, వాటికి తుర్కియే తోడవుతుండటంతో తమ భద్రత, ఆర్థిక స్థిరత్వాలకు భరోసానిచ్చే శక్తిమంతమైన, విశ్వసనీయమైన నేస్తంగా ఇండియాను యూఏఈ భావిస్తోంది. అరబ్ దేశాల్లో పాకిస్థాన్ ప్రాబల్యాన్ని తగ్గించడంతో పాటు పశ్చిమాసియాలో పరపతి విస్తరణకు, 'ఐమెక్' ఆర్థిక నడవా వంటి వాటి సాకారానికి యూఏఈతో దోస్తీ దోహదపడుతుందని భారత్ తలపోస్తోంది. గడచిన పాతికేళ్లలో 2200 కోట్ల డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టడం ద్వారా భారత ప్రగతియాత్రలో యూఏఈ భాగస్వామి అయితే- 43 లక్షల మంది ప్రవాస భారతీయుల వృత్తినైపుణ్యాలు ఆ దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఆర్థిక, సాంస్కృతిక, రక్షణ సంబంధాల పునాదులపై పరస్పర విశ్వాసమే ప్రాతిపదికగా ద్వైపాక్షిక బంధం కొత్త చివుళ్లు తొడుక్కునే కొద్దీ అది ఇంకా ఉభయతారకమవుతుంది!



హేతుబద్ధమైన ఆలోచనా విధానం, సాంఘిక, పర్యావరణ సంబంధ విషయాల పట్ల సున్నితంగా స్పందించడం, స్థిరంగా నిలబడి పదికాలాల పాటు సేవలందించే సంస్థలను నిర్మించడం... ఇవే సమాజాన్ని మారుస్తాయి.

– మృణాళినీ సారాభాయ్

పదార్థ ధర్మం

సృష్టిలోని ప్రతి అణువూ పదార్థ ధర్మానికి లోబడి ఉంటుంది. భూమికి ఉన్న ఆకర్షణ శక్తి నుంచి వాతావరణంలో మారే ఉష్ణోగ్రతల వరకు అన్నీ జీవుల శరీరాలనూ, మనసులనూ ప్రభావితం చేస్తాయి. మనిషి తరచూ అనుభవించే మనఃస్థితి మార్పును పూర్తిగా అతని లోపంగా భావించనక్కర్లేదు. అది ప్రకృతి నియమాలకు లోబడి శరీర ధర్మంగా సంభవించే మార్పుల్లో ఒకటి కావచ్చు!

ఆహారం శరీరానికి శక్తినివ్వడమే కాక మనసును కూడా ప్రభావితం చేస్తుంది. మనిషి ఆ మార్పును గ్రహించకపోయినా, పదార్థ ధర్మానికి లోబడి శరీరంలోని సూక్ష్మ శక్తులు మనసును ప్రభావితం చేస్తూనే ఉంటాయి. అందువల్ల ఒక్కోసారి మనఃస్థితిలో మార్పులు సంభవించడం సహజమే! వాతావరణ మార్పులు కూడా మనిషి మనసును ప్రభావితం చేస్తాయి. తీవ్రమైన చల్లదనం మనసును స్తబ్ధుగా మార్చగలదు, అలాగే అత్యధిక వేడిమి శరీరాన్ని అలసటకు గురిచేస్తుంది. ఇదే విధంగా ధ్వనులు కూడా మనసుపై ప్రభావాన్ని చూపుతాయి. శబ్దాలు కేవలం వినిపించే చప్పుళ్లే కాదు - అవి మనసును శాసించే శక్తులు. ఇష్టంలేని శబ్దాలు హృదయాన్ని క్షోభ పెడతాయి. అదే సమయంలో ఇష్టమైన ధ్వనులు మనసును ఉల్లాసకరంగా మార్చి, జీవితంపై కొత్త ఆశలను చిగురింపజేస్తాయి.



అంతర్యామి

మనిషి జీవితంలో ఎదురయ్యే ప్రతి అనర్థానికీ తన తప్పిదమే కారణమని భావించడం సరైంది కాదు. కొన్ని సమస్యలు పదార్థ ధర్మానికి లోబడి సంభవిస్తాయి. ప్రకృతి నియమాలను అర్థం చేసుకుని, వాటిని స్వీకరించడం ద్వారా మనసులో ప్రశాంతతను సాధించవచ్చు. మార్పులను అంగీకరించడం, వాటిని ఆధ్యాత్మికంగా పరిశీలించడం మనసును స్థిరంగా ఉంచుకోవడంలో సాయపడుతుంది. మన స్థితిలో మార్పులు వచ్చినప్పుడు మనసును తప్పుపట్టకుండా, అది శరీర ధర్మానికి లోబడి ఏమైనా వచ్చిందా అని పరిశీలించి తెలుసుకోగలిగితే మనలో సహనం, ధైర్యం పెరుగుతాయి.

ఇలాంటి అవగాహన ఉన్న మనిషి తన జీవితాన్ని ఇతరులతో పోల్చుకోడు. తన బాధకు పూర్తిగా తానే కారణం కాదనే విషయాన్ని గ్రహిస్తాడు. ఆధ్యాత్మికంగా దృఢంగా ఉండటం ద్వారా తన శరీరాన్ని, మనసును సంరక్షించుకునే మార్గాన్ని కనుగొంటాడు. పదార్థ ధర్మాన్ని పరిశీలిస్తూ, వాతావరణ మార్పులను అర్థం చేసుకుంటూ, ప్రకృతిని గౌరవిస్తూ జీవించినప్పుడు, జీవితంలోని ప్రతి సవాలు ఒక సాధనగా మారుతుంది.

అందుకే మనిషి తన శరీరాన్నీ మనసునూ ప్రేమించాలి. ప్రకృతి శక్తులను గుర్తించి వాటితో సఖ్యతగా జీవించాలి. దుఃఖం వచ్చినప్పుడు అది సహజమేనని నిబ్బరంగా ఉంటూ, ఆనందం కలిగినప్పుడు దాన్ని నలుగురితో పంచుకోగలిగితే, మనిషి జీవితాన్ని సంపూర్ణంగా ఆస్వాదించగలడు. పదార్థ ధర్మాన్ని అంగీకరించడం ద్వారా శాంతిని, సమతుల్యతను పొందగలడు.

– గోపాలుని రఘుపతిరావు

సురక్షిత ప్రయాణం ఎలా సాధ్యం?

రక్తసిక్తమవుతున్న రహదారులు... గాలిలో కలుస్తున్న ప్రాణాలు... క్షతగాత్రులవుతున్న పాదచారులు... ఇవన్నీ దేశంలో నిత్యకృత్యాలైన విషాదాలు. దేశంలో రహదారి భద్రత ఎవరికీ పట్టకపోవడంతో సమస్య అంతకంతకూ పెరిగిపోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అధికార యంత్రాంగాలు, ప్రజల తోడ్పాటుతోనే రహదారులపై నరమేధానికి అడ్డుకట్ట పడుతుంది.

మన దేశంలో రోజుకు 474 మంది రహదారి ప్రమాదాల్లో చనిపోతున్నారు. అంటే, గంటకు 20 మంది ప్రాణాలను రోడ్లు బలి తీసుకుంటున్నాయి. రోడ్డు రవాణా, రహదారుల పరిపాలన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటిపైనా ఉంది. కేంద్రం, రాష్ట్రాల్లోని రోడ్డు రవాణా, రహదారులు, పోలీసు, ఆరోగ్యశాఖ వంటి వివిధ విభాగాల సమన్వయంతోనే రహదారి భద్రతపై పురోగతి సాధ్యమవుతుంది. అయితే, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, వివిధ శాఖల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. రహదారి భద్రత కోసం నిధులు, సిబ్బంది, సమయం రూపేణా పెట్టే పెట్టుబడి అభివృద్ధికి తోడ్పడుతుందనే విషయాన్ని గుర్తించాలి. ముఖ్యంగా పోలీసు, రవాణా, రహదారులు, ఆరోగ్య శాఖలలో రోడ్డు ప్రమాద మరణాలపై ఉదాసీనత నెలకొనడం సమంజసం కాదు.

కొన్ని దేశాల పురోగతి

రహదారి ప్రమాదాలు, మరణాలను నివారించే విషయంలో కొన్ని దేశాలు ఎంతో పురోగతి సాధించాయి. 1997 నుంచే స్వీడన్ 'విజన్ జీరో' అనే నినాదంతో రవాణా కంటే భద్రతకే పెద్దపీట వేస్తూ ప్రణాళికలు రూపొందించింది. తద్వారా రహదారి ప్రమాదాలను గణనీయంగా తగ్గించగలిగింది. 'వ్యవస్థీకృత భద్రతా విధానం' ద్వారా ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, స్పెయిన్, బెలారస్, డెన్మార్క్, జపాన్, లిథువేనియా, నార్వే, ట్రినిడాడ్ అండ్ టొబాగో వంటి దేశాలు 50 శాతానికి మించి రహదారి ప్రమాద మరణాలను తగ్గించగలిగాయి. అలాంటి కృషిని పరిశీలించి, రహదారి భద్రతపై నిబద్ధతతో వ్యవహరిస్తే మన దగ్గరా ఫలితాలు ఆశాజనకంగా ఉంటాయి. 2017, 2018 సంవత్సరాల్లో ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి నెలా రహదారి భద్రతపై ప్రత్యేక శ్రద్ధతో సమీక్షించారు. ఫలితంగా వివిధ శాఖల సమన్వయం సాధ్యపడి ఆయా సంవత్సరాల్లో వరసగా ఆరు, ఎనిమిది శాతం చొప్పున రహదారి ప్రమాద మరణాలు తగ్గాయి.



సంస్థాగత ఏర్పాట్లు ఏవీ?

సాధారణంగా రహదారి భద్రత సమావేశాల్లో సంబంధిత శాఖ అధికారులు రోడ్ల స్థితిగతుల్ని వేలెత్తి చూపితే, రహదారుల శాఖ అధికారులు పర్యవేక్షణ వైఫల్యాలను తప్పుపడుతుంటారు. అంతాకలిసి సత్వర వైద్య సదుపాయాల లేమిని, పౌరుల్లో అవగాహన రాహిత్యాన్ని విమర్శిస్తుంటారు. ఎంతసేపూ ఇతరులపై నెపం మోపే ధోరణిని కట్టిపెట్టి, ఎవరికి వారు రహదారి భద్రతకు ఎలా దోహదపడాలనే దిశగా యోచించి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వ్యవస్థీకృత భద్రతా విధానం వివరిస్తుంది. ఈ విధానం ప్రకారం వాహన చోదకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రహదారుల నిర్మాణం జరగాలి. అవసరమైన చోట్ల సరైన భద్రత చిహ్నాలు, సూచికలు ప్రదర్శించాలి. ఎప్పటికప్పుడు వాహన చోదకులను అప్రమత్తం చేయాలి. రద్దీని నియంత్రించే ప్రయత్నాలు జరగాలి. రహదారులు వాహన చోదకుడి ఓర్పును పరీక్షించేవిగానో, అతివేగంతో సాహసాలను ప్రేరేపించేవిగానో ఉండకూడదు. ఎక్కువగా ప్రమాదాలకు ఆస్కారం ఉండే స్థలాలను మరమ్మతులతో సరిపెట్టడమే కాకుండా, నిరంతరం రహదారి భద్రత మదింపు జరగాలి. అవసరమైన చోట్ల సత్వరం నివారణ చర్యలు చేపట్టాలి. ఒక ప్రమాద స్థలాన్ని సరిదిద్దితే, ఇంకొకటి ప్రమాద స్థలంగా మారుతుంటుంది. అందుకని, ప్రతి కిలోమీటర్ రహదారిపై మదింపు చేపట్టి నివేదికలో పేర్కొన్న లోపాలను సంబంధిత శాఖలు వెంటనే పరిష్కరించేలా పర్యవేక్షణ ఉండాలి. అలాంటి చోట్ల ఏదైనా ప్రమాదం చోటుచేసుకుంటే, అంతకుముందే గుర్తించిన లోపాలను సరిదిద్దని అధికారులపై చర్యలు చేపట్టేలా చట్టం తీసుకురావాలి. 2014లో 'సుప్రీంకోర్టు రహదారి భద్రతపై సమీక్ష' కోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల రహదారి భద్రతా విధానాలను నిరంతరం సమీక్షిస్తుంది. ఇందులో భాగంగా కొన్ని సంస్థాగత ఏర్పాట్లను ఆ కమిటీ సూచించింది. రహదారి భద్రతను సదా సమీక్షించడానికి జిల్లా రాష్ట్ర కేంద్రస్థాయుల్లో వ్యవస్థీకృతంగా పనిచేయడానికి ప్రత్యేక ఏజెన్సీని ఏర్పాటు చేయడం, దానికి విశేష అధికారాలు ప్రసాదించడం, రహదారి భద్రతా నిధిని ఏర్పాటు చేయడం, దానికి నిరంతరంగా నిధులు సమకూర్చడం వంటివి 'సుప్రీమ్' కమిటీ సూచనల్లో ముఖ్యమైనవి. చాలా రాష్ట్రాల్లో ఇవి పూర్తిగా అమలు కావట్లేదు.

పారదర్శకంగా లైసెన్సుల జారీ...

మోటారు వాహనాల తయారీలో భద్రతా ప్రమాణాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలను ప్రవేశపెట్టింది. లైటింగ్, బ్రేకింగ్, ఎయిర్‌బ్యాగ్, సీట్ బెల్ట్, ఇంజిన్ సాంకేతికత వంటి విషయాల్లో వినూత్న మార్పులు వచ్చాయి. వాహన తయారీదారులు వివిధ స్థాయుల్లో అధునాతన డ్రైవర్ సహాయక వ్యవస్థలను వాహనాల్లో ప్రవేశ పెడుతున్నారు. వాహనాల్లో ఏర్పాటయ్యే ఈ ఆధునిక సాంకేతికతలపై చోదకులు అవగాహన పెంచుకోవాలి. మరో వైపు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియ పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలి. రహదారి నిబంధనలు, మోటారు వాహన చట్టంపై అవగాహన కల్పించే కేంద్రాలను ప్రోత్సహించాలి. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేయాలి. సహజ వాతావరణంలో రహదారిపై డ్రైవింగ్ పరీక్ష నిర్వహించడం కష్టమైనప్పుడు సిమ్యులేటర్ ద్వారా పరీక్షించాలి. చట్టాల ఉల్లంఘనలను పర్యవేక్షించే శాఖల్లో పారదర్శకత పెంపొందించాలి. మానవ రహిత పర్యవేక్షణ ఎలక్ట్రానిక్ ఉపకరణాల ద్వారా జరగాలి. 108 అంబులెన్సుల సమర్థ వినియోగం ద్వారా ప్రమాదం జరిగిన వెంటనే గోల్డెన్ అవర్‌లోనే చికిత్స అందించి మరణాల సంఖ్యను తగ్గించవచ్చు. క్షతగాత్రుల కోసం ప్రతి జిల్లాలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలి. గత ఆర్థిక సంవత్సరంలో మోటారు వాహనాలపై పన్నులు, ఫీజులు, అపరాధ రుసుముల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో రూ.11వేల కోట్లకు పైగా వసూలయ్యాయి. ఇలా సమకూరే సొమ్ములో అధిక భాగాన్ని రోడ్ల బాగుసేత, రహదారి భద్రత కోసమే వినియోగించాలి. ఈ తరహా చర్యలతోనే సురక్షిత ప్రయాణం సుసాధ్యమవుతుంది.



డాక్టర్ సంకా ప్రసాద్
విశ్రాంత అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, ఆంధ్రప్రదేశ్



బలమా... బలహీనతా?

రామకృష్ణ హాస్పిటల్లో ఉన్నాడు. క్యాన్సర్ తొలిదశ అన్నారు డాక్టర్లు. పరామర్శించడానికి మిత్రుడు చైతన్య వచ్చాడు. 'క్యాన్సర్ ట్రీట్‌మెంట్ ఇప్పుడు బాగా అభివృద్ధి చెందింది. మంచి వైద్యులూ ఉన్నారు. భయపడాల్సిన పనిలేదు. కొద్దిరోజుల్లోనే నయమైపోతుంది. నువ్వు స్పోర్ట్స్ పర్సన్‌వి. ఆటలోనే కాదు, జీవితంలోనూ గెలుస్తావు' అంటూ ధైర్యం చెప్పాడు. ఆ మాటలు రామకృష్ణ మీద బాగా పనిచేశాయి. కోలుకోగలనన్న భరోసా వచ్చింది. నవ్వుతూ మిత్రుణ్ని సాగనంపాడు. మర్నాడే మరో మిత్రుడు రాఘవ వచ్చాడు. 'అయ్యో ఎంత అన్యాయం జరిగింది. ఇంత చిన్నవయసులోనే క్యాన్సరా? ఈ మహమ్మారి ఎందరి ప్రాణాలు తీస్తోందో? అంతా దురదృష్టం. ధైర్యంగా ఉండు' అన్నాడు. ఈ మాటలతో రామకృష్ణ డీలా పడిపోయాడు. నిజంగా తనకేమన్నా అయితే తన భార్యాబిడ్డలూ ఏమవుతారు అన్న ఆలోచనతో దిగులుచెందాడు. ఇద్దరూ అతడి స్నేహితులే. ఒకరి మాటలు సాంత్వననిస్తే మరొకరి మాటలు వేదన కలిగించాయి.

సందర్భోచితంగా మాట్లాడటం ఒక కళ. మాటలు మెప్పించాలి కానీ నొప్పించకూడదు. కొందరి మాటలు పన్నీటి జల్లులా మురిపిస్తే, కొందరి మాటలు కన్నీటివరదలా మనసును ముంచెత్తేస్తాయి. నరేంద్ర కొడుక్కి నీట్‌లో సరైన ర్యాంక్ రాలేదు. పిల్లాడి కోరిక మేరకు లాంగ్‌టర్మ్ కోచింగ్‌లో చేర్పించాలనుకున్నాడు. 'నిజంగా వాడికంత శక్తి ఉంటే ఇప్పుడే సీట్ వచ్చేది. ఏడాది వేస్ట్ చేయడమెందుకు? ఏదో డిగ్రీలో చేర్చక' అన్నాడు అతడి ఫ్రెండ్ శ్రీనివాస్. నరేంద్ర ఆ మాటలు పట్టించుకోకుండా కొడుకును ప్రోత్సహించాడు. ఏడాది తిరిగేసరికి మంచి ర్యాంక్‌తో ఫ్రీ సీట్ తెచ్చుకున్నాడా అబ్బాయి. చేతనైతే మంచి మాటలతో వెన్నుతట్టాలి. లేకపోతే మౌనంగా ఊరుకోవాలి. నిరాశాజనకంగా మాట్లాడి అవతలివారి ఉత్సాహం మీద నీళ్లు చల్లడం భావ్యం కాదు. ప్రసాద్ లెక్కల టీచరు. లెక్కలు సరిగా రాని విద్యార్థుల్ని అందరిముందూ 'ఎందుకురా మీరు బడికి రావడం? పోయి గేదెలు కాచుకోక' అనేవాడు. ఆ మాటలకు ఎందరో పిల్లలు లెక్కల మీద వ్యతిరేకత పెంచుకునేవారు. కొందరైతే ఆత్మన్యూనతకు లోనై ఏకంగా బడి మానేసేవారు. అదే బడిలో సైన్స్ మాస్టారు విద్యార్థుల్ని చాలా ఎంకరేజ్ చేసేవారు. 'నువ్వు బొమ్మలు బాగా గీస్తావు. రైటింగ్ బాగుంటుంది. కొంచెం కష్టపడి చదివావంటే ఫస్ట్‌క్లాస్ గ్యారంటీ' అంటూ వాళ్ల బలాలను ముందు చెప్పి బలహీనతను సవరించుకోమనేవారు. దాంతో పిల్లలంతా ఆయనను అభిమానించేవారు. మాస్టారి ప్రశంసలు అందుకోవడానికి కష్టపడి చదివేవారు.


మాట కత్తికంటే పదునైనది. అది చేసే గాయం జీవితాంతం వెంటాడుతుంది. మాటల్లో ఆప్యాయత ధ్వనించాలి. అభిమానం వినిపించాలి. గౌరవం వ్యక్తమవ్వాలి. అలాకాకుండా ఆత్మస్తుతి, పరనింద పదేపదే దొర్లితే శ్రోతలతో అనుబంధం బలపడదు. వేమన అన్నట్లు అల్పులు మాత్రమే ఆడంబరంగా పలుకుతారు. ఆచితూచి, అవసరమైనంతవరకే మాట్లాడటం వివేకవంతుల లక్షణం. మాటతీరులోనే మన వ్యక్తిత్వం వెల్లడవుతుంది. మాటే మన బలమూ బలహీనతా! ఎలా మలచుకుంటామన్నది మన చేతిలోనే ఉంది.

– మొలకలపల్లి కోటేశ్వరరావు



దారితప్పుతున్న సంస్థలు

కంపెనీల చట్టం-2013 నిబంధనలను చాలా సంస్థలు తుంగలో తొక్కుతున్నాయి. పలు కంపెనీలు తమ వార్షిక రాబడులు, ఆర్థిక నివేదికలను సకాలంలో వెల్లడించట్లేదు. రుణాల విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నాయి. ఇంకా ఎన్నో రకాల మోసాలకు ఒడిగడుతున్నాయి. అలాంటి వాటికి కేంద్రం భారీగా జరిమానాలు విధిస్తోంది. చట్టపరంగా చర్యలు తీసుకుంటోంది. నియమాలను ఉల్లంఘించినందుకు ఆయా ఆర్థిక సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా ఎన్ని కంపెనీలపై కేంద్రం చర్యలు తీసుకుందంటే...



(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

లక్ష్యం వదిలి లాభార్జన!

సామాజిక బ్యాంకులుగా పని చేయాలన్నది ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రధాన లక్ష్యం. సంస్కరణల పేరుతో ఇప్పుడవి ప్రాంతీయ, గ్రామీణ స్వభావాన్ని కోల్పోయాయి. ఇంకా చెప్పాలంటే వదిలేశాయి. సామాజిక లాభమే తమ లాభమనే సూత్రం నుంచి ఈ ఆర్ఆర్‌బీలు దూరం జరిగాయనే విమర్శలున్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక వ్యవసాయ రంగానికి, దానితోపాటే గ్రామీణ రుణాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిశ్చయించారు. 1951-52లో రిజర్వు బ్యాంకు సర్వే- గ్రామాల్లో రుణ వితరణ యంత్రాంగం అధ్వానంగా ఉందనీ, సహకార సంఘాలు సమస్యను తీర్చగలిగేంత సమర్థంగా పనిచేయడం లేదని తేల్చింది. వడ్డీ వ్యాపారుల అప్పులు తీర్చడానికి రైతులు, గ్రామీణులు ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తోందని నిర్ధారించింది. నరసింహన్ కమిటీ గ్రామీణ పేదలకు రుణ సదుపాయం కల్పించడానికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. తదనుగుణంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల (ఆర్ఆర్‌బీ) చట్టం తెచ్చారు. 1975 అక్టోబరు 2న ప్రయోగాత్మకంగా అయిదు ఆర్ఆర్‌బీలను ప్రారంభించగా, ప్రస్తుతం 700 జిల్లాలకు విస్తరించాయి.

తగ్గుతున్న గ్రామీణ రుణాలు

గ్రామాల్లోని చిన్న, సన్నకారు రైతులకు, వ్యవసాయ కూలీలు, చేతివృత్తులవారు, చిరు వ్యాపారులకు రుణ సదుపాయం కల్పించాలనీ; గ్రామీణులను దారిద్ర్యం నుంచి విడిపించాలనీ ఆర్ఆర్‌బీ చట్టం నిర్దేశిస్తోంది. స్థానికులకు దగ్గరగా ఉండే సహకార సంఘాల మాదిరిగా, వాణిజ్య బ్యాంకుల్లా సమర్థంగా ఆర్ఆర్‌బీలు పని చేయాల్సి ఉంది. ఆర్ఆర్‌బీల మూలధనంలో 50 శాతాన్ని కేంద్ర ప్రభుత్వం, 35 శాతాన్ని ప్రాయోజక వాణిజ్య బ్యాంకు, 15శాతం మూలధనాన్ని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలని ఆర్ఆర్‌బీ చట్టం నిర్దేశిస్తోంది. ఆర్ఆర్‌బీలు వాణిజ్య బ్యాంకుల్లా కాకుండా పూర్తిగా సామాజిక బ్యాంకులుగా పనిచేయాలని విధాన నిర్ణేతలు ఆశించారు. 2005కల్లా 196 ఆర్ఆర్‌బీలు 14వేలకు పైగా శాఖలను తెరిచి దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న గ్రామీణ జనాభాకు రుణ సదుపాయం కల్పించాయి. వీఎస్‌వ్యాస్ కమిటీ సిఫార్సుల ప్రకారం ఆర్ఆర్‌బీల విలీనం జరిగింది. వ్యాపారం చేస్తూ తామే లాభాలు ఆర్జించాలన్నది ఆర్ఆర్‌బీల లక్ష్యం కాదు. తమ వల్ల సమాజం లాభపడాలన్నదే వాటి ఆశయం. ఈ క్రమంలో నష్టాలు సహజం. వీటిని రైతులు, గ్రామీణ పేదలకు చేయూతనివ్వడానికి అయ్యే సామాజిక వ్యయంగా పరిగణించాలని భావించారు.




ఆర్ఆర్‌బీలు ఇచ్చే రుణాల వల్ల గ్రామీణ ఆర్థికం, తద్వారా ఉపాధి అవకాశాలు ఊపందుకుంటాయనీ, అదే అసలు సిసలు లాభమని తలపోశారు. అందుకే గ్రామీణులకు రుణాలు ఇవ్వడానికి ఆస్తుల పూచీకత్తును కోరరాదన్నారు. తమ రుణాల ద్వారా గ్రామాల్లో సృష్టించిన ఉత్పత్తులు, ఆస్తులే ఆర్ఆర్‌బీలకు పూచీకత్తు. ఉదాహరణకు ఒక చిన్న రైతు రుణం తీసుకుని పండించిన పంటను మాత్రమే తనఖా పెట్టుకుంటారు తప్ప భూమిని కాదు. నష్టనివారణకు ఆర్ఆర్‌బీలు అనుసరించే మార్గమిది. కానీ, ఇది నష్టాలను తెచ్చిపెట్టింది. 1990లలో సంస్కరణలకు ముందు 173 ఆర్ఆర్‌బీలు నష్టాల్లోనే ఉండేవి. నష్ట భారం మితిమీరడంతో సంస్కరణలు తెచ్చారు. ఫలితంగా మొత్తం ఆర్ఆర్‌బీల స్వభావం, పరమార్థం మారిపోయింది.

సంస్కరణల కింద 196 ఆర్ఆర్‌బీలను 28గా మార్చారు. జిల్లాకొక ఆర్ఆర్‌బీ అనే పాత సూత్రం బదులుగా రాష్ట్రానికి ఒకటి అనే సూత్రాన్ని తెచ్చారు. 2024 మార్చి నాటికి 28 ఆర్ఆర్‌బీలకు 22,069 శాఖలు ఉన్నాయి. గ్రామాల్లో ఉండాల్సిన ఆర్ఆర్‌బీలు పట్టణాలకూ, నగరాలకూ తరలిపోయాయి. అవి రుణాలను కూడా అక్కడే ఇస్తున్నాయి. ఆర్ఆర్‌బీలు ఒకప్పుడు వందశాతం డిపాజిట్లను రుణాలుగా ఇచ్చేవి. ఇప్పుడు అది 71.4 శాతానికి దిగివచ్చింది. షేర్లు, సెక్యూరిటీలలో ఆర్ఆర్‌బీలు పెట్టుబడి పెట్టడం ఎక్కువైంది. అంటే గ్రామాలకు ఇచ్చే రుణాలు తగ్గుతున్నాయన్నమాట. 2023-24లో వాటి నికర లాభం ఎన్నడూ లేనంతగా రూ.7,571 కోట్లకు చేరింది. వాణిజ్య బ్యాంకులు వసూలు చేసే వడ్డీరేట్లకే ఆర్ఆర్‌బీలూ రుణాలిస్తున్నాయి. ఇప్పుడు బంగారంపై రుణాలు, స్వయంసహాయక బృందాలకు రుణాల విషయంలో ఆర్ఆర్‌బీలు వాణిజ్య బ్యాంకులకన్నా ఎక్కువ లాభాలు కళ్లజూస్తున్నాయి. అంటే సామాజిక, గ్రామీణ, అల్ప వడ్డీ రుణాలు అనే పదాలు ఆర్ఆర్‌బీల నిఘంటువు నుంచి కనుమరుగవుతున్నాయి. అయితే, చిన్న డిపాజిట్‌దారులు ఇప్పటికీ ఆర్ఆర్‌బీలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వయంసహాయక బృందాల డిపాజిట్లలో 29శాతం ఆర్ఆర్‌బీలలోనే ఉన్నాయి.

వాణిజ్య సంస్థలుగా...

సామాజిక బ్యాంకులుగా మొదలైన ఆర్ఆర్‌బీలు ఇప్పుడు వ్యాపార రూపం సంతరించుకున్నాయి. ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడం ద్వారా వీటిని పూర్తిస్థాయి వాణిజ్య సంస్థలుగా మార్చాలనే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం ఆర్ఆర్‌బీలలో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు 50 శాతంగా, ప్రాయోజక బ్యాంకు వాటా 35 శాతంగా ఉన్నాయి. ఈ 85శాతం వాటాను 51 శాతానికి తగ్గించి ప్రైవేటు వాటా పెంచాలనే ప్రతిపాదన ఉంది. ఇదే కనుక అమలైతే సామాజిక బ్యాంకులుగా ఉండాల్సిన ఆర్ఆర్‌బీలు లాభాపేక్షతో పనిచేసే వాణిజ్య బ్యాంకులుగా మారిపోతాయి. పేద రైతులు, గ్రామీణులకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలన్న లక్ష్యం తెరమరుగవుతుంది. ప్రజాప్రయోజనాలకు అది మంచిది కాదు.



పీఎస్ఎం రావు
ఆర్థిక, సామాజిక విశ్లేషకులు


పెట్టని పరీక్ష...



నరసింహపురంలో శరభయ్య అనే వ్యాపారి ఉండేవాడు. ఒకరోజు పని కోసం గోపన్న, శివన్న, రంగన్న అని ముగ్గురు వ్యక్తులు అతని దగ్గరికి వచ్చారు. అప్పుడే శరభయ్య తన దుకాణం నుంచి కొన్ని వస్తువులు ఇంటికి తీసుకురావడానికి బయలుదేరుతున్నాడు. దాంతో.. 'మీరు ప్రస్తుతానికి నాకు ఒక పని చేసి పెట్టండి. మా కొట్టు నుంచి ఇక్కడికి కొన్ని సరకులు తీసుకురావాలి. నాతోపాటు రండి దుకాణం చూపిస్తాను' అన్నాడు శరభయ్య. సరేనంటూ ముగ్గురూ ఆయనతో బయలుదేరారు. అలా నడుస్తూ ఉండగా.. గాలికి పడిపోయిన చెట్టు రోడ్డుకు అడ్డంగా, నడవడానికి వీల్లేకుండా ఉంది. 'దాన్ని ఎవరైనా కాస్త పక్కకు జరపండి. అప్పుడు మనం వెళ్లొచ్చు' అన్నాడు శరభయ్య. వెంటనే రంగన్న వెళ్లి ఆ చెట్టు కొమ్మలను పక్కకు జరిపాడు. ఇక అందరూ నడుచుకుంటూ ముందుకెళ్లారు. ఇంకాస్త దూరం వెళ్లాక.. రోడ్డు మీద పెద్దపెద్ద రాళ్లు కనిపించాయి. వాటిని చూసి వెంటనే అక్కడి నుంచి తీసి పక్కన పడేశాడు రంగన్న. మళ్లీ నడవడం ప్రారంభించారు. కాసేపటికి ఇంటికి చేరుకున్నారు. అప్పుడు గోపన్న.. 'దుకాణానికి వెళ్లాలి అన్నారు. కానీ మళ్లీ ఇంటికే వచ్చాము. దారి తప్పి నడిచామా?' అన్నాడు. 'అదేం లేదులే!' అన్నాడు శరభయ్య. 'మరి సరకుల బస్తాలు ఎప్పుడు తీసుకొచ్చేది?' అడిగాడు శివన్న. 'నిజానికి మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్లి పరీక్ష పెడదాం అనుకున్నాను. కానీ అనుకోకుండా దారిలోనే పూర్తయ్యింది అది' అన్నాడు శరభయ్య. 'అదెలా?' ఆశ్చర్యంగా అడిగారు ముగ్గురూ. 'మనం నడుచుకుంటూ వెళ్తున్నప్పుడు రకరకాల అడ్డంకులు వచ్చాయి. మొదటిసారి నేను చెట్టుకొమ్మలను తొలగించమని చెప్పినప్పుడు రంగన్న ఒక్కడే వాటిని తీసేశాడు. రెండోసారి నేనేమీ చెప్పకుండానే తనే రాళ్లను పక్కకు పడేశాడు. మీరు ఇద్దరూ అసలు ఒక్కసారి కూడా స్పందించలేదు. పని చేయాలనే తపన, చురుకుదనం అతనిలో ఉన్నాయి. అందుకే రంగన్ననే పనిలోకి తీసుకుంటున్నాను' అని చెప్పాడు శరభయ్య. విషయం అర్థం చేసుకున్న శివన్న, గోపన్న అక్కడి నుంచి వెళ్లిపోయారు.



– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య



ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
బుధవారం జనవరి 21, 2026

మన కొయ్య.. ఘనమయ్య

కొండపల్లి బొమ్మ కీర్తి చాటేలా అడుగులు

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

కొండపల్లి కొయ్య బొమ్మ ఔన్నత్యాన్ని చాటేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆ బొమ్మ కథను, విశిష్టతను నేటి తరానికి చెప్పేందుకు జిల్లా యంత్రాంగం మొదటి అడుగేసింది. ఆ వారసత్వ సంపద ప్రతి పర్యాటకునికి అర్థమయ్యేలా చెప్పడంతో పాటు దీని ఖ్యాతిని దశదశలా వ్యాపింపజేసేం


సిద్ధమైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్



చూడచక్కని ఖిల్లా ముఖద్వారం

దుకు స్థానికంగా ఒక వేదిక ఏర్పాటు చేయాలని భావించి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పూర్తి చేశారు. ప్రభుత్వం తెల్లపోనికి చెట్టు కర్ర దశ నుంచి రంగుల బొమ్మగా మారే విధానం పర్యాటకులకు చూపించేందుకు విశాలమైన హాల్‌ను రూపకల్పన చేశారు.

మ్యూరల్ పెయింటింగ్స్: కొండపల్లి కొయ్య బొమ్మల కళ, దాని నైపుణ్యం, చారిత్రక ఆధారాలు, కళాకారుల జీవన వైవిధ్యాన్ని తెలిపే మ్యూరల్ పెయింటింగ్స్‌ను అక్కడి ఎక్స్‌పీరియన్స్ సెంటర్ గోడలపై చిత్రీకరించారు. రహదారి పక్కన ఉన్న ప్రాంగణంతో పాటు లోపల గదుల్లో ఈ చిత్రాలను రూపుదిద్దారు.

ఉపయోగమేమంటే..: ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ద్వారా బొమ్మల కళ తీరుతెన్నులు పర్యాటకులకు తెలియజేయడం ముఖ్య ఉద్దేశం. బొమ్మ రూపొందే ప్రక్రియను ఆద్యంతం చూపిస్తూ పర్యాటకులు మధురానుభూతి పొందేలా చేయడం ప్రథమం. దీంతో పాటు బొమ్మకు అద్దే రంగుల సహజ సిద్ధంగా తీసే వాటికి ఏర్పాటే క్రమంలో వేసే వైవిధ్యాల్ని పర్యాటకులకు వివరిస్తారు. ఎన్ని రకాల బొమ్మలున్నాయో తెలియజేయడంతో పాటు అక్షరాలు వివరాలను కళాకారులు, పర్యాటకులకు తెలుపుతారు. బొమ్మ తయారీకి ఉపయోగించే తెల్లపోనికి విశిష్టత, అది కొండపల్లిలోనే లభించడానికి గల కారణాలు పర్యాటకులకు సుస్పష్టంగా ఈ సెంటర్ వివరిస్తుంది. ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయడంతో పాటు బొమ్మల అమ్మకాలు పెంచేందుకు యంత్రాంగం కృషి చేయనున్నట్లు స్పష్టం చేసింది.

ఆకర్షణీయంగా తీర్చిదిద్దాం..

శతాబ్దాల చరిత్ర కలిగిన కొండపల్లి బొమ్మల కాడలిని తెలియజేసేందుకు జాతీయ రహదారి(30) కొండపల్లి ఖిల్లా రోడ్డు వద్ద ముఖద్వారాన్ని నిర్మించాం. ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రతి పర్యాటకునికి మంచి అనుభూతిని కలిగిస్తుంది. కొండపల్లి కోటకు అనుసంధానంగా ఉన్న బొమ్మల ఖ్యాతిని అందరూ మరోసారి గుర్తుకు తెచ్చుకొనేలా ఇది సిద్ధమైంది. **- వెంకటరత్నం, ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్, కొండపల్లి**



కూలకముందే.. కదలండి

ప్రకాశం బ్యారేజిపై 39-40 పిల్లర్లకు ఎదురుగా పాదచారులకు రక్షణగా ఉన్న గోడ బీటలు వారి నది వైపు ఒరిగిపోతోంది. నిత్యం స్థానికులే కాకుండా పర్యాటకులు సైతం ఈ గోడ అంచునే నడిచి వెళుతుంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఈనాడు అమరావతి

ముప్పు తప్పేలా... ముంపు వీడేలా!

ఈనాడు, అమరావతి

బుడమేరు ముంచెత్తకుండా కూటమి ప్రభుత్వం కార్యాచరణ

విజయవాడకు వరద ముప్పును పరిష్కరించేలా కూటమి సర్కారు శాశ్వత పరిష్కారం చూపుతోంది. బుడమేరు యూటీ (అండర్ టన్నెల్) విస్తరణ ప్రక్రియ దాదాపు కొలిక్కి వచ్చింది. బుడమేరు వరదల వేళ ప్రస్తుత యూటీ సామర్థ్యం చాలక ముంపు ముప్పు 10 రోజులు వదల్లేదు. భవిష్యత్తులో ఇలా ఇబ్బంది రాకుండా యూటీ సామర్థ్యం పెంచే పనులు నెలాఖరుకు పట్టాలెక్కనున్నాయి.


విస్తరించనున్న ఎనికేపాడు యూటీ..

20 వేల క్యూసెక్కుల సామర్థ్యం జోడింపు..

★ ఏ.కొండూరులో మొదలైన బుడమేరు.. మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ గ్రామీణం, నగరం మీదుగా ఎనికేపాడు చేరుతుంది. 15 వేల క్యూసెక్కుల వరద వచ్చినా వెలగలేరు రెగ్యులేటర్ నుంచి బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలోకి పంపిస్తారు. ★ బుడమేరు వరద 30 వేల క్యూసెక్కులు రావడంతో.. వెలగలేరు రెగ్యులేటర్ దగ్గర 15 వేల క్యూసెక్కులు, ఎనికేపాడు యూటీ దగ్గర 4,800 క్యూసెక్కుల సామర్థ్యం చాలక.. నగరం అతలాకుతలమైంది. దాదాపు 30 వేల క్యూసెక్కుల వరద వచ్చినట్టు అంచనా వేశారు. ★ దీంతో భవిష్యత్తులో విపత్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా కూటమి సర్కారు ఎనికేపాడు యూటీని విస్తరించాలని నిర్ణయించింది.

కమిటీ ముందుకు దస్త్రం

★ యూటీ నిర్మాణానికి రూ.45 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రూ.36.31 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయి. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తవగా దస్త్రాన్ని అప్రూవల్ కమిటీ ముందుంచారు. గురువారం కమిటీ పరిశీలించనుంది. అంతా సవ్యంగా ఉంటే ఒప్పందం చేసుకుని, వర్క్ఆర్డర్ ఇవ్వనున్నారు. నెలాఖరుకల్లా పనులు మొదలుపెడతారు. ★ ప్రస్తుత ఎనికేపాడు యూటీ బ్రిటిష్ కాలం నాటిది కావడం.. సామర్థ్యం తక్కువగా ఉండటంతో కొత్త నిర్మాణం తప్పనిసరైంది. భారీవరదలు వస్తే వరద నీరు ముందుగా పాత యూటీలోకి వస్తుంది. ★ 4,300 క్యూసెక్కుల సామర్థ్యం దాటితే కొత్త యూటీ ద్వారా నీరు తరలించేలా నిర్మించనున్నారు. అక్కడ నుంచి నీరు కొల్లేరుకు చేరి అక్కడి నుంచి ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తుంది. ★ కొత్త యూటీ, వెలగలేరు రెగ్యులేటర్, పాత యూటీ సామర్థ్యాలు కలిపి 39,300 క్యూసెక్కుల వరద వచ్చినా విజయవాడ నగరానికి ఎలాంటి ముప్పు.. ముంపు ఉండదు.

ఆన్‌లైన్లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తోంది. కలెక్టరేట్, పోలీస్ కమిషనర్ కార్యాలయాల్లో వీటిని నిర్వహిస్తారు. వృద్ధులు ఎంతో వ్యయప్రయాసలు కోర్చి రావాల్సి ఉండడంతో.. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. ఇకపై ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదులు చేసేలా వెసులుబాటు కల్పించింది. అలాగే ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబరు అందుబాటులోకి తీసుకొచ్చింది.

ఇదీ విధానం.. తొలుత pgrs.ap.gov.in అనే వెబ్ సైట్లోకి వెళ్లాలి. 'హోం'ను క్లిక్ చేసి, తర్వాత లాగిన్ క్లిక్ చేయాలి. సిటిజన్‌ను ఎంపిక చేసుకోవాలి. మీ ఆధార్ నంబరు నమోదు చేయగానే, ఓటీపీ వస్తుంది. దాని ద్వారా లాగిన్ అవ్వాలి. ఫిర్యాదు వ్యక్తిగతమా లేక సంఘానికి సంబంధించిందో అడుగుతుంది. ఫిర్యాదు చేయగానే సదరు సచివాలయ కార్యదర్శికి చేరుతుంది. పోలీసులది అయితే పోలీస్‌స్టేషన్‌కు వెళుతుంది. వారు విచారించి చర్యలు తీసుకుంటారు.

pgrs.ap.gov.in
(or)
1100 TOLL FREE కి కాల్ చేసి మీ ఫిర్యాదును నమోదు చేయవచ్చు

1100కు కాల్ చేసి...

చరవాణి ద్వారా 1100 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే.. వారు ఫిర్యాదు స్వీకరిస్తారు. తర్వాత తగిన చర్యలు తీసుకుంటారు. ఎంతో వ్యయప్రయాసలు కోర్చి పోలీస్‌స్టేషన్లు, కలెక్టరేట్లకు వెళ్లకుండా ప్రభుత్వం ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సూచించారు.

కృత్తివెన్నుకు ఉపముఖ్యమంత్రి రాక నేడు

గరిశపూడి(కృత్తివెన్ను), న్యూస్‌టుడే: కృత్తివెన్ను మండలం గరిశపూడి పంచాయతీ పెదచందాలలో గతేడాది రోడ్డు ప్రమాదంలో మరణించిన చందు వీరవెంకట వసంతరాయలు అవయవదానం చేసి మానవత్వం చాటుకున్నారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, స్థానిక కూటమి నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనసేన క్రియాశీల సభ్యుడు వసంతరాయలు అవయవదానం చేయడం గొప్ప విషయమని చెప్పారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించడానికి ఉపముఖ్యమంత్రి వస్తున్నట్లు తెలిపారు.

గట్టు చెదిరి.. గుండెలదిరి



గతేడాది వరదల సమయంలో నీటి ఉద్ధృతికి ఇబ్రహీంపట్నం సమీపంలో ఫెర్రీ వద్ద మట్టి కొట్టుకుపోవడంతో ఇప్పుడు గట్టు నెమ్మదిగా నీటిలోకి జారిపోతోంది. పట్టిసీమ నీరు కృష్ణా నదిలో కలిసే ప్రదేశం కుడి వైపు గట్టు ప్రమాదకరంగా మారుతోంది. దీంతో తారు రోడ్డు ముక్కలుగా విరిగిపోయి, రక్షణగా ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్ కూడా కాలువలోకి వాలిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి గట్టు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

దయచేసి వినండి.. తెరవైపు చూడకండి!


ఎరైవల్ బ్లాకులో తీసేశారిలా..

పండిట్ నెహ్రూ బస్‌స్టాండులో అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో బస్సుల కోసం వేచి ఉండే ప్రయాణికులకు ఎరైవల్, డిపార్చర్ బ్లాకుల్లో మొత్తం 5 భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేశారు. బస్సు వచ్చే వరకు ప్రయాణికులు వీటిలో వినోద కార్యక్రమాలు చూసేవారు. ఒప్పందం ముగియడంతో గత 5 నెలలుగా ఇవి కనుమరుగయ్యాయి. ఎరైవల్ బ్లాకులో అయితే మొత్తం అన్ని ఎల్ఈడీ తెరలను పీకేశారు. సమాచార కేంద్రం ఎదురుగా ఉన్న తెర గత నాలుగేళ్లుగా పనిచేయడం లేదు. ఇదే స్క్రీన్‌పై అప్పట్లో ప్రపంచ కప్ క్రికెట్ లైవ్‌ను ప్రయాణికులు భారీ సంఖ్యలో వీక్షించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీటికి మరమ్మతులు నిర్వహించాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- ఈనాడు, అమరావతి**


5 నెలలుగా పనిచేయని ఎల్ఈడీ తెర

విచక్షణం మీదైతే.. విద్రోహం పరారే..!

డిజిటల్ అరెస్టులపై పెరిగిన చైతన్యం

ఈనాడు, అమరావతి

డిజిటల్ అరెస్టు మోసాలు పెరిగాయి. వయోవృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న పిల్లల తల్లిదండ్రులే లక్ష్యంగా మోసగాళ్లు వల వేస్తున్నారు. ఈతరహా మోసాలకు గురవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కమిషనరేట్‌లో విస్తృత కార్యక్రమాల నిర్వహణతో అవగాహన పెరుగుతోంది. ఈనేపథ్యంలో మోసగాళ్ల గాలానికి చిక్కకుండా పలువురు తప్పించుకొని.. కేటుగాళ్ల ఎత్తులను చిత్తుచేస్తున్నారు. ఇలాగే చైతన్యం వెల్లివిరిస్తే సైబర్ మోసాలకు అడ్డుకట్ట పడుతుంది.



★ అవగాహనతో అడుగేశారు.. ఈనెల 9న విజయవాడలో ఓ మహిళకు దిల్లీ సైబర్ క్రైమ్ విభాగం నుంచి అని ఫోన్ వచ్చింది. మీపై దిల్లీలో కేసు రిజిస్టర్ అయిందని మోసగాళ్లు బెదిరించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడతారని.. అవతల వ్యక్తి ఫోన్ పెట్టేశాడు. వెంటనే వాట్సాప్‌లో వీడియో కాల్ వచ్చింది. పోలీస్‌స్టేషన్ వాతావరణంలా ఉండటంతో నిజమేనని మహిళ నమ్మారు. ఖాతాలో ఎంత డబ్బుందని గద్దించి అడిగారు. రూ.70 లక్షలనడంతో.. అరెస్టు తప్పించుకోవాలంటే.. ఆ మొత్తాన్ని చెప్పిన ఖాతాకు బదిలీ చేయాలని ఒత్తిడిచేశారు. దీంతో ఆమె రూ.70 లక్షల చెక్కు సిద్ధం చేశారు. ఆపై అనుమానమొచ్చి.. తెలిసిన వారిని సంప్రదించి.. మోసమని తెలిసి చివరలో ఆగిపోయారు. ✦ న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న విజయవాడవాసికి ఈనెల 16న ఫోన్ వచ్చింది. బెంగళూరులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ నుంచి మాట్లాడుతున్నాం. మీ ఎయిర్‌టెల్ సిమ్ మనీ లాండరింగ్ కేసులో వాడారని.. ఈడీ నుంచి ఫిర్యాదు వచ్చిందన్నాడు. దీనిపై బెంగళూరులో కేసు నమోదైందని నమ్మించాడు. అరెస్టు తప్పించుకోవాలంటే తాను సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.60 లక్షలు పంపాలని ఒత్తిడి చేశాడు. సిద్ధపడ్డ న్యాయవాది.. అనుమానంతో డబ్బు బదిలీ చేయకుండా ఆగిపోయారు.

తీవ్రఒత్తిడికి గురిచేసి... తాము పోలీసు, ఆర్బీఐ, ఈడీ, నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులమని మోసగాళ్లు వీడియోకాల్స్ చేస్తారు. బాధితుడిని కాల్ కట్ చేయొద్దని గంటలపాటు ఇంటరాగేషన్ పేరుతో ఇబ్బంది పెడతారు. తమ ముందు కనిపించేలా చూసుకుంటూ డిమాండ్ల సాధనకు తీవ్ర ఒత్తిడి తెస్తారు. అచ్చు ప్రభుత్వ ఏజెన్సీ అధికారుల దుస్తులనే ధరించి.. పోలీసుస్టేషన్, ప్రభుత్వ కార్యాలయాలను భ్రమింపజేసేలా స్టూడియోల నుంచి కార్యకలాపాలు సాగిస్తూ మోసగిస్తుంటారు.

అవగాహనతో అరికట్టవచ్చు...

★ తాము పోలీసులమంటూ.. గుర్తుతెలియని నెంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను పట్టించుకోవద్దు. ★ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దు. వారి అస్తిత్వాన్ని ధ్రువీకరించుకోండి. ★ ప్రభుత్వ రంగ సంస్థలు కానీ. అధికారులు కానీ ఫోన్ ద్వారా డబ్బులు బదిలీ చేయమని అడగరు. వీరికి ఎలాంటి చెల్లింపులు చేయొద్దు. ★ అనుమానమొస్తే ఠాణాలో ఫిర్యాదు చేయాలి.

ప్రకృతి వ్యవసాయం.. శ్రేయస్కరం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : తక్కువ పెట్టుబడితో రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయం కల్పించడమే ప్రకృతి వ్యవసాయ విధాన లక్ష్యమని ఆ విభాగ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) కె.శంకర్ నాయక్ తెలిపారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ విధానంపై 5 రోజుల పాటు నిర్వహించే ఎన్.ఎం.ఎన్.ఎఫ్. క్లస్టర్ల రెండో దశ శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని వ్యవసాయాధికారుల సంఘం భవనంలో మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 'శిక్షణ ఐసీఆర్పీ'లకు ప్రకృతి వ్యవసాయంలో జరిగే తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై అవగాహన కల్పిస్తామన్నారు. మరో నాలుగు రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. అరుణ తదితరులు పాల్గొన్నారు.



చల్లని మొక్క.. చక్కని లెక్క

మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని ప్రోత్సహించేందుకు నాలుగు ఆపై తరగతుల విద్యార్థులకు ప్రభుత్వం గత ఏడాది జులైలో నిర్వహించిన మెగా పీటీఎం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మొక్కలను, గ్రీన్ పాస్‌పోర్ట్ పేరుతో ఒక పుస్తకం అందజేసింది. ఇందులో మొక్క వ్యవహారిక, సాంకేతిక నామం, ఏ తేదీన, ఏ ప్రాంతంలో నాటారనే వివరాలు పొందుపర్చాలి. విద్యార్థులు తమకు ఇచ్చిన మొక్కకు వారి తల్లి పేరు పెట్టి, కుదిరిన చోట నాటి ప్రతి మూడు నెలలకోసారి ఎదుగుదల స్థితిని పాస్ పుస్తకంలో నమోదు చేయాలని, ఏడాదికి రెండుసార్లు ఉపాధ్యాయుడు వీటిని నిర్ధారించి సంతకం చేయాల్సి ఉంది. దీని అమలు తీరుపై 'ఈనాడు'.. న్యూ రాజరాజేశ్వరిపేటలోని కేర్ అండ్ షేర్ మున్సిపల్ హైస్కూలులో పరిశీలించగా.. దాదాపు విద్యార్థులందరూ మొక్కలను నాటి, వారి సంరక్షణ పరిస్థితులను పాస్ పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ఇలా ప్రతి పాఠశాల విద్యార్థులు అమలు చేస్తే నగరం పచ్చదనంతో కళకళలాడుతుందని ఉపాధ్యాయులు అంటున్నారు. **- ఈనాడు, అమరావతి**

రెవెన్యూ అధికారులపై విచారణకు ఆదేశం

ఈనాడు డిజిటల్ - అమరావతి: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు రెవెన్యూ అధికారులపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉంగుటూరులో గతంలో తహసీల్దార్‌గా పని చేసిన మురళీకృష్ణ ప్రస్తుతం ఏపీఐఐసీలో విజయవాడ జోనల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఆయనతో పాటు మాజీ తహసీల్దార్ శ్రీనివాసు, మాజీ ఆర్ఐ కిశోర్‌బాబు, మాజీ వీఆర్వో శ్రీనివాసరావు, వీఆర్వో శ్రీనివాస్ రతన్‌పై శాఖాపరమైన విచారణకు రెవెన్యూ శాఖ.. ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారిని నియమించింది. మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించింది.

ఆదుకుంటానని.. ఆడుకున్నాడు

ఈనాడు, అమరావతి

- వెలుగులోకి వస్తున్న సూర్య ప్రలోభాలు
- అద్దె ఖాతాల కేసులో కొత్త కోణాలు

"ఇల్లు కట్టి అప్పులపాలైన శ్రీకాంత్‌ను ఆర్థికంగా ఆదుకుంటానని సూర్య నమ్మబలికాడు. తన వెన్నంటి సాయం చేస్తే డబ్బుకు లోటుండదని ఆశపెట్టాడు. ప్రలోభాలకు లొంగి అద్దె ఖాతాల నేరాల్లో పాలుపంచుకుని చివరకు కటకటాలపాలయ్యాడు. విజయవాడలో వెలుగుచూసిన మ్యూల్ అకౌంట్స్ కేసు ఫిలిప్పీన్స్ వరకు విస్తరించింది."

కారు కొనిచ్చి.. నమ్మకం కలిగించి..

పల్నాడు జిల్లా చాగల్లుకు చెందిన ప్రధాన నిందితుడు సూర్య (ఏ1)కు క్లాస్‌మేట్ అయిన నరసింహారావుకు.. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండల వాసి శ్రీకాంత్ అన్న అవుతాడు. వీరు ఓసారి మాట్లాడుతుండగా.. తాను ఇటీవల ఇల్లు నిర్మించడంతో రూ.5 లక్షల అప్పులు అయ్యాయని సూర్యకు చెప్పాడు. తనతో ఉంటే రూ.5 లక్షలు ఇస్తానని నమ్మించాడు. నీ పేరుతో ఒక కారు కొని ఇస్తానని శ్రీకాంత్‌కు చెప్పడంతో అంగీకరించాడు. రూ.1.20 లక్షలతో సెకెండ్ హ్యాండ్ కారు కొని శ్రీకాంత్ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. దీనిలో నిందితుడు పలు ప్రాంతాలు తిరుగుతూ బ్యాంకు ఖాతాలు తెరిపించే వ్యవహారాలను పర్యవేక్షించాడు. తన పెదనాన్న, అతని కుమారుడి హత్య కేసులో ఏ10 అరెస్టు అయి రిమాండ్‌లో ఉండి ఏడాదిన్నర కిందట జైలు నుంచి బయటకు వచ్చాడు. ఆ తర్వాత కూడా సూర్య ముఠాతో తిరిగాడని తేలింది. ఆశించిన మేర కమీషన్ రావడం లేదని బయటకు వచ్చాడు.

టెలిగ్రామ్ గ్రూపుల్లో ఓటీపీల పోస్టు...

సేకరించిన ఖాతాల తాలూకా రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్ల సిమ్‌లనూ తీసుకునేవారు. ఆ సిమ్‌ల కోసం ఎనిమిది ఫోన్లు ఉపయోగించేవారు. ఆ ఖాతాల లావాదేవీల్లో ఆ సిమ్‌లకు వచ్చే ఓటీపీలను వాడేవారు. ఈ ఓటీపీల వివరాలను నాలుగు టెలిగ్రామ్ గ్రూప్‌ల్లో సూర్య ముఠా పోస్టు చేసేది. వీటిని అవతల వ్యక్తులు తీసుకుని లావాదేవీలు నిర్వహించేవారని తేలింది.

ఏవియేషన్ కోర్సులో కలిశారు...

డిగ్రీ అయ్యాక సూర్య.. విజయవాడలో ఏవియేషన్ కోర్సు చేశాడు. ఈ కేసులో నిందితులైన విజయవాడకు చెందిన పార్వతి, ఫిలిప్పీన్స్‌లో ఉండి ఖాతాలను పర్యవేక్షిస్తున్న ఇబ్రహీంపట్నానికి చెందిన స్రవంతి పరిచయమయ్యారు. ఈ కోర్సు అయ్యాక స్రవంతి.. హైదరాబాద్‌లోని ఓ ఏవియేషన్ సంస్థలో ఉద్యోగంలో చేరింది. అక్కడే పరిచయమైన ఫిలిప్పీన్స్‌కు చెందిన వ్యక్తిని ప్రేమించి పెళ్లి చేసుకుని ఆ దేశానికి వెళ్లి స్థిరపడింది. అద్దె ఖాతాలను సేకరించి వాటి ద్వారా కమీషన్ పొందొచ్చని ముగ్గురు కూడబలుక్కున్నారు. సేకరించిన కరెంటు ఖాతాలను సూర్య, పార్వతీలు ఫిలిప్పీన్స్‌లోని స్రవంతికి పంపేవారు. ఆమె వాటిని బెట్టింగ్, డిజిటల్ అరెస్టు మోసాల లావాదేవీలకు అందించేది.









(c) eenadu

దాతృత్వ స్థలం.. అభివృద్ధి శూన్యం

❑ డంపింగ్ యార్డుగా సీవీ రెడ్డి ఛారిటీస్ ప్రాంగణం ❑ స్క్రాప్‌గా పలు వస్తువులు



వివిధ రకాల వ్యర్థాల గుట్ట

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే

రాష్ట్రంలో రెండో అతిపెద్ద దేవస్థానంగా పేరుగాంచిన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం భక్తులకు మౌలిక వసతుల కల్పనలో మాత్రం చివరి స్థానంలో ఉంది అనడానికి సి.వి.రెడ్డి ఛారిటీస్ ప్రాంగణం చూస్తే తెలుస్తుంది. దాత చుండూరు వెంకటరెడ్డి రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని ఐదు దశాబ్దాల కిందట సేవా కార్యక్రమాల నిమిత్తం ఉచితంగా అందజేశారు. దుర్గగుడి దత్త సంస్థగా మారిన తర్వాత రూ.10 కోట్లు వెచ్చించి నాలుగు డార్మిటరీలు నిర్మించారు. వీటిని నిర్మించక ముందు ఈ స్థలం చుట్టూ ఉన్న దుకాణాలు, గోదాముల ద్వారా సంస్థకు ఏడాదికి రూ.30 లక్షల ఆదాయం అద్దెల రూపంలో వచ్చేది. ప్రస్తుతం దుర్గగుడికి ఆదాయం రాకపోగా ఏడాదికి రూ.60 లక్షలు నిర్వహణ నిమిత్తం ఖర్చు అవుతోంది.

◆ ఆదాయం రాకపోగా డార్మిటరీలో ఉంటున్న భక్తులకు కంటిమీద నిద్ర లేకుండా ప్రాంగణం అంతా డంపింగ్ యార్డుగా మార్చారు. మామూళ్ల మత్తుకు అలవాటు పడిన కొందరు అధికారులు రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన స్టీల్ డ్రమ్ములు, బస్సులు, వాటి టైర్లు, ఈ-టాయిలెట్లు, బారికేడ్లు సైతం స్క్రాప్‌గా మారుస్తున్నారు. కుర్చీలు, టేబుళ్లు, సోఫాలు, ఫ్యాన్లు, ఎలక్ట్రిక్ వస్తువులు కనిపించకుండా పోతున్నాయి. దిగువస్థాయి అధికారులు గుత్తేదారులతో కలిసిపోయి చౌకగా వీటిని విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

◆ సీవీరెడ్డి ఛారిటీస్ ప్రాంగణాన్ని డంపింగ్ యార్డుగా మార్చడంపై దుర్గగుడి ఈవో శీనా నాయక్‌ను సంప్రదించగా.. ఇక్కడ విలువైన వస్తువులు భద్రపరిచేందుకు షెడ్డును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్క్రాప్‌ను గుత్తేదారుకు అప్పగించేందుకు అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



వంకాయలు-24/28, టమాటా-18, బెండ-24, పచ్చిమిర్చి-32, కాకర-40, బీర-28, క్యాలీ ఫ్లవర్-25/20, క్యాబేజి-22, క్యారెట్-35, దొండ-46, బంగాళ దుంప-22, ఉల్లిపాయలు-24, గోరుచిక్కుళ్లు-32, దోస-30/40, సొర-12, పొట్ల-30, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-68, మునగ-10/12, ఆకు కూరలు (కట్ట)-2.50, కంద-44, బీట్ రూట్-28, కీర దోస-32, బీన్స్-65, క్యాప్సికమ్-62, చింతకాయలు-60, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - విజయవాడ రైతుబజారు

తారక మంత్రం.. నిఘా నేత్రం

» ఎన్టీఆర్ కమిషనరేట్‌లో మరో కొత్త ప్రయోగం



సీసీ కెమెరాలన్నీ ఇలా కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానమయ్యాయి..

✸ సంక్రాంతి పండగ తిరుగు ప్రయాణాలతో ఇబ్రహీంపట్నం రింగ్ వద్ద నలువైపులా వాహనాలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన పోలీసులు.. విజయవాడ నుంచే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా హైదరాబాద్ వైపు మళ్లించారు.

✸ పాయకాపురం ఉడా కాలనీలో మహిళ వేషంలో వచ్చిన ఒక వ్యక్తి.. వృద్ధురాలి ముఖంపై స్ప్రే కొట్టాడు. బంగారు గొలుసుతో పరారవగా. . 24 గంటల వ్యవధిలో అతడిని గుర్తించి అరెస్టు చేశారు.

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్లే ఇదంతా సాధ్యమైందంటున్నారు విజయవాడ పోలీసులు. నేర పరిశోధన, ట్రాఫిక్ నియంత్రణలో అవి కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఎన్టీఆర్ కమిషనరేట్‌కు గుండెకాయగా మారాయి. దేశంలో ఏ జిల్లాలో లేని విధంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ కేంద్రానికి అనుసంధానం చేశారు. ఇవే కాకుండా ట్రాఫిక్ పోలీసుల డ్రోన్లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లను సైతం కమాండ్ కంట్రోల్‌తో కలిపారు.

అనుసంధానించినవి..
సీసీ కెమెరాలు : 10,550
ట్యాబ్‌లు : 100 డ్రోన్లు : 42

ప్రత్యేక డ్యాష్‌బోర్డు ఏర్పాటు.. డయల్ 112కు నిత్యం ఫోన్ కాల్స్ వస్తుంటాయి. వాటిని పెట్రోలింగ్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారు. అవసరమైన ప్రాంతాలకు వారు వెళతారు. దీని కోసం వారికి ప్రత్యేకమైన ట్యాబ్‌లు ఇచ్చారు. వాటిని కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఏదైనా కేసు విషయమైన ఫీల్డ్‌కు వెళితే.. వారు సంఘటనా స్థలం నుంచే వివరాలను అప్‌లోడ్ చేస్తారు. ఇలా సీసీ కెమెరాలు, డ్రోన్లు, ట్యాబ్‌ల సమాచారాన్ని విశ్లేషించేందుకు ప్రత్యేకంగా ఒక డాష్‌బోర్డును ఏర్పాటు చేశారు. 'జబ్బిక్స్' అనే సాఫ్ట్‌వేర్‌లో డీహెచ్ఎంఎస్ (డివైజ్ హెల్త్ మేనేజ్‌మెంట్ సిస్టం) పేరుతో డ్యాష్‌బోర్డును రూపొందించారు. వచ్చిన ఫుటేజీ మొత్తం అందులో రికార్డు అవుతుంది. ఎక్కడైనా సీసీ కెమెరా పనిచేయకపోయినా.. దానికి సంబంధించిన ఎలర్ట్ మేసేజ్ వచ్చేలా ప్రత్యేక సాంకేతికతను వినియోగించారు.

సీఎం చేతుల మీదుగా ప్రారంభం.. ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్‌కే ప్రత్యేకమైన ఈ వ్యవస్థను ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు పోలీస్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. తాజాగా ఈ వ్యవస్థ పూర్తి సామర్థ్యంతో పని చేస్తోంది. ఒకటి రెండు రోజుల్లో దీనిపై పూర్తి స్థాయిలో విశ్లేషించి.. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తారు.

జిల్లాకు కర్ణాటక అధ్యయన బృందం



అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కన్నడ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ కె.ఎం. గాయత్రి నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి అధ్యయన బృందం మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలో పర్యటించింది. ఆంధ్రప్రదేశ్ భాష, సాంస్కృతిక, మైనార్టీ శాఖ ఉన్నతాధికారులను కలిసిన అనంతరం, నగరంలోని వివిధ కార్యాలయాల్లో కలెక్టర్ జి.లక్ష్మీశతో భేటీ అయింది. కర్ణాటకలో ప్రాదేశిక భాష అమలుకు సంబంధించి [illegible] సంకల్పం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ద్వితీయ భాషా ఉర్దూ అమలు తీరును అధ్యయనం చేసేందుకు ఈ బృందం పర్యటిస్తోంది. విద్యారంగం, పంచాయతీలు, పోలీసు స్టేషన్లు తదితర కార్యాలయాలు, వివిధ ప్రాంతాల్లో రెండో అధికార భాష అమలు తీరుపై సమాచారాన్ని సేకరించింది. భాష, సాంస్కృతిక శాఖ అధికారులతో పాటు, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు తగిన సమాచారం అందించారు. వివిధ కార్యాలయాలను బృంద సభ్యులతో కలెక్టర్ ముచ్చటించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ కన్నడ ప్రొఫెసర్, తుళు కమిషన్ ఛైర్మన్ తదితరులు బృందంలో ఉన్నట్లు ఏపీ భాష, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు.

రెండు రోజుల ముందే రెక్కీ!

చరవాణుల చోరీ కేసు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

పటమటలోని ఒక ఎలక్ట్రానిక్ షోరూంలో రూ.18లక్షల విలువైన చరవాణులను చోరీ చేసిన కేసులో ప్రధాన సూత్రధారి కదలికలపై ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. చోరీకి రెండు రోజుల ముందుగానే విజయవాడకు వచ్చి, షోరూంలో ప్రవేశించి చోరీ అనుకూలమైన మార్గాన్ని గుర్తించినట్లు తెలిసింది. ఆ తర్వాత అనుచరులకు ఫోన్ చేసి పిలిపించాడు. కేవలం 3 గంటల్లోనే దొంగతనం చేసి వెళ్లిపోయాడు.

స్వేచ్ఛగా తిరిగి... షోరూం మరమ్మతులు నిమిత్తం సీసీ కెమెరాల వైర్లను నిర్వాహకులే తొలగించారు. దీంతో ముఠా నాయకుని కదలికలు నమోదు కాలేదు. కానీ సమీపంలోని మరో సీసీ కెమెరాకు చిక్కాడు. 4 అంతస్తులున్న ఈ షోరూంలో స్వేచ్ఛగా తిరిగినట్లు పోలీసుల విచారణలో తేలింది. అతడి సూచనల మేరకు అయిదుగురు వ్యక్తులు విజయవాడకు రైలులో వచ్చారు. అక్కడ నుంచి ఆటో ఎక్కి పటమట సెంటరులో ఒక్కొక్కరు ఒక్కో చోట దిగారు. అందరూ నడుచుకుంటూ షోరూం వద్దకు చేరుకున్నారు. ముందుగా గుర్తించిన మార్గంలో లోపలికి వెళ్లి చరవాణులను చోరీ చేశారు. తాపీగా బెంజిసర్కిల్ వరకు నడుచుకుంటూ వెళ్లి.. అక్కడ ఆటో ఎక్కి రైల్వేస్టేషన్‌కు వెళ్లి రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు.

విశాఖలో బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కి... రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం చేరి, అక్కడి నుంచి బొకారో ఎక్స్‌ప్రెస్ ఎక్కినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు నిర్ధారించుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన ముఠా కావచ్చని అనుమానించారు. ఈ క్రమంలో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఒక బృందం పట్నాకు చేరుకోగా.. మిగిలిన వారు రైలులో అక్కడికి బయలుదేరారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో సీసీ ఫుటేజీలే పోలీసుల దర్యాప్తునకు కీలకంగా మారాయి. ముఠా నాయకుడితో పాటు మిగిలిన వారి ఫొటోలతో బిహార్ పోలీస్ రికార్డుల్లో వెతుకుతున్నారు.



పోలీసులు అనుమానిస్తున్న ముఠా నాయకుడు

అవగాహనతోనే సైబర్ నేరగాళ్లకు కళ్లెం



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్, పక్కన సమాచార, వివిధ శాఖల అధికారులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆశ పడడం. . తర్వాత భయపడడం.. ఇలా ఆన్‌లైన్ మోసాలకు ప్రజలు బలవుతున్నారు. సరైన అవగాహనతోనే సైబర్ నేరగాళ్లకు కళ్లెం పడుతుంది. అనుమానాస్పద లింక్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ సీఐ ఎన్.శ్రీనివాస్ సూచించారు. నగరంలోని ప్రభుత్వ అతిథి గృహ ప్రాంగణంలోని జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ప్రజల కష్టార్జితాన్ని గద్దల్లా తన్నుకు పోతున్నారు. . సరైన అవగాహన కలిగి ఉండడం ద్వారా నేరాలకు కళ్లెం వేయాలన్నారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. డిజిటల్ అరెస్టులు, ఏసీబీ అధికారుల పేరిట వచ్చే నకిలీ కాల్స్ తదితరాలపై అవగాహన కల్పించారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని, గోల్డెన్ అవర్‌లో టోల్ ఫ్రీ నంబరు 1930 ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. https://www.ntrpolice.in వెబ్‌సైట్‌లోని సమాచారాన్ని పొంది, సరైన అవగాహనతో సైబర్ నేరాల నుంచి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎస్.ఐ. బి.డబ్ల్యూ.దాసన్, సమాచార శాఖ డీఐపీఆర్వో కె.వి.రమణరావు, అదనపు పీఆర్వో కె.రవి, ఎ.వి.సూపర్‌వైజర్ వేమూరి ప్రసాద్, సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల డీసీవో ఎ.మురళీకృష్ణ, భూసేకరణ కోర్టు రిజిస్ట్రార్ ఎన్.సూర్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వైభవంగా జలోత్సవం



భవానీపురం, న్యూస్‌టుడే: వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భవానీపురంలోని పున్నమి ఘాట్ వద్ద జలోత్సవం కార్యక్రమం మంగళవారం రాత్రి జరిగింది. వాసవీ పీఠం పీఠాధిపతి ప్రజ్ఞానేంద్ర సరస్వతి అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కలెక్టర్ లక్ష్మీశ పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలుకు డిమాండ్

విజయవాడ (గాంధీనగర్), న్యూస్‌టుడే : రాజ్యాంగానికి విరుద్ధంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని.. భూసేకరణలు, భూసమీకరణలు న్యాయస్థానం ముందు చెల్లవని మాజీ మంత్రి, రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని, భూసేకరణలు నిలిపివేయాలని, ఉద్యమకారులపై పెట్టిన పీడీ యాక్ట్, రౌడీషీట్లు తొలగించాలని కోరుతూ సీపీఐ (ఎం.ఎల్. న్యూడెమోక్రసీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దేశాన్ని కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని, మరోవైపు అమరావతిని పప్పు బెల్లంలా బడా బాబులకు పంచుతూ క్విడ్ ప్రోకోకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులు ఐక్యంగా చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇదే నిరంకుశ పంథాలో ముందుకువెళ్తే ప్రజా తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజాధనంతో నిర్మాణమైన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీల పేరుతో ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ప్రజల ఆరోగ్యాన్ని కార్పొరేట్లకు బలి చేయడమేనని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కె.పోలారి, ఎం.లక్ష్మి, సాగర్, పద్మ, పి.శ్రీనివాస్, రమణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

పెరిగిన ధర.. చిగురించిన ఆశ

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

ప్రస్తుతం విపణిలో మిరప ధర సాగుదారుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. పంట దిగుబడి తగ్గినా ధర అనుకూలంగా ఉంటే పెట్టుబడి ఖర్చు లభిస్తోందంటున్నారు. 2025 ఖరీఫ్‌లో సాగైన మిరపకు మొదటి నుంచి తెగుళ్ల బెడద తీవ్రమై అన్నదాతలను కలవరపెడుతోంది. నల్లతామర పురుగు, వేరు కుళ్లు తెగులు ఆశించి పంట దెబ్బతినడంతో కొందరు రైతులు ఆశలు వదులుకున్నారు. ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి రాగానే పంటను తొలగించి ప్రత్యామ్నాయ సాగుకు భూమిని సిద్ధం చేశారు. ఈ దశలో సోమవారం మధిర, ఖమ్మం, గుంటూరు మార్కెట్లలో తేజ రకం(సన్నాలు) క్వింటా రూ.15,500 నుంచి రూ.16 వేలు ధర లభించింది.

తెగుళ్లు సోకి పాడైన తోటల్లో.. ఇటీవల చైనాకు మిరప ఎగుమతులు ఆరంభమయ్యాయి. దీంతో పంట ధర క్రమేణా పెరుగుతోంది. ఇంతకు ముందు వరకు క్వింటా రూ.13 వేలు నుంచి రూ.14 వేలు విక్రయించడం గగనమైంది. ప్రస్తుతం లావు కాయలు క్వింటా రూ.20 వేలు కూడా ఉంది. పసుపు రకం మిరప రూ.30 వేలు పైగా ధర ఉంది. మరో వైపు ఈ ఏడాది తెగుళ్లు సోకి పాడైన తోటల్లో నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి లభించింది. రైతులు పూర్తిగా సన్నరకం సాగు చేస్తూ లావు రకాన్ని విస్మరిస్తున్నారు. దీంతో ధర, దిగుబడి, పెట్టుబడి వ్యయంలో వ్యత్యాసం వస్తోంది. సన్న, లావు రకం మిరప సమాన విస్తీర్ణంలో సాగు చేయడం మేలని ఉద్యానాధికారులు చెబుతున్నారు.

క్వింటా మిరప రూ.16 వేలు

జిల్లాలోని మెట్ట ప్రాంత మండలాల్లో మిరప సాగు చేస్తున్నారు. నల్ల తామర పురుగు, తెగుళ్ల బెడదతో ఏటేటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. మూడేళ్లలోనే జిల్లాలో మిరప సాగు సగానికి పడిపోయింది. 2022 వరకు జిల్లాలో 29 వేల ఎకరాల్లో సాగు చేపట్టారు. అప్పట్లో విదేశీ ఎగుమతులు పెరిగి పంటకు గిరాకీ ఏర్పడింది. దీంతో రైతులు ఇతర పంటల సాగు తగ్గించి మిరప విస్తీర్ణం పెంచేశారు. ఈ క్రమంలో నల్ల తామర ఆశించి పంటను నాశనం చేసి సాగుదారులను నష్టపరిచింది. దీంతో సాధారణ విస్తీర్ణం కంటే కూడా తగ్గించేశారు. జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 46 వేలు, 2024 ఖరీఫ్‌లో 35వేలు, 2025 ఖరీఫ్‌లో 21 వేల ఎకరాలు సాగైంది. విస్తీర్ణంతో పాటు పంట దిగుబడి తగ్గిపోయింది.

డీఎస్పీ విభాగాన్ని పునరుద్ధరించాలి

ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాల్సిందే



సమావేశమైన కమిటీ సభ్యులు

ఈనాడు డిజిటల్, అమరావతి : 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణకు ప్రత్యేక డీఎస్పీ ఉండేవారు. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఆ విభాగాన్ని తొలగించింది. కేసుల విచారణలో జాప్యం జరుగుతోంది. దీన్ని వెంటనే పునరుద్ధరించాలని' రాష్ట్ర స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో వారు సమావేశం నిర్వహించారు. వివిధ జిల్లాల సభ్యులు మాట్లాడుతూ.. 'వివిధ శాఖల్లో ఎస్సీ, ఎస్టీల బ్యాక్ లాగ్ పోస్టులు ఏళ్లుగా భర్తీ చేయడం లేదు. రాష్ట్రంలో మిగులు భూములను పేదలకు ఇవ్వాలి. బెస్ట్ అవైలబుల్, కార్పొరేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశం కల్పించాలి. ఎస్సీ, ఎస్టీల భూములకు సంబంధించినవి, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా జిల్లాలో గ్రీవెన్స్ నిర్వహించాలి. డీవీఎంసీ (జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ) సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. చాలా కళాశాలల యాజమాన్యాలు టీసీలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అట్రాసిటీ కేసు బాధితులకు వారంలో నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉన్నా చెల్లించడం లేదు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను ఎస్సీ, ఎస్టీల కాలనీలకే వినియోగించాలి. కేసుల్లో 41 సీఆర్‌పీసీ నోటీసులు, స్టేషన్ బెయిల్ తొలగించాలి' అని సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, ఎన్.ఎల్లన్న, వి.రాజ్‌కుమార్, అరవ పార్వతయ్య, పల్లె మణీందర్‌దేవ్, వివిధ జిల్లాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహిళ వేషంలో వచ్చి బంగారం చోరీ

మూడు గంటల్లోనే దొంగ అరెస్టు



వాహనంపై వెళ్తున్న నిందితుడు

పాయకాపురం, న్యూస్‌టుడే : మహిళ వేషం వేసుకుని వచ్చి ఓ వృద్ధురాలి మెడలో బంగారాన్ని చోరీ చేసిన వ్యక్తిని.. మూడు గంటల్లోనే పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం నున్న పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. రాజీవ్‌నగర్.. ఎల్ఐజీ-294 ఉడా కాలనీలో ఓ వృద్ధురాలు (77) తన కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోంది. సోమవారం ఒక మహిళ వచ్చి ఆమె ముఖంపై స్ప్రే చల్లి, మెడలోని బంగారు గొలుసు లాక్కునేందుకు యత్నించింది. దీంతో వృద్ధురాలు ప్రతిఘటించింది. గొలుసులోని చిన్న ముక్క, ఆంజనేయస్వామి లాకెట్ దొంగ చేతిలో ఉండిపోయింది. తర్వాత మహిళ ద్విచక్ర వాహనంపై పరారైంది. బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి వెంటనే నున్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. దొంగతనం చేసింది మహిళ కాదని, పురుషుడని గుర్తించారు.

భార్య దుస్తులు ధరించి.. కండ్రికకు చెందిన మకాం జోసెఫ్ (32) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వృద్ధురాలి కోడలు స్కూల్ టీచర్‌గా పనిచేస్తుంటారు. ఆమెను ప్రతి రోజు జోసెఫ్ తన ఆటోలో ఇంటికి తీసుకొచ్చి దిగపెడుతుంటాడు. అలాగే వృద్ధురాలికి మంగళాపురంలో పాల వ్యాపారం ఉంది. అక్కడి నుంచి పాలు తీసుకుని వస్తుంటాడు. ప్రస్తుతం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ క్రమంలో దొంగతనానికి పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలింది. ఈ క్రమంలో అతడు తన భార్య టాప్, చున్నీ ధరించి.. మహిళ వేషంలో వెళ్లి దొంగతనానికి పాల్పడ్డాడని పోలీసులు తేల్చారు.

పోలీసుల గోప్యతకు కారణమేంటీ..?: సోమవారం ఉదయం దొంగతనం జరగ్గా.. మూడు గంటల్లోనే పోలీసులు దొంగను పట్టేసుకున్నారు. జోసెఫ్ గంజాయి మత్తులో ఉన్నట్టు తెలిసింది. ఈ విషయం బయటకు పొక్కకుండా ఉండేందుకు పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. మత్తు దిగాక మంగళవారం వివరాలు బయటపెట్టినట్టు విమర్శలు వచ్చాయి. గోప్యతకు గల కారణాలు ఏంటని మీడియా ప్రతినిధులు పోలీసులను అడగ్గా.... బాధితురాలు తమకు కేసు వద్దని చెప్పారని, అయినా నిబద్ధతతో కేసు కట్టి, దొంగను పట్టుకున్నామని సీఐ కృష్ణమోహన్ తెలిపారు. కాగా.. నున్న స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం, గంజాయి మత్తులో వరుస దొంగతనాలు, దాడులు జరుగుతున్నాయి. పదుల సంఖ్యలో బాధితులు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయానికి వెళ్లి పోలీసుల తీరుపై ఫిర్యాదులు చేస్తున్నా.. వారిలో మార్పు లేకపోవడం గమనార్హం.

అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు.. జరిమానా

విజయవాడ(చిట్టినగర్), న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఓ వ్యక్తికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.3 వేలు జరిమానా విధించినట్లు పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు వెల్లడించారు. కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న బాలికపై 2021లో ఆమె మేనత్త భర్త అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. 2021 జూన్‌లో నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ వి.వి.నాయుడు ఆధారాలు న్యాయస్థానంలో సమర్పించగా 11 మంది సాక్షులను విచారించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. బాధిత బాలికకు రూ.5 లక్షల నష్టపరిహారం అందించాలని జిల్లా న్యాయ విభాగం అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.

హత్య కేసు నిందితుడి కోసం గాలింపు

మధురానగర్, న్యూస్‌టుడే : సహజీవనం చేస్తున్న యువతిని చంపి, ఆమె కుమార్తెపై దాడి చేసి పరారైన నిందితుడు సాయి శివకుమార్ కోసం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. గుంటూరు జిల్లా నులకపేటకు చెందిన సాయి శివకుమార్.. కేదారేశ్వరపేటలో హస్సేనా అనే మహిళతో 14 సంవత్సరాలుగా కలిసి ఉంటున్నారు. అనుమానంతో ఆమెను ఈ నెల 16వ తేదీన హత్య చేశాడు. అడ్డుకున్న ఆమె కుమార్తెను రోకలిబండతో కొట్టి పరారయ్యాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం గాలింపు చేపట్టారు. అతడు బందరు కాలువలో దూకాడనే అనుమానంతో పరివాహక ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్లు, లాకులు వద్ద పరిశీలించారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. హత్య చేసిన తర్వాత నిందితుడు ఒక మహిళా న్యాయవాదిని సంప్రదించాడని విశ్వసనీయ సమాచారం. అయితే కేసు తీసుకునేందుకు ఆమె నిరాకరించడంతో వెళ్లిపోయాడని తెలిసింది. న్యాయస్థానంలో లొంగిపోయేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాడని సన్నిహితులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో నిందితుడి కోసం 3 బృందాలు గాలింపు చేపట్టాయి.


జాతీయస్థాయి జూడో పోటీలకు రాష్ట్ర జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: కోల్‌కతాలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ జూడో పోటీల్లో తలపడే రాష్ట్ర స్త్రీ, పురుషుల జట్లను రాష్ట్ర జూడో సంఘం కార్యాలయ కార్యదర్శి ఎంఎల్ ఉషారాణి మంగళవారం వెల్లడించారు. ఇటీవల కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను రాష్ట్ర జట్లకు ఎంపిక చేశామని పేర్కొన్నారు. మహిళా జట్టులో కె.సౌమ్య రాణి, జి.ప్రవల్లిక, బి.అక్షయ, ఎస్.వెన్నెల, ఏకే సౌందర్య, ఎం.దీపిక భువన, ఎం.సాయి హర్షిత, జి.దీపిక, జి.హేమాంగిణి, ఎం.రిషిత చోటు సంపాదించారు. పురుషుల జట్టులో పి.యువరాజు, కె.తిరుమల, కె.పాపిరెడ్డి, ఎన్.శేఖర్‌రెడ్డి, ఎం.గోవర్ధన్, పి.అరుణ్, డి.హర్ష రామ్‌కుమార్, వి.గణేష్‌కుమార్, కె.హేమంత్, ఎన్.అమరేశ్వర్‌రెడ్డి చోటు దక్కించుకున్నారు. జట్ల సభ్యులకు సోమవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో డీఎస్‌డీవో కాకర్ల కోటేశ్వరరావు కిట్లు అందజేశారు.



క్రీడాకారులతో డీఎస్‌డీవో కోటేశ్వరరావు, నామిశెట్టి వెంకట్, ఉషారాణి

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -157 రిటైల్ ధర 184 చికెన్ విత్ స్కిన్ - 267 చికెన్ స్కిన్‌లెస్ - 304.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 180, 189, 200 చికెన్ విత్ స్కిన్ - 350 చికెన్ స్కిన్‌లెస్ - 360.

91.9FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU e Classifieds

AUTO
VEHICLES FOR SALE
AP-39- VB-6379 TATA ACE HT Electronic Model 2023 is for Sale in as is Where is Condition. Sundaram Finance Ltd. ✆ 94409 09752, 79016 77794.

BUSINESS SERVICES
బంగారం కొనుగోలు. బ్యాంకులో, ఇతర ఫైనాన్స్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి మార్కెట్ ధరకు కొనుగోలు. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166
బంగారం కొనుగోలు. [illegible] స్పాట్‌క్యాష్. ✆ 81422 92071

REAL ESTATE
FLAT FOR SALE
Ready to Occupy 3BHK E/F 1340 S.Ft. Flat No: 2003, 2nd Floor with Nice Parking, Divis Palace, Ramachandra Nagar, VJA. ✆ 90329 62307

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జీఎస్టీ 5% అదనం

[illegible] ✆ 93939 59907

LEASE/ RENT
విజయవాడ సిటీ [illegible] ✆ 73821 92967.

TO LET
COMMERCIAL
VJA, [illegible] ✆ 98497 89830.

JOBS
స్వగృహ ఫుడ్స్‌లో పనిచేయుటకు Customer Care, [illegible] MG రోడ్ VJA. ✆ 81425 45000.
[illegible] ✆ 90007 14836
Konac Diagnostics VJA looking for Mrkg Exe. B.Sc/B.Com/Fresher/Exp. Attractive pay & incentives call immediately # 84999 01899, 70952 20088.

VJA-2 [illegible] ✆ 94412 49912, 92463 75420
బాయ్స్ కావలెను. [illegible] Age: 19 to 25Yrs [illegible] ✆ 85238 55445.
బోయపాటి స్వీట్స్ [illegible] ✆ 91173 35959.
ప్రముఖ మార్కెట్యార్డులో [illegible] ✆ 81212 46222.
[illegible] ✆ 89776 39662, 89776 39663

గమనిక [illegible]

తిరువూరు

• తిరువూరు • మైలవరం

ప్రాంగణ ఎంపికలో సత్తా

గొల్లపూడి : గొల్లపూడిలోని నలంద కళాశాలలో జరిగిన ప్రాంగణ ఎంపికలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ వాసిం పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరు తమ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నట్లు ఆయన చెప్పారు.

లబ్ధిదారులకు చెట్టు పట్టాలు కొనసాగించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూముల లబ్ధిదారులకు అటవీ హక్కు చెట్టు పట్టాలు కొనసాగించాలని తిరువూరు నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు గొట్టేటి సుబ్బ పట్నం(బుజ్జయ్య) అటవీ అధికారులను కోరారు. ఈ మేరకు తెదేపా నియోజకవర్గ రైతు సంఘం ఉపాధ్యక్షుడు దమ్మాలపాటి సాంబశివరావుతో పాటు డీఎఫ్‌వో సతీష్‌ను విజయవాడలో మంగళవారం కలిసి సమస్యను వివరించారు. దీనిపై డీఎఫ్‌వో సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కొండపల్లి: కొండపల్లి పుల్లయ్య గట్టు ప్రాంతానికి చెందిన పి.దుర్గారావు(50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దుర్గారావు కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. కొండపల్లి పురపాలక వైస్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ఎమ్మెల్యే సాయంతో పాటు మరికొంత కలిపి మృతుని కుటుంబానికి రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ, ఏడుకొండలు, డేవిడ్, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ మోర్చాలో స్థానం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : భాజపా మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రఫీ మోను, కోశాధికారిగా షేక్ అమీర్‌బాషాను నియమించినట్లు భాజపా జిల్లా సెక్రటరీ మారసు కృష్ణమోహన్ తెలిపారు. మైనార్టీ నుంచి ఇద్దరు ఇబ్రహీంపట్నం వారికి అవకాశం ఇవ్వడం సంతోషించదగ్గ విషయమని చెప్పారు. మైనార్టీల్లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఇది మంచి తరుణమని అన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందన: దాములూరు ఇందిరమ్మ కాలనీలోని మురుగు కాలువల్లో పూడిక పేరుకుని నీరు పారుదలకు ఇబ్బందిగా ఉందని, దీంతో దుర్వాసన వస్తూ దోమలతో అవస్థలు పడుతున్నామని స్థానికుడు లాలిషా హెబ్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను గ్రామ కార్యదర్శి కె.గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి సమస్య పరిష్కరించారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

★ మండలంలోని కీర్తిరాయునిగూడెం ఎస్సీ ఏరియాలోని మురుగు కాలువల్లో పూడిక తొలగింపు చర్యలు పంచాయతీ అధికారులు సోమవారం చేపట్టారు. 'కాలువ లేదు అంతా మురుగే' శీర్షిక 'ఈనాడు'లో శుక్రవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పంచాయతీ కార్మికులతో పూడిక తీయించారు. సీసీ రోడ్ల వెంట పక్కా డ్రైనేజ్ నిర్మాణం చేపట్టక పోవడంతో, తరచు పూడిక నిండుతోందని, శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు వారిని కోరారు. - న్యూస్‌టుడే, మైలవరం

★ విస్సన్నపేట ప్రధాన రహదారిపై డివైడర్ల వెంట మట్టి పేరుకుందని వాహనదారులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. ఈవో కేశవ హరికృష్ణ కుమార్, ఎంపీడీవో చేకు చిన్న రాట్నాలు స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి శుభ్రం చేయించి సమస్య పరిష్కరించారు. - విస్సన్నపేట

విస్సన్నపేట ఎస్సైగా అర్జున్ రాజు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట ఎస్సై జి.రామకృష్ణ సైబర్ క్రైమ్ బ్రాంచికి బదిలీ అయినట్లు తిరువూరు సీఐ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఎస్సైగా అర్జున్ రాజును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు వెల్లడించారు. ఆయన సిటీ నుంచి విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయినట్లు చెప్పారు.

పాడి రైతుల సంక్షేమానికి పథకాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం పశుసంవర్ధక సహాయక సంచాలకులు తాళ్లూరి శ్రీనివాసులు సూచించారు. గుంటుపల్లి గ్రామీణ పశు వైద్యశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన పశు ఆరోగ్య వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరాన్ని తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు తిరుమలరావు ప్రారంభించారు. ఏడీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొండపల్లి పశువైద్యశాల వైద్యులు, సిబ్బంది చికిత్సలు అందించారు. చిలుకూరులో జరిగిన శిబిరంలో మూలపాడు వైద్యురాలు, ఆమె సిబ్బంది పశువులకు వైద్య పరీక్షలు చేశారు.

మంచు విపరీతం.. ప్రమాదాలు అధికం

జాతీయ రహదారిపై గత గురువారం కంచికచర్ల వద్ద ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడిని కారు ఢీకొంది. ఉదయం 6 గంటలకు జరిగిన సంఘటనలో మంచు అధికంగా ఉండటంతో వాహనం కనిపించక ప్రమాదం జరిగిందని కారు చోదకుడు తెలిపారు.

ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి శాంతినగర్ వద్ద ఆదివారం ఇద్దరు ద్విచక్ర వాహనదారులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంచు తెర అడ్డుగా ఉండటంతో ఎదుటి వ్యక్తి కనిపించక ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు.

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

గత వారం రోజులుగా మంచు విపరీతంగా కురవడంతో తెల్లవారుజామున జాతీయ రహదారిపై ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. మంచు దుప్పటి మాదిరిగా రావడంతో ఎదురుగా ఉన్న వాహనాన్ని మరో వాహనదారుడు గుర్తించలేక పోతున్నారు. వన్ వేలోనే ఇలా ఉంటే ఇక టూ వేలో పరిస్థితి మరో రకంగా ఉంది. మంచు దుప్పటి అడ్డుగా ఉండటంతో వాహనాలు ఎదురెదురుగా ఢీకొంటున్నాయి. ఇదిలా ఉంటే పొలాల వద్ద మంచు విపరీతంగా ఉంటుండటంతో వాహనదారులు 30 కి.మీ వేగంతో కూడా వెళ్ల లేని పరిస్థితి నెలకొంది. మంచు వల్ల పూతకొచ్చిన మామిడి పరిస్థితి కూడా ఇబ్బందిగా మారింది.

ఎక్కువగా జరిగేది ఇక్కడే..

గ్రామ శివారు, నిర్జన ప్రదేశాల్లో స్థానికులు నడుచుకుంటూ వెళ్తుంటారు. అటువంటి వారు వాహనదారులకు కనిపించక మరింత ప్రమాదం పొంచి ఉంటోంది. ఇబ్రహీంపట్నం మండలం మూలపాడులో శనివారం మంచు కురిసే సమయంలో నడుచుకుంటూ వెళ్తున్న శంకర్‌రావును ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు రహదారిపై పడడంతో వెనుక వస్తున్న లారీ నుంచి త్రుటిలో తప్పించుకున్నాడు.



కొండూరు వద్ద హెడ్ లైట్లు వేసుకుని జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు

అప్రమత్తం చేస్తున్నాం

మంచు అధికంగా ఉండడం వల్ల కొన్ని ప్రమాదాలు సంభవిస్తున్న మాట వాస్తవం. సంక్రాంతి సెలవుల్లో ఆంధ్రాకు వచ్చిన వారు తిరుగు ప్రయాణమవుతున్నారు. కార్ల యజమానులతో పాటు బస్సు డ్రైవర్లకు పలు సూచనలు చేస్తున్నాం. వాహనదారులు ఫాగ్ లైట్లు వాడే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. జాతీయ రహదారులపై వేగాన్ని గణనీయంగా తగ్గించుకొని వెళ్లే విధంగా వాహనదారులను అప్రమత్తం చేస్తున్నాం. - రామచంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ

26న క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, న్యూస్‌టుడే : పాఠశాల విద్యార్థులకు మేడే- 2026 పేరుతో ఈ నెల 26న క్విజ్, వ్యాసరచన, కథ చెప్పడంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లంపల్లి ఛారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి నుంచి శ్రీపోసాని నరసింహారావు చౌదరి ఉన్నత పాఠశాల ఆవరణలో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్: 94903 36550లో సంప్రదించాలని కోరారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

భవానీపురం, న్యూస్‌టుడే : ఎగ్జిబిషన్ నిర్వాహకులు అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అగ్నిమాపక అధికారి పేర్కొన్నారు. మంగళవారం భవానీపురం, విద్యాధరపురం ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసే నిర్వాహకులు అగ్ని ప్రమాదాలకు కారణమయ్యే వాటిని జాగ్రత్తగా ఉంచాలని తెలిపారు. పొంగిలించే వంటలు చేయవద్దని.. వంట చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని వారికి సూచించారు.

అనుమానాస్పద ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం మునుకుళ్ల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరువూరు సీఐ.గిరిబాబు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు, క్యూఆర్ కోడ్ పేరుతో వచ్చే అనుమానాస్పద ఫోన్ కాల్స్‌కు స్పందించ వద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గిరిబాబు

ఉపాధి హామీ పథకం కొనసాగించాలని ఉద్యమం

చీమలపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : గ్రామాల్లో పేదలకు పని కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకునేందుకు ప్రజలు ఉద్యమించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 23 వరకు ఇంటింటా 'ఉపాధి పథకం రక్షించుకుందాం' అనే ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం చీమలపాడులో సంబంధిత ఉద్యమ గోడపత్రులను సీపీఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తాజాగా పథకం పేరు మార్పు చేసి వీబీజీరామ్ పేరుతో పథకానికి తూట్లు పొడిచిందని ఆరోపించారు.



చీమలపాడులో గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు



తిరువూరు సీపీఎం కార్యాలయంలో..

తిరువూరు, న్యూస్‌టుడే : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరుతూ స్థానిక సీపీఎం కార్యాలయంలో గోడప్రతులు విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో శుభ్రతకు సహకారం అవసరం



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో లావణ్య కుమారి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరిచి స్వచ్ఛాంధ్ర సాధన కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి పి.లావణ్య కుమారి అధికారులకు సూచించారు. జూపూడి గ్రామ పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణపై మార్గదర్శకాలను వారికి వివరించారు. అనంతరం శిక్షణకు వచ్చిన అధికారులు జూపూడిలో పర్యటించి రోడ్డు పక్కనున్న ఎరువు దిబ్బలను, చెత్తను గుర్తించి రైతులు, గ్రామస్థులతో మాట్లాడి గ్రామాన్ని శుభ్రంగా ఉంచడానికి పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, ఇబ్రహీంపట్నం డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, జూపూడి గ్రామ కార్యదర్శి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణంలోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో షటిల్ కోర్టుకు మరమ్మతులు చేయించడానికి నిధులు కేటాయించాలని తిరువూరు తెదేపా నాయకులు శాప్ ఛైర్మన్ అనిమిని.రవినాయుడుని కోరారు. ఈ మేరకు మంగళవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి స్టేడియాన్ని అభివృద్ధి చేస్తే యువతకు క్రీడా సదుపాయాలు మెరుగవుతాయని తెలిపారు. దుక్కిపాటి.కాళీవరప్రసాద్, యండ్రాతి.కిరణ్, దొబ్బల.సందీప్ కుమార్, వైట్ల.సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రవి నాయుడితో చర్చిస్తున్న తిరువూరు తెదేపా నేతలు

పల్లె బాటలో.. స్వచ్ఛ రథాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

పల్లెలను స్వచ్ఛంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. దీనిలో భాగంగా ఈ నెలాఖరుకు ఇబ్రహీంపట్నం మండలంతో పాటు జగ్గయ్యపేట, నందిగామ, కంచికచర్ల, చందర్లపాడు మండలాల్లో వ్యర్థాల సేకరణకు స్వచ్ఛ రథాలను సిద్ధం చేస్తున్నారు. ఈ మండలాల్లో వీటి నిర్వహణకు పిలిచిన టెండర్లను జిల్లా కమిటీ ఖరారు చేసింది. వీటి బాధ్యతలను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు చూస్తారు. మండల పరిషత్తు నిధుల నుంచి స్వచ్ఛ రథం నిర్వాహకుడికి ప్రతి నెల రూ.25 వేలు ఇస్తారు. రెండో దశలో మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాలకు విస్తరిస్తారు. పల్లెల్లో గృహిణుల నుంచి వ్యర్థాలను తీసుకుని తగిన ప్రతి ఫలం పొందేలా నూతన అవిష్కరణకు పంచాయతీ రాజ్ శాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టింది.

డిజిటల్ తుకాలు..: గ్రామాల్లో హరిత రాయబారులు తడి, పొడి చెత్తను సేకరిస్తున్నా అందులో వ్యర్థాలను వేర్వేరుగా సేకరించడంలో విఫలమవుతున్నారు. ఈ క్రమంలో గృహిణులకు తడి, పొడి వ్యర్థాలను వేరే చేసి అందజేసే పద్ధతులపై హరిత రాయబారులు శిక్షణ ఇస్తారు. వాటిని గృహిణులు స్వచ్ఛ రథం నిర్వాహకుడికి ఇచ్చి ప్రతి ఫలంగా అవసరమైన కొన్ని నిత్యావసరాలను పొందవచ్చు. స్వచ్ఛ రథాల నిర్వాహకులు కొందరు తక్కువగా తూచి తక్కువ మొత్తం ఇస్తారన్న అనుమానంతో ఈ రథాల్లో డిజిటల్ తూకాలు ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్, గాజు, స్టీలు, అట్టపెట్టెలు, కంప్యూటరు విడిభాగాలు, పాత పుస్తకాలు, దినపత్రికలు ఇచ్చి బరువుకు తగిన కిరాణా సరకులు తీసుకోవచ్చు.



నిర్వాహకుడి నుంచి సరకులు తీసుకుంటున్న స్థానికురాలు

నెలాఖరుకు అయిదు..

గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు స్వచ్ఛ రథాల పనితీరును పర్యవేక్షిస్తారు. వీటి ఏర్పాటు నిర్వహణలకు జిల్లా కమిటీ టెండర్లు పిలిచి ఖరారు చేసింది. ఈ నెలాఖరుకు మండలానికి ఒకటి చొప్పున అయిదు స్వచ్ఛరథాలు రానున్నాయి.

- మనోజ్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో, ఇబ్రహీంపట్నం

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినం



మైలవరంలో దీపారాధన చేస్తున్న మహిళలు



గంపలగూడెం శ్రీరామభజన మందిరం వద్ద..



ఊటుకూరులో వాసవీమాత



తిరువూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

మైలవరం, న్యూస్‌టుడే : ఆర్యవైశ్య కులదేవత శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం సందర్భంగా స్థానిక కోదండ రామాలయంలో మంగళవారం ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన, కుంకుమ పూజలు చేశారు.

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : గంపలగూడెం శ్రీరామభజన మందిరం, ఊటుకూరు కోదండ రామాలయం, ఎ.కొండూరు మండలం కంభంపాడులో ఆర్యవైశ్య సంఘీయులైన మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు

నందిగామ గ్రామీణం : నందిగామ కేవీఆర్ కళాశాలలో ఈనెల 24, 25 తేదీల్లో కృష్ణా విశ్వవిద్యాలయ అంతర కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామని ఫిజికల్ డైరెక్టర్, పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి వాసిరెడ్డి నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ పి.రాయప్ప మంగళవారం తెలిపారు. ఈ పోటీల కోసం కళాశాల ఆట స్థలాన్ని డోజరుతో చదును చేయించారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విద్యార్థులు పట్టుదలతో చదివి పది పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు సాధించాలని విస్సన్నపేట ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు అన్నారు. మంగళవారం ఆయన నరసాపురం అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎం.బి.డి శ్యామల, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న చిన్న రాట్నాలు

బోధన సామగ్రి ఆవిష్కరణ

గంపలగూడెం, న్యూస్‌టుడే : డీపీఆర్టీయూ అనుబంధ ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో పది విద్యార్థుల కోసం ముద్రించిన ఉచిత బోధన సామగ్రిని మంగళవారం గంపలగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నందిగామ డీవైఈవో ఎ.శ్యామ్‌సుందరరావు, ఎంఈవో నరసింహారావు ఆవిష్కరించారు. ఉపాధ్యాయ సేవాదళ్ సంక్షిప్తమైన సమాధానాలతో రూపొందించిన స్టడీ మెటీరియల్ పదిలో సీ.డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు ఉత్తీర్ణతకు ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు. డీపీఆర్టీయూ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు బూరుగు జమలయ్య, కె.సుందరరావు, ఏవీ.నరసింహారావు, సీహెచ్.మోహన్‌రావు, ఎన్.అనురాధ, హెచ్‌ఎం జి.శ్రీనివాస బాబు పాల్గొన్నారు.



కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

త్రీడీ ప్రింటింగ్‌తో ఉపాధి అవకాశాలు

మైలవరం, న్యూస్‌టుడే : త్రీడీ ప్రింటింగ్‌పై నైపుణ్యత సాధిస్తే ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.రంగారావు తెలిపారు. కళాశాలలో త్రీడీ ప్రింటింగ్‌పై నిర్వహించిన కార్యశాలలో శిక్షణ పొందిన విద్యార్థులకు మంగళవారం ధ్రువపత్రాలను అందజేశారు. అందులో గల ఉపాధి అవకాశాలను వారికి వివరించారు. కార్యక్రమంలో సమన్వయకర్తలు సుభాషిణి, మన్నే స్వామి, వి.ఉమాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ధ్రువపత్రాలతో విద్యార్థులు

పంటల వివరాలు యాప్‌లో నమోదు చేసుకోండి

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలంలోని రైతులు రబీకి సంబంధించి తమ పంటల వివరాలను ఈ- పంట యాప్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని ఏవో.పద్మ సూచించారు. కాకర్ల గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ-పంట యాప్ ద్వారా నమోదు చేయడం వల్ల విస్తీర్ణం, రకం, సాగు వివరాలు ప్రభుత్వానికి కచ్చితంగా అందుతాయని చెప్పారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



తిరువూరు: రైతులకు సూచనలిస్తున్న ఏవో పద్మ

జి.కొండూరు, న్యూస్‌టుడే : మొక్కజొన్నను ఆశించే కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరి అని ఏవో సూరిబాబు తెలిపారు. పినపాక గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏ ప్రవల్లిక, రైతులు పాల్గొన్నారు.



పినపాకలో ఏవో సూరిబాబు, వీఏఏ ప్రవల్లిక

గోడ కూలింది.. రక్షణ దూరమైంది!

స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల రక్షణ గోడ కూలిపోయి ఏడాది దాటినా నిర్మాణానికి నోచుకోలేదు. 2024 అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు పాఠశాల ఆవరణలోకి నీరు చేరి గోడ కూలిపోయింది. దీంతో బడికి రక్షణ లేకుండా పోయింది. ఈ పాఠశాల్లో పదో తరగతి పరీక్షా కేంద్రం ఉంది. గత సంవత్సరం పది పరీక్షల సమయంలో కూలిన గోడ ప్రదేశంలో పరదాలు కట్టారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఈ ఏడాది అయినా గోడను నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం



అంచులు ఇలా వదిలేస్తే ఎలా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పినపాక గ్రామంలో సీసీ రోడ్డు వేశారు. ఇది దాదాపు 250 మీటర్ల మేర బీసీ, ఎస్సీ శ్మశాన వాటికకు చేరుకునేందుకు గ్రామస్థులకు ఉపయోగకరంగా ఉంది. గతేడాది నిర్మించిన సీసీ రహదారికి మిగిలిన అభివృద్ధి పనులను అసంపూర్తిగా వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు పక్కన అంచులను గ్రావెల్‌తో పరచాల్సి ఉన్నా ఆ పనులు చేయలేదు. దీంతో ద్విచక్ర వాహనదారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రావెల్‌తో అంచులను అభివృద్ధి పరచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు



శివాలయ రథానికి ఇనుప చక్రాలు

నందిగామ గ్రామీణం: నందిగామ శివాలయ పెద్ద రథానికి వంశపారంపర్య ధర్మకర్త మురళీరాఘవకుమార్ తన సొంత నిధులతో ఇనుప చక్రాలు తయారు చేయిస్తున్నట్లు ఈవో సురేష్ తెలిపారు.

CHANGE OF NAME
I, THUMMA JOSEPH SAGAR REDDY S/o THUMMA INNAREDDY Resident of D.No.13-196, Vijaya Shakti School Road, Ferry, Ibrahimpatnam Village, Ibrahimpatnam Mandal, NTR District-521456. My actual name in Aadhaar THUMMA JOSEPH SAGAR REDDY. But in my passport name was worngly mentioned THUMMA JOSAPH SAGAR. I hereby request you to correct that my name THUMMA JOSEPH SAGAR REDDY instead of THUMMA JOSAPH SAGAR.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

చిట్టినగర్, న్యూస్‌టుడే: కులం పేరుతో దూషించారని కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు అందగా మంగళవారం కేసు నమోదు చేశారు. సాయిరాం థియేటర్ సమీపంలోని గుంటూరు పాపనయ్య వీధిలో రాయపూడి ప్రియదర్శిని తన కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నారు. ఆమె ఉండే ఇంటి పక్క పోర్షన్‌లో కుమారి అనే మహిళ ఉంటున్నారు. వారి మధ్య గొడవలు జరగడంతో ప్రియదర్శిని, ఆమె కుమార్తెపై కులం పేరుతో కుమారి దూషించింది. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కుమారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు కొత్తపేట పోలీసులు తెలిపారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

గుళ్లపూడి(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని గుళ్లపూడిలో చల్లా నాగరాజు(35) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గంపలగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. తన కుమారుడి మృతికి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కారణమని తండ్రి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై రమేష్ కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న లారీల పట్టివేత

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఇసుకను హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను గంపలగూడెం పోలీసులు సోమవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నారు. తిరువూరు సీఐ కె.గిరిబాబు సబ్ డివిజన్‌లో నిర్వహించే తనిఖీల్లో భాగంగా మండలంలోని నెమలి సమీపంలో తనిఖీ చేస్తుండగా రెండు లారీలు అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీల చోదకులైన తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లా భువనగిరి మండలం బాలంపల్లికి చెందిన కాశిపాక రవీందర్, రంగారెడ్డి జిల్లా గోల్నాకకు చెందిన లంక గోపి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్ మంగళవారం తెలిపారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
పెదవడ్లపూడి బ్రాంచ్, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా

బంగారు ఆభరణముల వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణమును సకాలంలో తిరిగి చెల్లించలేదు. కావున తేది.30.01.2026 శుక్రవారం, సా॥ 5 గం.లకు బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. ఈ ప్రకటన నిమిత్తం అయిన ఖర్చును ఖాతాదారుడే భరించవలెను. వేలంలో పాల్గొనదలచినవారు రూ.10,000/- ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. వేలం పాడినవారు వెంటనే పూర్తి సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకొనవలెను. వేలంలో బంగారు నగలు ఎలా ఉన్నవి అలా అనే ప్రాతిపదికపై నిర్వహించబడును. వేలందారులు చిరునామా నిర్ధారింపు ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేదా పాన్‌కార్డును జతపర్చవలెను. ఒకసారి వేలం పూర్తి అయిన తరువాత నగల నాణ్యత, బరువులకు సంబంధించిన ఏ విధమైన ఫిర్యాదులు బ్యాంకు అనుమతించదు. బకాయి నోటీసులు అందనివారు లేక తిరస్కరించినవారు ఈ ప్రకటనను ఆఖరి నోటీసుగా భావించి వేలం తేదీలోపుగా సొమ్ము చెల్లించగలరు. ఎటువంటి కారణములు తెలుపకనే వేలము వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు. ఇతర వివరములకు బ్రాంచ్ మేనేజర్ గారిని సంప్రదించగలరు.

ఖాతా నెంబరు	ఖాతాదారుని పేరు & చిరునామా	స్థూల బరువు
42908546173	శ్రీ అశోక్ బెక్కంటి, బాలకృష్ణ థియేటర్ ఎదురుగా, కొండపల్లి, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా-521228.	22.70 గ్రా॥లు

తేది: 20.01.2026, ప్రదేశం: పెదవడ్లపూడి సం/- అధీకృత అధికారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

క్రీడల్లో రాణిస్తే.. ఉజ్వల భవిత


బిహార్, ఝార్ఖండ్ రాష్ట్రాల జట్ల మధ్య పోటీ

గుడివాడ, న్యూస్‌టుడే : జాతీయ క్రీడల్లో రాణించినవారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల చేపట్టిన మెగా డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను ఇచ్చి గౌరవించారని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి 69వ జాతీయ అండర్- 14 కబడ్డీ పోటీలను మంగళవారం ఆయన సందర్శించి.. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని.. స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి భానుమూర్తి, కబడ్డీ పరిశీలకులు నట్వర్ సింగ్, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి కిలారపు రంగ ప్రసాద్, సభ్యులు వి.లక్ష్మీ వరప్రసాద్, రాష్ట్ర ఖోఖో సంఘం అధ్యక్షుడు మడకా ప్రసాద్, భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు వలపర్ల వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శులు అరుణ, ఎస్.గంగాధర్, నాసిక్ ఎస్సీ సంతోష్ పాల్గొన్నారు.

నేటి విజేతలు వీరే : మంగళవారం పంజాబ్, ఛత్తీస్‌గఢ్ మధ్య జరిగిన పోటీలో పంజాబ్ విజయం సాధించగా, కేరళ, హిమాచల్ ప్రదేశ్ మధ్య పోటీలో హిమాచల్ ప్రదేశ్ విజయం సొంతం చేసుకుంది. బిహార్, కేవీఎస్ మధ్య పోటీలో బిహార్, కర్ణాటక, వెస్ట్ బెంగాల్ మధ్య పోటీలో కర్ణాటక, సీబీఎస్ఈ, విద్యాభారతి మధ్య పోటీలో సీబీఎస్ఈ, దిల్లీ, గుజరాత్ మధ్య పోటీలో దిల్లీ గెలిచింది. హరియాణా, సీఐఎస్‌సీఈ జట్ల మధ్య పోటీలో హరియాణా, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్ మధ్య పోటీలో మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, తెలంగాణ మధ్య పోటీలో హిమాచల్ ప్రదేశ్ విజయ కేతనం ఎగురవేసింది. బిహార్, ఝార్ఖండ్ పోటీలో బిహార్, ఉత్తరాఖండ్, పంజాబ్ జట్లు తలపడగా ఉత్తరాఖండ్, విద్యాభారతి, ఛండీగఢ్ పోటీలో విద్యాభారతి, మధ్యప్రదేశ్, కర్ణాటక మధ్య పోటీలో కర్ణాటక విజయం సాధించాయి.

ఈఎస్‌ఎల్ ఫైనల్స్ నేడే

హోరాహోరీగా సెంట్రల్ ఆంధ్రా ప్రాంతీయ క్రికెట్ పోటీలు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో జరుగుతున్న సెంట్రల్ ఆంధ్రా ప్రాంతీయ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు చేరుకుంది. మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హెల్‌ప్యాడ్ స్టేడియంలో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ప్రజెంట్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్) సెంట్రల్ ఆంధ్రా స్థాయి క్రికెట్ పోటీల్లో వివిధ జిల్లాల జట్లు రెండో రోజు మంగళవారం హోరాహోరీగా తలపడ్డాయి. జూనియర్స్ విభాగంలో పశ్చిమ గోదావరి-ప్రకాశం, కృష్ణా-నెల్లూరు, సీనియర్స్ విభాగంలో పశ్చిమ గోదావరి-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. పశ్చిమ గోదావరి-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగింది.

పశ్చిమ గోదావరి జట్టు గెలుపు బావుటా


విజేతగా నిలిచిన పశ్చిమ గోదావరి జట్టు

జూనియర్స్ విభాగంలో మొదటి మ్యాచ్ పశ్చిమ గోదావరి-ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన ప్రకాశం జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుని 14.1 ఓవర్లలో 110 పరుగులకు ఆలౌటైంది. రాజేష్ 28 బంతుల్లో నాలుగు ఫోర్లు కొట్టి 35 పరుగులు చేశాడు. అనంతరం పశ్చిమ గోదావరి జట్టు 13.4 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 111 పరుగులు చేసి జయకేతనం ఎగురవేసింది. సాయిరామ్ 17 బంతుల్లో మూడు ఫోర్లు కొట్టి 19 పరుగులు చేయడంతో పాటు మూడు కీలకమైన వికెట్లు కూడా తీసి జట్టుకు విజయాన్ని అందించాడు. ప్రకాశం బౌలర్ మోహన్ 3 వికెట్లు తీశాడు.

నిప్పులు చెరిగిన నగేష్.. చెలరేగిన రామ్‌చరణ్..

జూనియర్స్ విభాగంలో రెండో మ్యాచ్ కృష్ణా-నెల్లూరు జిల్లా జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. 17.4 ఓవర్లలో 91 పరుగులకే ఆలౌటైంది. కృష్ణా బౌలర్ నగేష్ బౌలింగ్‌లో నిప్పులు చెరిగాడు. నాలుగు కీలకమైన వికెట్లు తీయడంతో నెల్లూరు జట్టు తక్కువ స్కోరుకే పరిమితమైంది. బరిలోకి దిగిన కృష్ణా జట్టు 7.3 ఓవర్లలో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 97 పరుగులు చేసింది. రామ్‌చరణ్ 20 బంతుల్లో ఏడు ఫోర్లు, మూడు సిక్సర్ల బాదీ 50 పరుగులు చేసి జట్టును విజయ పథంలో నడిపించాడు.


గెలుపొందిన కృష్ణా జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్


సాయితేజ నగేష్ యాసిర్

నేటి ఫైనల్స్ మ్యాచ్‌ల షెడ్యూల్

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాలలోని హెల్‌ప్యాడ్ స్టేడియం, మోతడక

సీనియర్స్: రావూస్ డిగ్రీ, పీజీ కళాశాల(నెల్లూరు) × ఆర్‌జీయూకేటీ (ప్రకాశం)

జూనియర్స్: ఆర్‌జీయూకేటీ(పశ్చిమ గోదావరి) × ఎన్నారై జూనియర్ కళాశాల (కృష్ణా)


ఉత్కంఠ పోరు.. నెల్లూరుదే గెలుపు

మూడో మ్యాచ్ సీనియర్స్ విభాగంలో పశ్చిమ గోదావరి-నెల్లూరు జిల్లా జట్ల మధ్య ఉత్కంఠంగా జరిగింది. టాస్ గెలిచిన నెల్లూరు జట్టు మొదట బ్యాటింగ్ ఎంచుకుని 20 ఓవర్లకు 9 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసింది. అనంతరం పశ్చిమ గోదావరి జట్టు 19.2 ఓవర్లలో 117 పరుగులకే ఆలౌట్ అవడంతో నెల్లూరు జిల్లా జట్టు విజయం సాధించింది. యాసిర్ 14 పరుగులు చేయడంతో పాటు చివర్లో అద్భుతంగా బౌలింగ్ చేసి 2 ప్రధాన వికెట్లు పడగొట్టారు.. మిగిలిన బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి జట్టుకు విజయం అందించారు.


విజయానందంలో నెల్లూరు జట్టు

☛ నాలుగో మ్యాచ్ సీనియర్స్ విభాగంలో కృష్ణా-ప్రకాశం జిల్లా జట్ల మధ్య జరగాల్సి ఉంది. కృష్ణా జట్టు అనివార్య కారణాల వల్ల మ్యాచ్‌కు హాజరు కాలేదు. దీంతో ప్రకాశం జిల్లా జట్టును విజేతగా ప్రకటించారు.

Title Sponsor: ధనిక్ భారత్ విద్యా సంస్థలు IIT-JEE | NEET
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Digital Partner: ఈనాడు.net
TV Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు



విజయవాడ, ఆటోనగర్ హైటెన్షన్ రోడ్డులో ఉన్న భారీ హైటెన్షన్ విద్యుత్తు స్తంభాల మరమ్మతుల్లో భాగంగా కార్మికులు తాళ్లు కట్టుకుని పైకి చేరి పనులు చేస్తున్నారు. తాడు సహాయంతో వేలాడుతూ.. పైకి.. కిందకు చేరుకుంటూ తీగలను సరి చేస్తున్నారు. ఇది ప్రమాదకరమని తెలిసినా విద్యుత్తు కార్మికులు ధైర్యంగా పనులు చేస్తున్నారు. కింది నుంచి వారిని చూసే ప్రజలు మాత్రం.. అమ్మో అని భయపడుతున్నారు. **- ఈనాడు, అమరావతి**

జోగి రమేష్‌కు వైద్య పరీక్షలు

విజయవాడ వైద్యం: మాజీ మంత్రి, వైకాపా నాయకుడు నకిలీ మద్యం కేసులో నిందితుడు జోగి రమేష్‌ను జైలు అధికారులు మంగళవారం విజయవాడ జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. తన కుడి చేతికి చిన్న కాయలా ఏర్పడిందని, నొప్పి తీవ్రంగా ఉందని చెప్పడంతో జీజీహెచ్‌కు తరలించారు. ఆయనకు 2డీ ఎకో, ఎక్స్‌రే, రక్త పరీక్షలు, కార్డియోథొరాసిక్ వైద్య పరీక్షలు చేసి అంతా బాగానే ఉందని వైద్యులు తెలిపారు. రక్తం గడ్డ కట్టడం వల్ల చిన్నకాయ ఏర్పడిందని, చిన్న సర్జరీ చేస్తే సరిపోతుందని, తాము శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు చెప్పగా.. అందుకు ఆయన నిరాకరించారని సమాచారం. తనకు ఎండోస్కోపీ సర్జరీ మాత్రమే కావాలన్నట్లు తెలిసింది. దాంతో వైద్యులు ఆయనకు చేసిన వైద్య పరీక్షల వివరాలతో కూడిన రిపోర్టును, ఎండోస్కోపీ ఉన్న చోట కాయ తొలగించుకోవాలన్న లేఖను పోలీసులకు అందజేసినట్లు సమాచారం. తరువాత పోలీసులు జిల్లా జైలుకు ఆయన్ని తరలించారు.

రైల్వే సిబ్బంది కృషి అభినందనీయం

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో రైల్వే సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని డీఆర్ఎం మోహిత్ సొనాకియా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని విజయవాడ మీదగా 54 ప్రత్యేక రైళ్లు నడిపినట్లు తెలిపారు. ముఖ్యంగా 12, 18 తేదీల్లో రద్దీ దృష్ట్యా విజయవాడతో పాటు డివిజన్ వ్యాప్తంగా ముఖ్య రైల్వే స్టేషన్లలో సిబ్బంది 24 గంటలు విధులు నిర్వహించినట్లు చెప్పారు. స్టేషన్ సిబ్బంది, లోకో పైలెట్లు, గార్డులు, ఎస్అండ్‌టీ, ఇంజనీరింగ్, భద్రతా సిబ్బంది సమన్వయంతో వ్యవహరించి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చినట్లు వెల్లడించారు. ప్రయాణికుల కోసం అంకితభావంతో సేవలు అందించిన రైల్వే సిబ్బందిని ఈ సందర్భంగా డీఆర్ఎం అభినందించారు.

23న ఇంద్రకీలాద్రిపై శ్రీపంచమి వేడుకలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఈనెల 23న ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను సరస్వతీ దేవిగా అలంకరణ చేయనున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్, పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా దుర్గమ్మ దర్శనం చేసుకున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అవసరమైన అమ్మవారి పాకెట్ సైజ్ క్యాలెండర్, రక్ష కంకణం, పెన్ను, ప్రసాదాలు సేవా సిబ్బంది మంగళవారం సిద్ధం చేశారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని మల్లికార్జున మహా మండపం ఆరో అంతస్తులో ఉదయం 7 గంటలకు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అందుకు అవసరమైన పలక, బలపం, ఇతర పూజా సామగ్రిని దేవస్థానం సమకూరుస్తుందని పేర్కొన్నారు. దేవస్థానం యాగశాలలో శాస్త్రోక్తంగా సరస్వతీ యాగం నిర్వహిస్తారని తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు యూనిఫాం, ఐడీ కార్డు ధరించిన విద్యార్థులకు ఉచితంగా అమ్మవారిని దర్శించుకునే అవకాశాన్ని కల్పించినట్లు పేర్కొన్నారు.


విద్యార్థులకు పంపిణీ చేసేందుకు అమ్మవారి క్యాలెండరు, రక్ష కంకణం, పెన్నులు సిద్ధం చేస్తున్న సేవా సిబ్బంది

ఆకాశ మార్గంలో అవకాశాలెన్నో!

వినీలాకాశంలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతోన్న పౌర విమానయాన రంగం సుశిక్షితులైన సిబ్బంది కొరతతో ఇబ్బంది పడుతోంది. ఈ రంగంలో సేవలందించడానికి ఎన్నో విభాగాలు ఉన్నాయి. వాటిలో పలు హోదాలతో ఉద్యోగాలు లభిస్తున్నాయి. కానీ అవసరమైన విద్యార్హతలు ఉన్నవారు దొరకడం లేదు. అందువల్ల వైమానిక రంగంలో కొలువులు ఆశిస్తున్నవారు అందులో ఉన్న వివిధ ఉద్యోగాల గురించి అవగాహన పెంచుకోవాలి. వాటిలో ఆసక్తి ఉన్నదాన్ని ఎంచుకోవాలి. అందుకు సరిపోయే కోర్సుల్లో శిక్షణ పొందితే ఆకాశ మార్గంలో అవకాశాలు సొంతమైనట్లే



మేనేజ్‌మెంట్ | టెక్నికల్ సిబ్బంది

నిత్య కల్యాణం పచ్చ తోరణం లాంటి పౌర విమానయాన రంగంలో నాలుగు విభాగాల్లో సిబ్బంది అవసరం ఉంటోంది. ప్రవేశించాలనుకునే విభాగాన్ని అనుసరించి సంబంధిత కోర్సులు చదవాలి. అయితే ఏ విభాగంలోకి ప్రవేశించాలన్నది ఉద్యోగార్థి స్వీయ ఆసక్తి ఆధారంగా ఎంపిక చేసుకోవాలి.

ఉపాధి పథం నైపుణ్య సాధనం



మేనేజ్‌మెంట్, కార్పొరేట్ విధులు

వందలాది ఎయిర్ లైన్ సర్వీసుల నిర్వహణకు ఎయిర్ పోర్టుల్లో సిబ్బంది అవసరం. విమానాశ్రయ కార్యకలాపాల ప్రణాళిక, ప్రయాణికులు, సరకు రవాణాకు సన్నాహాలు చేయాలి.

సేల్స్, మార్కెటింగ్: ఎయిర్ లైన్ సర్వీసులు, వివిధ గమ్య స్థానాలకు వేర్వేరు విమానయాన సంస్థలు నిర్వహిస్తున్న సర్వీసులను ప్రమోట్ చేయడం. ఎక్కువ సంస్థలు సొంతంగానే దీన్ని చేస్తున్నాయి. కొన్ని ఎయిర్‌లైన్స్ బాధ్యతలను ఎయిర్ పోర్టులే స్వీకరిస్తాయి.

ఈ విభాగాలే కాకుండా అత్యంత కీలక విభాగం టెక్నికల్ ఇంజినీరింగ్. విభాగాల వారీ హోదాలు, ఆ స్థాయిలో చేయాల్సిన విధులను అవగాహన చేసుకోవాలి. విద్యార్థులు ఆసక్తి ఉన్న విభాగాన్ని గుర్తించాలి. అందుకు తగ్గ కోర్సుల వివరాలు తెలుసుకోవాలి. వాటిలో ఏదైనా పూర్తిచేయడం ద్వారా అంతిమంగా పౌర విమాన రంగంలో ఉద్యోగిగా ప్రవేశించే మార్గాన్ని సుగమం చేసుకోవచ్చు.

ఎయిర్ పోర్ట్స్ ఆపరేషన్స్, మేనేజ్‌మెంట్

ఫ్లయిట్ నిర్వహణ విభాగం

ఎయిర్‌లైన్ పైలట్, కో పైలట్: బాహ్య ప్రపంచానికి కనిపించడంతో పాటు ఏ ఎయిర్ లైన్ టేకాఫ్ కావాలన్నా అత్యంత కీలకమైన హోదా వీరిదే. ప్రయాణికుల విమానాలకు, సరకు రవాణా (కార్గో) విమానాలకు పైలట్, కో పైలట్ సేవలే కీలకం. దాదాపు అన్ని విమానయాన సంస్థలూ సుశిక్షితులైన పైలట్ల కొరతను ఎదుర్కొంటున్నాయి. ఆసక్తి ఉన్నవారు పైలట్ శిక్షణ పూర్తిచేసుకున్న వెంటనే ఉపాధి పొందవచ్చు.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్: విమానాశ్రయం నుంచి విమానం బయలు దేరేలా చూసేది వీరే. ఎయిర్ రూట్ క్లియరెన్స్, ఎయిర్ లైన్ భద్రతా ప్రమాణాల మదింపు, అనుమతులను ఎప్పటికప్పుడు సకాలంలో రాబట్టేందుకు తెర వెనుక ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ కృషి చేస్తుంటారు.

ఫ్లయిట్ గెస్ట్ పర్యవేక్షణ: వీరినే కేబిన్ క్రూ అంటారు. విమాన టికెట్ బుక్ చేసుకున్న వారికి స్వాగతం చెప్పడం దగ్గర నుంచి టికెట్ చెకింగ్, అవసరం ఉంటే సీట్ల సర్దుబాటు, ఫ్లయిట్‌లో మెలగవలసిన విధానంపై వివరణ, అత్యవసర పరిస్థితులు ఉత్పన్నమైతే తీసుకోవలసిన జాగ్రత్తల వరకు ఫ్లయిట్ సిబ్బంది అడుగడుగునా పర్యవేక్షిస్తారు. విమాన సంస్థలన్నీ వీరి నియామకానికి ఎంతో ప్రాధాన్యమిస్తున్నాయి.

2014కి ముందు దేశంలో 74 విమానాశ్రయాలే ఉండగా ఈ 11 ఏళ్లలో 100కు పైగా కొత్తవి ఏర్పడ్డాయి. రాబోయే వందేళ్ల అవసరాలకు తగ్గట్టు భారీ ఎత్తున నిర్మిస్తున్న ఎయిర్ పోర్టుల నిర్వహణకు వేల సంఖ్యలో ఉద్యోగులు అవసరం అవుతున్నారు. ఒక అంతర్జాతీయ విమానాశ్రయం నిర్వహణకు వివిధ విభాగాల్లో 10,000 మంది సిబ్బంది అవసరమని అంచనా.

ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్: విమాన పని తీరును పర్యవేక్షించేది వీరే. తదుపరి సర్వీసు టేకాఫ్‌కి సాంకేతికంగా తగిన ప్రమాణాల మేరకు ఉందో, లేదో పరిశీలిస్తారు. మరమ్మతు అవసరాన్ని గుర్తిస్తే వెంటనే చేపట్టే ఇంజినీర్లు ఎయిర్ పోర్టులో సిద్ధంగా ఉంటారు.

గ్రౌండ్ స్టాఫ్: టికెటింగ్, బ్యాగేజీ హ్యాండ్లింగ్, చెకిన్ ప్రక్రియ పర్యవేక్షణ, ర్యాంప్ నిర్వహణకు సిబ్బంది అవసరం.

ఎయిర్ పోర్ట్ సెక్యూరిటీ: సాధారణంగా ఈ విభాగంలో కీలక బాధ్యతలను సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్) సిబ్బంది చూసుకుంటారు. అయితే కొన్ని విభాగాల్లో ఎయిర్ పోర్టులే సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాలి.


యస్.వి. సురేష్, సంపాదకుడు, ఉద్యోగ సోపానం

అప్రెంటిస్‌షిప్

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఓసీఎల్).. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
ఖాళీలు: 405
● టెక్నీషియన్ అప్రెంటిస్ ● ట్రేడ్ అప్రెంటిస్
● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
ట్రేడులు: మెకానికల్, ఎలక్ట్రికల్, టీఅండ్ఐ, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, ఫిట్టర్, మెషినిస్ట్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డేటా ఎంట్రీ. **అర్హత:** సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ **వయసు:** 31.12.2025 నాటికి 18-24 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** విద్యార్హతలు, వైద్య పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలనతో.. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 31.01.2026. **వెబ్‌సైట్:** https://iocl.com/

డిజైన్ కోర్సులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్.. యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.
● బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీడీఈఎస్)-నాలుగేళ్లు: 180 సీట్లు ● మాస్టర్ ఆఫ్ డిజైన్(ఎండీఈఎస్)- రెండేళ్లు: 60 సీట్లు ● పీజీ డిప్లొమా ఇన్ డిజైన్ ఫౌండేషన్- ఏడాది: 20 సీట్లు
స్పెషలైజేషన్లు: హార్డ్ మెటీరియల్ డిజైన్, సాఫ్ట్ మెటీరియల్ డిజైన్, ఫైర్డ్ మెటీరియల్ డిజైన్, ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్, జువెల్లరీ డిజైన్, క్రాఫ్ట్ కమ్యూనికేషన్, ఇంటీరియర్ డిజైన్.
అర్హత: కోర్సులను అనుసరించి ఇంటర్మీడియట్, సాధారణ డిగ్రీ, డిజైన్ అండ్ ఆర్కిటెక్చర్‌లో ఏదైనా డిగ్రీ (బీడీఎస్, బీఆర్క్, బీఏ, బీఎస్సీ, ఒకేషనల్ డిగ్రీ, పీజీ డిప్లొమా) ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, ఇంటర్వ్యూలతో. (యూసీడ్/సీడ్/నిఫ్ట్/నిడ్‌లో అర్హత పొందినవారు పరీక్ష రాయనవసరం లేదు).
దరఖాస్తు ఫీజు: రూ.1,750.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 31.03.2026. **పరీక్ష తేదీ:** 05.04.2026.
వెబ్‌సైట్: https://www.iicd.ac.in/

స్పెషలిస్ట్ ఆఫీసర్లు

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ముంబయి.. రెగ్యులర్ ప్రాతిపదికన ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలచేసింది.
● మార్కెటింగ్ ఆఫీసర్ స్కేల్-I: 300 పోస్టులు ● ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్ స్కేల్-III: 50 పోస్టులు
అర్హత: పోస్టును అనుసరించి బ్యాచిలర్స్/మాస్టర్స్ డిగ్రీ, ఎంబీఏ/పీజీడీఎం. ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఆఫీసర్‌కు ట్రేడ్ ఫైనాన్స్‌లో బ్యాంకింగ్ అనుభవం తప్పనిసరి. మార్కెటింగ్ ఆఫీసర్‌కు మార్కెటింగ్ స్పెషలైజేషన్‌తో బీఎఫ్ఎస్ఐ రంగంలో అనుభవం కావాలి **వయసు:** స్కేల్-III: పోస్టులకు 30-38 ఏళ్లు; స్కేల్-I ఖాళీలకు 23- 27 ఏళ్ల మధ్య ఉండాలి. **వేతన శ్రేణి:** స్కేల్-III: పోస్టులకు రూ.1,05,280; స్కేల్-I పోస్టుకు రూ.85,920.
ఎంపిక: ఆన్‌లైన్ పరీక్ష/ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 03.02.2026. **ఆన్‌లైన్ పరీక్ష:** ఫిబ్రవరి/మార్చి 2026లో.
ఇంటర్వ్యూలు: మార్చి/ఏప్రిల్ 2026లో
వెబ్‌సైట్: https://www.centralbankofindia.co.in/

చదువు

■ e-mail: edc@eenadu.in

ఎమ్మెస్సీ.. ఎంబీఈల్లో ఏది బాగు?

బీఎస్సీ ఎకనామిక్స్ ఆనర్స్ చదువుతున్నాను. పీజీలో ఎమ్మెస్సీ ఎకనామిక్స్, ఎంబీఈల్లో ఏది బాగుంటుంది? - తేజస్విని

బీఎస్సీ ఎకనామిక్స్ ఆనర్స్ తర్వాత సరైన పీజీ ప్రోగ్రాంను ఎంచుకోవడం ఎంతో ముఖ్యం. ప్రస్తుతం మీ ముందు ఎమ్మెస్సీ ఎకనామిక్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ (ఎంబీఈ) అనే రెండు ప్రోగ్రాంలు ఉన్నాయి. ఇవి రెండూ ఆర్థిక శాస్త్రానికి సంబంధించినవే. అయితే వాటి దృష్టికోణం, పాఠ్యాంశాల స్వభావం, భవిష్యత్తు అవకాశాలు వేర్వేరుగా ఉంటాయి.

● ఎమ్మెస్సీ ఎకనామిక్స్ కోర్సు ప్రధానంగా సైద్ధాంతిక, విశ్లేషణాత్మక స్వభావం కలిగి ఉంటుంది. ఇందులో మైక్రో ఎకనామిక్స్, మ్యాథమెటిక్స్ ఫర్ ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్, డెవలప్‌మెంటల్ ఎకనామిక్స్ లాంటి అంశాలు లోతుగా బోధిస్తారు. వీటి ద్వారా లాజికల్ థింకింగ్, విశ్లేషణ నైపుణ్యాలు పెరుగుతాయి. ముఖ్యంగా పరిశోధన రంగంలోకి వెళ్లాలనుకునే వారికీ, ఉన్నత విద్యలో అధ్యాపక వృత్తిని ఆశించే వారికీ ఈ కోర్సు బలమైన పునాది అవుతుంది. ప్రభుత్వ రంగాల్లో, పాలసీ మేకింగ్ సంస్థలు, పరిశోధన కేంద్రాలు లాంటి చోట్ల ఈ కోర్సుకు గుర్తింపు ఉంటుంది.

ఈ రెండు కోర్సులూ పోల్చి చూస్తే.. ఎమ్మెస్సీ ఎకనామిక్స్ అకడమిక్, పరిశోధన దిశగా తీసుకెళ్తుంది. మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ ప్రాక్టికల్ అప్లికేషన్, పరిశ్రమ అవసరాలపై దృష్టి పెడుతుంది. మొదటిది దీర్ఘకాలంలో పీహెచ్‌డీ, బోధన, విధాన విశ్లేషణ లాంటి రంగాలకు దారి తీస్తే, రెండోది తక్షణ ఉపాధి అవకాశాలతో కూడిన కార్పొరేట్ కెరియర్‌కు మార్గం వేస్తుంది.

● మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ కోర్సు ఆర్థిక శాస్త్రాన్ని వ్యాపార అవసరాలకు అన్వయించే విధంగా రూపొందించారు. ఇందులో మేనేజీరియల్ ఎకనామిక్స్, ఇండస్ట్రియల్ ఎకనామిక్స్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెట్ అనాలిసిస్, వ్యాపార నిర్ణయాల కోసం ఆర్థిక విధానాలు లాంటి అంశాలు ఉంటాయి. ఈ కోర్సు ద్వారా కార్పొరేట్ ప్రపంచంలో ఎదురయ్యే సమస్యలను ఆర్థిక కోణంలో విశ్లేషించి, పరిష్కరించే నైపుణ్యాన్ని పొందవచ్చు. ప్రైవేటు రంగ సంస్థలు, బ్యాంకులు, ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థలు, కన్సల్టెన్సీ రంగంలో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

● పరిశోధన, బోధన, ప్రభుత్వ రంగ సేవలు లక్ష్యంగా పెట్టుకున్నట్లయితే ఎమ్మెస్సీ ఎకనామిక్స్ సరైన ఎంపిక. అదే విధంగా వ్యాపారం, కార్పొరేట్ రంగం, ఫైనాన్స్, మార్కెట్ నిర్ణయాలు మీ ఆసక్తి అయితే మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఎకనామిక్స్ సరైన దారి. మీ సామర్థ్యాలు, ఆసక్తులు, భవిష్యత్తు ఆశయాలను సరిగా అంచనా వేసుకొని కోర్సును ఎంచుకుంటే, మీ కెరియర్ విజయవంతంగా రూపుదిద్దుకుంటుంది.

– ప్రొ.బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in



ప్రతీకాత్మక చిత్రం

పొదుపే కాదు... మదుపూ తెలుసు!

మహిళలు కుటుంబ సభ్యుల బాగోగుల్నీ, మగ వాళ్లు ఆర్థిక విషయాల్నీ చూసుకోవాలనే ఆలోచనలు ఇంకా సమాజంలో ఉన్నాయి. మహిళలూ సంపాదిస్తుండటంతో ఈ పరిస్థితుల్లో ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. మల్టీ టాస్కింగ్ నైపుణ్యం కారణంగా మహిళలు ఆర్థిక విషయాల్నీ సులభంగా నేర్చుకోగలరు. అంతకంటే ముందు ఆర్థికం కూడా తమకు సంబంధించిందేనని వాళ్లు గుర్తించాలి.

ఆర్థిక ప్రణాళికలే... జీవిత ప్రణాళికలు. కాబట్టి మహిళలు కుటుంబ ఆర్థిక ప్రణాళికల్లోనూ భాగం కావాలి. ముఖ్యంగా కుటుంబ ఆస్తుల వివరాలన్నింటిపైనా అవగాహన ఉండాలి. మహిళలు డబ్బు విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటారు. పోపుల డబ్బాల్లో కొద్దికొద్దిగా దాచుకున్న మొత్తాలతో కుటుంబాలను ఆర్థికంగా ఆదుకున్న సందర్భాలే దీనికి ఉదాహరణ.

- ఆధునిక మహిళలు సంప్రదాయేతర పొదుపు, మదుపు మార్గాలవైపు ఆలోచిస్తున్నారు. కొవిడ్ సమయంలో స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టిన మహిళల సంఖ్య పెరిగింది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉంటే అక్కడ మరింతగా రాణిస్తారు.
- ఇప్పటికీ మనం బంగారంపైన పెట్టుబడికే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నాం. కానీ, విభిన్నమైన పెట్టుబడులు ఉంటేనే మేలు. మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్ మెరుగైన ప్రత్యామ్నాయాలు. అయితే వీటి గురించి తెలియదనే భావనతో మహిళలు వెనకంజ వేస్తుంటారు. అలా కాకుండా చిన్న మొత్తాలతో మొదలుపెట్టండి. నిపుణుల సలహాల్ని తీసుకుని అడుగులు వేయండి.
- ఆర్థిక అంశాలపైన అవగాహన చిన్నప్పుడే మొదలవ్వాలి. ఏడెనిమిదేళ్లప్పట్నుంచీ పిల్లలకు పొదుపు, ఆర్థిక ప్రణాళికల గురించి చెప్పాలి. పండుగలప్పుడు, పుట్టినరోజు సమయంలో పెద్దలు ఇచ్చే డబ్బులతో ఏం కొనాలనుకుంటున్నారో తెలుసుకుని... అందుకు ఎలా డబ్బు ఆదా చేయొచ్చో చెప్పాలి.

- బినోలీ దోధీవాలా, వ్యవస్థాపకులు, సీఈఓ, ది మనీ మార్ట్

లక్ష్మి

మీకు తెలుసా!



జోసెఫిన్ గారిస్ కోక్రాన్ 1893లో మోటారు సాయంతో నడిచే డిష్‌వాషర్‌ను కనిపెట్టారు. మహిళలకు గిన్నెలు కడిగే శ్రమని తగ్గించడంతో పాటు, సమయాన్ని ఆదా చేయగలిగారు. ఆ ఆవిష్కరణతో 1893లో వరల్డ్ ఫెయిర్ ప్రశంసలతోపాటు అవార్డులెన్నో అందుకున్నారు. కిచెన్ ఎయిడ్ కంపెనీ నెలకొల్పి అమ్మకాలూ మొదలుపెట్టారు. హోటల్స్, రెస్టరంట్లలో సిబ్బంది అవసరాలను తగ్గించారు.

మీరూ వెబ్‌సిరీస్‌కి బానిసలేనా..!



ఓ ఆన్‌లైన్ సర్వేలో... 'ఖాళీ సమయాల్లో ఏం చేస్తుంటారు'? అని అడిగితే సగానికి పైగా మహిళలు, అమ్మాయిలు చెప్పిన సమాధానం 'వెబ్‌సిరీస్, టెలివిజన్ కార్యక్రమాలు చూస్తున్నా'మని. టీనేజర్లు అయితే 'రోజుకి ఒక్క కొరియన్ సిరీస్ అన్నా పూర్తిచేయక పోతే నిద్రపట్టదు' అన్నారట. ఇవన్నీ 'బింజ్ వాచింగ్'కు చిహ్నాలు అంటున్నారు నిపుణులు.

టెలివిజన్, వెబ్ సిరీస్, సీరియళ్లకు సంబంధించిన ఎపిసోడ్‌లన్నీ ఒకేసారి చూడటం, ధ్యాసంతా వాటిమీద ఉంచడాన్నే బింజ్ వాచింగ్ అంటారు. ఓ రకంగా అతిగా చూడటం. వ్యసనంగా మారడం. పిల్లలు, భర్త ఎక్కడివారు అక్కడికి వెళ్లిపోయాక.. గృహిణులకు ఖాళీ సమయం దొరుకుతుంది. ఇదివరకూ ఈ సమయాన్ని కొత్తగా ఏదైనా నేర్చుకోవడానికీ, ఇరుగుపొరుగుతో మాట్లాడటానికీ కేటాయించేవారు. కానీ కొవిడ్ తర్వాత ఇది మారింది. ఓటీటీ వేదికలు, మొబైల్ అప్లికేషన్ల హవా పెరిగింది. వినియోగమూ సులభమైంది. దాంతో ఏ కాస్త సమయం దొరికినా సినిమాలూ, సిరీస్‌ల మీద ఆధారపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతూ వచ్చింది అంటున్నాయి అధ్యయనాలు. పైగా, కాలేజీకి వెళుతున్న అమ్మాయిల్లో చాలామంది కొరియన్ సిరీస్ చూడటానికి ఇష్టపడుతున్నారట. ఎందుకు వీటిని చూస్తున్నారంటే? 'ఇంగ్లిష్ నేర్చుకోవడానికి వీటిని చూడమంటూ కాలేజీలోని కొంతమంది లెక్చరర్లు, స్నేహితులు సిఫారసు చేశా'రని చెబుతున్నారట. రోజులో ఒక సిరీస్ పూర్తిచేస్తేగానీ నిద్రపోమని చెప్పినవారూ చాలామందేనట. పరిస్థితుల నుంచి ధ్యాస మళ్లించుకోవడానికి వీటిమీద ఆధారపడుతున్నారు కొంతమంది. మొత్తంగా బింజ్ వాచింగ్ చేస్తున్న వారిలో వృత్తి, వ్యక్తిగత జీవితాల్లో వైఫల్యాలు ఎదుర్కొంటున్న వారే అధికం అంటోంది ఓ అధ్యయనం.

వీటివల్ల సమస్యలు...

- ఒకే దగ్గర గంటల తరబడి కూర్చుంటున్నారు. దీనివల్ల శారీరక శ్రమ తగ్గిపోతోంది. ఇది ఓ వయసు దాటినవారి నుంచి టీనేజర్ల వరకూ ప్రతి ఒక్కరి శారీరక ఆరోగ్యాన్నీ ప్రభావితం చేస్తోంది. పర్యవసానంగా... ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, కార్డియోవాస్క్యులర్ వ్యాధుల బారిన పడే వారు పెరుగుతున్నారట.
- ఎక్కువసేపు కదలికలు లేకపోవడం వల్ల కాళ్లలో రక్తం గడ్డకట్టి డీప్-వెయిన్ థ్రాంబోసిస్ ప్రమాదం బారిన పడుతున్న వారూ ఉన్నారు.
- పైగా, ఈ సిరీస్‌లను రాత్రిపూట చూసేవారే ఎక్కువ. దాంతో జీవగడియారం దెబ్బతింటుంది. స్క్రీన్ నుంచి వచ్చే రేడియేషన్‌కి మెలటోనిన్ ఉత్పత్తి తగ్గిపోయి, నిద్రలేమికి కారణమవుతుంది. నాణ్యమైన నిద్రకూ దూరం అవుతున్నారు. అంతేకాదు, కళ్లు పొడిబారడం, దృష్టిలోపాలు, మసకబారడం వంటి సమస్యల బారిన పడుతున్న వారూ ఎక్కువేనట.
- స్క్రీన్ టైమ్‌లో నిమగ్నమై స్నాక్స్, కూల్ డ్రింకులు అంటూ ఆరోగ్యాన్ని పాడుచేసే ఆహారానికీ బానిస అవుతున్నారు.

బయటపడండి ఇలా...

ధ్యాస మళ్లడానికీ, భాష నేర్చుకోవడానికీ, కాలక్షేపానికీ ఇలా కారణం ఏదైనా... సిరీస్‌ను అతిగా చూడటం తగ్గించుకోండి. ఒకటి, రెండు ఎపిసోడ్లని మాత్రమే చూడటం, అరగంట, గంట మాత్రమే వీటికి కేటాయించేలా లక్ష్యాల్ని నిర్దేశించుకోండి. స్క్రీన్ సమయంలో తినాలి అనిపిస్తే, ఆరోగ్యకరమైన ఆహారాలకి చోటివ్వండి. వీటిని చూడాలి అనిపించినప్పుడు వేరే వాటిపైకి ధ్యాస మళ్లించుకోండి. నచ్చిన వాళ్లతో మాట్లాడటం, కాఫీ-టీ బ్రేకులు తీసుకోవడం... విండో షాపింగ్‌కి వెళ్లడం వంటివి చేస్తే ఈ వ్యసనం నుంచి బయటపడొచ్చు.

సామాజిక జీవనానికి అలవాటు పడాలి...

బింజ్ వాచింగ్ వల్ల డోపమైన్ విడుదల ఎక్కువవుతుంది. దాంతో సంతోషం కోసం దానిమీదే మెదడు ఎక్కువగా ఆధారపడుతుంది. జీవనశైలిలో ఏ కాస్త ఇబ్బందులు ఎదురైనా సిరీస్ చూడాలనే సంకేతాల్ని మెదడు విడుదల చేస్తుంది. ఒకరకంగా చిన్నపిల్లలు కార్టూన్లు చూడటం లాంటిదే ఈ వ్యసనం కూడా. కాబట్టి సామాజిక జీవితానికి దగ్గరవ్వండి. అంటే, బంధువుల ఇళ్లకు వెళ్లడమో, స్నేహితులతో మాట్లాడటమో చేయండి. నైపుణ్యాలు నేర్చుకోవడానికి సమయాన్ని కేటాయించండి. మొదట్లో కష్టంగా ఉన్నా క్రమేణా ఇది అలవాటవుతుంది.

– డా. మండాది గౌరీదేవీ, మానసిక నిపుణురాలు



మీకు ఏ కర్టెన్?

ఫ్యాషనే కాదు... ఇంటికోసం ఏం కొనాలన్నా... ఇప్పుడు ట్రెండ్ ఏంటి అనే కొంటుంటాం కదా! కానీ ఇంటీరియర్ నిపుణులు ఏమంటారో తెలుసా? మీకు అనువైనవేంటి అని చూసుకోమంటారు. అంటే... ఇప్పుడంటే చలికాలం కానీ చలి నెమ్మదిగా తగ్గుతోంది. ఇన్నిరోజులూ వెలుతురు రావాలి, కోజీగా కనిపించాలంటూ ఎన్నో ప్రయోగాలు చేశాం. కానీ వచ్చేది వేసవి. ఎండ ప్రభావం మామూలుగా ఉండదు. ఆ వేడి నుంచి తప్పించుకోవాలి అనుకోండి. ముదురు రంగులు ఎంచుకోండి. అవైతే ఎండని ఆపుతాయి. దీంతో గది చల్లగా ఉంటుంది. లేదు, ఇల్లంతా వెలుగు రావాలి అంటారా... న్యూట్రల్ కలర్స్‌ని ఎంచుకుంటే సరి. ఇవైతే ఏరకం ఇంటీరియర్‌కైనా నప్పుతాయి. అంతేకాదు, గది కూడా విశాలంగా కనిపిస్తుంది. మీది మినిమలిస్టిక్ డెకార్ అనుకోండి... కాటన్, లినెన్‌వి నప్పుతాయి. సంప్రదాయ అలంకరణ ఇష్టపడేవాళ్లు వెల్వెట్, బ్రొకేడ్ రకాలు ఎంచుకుంటే మేలు. బరువుగా ఉంటే జరిపినా త్వరగా లొంగవు, తేలికగా ఉంటే కుదురుగా ఉండవు. కాబట్టి, ఏది ఎంచుకున్నా మరీ బరువుగా, మరీ తేలికగా ఉండకుండా చూసుకోవాలి. అలాగే ఎంచుకునేటప్పుడు ఎలా ఉతకాలి అన్నది చూడటం మర్చిపోవద్దు. గమనించుకుంటారుగా మరి?

అందరి ముందూ కోప్పడుతున్నారు..!

నేనో ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్నా. కొంతకాలంగా మా బాస్ అందరి ముందు నాపై పెద్దగా అరుస్తున్నారు, కోప్పడుతున్నారు. దీని వల్ల చేస్తున్న పనిపై ఆసక్తిపోతోంది. పెరిగిపోతోంది. ఆత్మవిశ్వాసం తగ్గిపోతోంది. ఆసక్తి ఉండటం లేదు. పొరపాటు చేస్తానేమో అన్న భయంతో పని చేయలేకున్నా. ఈ పరిస్థితిని ఎదుర్కోవడమెలా?

– ఓ సోదరి

డియర్ వసుంధర



కవితా గూడపాటి, సైకోథెరపిస్ట్

ఎంత పెద్ద పొరపాటు చేసినా, ఒక ఉద్యోగినిపై ఇలా నలుగురిలోనూ అరవడం అంగీకరించదగిన ప్రవర్తన కాదు. ఎప్పుడో ఒకసారి ఇలా జరిగితే, పరవా లేదు. కానీ, తరచూ ఇదే ఒరవడి కొనసాగితే కాస్త ఇబ్బందిగానే ఉంటుంది. దీని ప్రభావం మీ మీదే కాదు, పూర్తి టీమ్ మీదా పడుతుంది. పని వాతావరణంలోనూ చాలా సమస్యలు కలుగుతుంది. ఇలా జరగకూడదంటే ముందు మీ పని విధానాన్ని సరిచేసుకునే ప్రయత్నం చేయండి. తప్పులు జరిగితే అవి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోండి. ఇలాంటి పరిస్థితులు మీ సహోద్యోగులు, సీనియర్లలో ఎవరికైనా ఎదురయ్యాయేమో కనుక్కోండి. వాళ్ల సలహాలూ, సూచనలూ మీరు దీన్నుంచి బయటపడేందుకు సహకరిస్తాయి. ఇక ఆత్మవిశ్వాసం విషయానికొస్తే... మీరు మీ వైపు ఉన్న లోపాలు సరిచేసుకుంటే అవతలి వాళ్లు మిమ్మల్ని కించపరిచినా ఆ ప్రభావం మీపై ఉండదు. ఆత్మవిశ్వాసం దెబ్బతినదు. ఇలాంటి సందర్భాల్లో మిమ్మల్ని మీరు మోటివేట్ చేసుకుని ముందుకు వెళ్లడం చాలా అవసరం. అలానే, బాస్ కోప్పడినప్పుడు కాకుండా ప్రశాంతంగా ఉన్నప్పుడు ఆయనకు మీ పరిస్థితి వివరించడానికి ప్రయత్నించండి. అందరి ముందూ కాకుండా... మీరు మధ్య ఇబ్బంది ఉంటే నెమ్మదిగా చెబితే నేనింకా బాగా పనిచేయగలను అని చెప్పండి. లేదా వృత్తిపరంగా మీనుంచి ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకోండి. ఓ రకంగా రివ్యూ లాంటిదే ఇది. తెలుసుకున్నాక ఇందుకు అనుగుణంగా మిమ్మల్ని మీరు మలుచుకునేందుకు ప్రయత్నించండి.

గ్రామం నుంచి కేన్స్ వరకూ...

నెలసరిలో సింథటిక్ ప్యాడ్స్ వాడటం వల్ల ఎన్ని సమస్యలో... ఆ బాధలు ప్రత్యక్షంగా అనుభవించిన గీతా సోలంకికీ అవగతమే. అందుకే వీటికి ప్రత్యామ్నాయాలు వెతకడం మొదలుపెట్టింది. ఆ క్రమంలో తనకు దొరికిన పరిష్కారమే 'యూనీప్యాడ్స్' సంస్థ ప్రారంభానికి కారణమైంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపునూ తెచ్చిపెట్టింది. ఆమె ప్రయాణంలో విశేషాలివి..



గీత

గుజరాత్‌లోని ఓ వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగింది గీత. పెళ్లైన కొంతకాలానికి బార్తోలిన్ సిస్ట్‌తో ఇబ్బంది పడింది. ఇది నెలసరి సమయంలో తీవ్రమైన కడుపు నొప్పిని కలిగించి, నడవడం, కూర్చోవడం, చివరికి లోదుస్తులు ధరించాలన్నా కూడా ఇబ్బంది పడేదట గీత. దీనికి తోడు సింథటిక్ ప్యాడ్స్‌ను ఉపయోగించడం వల్ల ఇన్‌ఫెక్షన్ పెరిగేది. గీత సమస్యను అర్థం చేసుకున్న ఆమె తల్లి పాతకాలపు పద్ధతిలో కాటన్ వస్త్రాన్ని వాడమంది. మొదట దానికి నిరాకరించినా వాడిన తర్వాత నొప్పీ, దద్దుర్ల నుంచి కాస్త ఉపశమనం లభించిందట. దాంతో శానిటరీ ప్యాడ్స్ వల్ల తనకీ, పర్యావరణానికీ కలిగే హాని తగ్గించాలనుకుంది. అప్పుడే క్లాత్‌తో రీయూజబుల్ ప్యాడ్‌లను తయారుచేయాలనుకుంది.

సొంత గ్రామమైన వెరావాల్‌లోనే తయారీని ప్రారంభించాలనుకుంది గీత. అందులో భాగంగానే గుజరాత్‌లోని మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడ సౌకర్యాల లేమి, ఇతర సమస్యల గురించి అవగాహన తెచ్చుకుంది. ఈ క్రమంలోనే అక్కడి మహిళలు నెలసరి సమయంలో పాటించే అసురక్షిత పద్ధతులను తెలుసుకుందామె. సింథటిక్ ప్యాడ్స్‌కి అంత ఖర్చుపెట్టలేక, రోజుమొత్తం ఒకే శానిటరీ నాప్కిన్ను ఉపయోగించేవారు కొందరైతే, ప్రయాణాలప్పుడు మాత్రమే ఉపయోగించేవారు ఇంకొందరు. పైగా ధర కూడా ఎక్కువే. అందుకే యూనీప్యాడ్స్ పర్యావరణహితంగానే కాక, సాధారణ మహిళలకూ అందుబాటులో ఉండాలనుకుంది. ఎన్నో రీసర్చ్‌లు చేసి తయారీ గురించి అవగాహన తెచ్చుకుంది. కానీ, ఎలాంటి అనుభవం లేని గ్రామీణ మహిళలతోనే వీటిని తయారుచేయించాలి. కాబట్టి వాళ్లకి అర్థమయ్యేలా చెప్పేందుకు ఎక్కువ సమయం పట్టిందట. ఎన్నో ట్రయల్స్, టెస్టింగులు తర్వాత 2018లో మార్కెట్‌లోకి యూనీప్యాడ్స్ తీసుకొచ్చిందామె. గ్రామీణ మహిళలకు వీటిని కుట్టడంలో శిక్షణ ఇస్తూనే, వాడకంపై అవగాహన కల్పించేది గీత.

ఆ స్ఫూర్తితోనే...

యూనీప్యాడ్ మొత్తం ప్రయాణాన్ని ఒక డాక్యుమెంటరీగా రూపొందించిందీమె. అది 'కేన్స్ క్రియేటివిటీ సిల్వర్ గ్లాస్ లయన్' అవార్డును గెలుచుకుంది. ఆ స్ఫూర్తితోనే స్కూల్ మైల్స్ పేరుతో గుజరాత్, రాజస్థాన్‌ల్లోని 1000మంది స్కూలు బాలికలకు బ్యాగ్స్, రీయూజబుల్ ప్యాడ్స్, సబ్బు, హాట్‌వాటర్ ప్యాక్, లోదుస్తులతో కూడిన ఓ కిట్‌ను అందిస్తోంది. పీరియడ్స్‌పై అవగాహనా కల్పిస్తుందీమె. దీంతోపాటు కాలేజీ, స్కూళ్లలో ఆన్‌లైన్ సెమినార్లు, అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తుంది గీత.



ఆమె నృత్యానికి... గురు సత్కారం!

'ఆంధ్రనాట్యం'... తెలుగు రాష్ట్రాల్లో ఈ నృత్యరీతి అందరికీ సుపరిచితమే! దానికి జాతీయ స్థాయిలో ప్రాచుర్యం తేవడానికి కృషి చేస్తున్నారు. శిష్యులను తయారు చేసి, రెండు దశాబ్దాలుగా దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇప్పిస్తున్నారు. ఆ కృషికి ఫలితంగానే తాజాగా దిల్లీలో గురు సత్కారం అందుకున్నారు వేదాంతం రమణి. తన గురించి ఆమె పంచుకున్నారిలా...



రమణి

మాది వైజాగ్. నాన్న ఈవీ చారి డాక్టర్. ఆయన వృత్తిరీత్యా నా చదువంతా వివిధ ప్రాంతాల్లో సాగింది. చివరకు హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. అమ్మ వసుమతి దేవికి నాట్యమంటే ఇష్టం. ఇంటి ముందే టీచర్ ఉండటంతో నన్ను భరతనాట్యంలో చేర్చారు. తరవాత కూచిపూడి, మా గురువు నటరాజ రామకృష్ణ వద్ద ఆంధ్రనాట్యం నేర్చుకున్నా. అప్పట్లో దూరదర్శన్‌లోనూ ప్రదర్శనలిచ్చా. పెళ్లయ్యాక దిల్లీలో స్థిరపడ్డా. మావారు వేదాంతం గిరి సివిల్ సర్వెంట్. ప్రస్తుతం రిటైర్ అయ్యారు. నేను నృత్యం నేర్చుకున్నదంతా 'గురు శిష్య పరంపర'లోనే. దిల్లీ వచ్చాక సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఇచ్చే రీసర్చ్ ఫెలోషిప్‌కి ఎంపికయ్యా. రెండేళ్లు క్షేత్ర పదాలనే అంశంమీద పరిశోధన చేసి, థీసిస్ సబ్మిట్ చేశా. తరవాత సీనియర్ రీసర్చ్ ఫెలోషిప్‌ని అందుకుని 'డ్యాన్స్ ఫామ్స్ ఆఫ్ ఇండియా'పై పనిచేశా. నేను ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఇంగ్లిష్ లిటరేచర్‌లో ఎంఏ, తెలుగు యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీనీ పూర్తిచేశా. దీనిలోనూ పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌నే ఎంచుకున్నా.

వివిధ రాష్ట్రాల వాళ్లూ...

ఆంధ్రనాట్యం... దీన్ని పూర్వం ఆలయాలు, రాజదర్బారులు, ప్రజా వేదికలమీద ప్రదర్శించేవారు. ఇది కాలక్రమేణా మరుగున పడిపోతే మా గురువు నటరాజ రామకృష్ణ వెలికి తీసి, మూడు సంప్రదాయాలను ఒకే తాటి మీదకి తెచ్చారు. 'ఆంధ్రనాట్యం'గా ప్రాచుర్యంలోకి తేవడమే కాదు, పీహెచ్‌డీ వరకూ కోర్సులనూ అందుబాటులోకి తెచ్చారు. దీంతో తెలుగునాట ఇది అందరికీ పరిచయమే. జాతీయ స్థాయిలో గుర్తింపు తేవాలన్నదే నా తాపత్రయం. అందుకే దిల్లీలో 'ఆలయ నృత్య అకాడమీ' స్థాపించి, అందరికీ శిక్షణనిస్తున్నా. పంజాబ్, హరియాణ, బెంగాల్... ఇలా ఎన్నో రాష్ట్రాల్లో నా శిష్యులున్నారు. ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచితంగానూ నేర్పిస్తున్నా. జడ్జిలు, డాక్టర్లు కూడా నా దగ్గర నేర్చుకున్నారు, ప్రదర్శనలిచ్చారు. 2017లో మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ వాళ్లు అవుట్‌స్టాండింగ్ గురు కేటగిరీలో నన్ను యూరప్ పంపింది. ఫ్రాన్స్, వరల్డ్ ట్రేడ్ ఫేర్, సూరజ్ కుండ్ ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ వంటి ఎన్నో చోట్లా నా శిష్యులతో కలిసి ప్రదర్శనలిచ్చా. ఈ రెండు దశాబ్దాలకుపైగా ప్రయాణంలో మా గురువు గారి పేరుమీదున్న 'నటరాజ రామకృష్ణ మెమోరియల్ అవార్డు' సహా పురస్కారాలెన్నో అందుకున్నా.

నేను చేసే ప్రోగ్రామ్స్‌కి ఆదిశంకరాచార్య, అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలు... ఇలా ఏదో ఒక థీమ్ తీసుకుంటా. కర్ణాటక సంగీతాన్నీ నేర్చుకున్నా. దీంతో కొరియోగ్రఫీతోపాటు గాత్ర సహకారమూ నేనే చేస్తా. మాకిద్దరు పిల్లలు. మా అమ్మాయికీ నేర్పించా. నాతోపాటు ప్రదర్శనలు కూడా ఇచ్చింది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన తను ప్రస్తుతం పారా మిలిటరీ ఫోర్సెస్‌లో మేజర్ ర్యాంక్‌లో ఉంది. బాబు జర్మనీలో ఎంటీఏ చేస్తున్నాడు. తెలుగు యూనివర్సిటీ వాళ్లు ఏటా ఇంటర్నేషనల్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది దిల్లీలో 'రసఝరి' పేరుతో నిర్వహించారు. ఇక్కడ గురుసత్కారం అందుకోవడం మర్చిపోలేని అనుభూతి. ఇది మా గురువు గారి ప్రయత్నాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలనే నా బాధ్యతని మరింత పెంచింది.



బంగారం - వెండి

20న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,49,780	1,38,400	3,30,000
విజయవాడ	1,45,500	1,35,000	3,15,500
ప్రొద్దుటూరు	1,49,000	1,37,080	3,10,000
రాజమహేంద్రవరం	1,48,370	1,36,000	3,30,000
విశాఖపట్నం	1,49,790	1,37,300	3,21,000
తమిళనాడు	-----	1,39,000	3,40,000

ఏకాంతం... నూతనోత్తేజం!



చాలామంది ఏకాంతాన్ని ఒంటరితనంగా భావించి, దాన్ని ప్రతికూల అంశంగా చూస్తారు. రెండింటి మధ్య తేడాని గుర్తిస్తే ఏకాంతంతో జీవితానికి ఎంతో మేలని గ్రహిస్తారు.


ఏకాంతం అంటే... చుట్టూ ఎవరూ లేకపోవడం. ఫోన్లో, నేరుగా మాట్లాడటం, టెక్స్టింగ్... వీటికి దూరంగా ఉండటం. ఇక్కడ మీతో మీరే ఉంటారు. కొన్నిసార్లు టీవీ చూడటం, గార్డెనింగ్, చదవడం లాంటి శ్రమలేని పనులూ ఉంటాయి. ఒకరి సమక్షంలో ఉంటే, వాళ్ల మాటలు, చేతలకు ప్రతిస్పందించాలి. ఏకాంతంలో మనకు నచ్చింది చేస్తూ ఉత్సాహంగా ఉంటాం. ఆలోచించడం, విశ్రాంతి పొందడం, ఏదైనా హాబీకి సమయం కేటాయించడం... ఇలా ఏదో ఒకటి చేస్తున్నా మంచిదే.

- ఏకాంతం కొందరికి ప్రకృతిలో దొరికితే, ఇంకొందరికి ఇంట్లోనే లభిస్తుంది. కొందరు నిశ్శబ్దాన్ని భరించలేరు. చుట్టూ మనుషులు ఉండాలి. వాళ్ల మధ్యనే ఏకాంతాన్ని పొందగలరు. కాబట్టి అనుకూలమైన ప్రదేశాన్ని ఎంచుకోండి. ఇది సహజంగా ప్రశాంతతను ఇస్తుంది. మనం పునరుత్తేజం పొందడానికి ఉపయోగపడుతుంది. మన ఆలోచనల్నీ, భావనల్నీ బేరీజు వేసుకుంటూ భవిష్యత్తు ప్రణాళికల తయారీ, వ్యక్తిత్వ నిర్మాణంలో ఇది కీలకం.
- దీని కోసం ప్రపంచానికి దూరంగా వారం, పదిరోజులు ఉండాల్సిన పనిలేదు. రోజులో 15 నిమిషాలు కేటాయించుకోండి. ప్రారంభంలో పెద్దగా మార్పు కనిపించకపోయినా, కొన్నాళ్లకు దీని ప్రయోజనం తెలుస్తుంది. ఏకాంతంలో ఎక్కువగా సానుకూల ఆలోచనలతో ఉండాలి. అలా కాకుండా మిమ్మల్ని నిందించుకోవడం, అపరాధభావంతో ఉండటంవల్ల లాభంకంటే నష్టమే కలిగిస్తుంది. కాబట్టి, మనమీద మనకు జాలి, దయ ఉండాలి. మంచి స్నేహితురాలు పక్కన ఉన్న భావన కలగాలి.
- ఈ సమయంలో మనం గడిపే ప్రతి క్షణం ఎంతో ఉత్సుకతతో ఉండాలి. చేస్తున్న పనులు, ఉంటోన్న వాతావరణం ఇవన్నీ అందుకు దోహదపడాలి. ఒక సృజనాత్మక సవాలు మనకు ఎదురవ్వాలి. మనల్ని మనం మెరుగుపరుచుకునే పని చేస్తుండాలి.

చోటు వెతకాల్సిన పని లేదిక..!

నగరాల్లో అన్నీ కాంపాక్ట్(చిన్న) కిచెన్లే. లేదంటే మిగతా గదుల నిర్మాణం విషయంలో రాజీపడాల్సి వస్తుంది. అలాకాకూడదని అవసరం మేరకే వంటింటిని నిర్మించుకుంటున్నారు ఈ తరం. అనుకూలంగా ఉండే వస్తువులూ కావాలిగా మరి. అలాంటివే ఈ కిచెన్ ఆర్గనైజర్లు.

గోడకి అతుక్కుని...



మిర్చి, వెల్లుల్లి, అల్లం వంటివి గాలి తగిలే ప్రాంతాల్లో ఉంచితేనే నిల్వ ఉంటాయి. లేదంటే కొద్దిరోజుల్లోనే పాడైపోతాయి. మరి వాటిని ఒక్కొక్కటిగా ట్రేల్లో వేస్తే చూడటానికి గజిబిజిగా ఉంటాయి. ఈ 'మల్టీ టైర్ సక్షన్ కప్ వాల్ స్టోరేజ్ హోల్డర్ల'ను ఉపయోగించి చూడండి. ఎంత స్థలం కలిసొస్తుందో. వంటింటి గోడలకు ఈ హోల్డర్లను అమర్చితే సరి. డ్రిల్లింగ్ చేసి గోడలకి రంధ్రాలు చేయాలన్న భయమూ అవసరం లేదు. వీటిని సక్షన్ సాంకేతికతతో అతికించొచ్చు.

ఒకదానిపై ఒకటి...





వంటింటి సరకుల్లో... వాడేవీ నిల్వ ఉండేవీ వేరుగా పెడితేనే పాడవకుండా ఉంటాయి. అయితే రెండింటికీ వేర్వేరు బాక్సులు, డబ్బాలు కేటాయించగలమా? మన మాడ్యులర్, మైక్రో కిచెన్లలో ఇన్ని సామాన్లకు స్థలం ఉంటుందా? అలాంటప్పుడు ఈ 'మల్టీ లేయర్ ఫుడ్ స్టోరేజ్ బాక్సులు' ఉపయోగించి చూడండి. వాడుకునే సరకుల్ని ఇందులో వేసుకుని ఒకదానిపై ఒకటి అతికిస్తే సరి. అవసరం అయినప్పుడు తీసుకుంటాం. వంట అయిపోగానే యథాస్థితిలో అమర్చి పెట్టేస్తాం. అందానికి అందం, సౌలభ్యం కూడా.

కలిసి ఉండే జాడీలు...

స్మార్ట్ కిచెన్



స్టీలు, రాగి, సిల్వర్ ఎన్ని బాక్సులు వచ్చినా... వంటింట్లో పారదర్శక వస్తువులకే ప్రాధాన్యత ఇస్తాం. వెతుకులాట లేకుండా వస్తువు వెంటనే కనిపిస్తుందని. అయితే ఒక్కో వస్తువు ఒక్కో దగ్గర ఉన్నా విసుగే. ఈ 'మల్టీపర్పస్ స్పైస్ టవర్' ఆ సమస్యను పరిష్కరిస్తుంది. దీనిలో ఐదు నుంచి ఆరు జాడీలు ఉంటాయి. వాడుకునే సరకుల్ని ఇందులో వేస్తే సరి. ఒక్కోదానికి వేర్వేరు మూతలు ఉన్నా... అన్నింటినీ ఒకదానిపై ఒకటి అతికించొచ్చు. చూడటానికీ అందంగా ఉంటాయి. స్థలాభావాన్ని భర్తీ చేస్తాయి.



(c) eenadu

కాకాణి, రామిరెడ్డిలపై.. కల్తీ మద్యం కేసు విచారణకు ఎన్నాళ్లు?

- వీరు పంచిన చీప్‌లిక్కర్ తాగి కొందరు మృతి, పలువురికి అస్వస్థత
- తీవ్ర అభియోగాలపై 2014లో కేసు.. 2017లో ఛార్జిషీట్
- దస్త్రాలు గల్లంతై విచారణలో లోపించిన పురోగతి
- ప్రజాప్రతినిధులపై కేసుల్లో సుప్రీంకోర్టు ఆదేశాలకు తూట్లు




కాకాణి గోవర్ధన్‌రెడ్డి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: ఎన్నికల వేళ ఓటర్లకు కల్తీ మద్యం పంచిన కేసులో వైకాపా నేతలు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిలపై పుష్కర కాలంగా విచారణ ముందుకు సాగడం లేదు. ప్రజాప్రతినిధులపై నమోదైన క్రిమినల్ కేసుల విచారణలో జాప్యానికి వీల్లేదని, ప్రత్యేక కోర్టుల ద్వారా శీఘ్రంగా పరిష్కరించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు వీరి విషయంలో అమలు కావడం లేదు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో కల్తీ మద్యం పంచడంపై మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డి, తదితరులపై 4 కేసులు, కావలి నియోజకవర్గ పరిధిలో వైకాపా మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, తదితరులపై 6 కేసులు నమోదయ్యాయి. మొత్తంగా ఈ 10 కేసులపై సీఐడీ పోలీసులు 2017లో నెల్లూరు కోర్టులో అభియోగపత్రాలు సమర్పించారు. ఆనక వాటిని నెల్లూరు కోర్టు నుంచి విజయవాడలోని ప్రత్యేక కోర్టుకు పంపించారు. వీటిని పరిశీలించిన ప్రత్యేక కోర్టు. . కీలక దస్త్రాలు మాయమైనట్లు గుర్తించి, 2018లో నెల్లూరు కోర్టుకు తిప్పి పంపింది. గల్లంతైన దస్త్రాలను కూడా జతచేసి పంపాలని కోరింది. ఆ తర్వాత రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం ఏర్పడటంతో ఈ కేసుల విచారణలో పురోగతి లోపించింది. కేసును నీరుగార్చే ఉద్దేశంతోనే సహ నిందితులు వైకాపా నేతల సాయంతో ఫైళ్లు మాయం చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ కేసుల్లో కదలిక వచ్చింది. నెల్లూరు సీఐడీ అధికారులు అదృశ్యమైన దస్త్రాలను జతచేసి నెల్లూరు కోర్టు ద్వారా ప్రత్యేక కోర్టుకు పంపే పనిలో ఉన్నారు.

ఇన్నాళ్లుగా బెయిల్‌పైనే..

2014 ఎన్నికల సందర్భంగా ఓటర్లకు నాసిరకం మద్యం పంచగా, అది తాగిన వారిలో కొందరు చనిపోయారు. మరికొందరు తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. అప్పట్లో ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేసి, ప్రమాదకరమైన చీప్ లిక్కర్‌ను భారీమొత్తంలో సీజ్ చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిలు గోవా, కర్ణాటక, పుదుచ్చేరికి చెందిన లిక్కర్ మాఫియాతో చేతులు కలిపి, ఈ మద్యాన్ని సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో డంప్ చేసినట్లు పోలీసులు తేల్చారు. పలువురు నిందితులను అరెస్టు చేయగా, కాకాణి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు హైకోర్టును ఆశ్రయించి బెయిల్ పొందారు. ఈ ముఠాలోని కీలక సభ్యుడు, అంతర్జాతీయ స్థాయి నిందితుడు గోపాలకృష్ణస్వామి అలియాస్ అప్పు రిమాండ్‌లో ఉంటూ జైల్లోనే చనిపోయాడు.

సుప్రీం మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నా..

న్యాయవాది అశ్వనీకుమార్ ఉపాధ్యాయ వేసిన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా.. ఎమ్మెల్యేలు, ఎంపీలు, తదితర ప్రజాప్రతినిధులపై నమోదైన కేసుల విచారణలో జాప్యాన్ని నివారించేందుకు సుప్రీంకోర్టు 2023 నవంబర్ 9న కీలక మార్గదర్శకాలిచ్చింది. 'ఈ కేసుల పర్యవేక్షణకు హైకోర్టుల్లో ప్రత్యేక ధర్మాసనాలు ఏర్పాటు చేయాలి. ట్రయల్ కోర్టులు (ప్రత్యేక కోర్టులు) తప్పనిసరి పరిస్థితి అయితేనే విచారణలు వాయిదా వేయాలి. ట్రయల్ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణను వేగంగా ముగించేందుకు హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం ఎప్పటికప్పుడు ఆదేశాలిస్తుండాలి. విచారణ పురోగతిపై నివేదికలు కూడా కోరవచ్చు. స్టే ఉన్న కేసుల జాబితాను రూపొందించి తగిన ఉత్తర్వులివ్వాలి. స్టేలు ఎత్తివేయడంతో పాటు విచారణ ప్రారంభానికి ఉన్న అవరోధాలను తొలగించాలి' అని మార్గదర్శకాలు ఇచ్చింది. ఇవేవీ కాకాణి, రామిరెడ్డిలపై నమోదైన కేసుల్లో అమలు కాకపోవడం న్యాయవర్గాలను విస్మయపరుస్తోంది.



అయోధ్య రాముడికి 286 కిలోల స్వర్ణ ధనుస్సు

అయోధ్య రామమందిరానికి అంకితమిస్తూ తయారుచేసిన 286 కిలోల 'స్వర్ణ ధనుస్సు' ఒడిశాలోని పురీ పుణ్యక్షేత్రానికి చేరుకుంది. భక్తుల జయజయధ్వానాల మధ్య మంగళవారం ఊరేగింపుగా స్థానిక మఠం వద్దకు తీసుకొచ్చారు. భక్తులు స్వర్ణ ధనుస్సును దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పంచలోహాలతో తయారుచేసిన ఈ భారీ విల్లు రవుర్కెలా నుంచి వచ్చిందని, త్వరలోనే అయోధ్య రాముడి చెంతకు చేర్చనున్నట్లు ఇక్కడి పూజారి తెలిపారు. – ఇంటర్నెట్ డెస్క్

కర్ణాటక ఐపీఎస్ అధికారి రామచంద్రరావుపై సస్పెన్షన్ వేటు

రాసలీలల వీడియో కలకలం నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

ఈనాడు, బెంగళూరు: మహిళలతో అసభ్య ప్రవర్తన ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీజీపీ రామచంద్రరావు సస్పెండ్ అయ్యారు. ఆయనను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులిచ్చింది. 'ఆ అధికారి ప్రవర్తన ప్రభుత్వానికి తలవంపులు తెచ్చేలా ఉంది. ఆయన చర్యలు అఖిల భారతీయ సేవల నిబంధనలను ఉల్లంఘించినట్లు ప్రాథమిక పరిశీలనలో తేలింది. ఈ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టాలి. సస్పెన్షన్ సమయంలో అనుమతి లేకుండా నగరం విడిచి వెళ్లకుండా ఆయనను నిర్బంధించాలి' అని ప్రభుత్వం ఆదేశించింది. పలువురు మహిళలతో రామచంద్రరావు అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోలు సోమవారం వైరల్ అయ్యాయి. ఓ మహిళతో అభ్యంతరకరంగా మాట్లాడుతున్న ఆడియోలూ సామాజిక మాధ్యమాల్లో హోరెత్తాయి.

ఆయనతో మాట్లాడాలనుకోలేదు: రామచంద్రరావు తనతో మాట్లాడేందుకు వచ్చినా అందుకు అవకాశం ఇవ్వలేదని రాష్ట్ర హోంమంత్రి జి.పరమేశ్వర్ చెప్పారు. 'అలాంటి అధికారులతో మాట్లాడటం సరికాదు. ఏ శాఖలోనూ అధికారులు ఇలా ప్రవర్తించకూడదు. నేను ముఖ్యమంత్రితో చర్చించి తక్షణమే అధికారిని సస్పెండ్ చేయాలని నిర్ణయించుకుని.. ఆపని చేయించా. వీడియోలు ఏఐ సృష్టి అని ఆ అధికారి చెబుతున్నారు. విచారణ చేపట్టాక వాస్తవాలు తెలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే అరెస్టు చేసేందుకూ వెనకాడబోం' అని మంత్రి తేల్చిచెప్పారు. రామచంద్రరావుపై విచారణను పారదర్శకంగా చేపట్టి, వారంలో నివేదిక ఇవ్వాలని కర్ణాటక మహిళా కమిషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు లేఖ రాసింది.

నేటి నుంచి జేఈఈ మెయిన్స్

ఈనాడు, అమరావతి, కర్నూలు: విద్యార్థులకు పోటీ, పబ్లిక్ పరీక్షల హడావుడి మొదలైంది. దేశవ్యాప్తంగా ఎన్ఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి, జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత పొందేందుకు నిర్వహించే జేఈఈ మెయిన్స్ బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నెల 21, 22, 23, 24, 28 తేదీల్లో పేపర్-1, చివరిరోజు 29న పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. రోజూ ఉదయం 9-12గంటల వరకు, మధ్యాహ్నం 3-6గంటల వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుంది. జేఈఈ మెయిన్స్‌కు ఈసారి రికార్డుస్థాయిలో 14.50 లక్షల మంది దరఖాస్తు చేసినట్లు సమాచారం. రాష్ట్రం నుంచి 50వేలకు పైగా విద్యార్థులు ఈ పరీక్ష రాసే అవకాశం ఉంది.

- ఉదయం విడతలో 7గంటల నుంచి 8.30 గంటల మధ్య, మధ్యాహ్నం విడతకు ఒంటిగంట నుంచి 2.30 వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే గేట్లు మూసేస్తారు.

'గోల్డెన్ అవర్'లో స్పందన.. సైబర్ నేరగాళ్లకు చెక్

- రూ.2.16 కోట్లను తిరిగి రాబట్టిన బెంగళూరు పోలీసులు

బెంగళూరు (శివాజీ నగర), న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు ఈ-మెయిల్ స్పూఫింగ్‌తో కాజేసిన రూ.2.16 కోట్లను జప్తు చేసి, సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు బెంగళూరు నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ తెలిపారు. గోల్డెన్ అవర్‌లో(మోసపోయిన గంటలోపు) ఫిర్యాదు చేస్తే, నిందితుల ఖాతాలోకి నగదు చేరేలోగా అడ్డుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధానంలో ఇంత మొత్తంలో నగదును రికవరీ చేయడం దేశంలో ప్రథమమని మంగళవారం ఇక్కడ వెల్లడించారు. సీపీ వివరాల ప్రకారం.. బెంగళూరులోని గ్రూప్ ఫార్మా అనే కంపెనీ హైదరాబాద్‌లోని రెడ్డీస్ ల్యాబొరేటరీస్‌తో లావాదేవీలను నిర్వహించేది. ఇది గమనించిన నైజీరియాకు చెందిన నిందితులు గతేడాది గ్రూప్ ఫార్మా పేరిట నకిలీ ఈ-మెయిల్ ఖాతా తెరిచి.. దాంతో రెడ్డీస్ ప్రతినిధులతో సంప్రదింపులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల వచ్చిన ఓ మెయిల్‌ను విశ్వసించిన రెడ్డీస్ ల్యాబొరేటరీస్ ప్రతినిధులు రూ.2.16 కోట్లను నిందితులు సూచించిన ఖాతాకు బదిలీ చేశారు. ఆ తర్వాత వెంటనే మోసపోయినట్లు గుర్తించి గ్రూప్ ఫార్మా సాయంతో బెంగళూరులోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు చేపట్టిన పోలీసులు నగదు జమైన ఖాతాలు గుజరాత్‌కు చెందినవని తెలుసుకొని, వాటిని జప్తు చేశారు. ఆ మొత్తాన్ని నిందితులు డ్రా చేసుకోకుండా అడ్డుకున్నారు. అనంతరం మొత్తాన్ని తిరిగి రాబట్టి, చట్టపర ప్రక్రియలు పూర్తిచేసి రెడ్డీస్ ప్రతినిధులకు అందించినట్లు సీపీ తెలిపారు.



నగదు రాబట్టిన విధానాన్ని కొత్వాలుకు వివరిస్తున్న అధికారి



పని చేయకుండా ప్రయోజనం కోరొద్దు!

ఆఫీసులో ఆశించిన స్థాయి ఫలితం/ప్రయోజనం దక్కనప్పుడు ఫిర్యాదు చేయడం తప్పేమీ కాదు. కానీ- మీరు చేయాల్సిన పనిని సరిగ్గా పూర్తిచేశాకే ఆ దిశగా అడుగు వేయండి. సరిగా చేయని పనికి ఫలితం రాలేదని ఫిర్యాదు చేసే హక్కు మీకు ఎంతమాత్రమూ ఉండదు.

– ఒరియోలువా బుకోలా, కెరీర్ కౌన్సిలర్

తిరుగు ప్రయాణాల వేళ ఆర్టీసీకి రికార్డు స్థాయి ఆదాయం

ఈనాడు, అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రికార్డుస్థాయిలో ఒక్కరోజే రూ.27.68 కోట్లను ఆర్జించింది. సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వచ్చినవారిలో అత్యధిక శాతం 19న తిరుగు ప్రయాణమయ్యారు. వీరికోసం ఆర్టీసీ పెద్ద సంఖ్యలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. వీటిలో సాధారణ ఛార్జీలే వసూలు చేసింది. దీంతో 19న ఒక్కరోజే 50.60 లక్షల మంది ప్రయాణించారు. సాధారణంగా రోజుకు సగటున 40-42 లక్షల మంది ప్రయాణిస్తారు. కానీ 19న రికార్డుస్థాయిలో 50.60 లక్షల మంది ప్రయాణాలతో రికార్డు సృష్టించింది. వీరిలో స్త్రీశక్తి పథకాన్ని వినియోగించుకొని ప్రయాణించిన మహిళలు 28.68 లక్షల మంది ఉన్నారు.

- ఇక రోజువారీ సగటు రాబడి రూ.19-20 కోట్లు ఉండగా, 19న రూ.27.68 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో స్త్రీశక్తి పథకం ద్వారా ప్రయాణికులు పొందిన సబ్సిడీ రూ.11.30 కోట్ల మేర ఉంది.
- ఆర్టీసీలో నిత్యం నడిపే బస్సులు కాకుండా, అదనంగా 800 బస్సులు ఉండగా, వాటిని అన్నింటినీ 19న రోడ్డెక్కించారు. దూరప్రాంత సర్వీసులు రాత్రులు మాత్రమే తిరుగుతాయి. పగలంతా డిపోలో ఉంటాయి. ఇటువంటి బస్సులన్నింటినీ ఆయా డిపోల పరిధిలోని 100-200 కి.మీ. దూరంలో ఉండే ప్రాంతాలకు పగలు కూడా నడిపారు.
- విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రాత్రి బయలుదేరి వెళ్లిన బస్సులు మరుసటి రోజు ఉదయానికి అక్కడ చేరుకుంటాయి. అవి మళ్లీ రాత్రి అక్కడి నుంచి బయలుదేరతాయి. ఈసారి మాత్రం ఇలా ఉదయం హైదరాబాద్ చేరుకున్న బస్సులను, వెంటనే బయలుదేరి మధ్యాహ్నానికి విజయవాడ వచ్చేలా చూశారు. ఇటువంటి ఏర్పాట్లతో రికార్డుస్థాయిలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేందుకు అవకాశం ఏర్పడింది.
- అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో రికార్డుస్థాయిలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడంతోపాటు, అత్యధిక ఆదాయం పొందే అవకాశం కలిగిందని సంస్థ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు.

ఫుడ్ డెలివరీ బాయ్‌పై కత్తితో దాడి చేసి రీల్స్

- ముగ్గురు నిందితుల అరెస్టు



అరెస్టయిన నిందితులు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: ఫుడ్ డెలివరీ బాయ్‌పై కత్తులతో దాడి చేసిన ఓ ముఠా... ఆ దాడిని వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్‌గా పోస్టు చేసిన ఘటన చెన్నైలో కలకలం సృష్టించింది. చెన్నై వేళచ్చేరి నెహ్రూనగర్ ఏఎల్ ముదలియార్ వీధిలో సోమవారం రాత్రి ఫుడ్ డెలివరీ చేసేందుకు వచ్చిన యువకుడిపై ఓ ముఠాలోని ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేశారు. మరికొందరు దానిని వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో రీల్స్‌గా పోస్టు చేశారు. ఘటనపై వేళచ్చేరి పోలీసులు కేసు నమోదు చేసి విష్ణు, నంద, సుందర్ అనే నిందితులను అరెస్టు చేశారు. పరారీలో ఉన్నవారి కోసం గాలిస్తున్నారు.

ప్రసంగంలో కొన్ని పేరాలు చదవని కేరళ గవర్నర్

అసెంబ్లీలో సీఎం విజయన్ అసహనం

తిరువనంతపురం: కేరళలో మంగళవారం మొదలైన అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమావేశాల సందర్భంగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ కాపీలో కొన్ని అంశాలను చదవలేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అర్లేకర్ సభ నుంచి నిష్క్రమించిన అనంతరం సీఎం మాట్లాడారు. ప్రసంగంలోని 12వ పేరా ప్రారంభ అంశాలను, 15వ పేరా ముగింపు అంశాలను గవర్నర్ చదవలేదని స్పీకర్‌కు వెల్లడించారు. గవర్నర్ చేసిన పని రాజ్యాంగ విరుద్ధమన్నారు. 12వ పేరాలో సమాఖ్య విధానం, కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి, 15వ పేరాలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వంటి విషయాలున్నాయని చెప్పారు.

'దీనిపై వివాదం అనవసరం'

గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అసెంబ్లీ ప్రసంగంపై కేరళ లోక్‌భవన్ స్పందించింది. దీనిపై వివాదం అనవసరమని, నిరాధారమని పేర్కొంది. ప్రసంగంలో రెండు భాగాలు వదిలేశారంటూ సీఎం విజయన్ పేర్కొన్న కొద్దిసేపటికే దీనిపై స్పష్టతనిచ్చింది. ముసాయిదా ప్రసంగం నుంచి అర్ధ సత్యాలను తొలగించాలని గవర్నర్ కోరినట్లు పేర్కొంది. అయినప్పటికీ ఎలాంటి మార్పులు లేకుండానే దాన్ని తిరిగి పంపారని వెల్లడించింది. దాన్నే ఆయన అసెంబ్లీలో చదివారని, దీనిపై చర్చ అనవసరమని పేర్కొంది.

జాతీయ గీతాన్నీ నన్నూ అవమానించారు

- ప్రసంగించకుండానే అసెంబ్లీ నుంచి వెళ్లిపోయిన తమిళనాడు గవర్నర్ రవి
- 13 అభ్యంతరాల్ని పేర్కొంటూ లోక్‌భవన్ నుంచి ప్రకటన
- ఆ రాష్ట్ర చరిత్రలో వరసగా ఇలా నాలుగోసారి



సమావేశాలకు ముందు గవర్నర్ రవికి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలుకుతున్న స్పీకర్ అప్పావు



అసెంబ్లీ నుంచి కారులో వెళ్లిపోతున్న గవర్నర్ రవి

ఈనాడు, చెన్నై- న్యూస్‌టుడే, చెన్నై: కొత్త ఏడాదిలో మంగళవారం మొదలైన తమిళనాడు అసెంబ్లీ సమావేశాలు వివాదాస్పదంగా మారాయి. తాను ప్రసంగించకుండానే సమావేశాలను బహిష్కరిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి బయటకు వెళ్లిపోయారు. ఎందుకలా చేయాల్సి వచ్చిందో వివరిస్తూ ఆ తర్వాత ప్రకటన విడుదల చేశారు. 'తమిళ తల్లి ప్రార్థన గీతం పూర్తవగానే జాతీయగీతం ఆలపించలేదు. ఇది ఆ గీతాన్ని అవమానించడమే. సభలో ప్రసంగ ప్రారంభ సమయంలో నా మైక్‌ను కట్ చేసి నన్ను అవమానించారు. అందుకే బయటకు వచ్చేశా' అని ఆయన పేర్కొన్నారు. గవర్నర్ శాసనసభ సమావేశాల నుంచి బయటికెళ్లడం వరసగా ఇది నాలుగోసారి. 2023లో ప్రసంగం పూర్తయ్యాక, ఆ తర్వాత మూడుసార్లూ ప్రసంగం చదవకుండానే ఆయన వెలుపలికి వచ్చారు. ఈ చర్య అటు అసెంబ్లీని, ఇటు రాష్ట్ర రాజకీయాల్ని కుదిపేసింది. లోక్‌భవన్ కార్యాలయం నుంచి వెలువరించిన ప్రకటనలో 13 అభ్యంతరాల్ని గవర్నర్ రవి పేర్కొన్నారు. తనకిచ్చిన ప్రసంగపాఠంలో తమిళనాడు ప్రభుత్వం పలు కీలక ప్రజాసమస్యల్ని విస్మరించిందన్నారు. రాష్ట్రానికొచ్చాయని చెబుతున్న పెట్టుబడుల్లో చాలావరకు ఒప్పందాలు పెండింగ్‌లో ఉండటం, అత్యాచార, వేధింపుల కేసులు పెరగడం, మాదకద్రవ్యాల కారణంగా ఆత్మహత్యలు పెరగడం, రాష్ట్రంలో అధ్యాపక పోస్టులు భర్తీ కాకపోవడం, ఆలయాలకు బోర్డ్ ఆఫ్ ట్రస్టీలు లేకపోవడం, గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగక పోవడం లాంటి వాటిని ప్రభుత్వం పట్టించుకోలేదని అందుకే ప్రసంగాన్ని బహిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు.

గవర్నర్ ప్రసంగం అవసరమా?: సీఎం స్టాలిన్


దేశంలో ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం వద్దని చెబుతూ రాజ్యాంగ సవరణను కోరాల్సిన అవసరముందని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ అన్నారు. తమ ప్రభుత్వం రూపొందించిన ప్రసంగాన్ని గవర్నర్ చదవక పోయినంత మాత్రాన ద్రావిడ మోడల్ సర్కారు విజయాల్ని, ప్రయోజనాల్ని ప్రజల ముందు దాచలేరని వ్యాఖ్యానించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులతో కూడిన శాసనసభను గౌరవించకుండా, సంక్షేమ కార్యకలాపాలను అడ్డుకుంటున్న గవర్నర్‌ను వెనక్కి తీసుకోవాలని అనడంలో తప్పులేదన్నారు. స్పీకర్ అప్పావు మాట్లాడుతూ... అసెంబ్లీ సంప్రదాయాల ప్రకారం తమిళ తల్లి ప్రార్థన గీతాన్ని మొదట్లో ఆలపించాలని, చివర్లో జాతీయ గీతం ఉంటుందని చెప్పారు. మరోవైపు రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రజా సమస్యల్ని పట్టించుకోవడం లేదంటూ ప్రతిపక్షాలు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశాయి.

వసతిగృహాల్లో తనిఖీలకు జాయింట్ యాక్షన్ కమిటీలు

తొమ్మిది శాఖలతో ఏర్పాటుకు ప్రభుత్వ ఆదేశం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ విద్యాసంస్థలు, సంక్షేమ వసతిగృహాల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు తొమ్మిది ప్రభుత్వ శాఖల అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. అంటువ్యాధుల కట్టడికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ, విద్యాశాఖ, ఆహార భద్రత, పంచాయతీ, పురపాలక, పశుసంవర్ధక, వ్యవసాయ, బీసీ/ఎస్సీ/ఎస్టీ సంక్షేమ శాఖలు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి కమిటీలు ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ జిల్లాలకు పంపిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్ణీత కాల వ్యవధిలో జాయింట్ యాక్షన్ కమిటీలు తనిఖీలు చేయాలని స్పష్టం చేశారు. కీలక శాఖల సమన్వయంతో తనిఖీల సమయంలో పరిశీలించాల్సిన అంశాలను (చెక్‌లిస్ట్)ను ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

ఆర్టీఐ కమిషనర్ల ప్రమాణం



ప్రమాణం అనంతరం సీఎస్ విజయానంద్‌తో పరవాడ సింహాచలం నాయుడు, వజ్జా శ్రీనివాసరావు, వొంటేరు రవిబాబు, గాజుల ఆదెన్న, వట్టికూటి శరత్ చంద్ర కళ్యాణ చక్రవర్తి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్(ఏపీఐసీ)లో నూతనంగా నియమితులైన చీఫ్ కమిషనర్‌తోపాటు, మరో నలుగురు కమిషనర్లు మంగళవారం ప్రమాణం చేశారు. చీఫ్ కమిషనర్‌గా వజ్జా శ్రీనివాసరావు, కమిషనర్లుగా పరవాడ సింహాచలం నాయుడు, వొంటేరు రవిబాబు, గాజుల ఆదెన్న, వట్టికూటి శరత్‌చంద్ర కళ్యాణ చక్రవర్తిలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సచివాలయంలో ప్రమాణం చేయించారు. వారికి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సాధారణ పరిపాలన శాఖ సర్వీసెస్ విభాగం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ఏపీఐసీ అధికారులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్‌గా మారి.. కష్టాలు తెలుసుకున్న ఎమ్మెల్యే!



డెలివరీ బాయ్‌గా ఎమ్మెల్యే బోడే ప్రసాద్

కానూరు, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ డెలివరీ బాయ్‌గా మారి అందరినీ ఆశ్చర్యపరిచారు. 15 రోజుల క్రితం ఓ ఇంటికి వచ్చి ఆర్డరిచ్చిన ఆహారాన్ని అందించారు. పార్సిల్ తీసుకున్నవారు డెలివరీ బాయ్‌గా వచ్చిన ఎమ్మెల్యేను గుర్తించి ఆశ్చర్యపోయారు. ఎమ్మెల్యే కొన్ని రోజులుగా కానూరు, పోరంకి, యనమలకుదురులో ఇలా సేవలందించి, డెలివరీ బాయ్స్ కష్టాలను తెలుసుకున్నట్లు తెలిసింది. ఈ విషయం మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ డెలివరీ బాయ్స్ కష్టాలు, పని ఒత్తిడిని తెలుసుకున్నానని, వారికి ప్రజలు తగిన గౌరవం ఇవ్వాలన్నారు.

ఒట్టు.. ఇది రైళ్లు వచ్చే చోటు!



అమరావతిలోని మంగళగిరి రైల్వేస్టేషన్ ఎయిర్‌పోర్టును తలపిస్తోంది. అమృత్ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో ఇక్కడ పనులు జరుగుతున్నాయి. రాజధాని ముఖద్వారంగా మారనున్న ఈ రైల్వేస్టేషన్‌లో ఇప్పటికే పార్కింగ్, వెయిటింగ్ హాల్ వంటి సౌకర్యాలు కల్పించారు. స్టేషన్ ముందు చేనేత కార్మికురాలు మగ్గం నేస్తున్నట్లు ఏర్పాటు చేసిన విగ్రహం మరో ప్రధాన ఆకర్షణ. మంగళవారం విద్యుత్ కాంతులతో స్టేషన్ ఇలా కాంతులీనుతూ కనిపించింది. – ఈనాడు అమరావతి

ఇంజినీర్ల బదిలీలకు రూ.366 కోట్ల లంచం

- తమిళనాడు మంత్రి కేఎన్ నెహ్రూపై ఈడీ అభియోగాలు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: తమిళనాడులో మున్సిపల్ పరిపాలన, నీటి సరఫరా విభాగంలో ఇంజినీర్ల బదిలీలకు మంత్రి కేఎన్ నెహ్రూ రూ.366 కోట్లు లంచం తీసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆరోపణలు చేస్తూ తమిళనాడు డీజీపీకి మూడోసారి లేఖ రాసింది. ఈ మేరకు మంత్రి సన్నిహితుల ఫోన్లలో 340 మంది వ్యక్తుల జాబితాతో కూడిన లేఖ గుర్తించినట్లు పేర్కొంది. లంచం తీసుకున్న 15 ఘటనలను లేఖలో ప్రస్తావించింది. మంత్రి నెహ్రూ, ఆయన కుటుంబీకులు, సన్నిహితులకు కలిపి రూ.365.87 కోట్ల వరకు చట్ట విరుద్ధంగా నగదు బదిలీ అయిందని తెలిపింది. కేసు నమోదులో ఆలస్యమైతే ఆధారాలు నాశనం చేసేందుకు అవకాశం ఇచ్చినట్లవుతుందని పేర్కొంది. కేఎన్ నెహ్రూ బాధ్యతలు వహిస్తున్న మున్సిపల్ పరిపాలన, నీటి సరఫరా విభాగంలో అవినీతి జరిగినట్లు పేర్కొంటూ ఇదివరకే ఈడీ.. రెండుసార్లు డీజీపీకి లేఖ రాసింది. ఆ శాఖల పరిధిలో ఒప్పందాలు ఖరారు చేసేందుకు రూ.1,020 కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపించిన ఈడీ అందుకు తగిన ఆధారాలను లేఖ ద్వారా డీజీపీకి పంపింది. ఆ తర్వాత ఉద్యోగ నియామకాల్లో ఒక్కొక్కరి నుంచి రూ.25 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు లంచం తీసుకున్నట్లు వాట్సప్ సంభాషణల ఆధారాలతో మరో ఉత్తరం పంపింది. వాటిపై కేసు నమోదు చేసి తమకు పంపించాలని తెలిపింది. ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించిన అవినీతి నిరోధక శాఖ ఇంకా కేసు నమోదు చేయలేదు.

కేసు ఫైళ్లను మూడో పక్షానికి ఇవ్వం

హైకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ హయాంలో తెదేపా అధినేత చంద్రబాబు, తదితరులపై నమోదైన ఫైబర్‌నెట్, మద్యం విధానం కేసుల రికార్డులను ఇచ్చేందుకు నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు జారీచేసిన ఉత్తర్వులను సవాలుచేస్తూ.. రైల్వే మాజీ ఉద్యోగి కొండలరావు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. 'ఈ కేసులకు మీరు థర్డ్ పార్టీ. ఏసీబీ కోర్టు ఉత్తర్వులతో మీరు పొందే ప్రయోజనమేంటి?' అని పిటిషనర్‌ను సూటిగా ప్రశ్నించిన హైకోర్టు.. కేసు దస్త్రాలను మూడో పక్షానికి ఇవ్వడానికి సహజంగా అనుమతించబోమని స్పష్టం చేసింది. కౌంటర్ వేయాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది. న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకుముందు పిటిషనర్ తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదించారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు సాక్ష్యాధారాలను పరిశీలించకుండా, సీఐడీ వేసిన తుది నివేదికను మాత్రమే పరిగణనలోకి తీసుకొని 'మిస్టేక్ ఆఫ్ ఫ్యాక్ట్'గా పేర్కొంటూ విచారణను మూసివేసిందని పేర్కొన్నారు. ఈ కేసు విచారణ బాధ్యత ఏసీబీ కోర్టుకు లేదని, విజయవాడలోని ప్రత్యేక కోర్టుకు బదలాయించి ఉండాల్సిందని వాదించారు. సీఐడీ తరఫున అదనపు పీపీ పాణిని సోమయాజి స్పందిస్తూ, ఈ వ్యాజ్యం మొదటిసారి విచారణకు వచ్చిందని, వివరాలు సమర్పించేందుకు సమయమివ్వాలని కోరారు. దీంతో విచారణ ఫిబ్రవరి 3కి వాయిదా పడింది.

జోగి సోదరులకు షరతులతో బెయిల్

- తీర్పు వెలువరించిన విజయవాడ ఎక్సైజ్ కోర్టు
- ములకలచెరువు కేసులో బెయిల్ వస్తేనే జైలు నుంచి విడుదల

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగు చూసిన నకిలీ మద్యం కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు రాముకు బెయిల్ మంజూరైంది. విజయవాడలోని ఎక్సైజ్ కోర్టు మంగళవారం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. జోగి సోదరులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లపై గత వారం వాదనలు పూర్తయ్యాయి. వీటిపై న్యాయాధికారి లెనిన్ బాబు తీర్పు వెలువరించారు. గత ఏడాది నవంబరు 2న ఇబ్రహీంపట్నంలోని నివాసంలో ఇద్దరినీ ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నెల్లూరు, అనంతరం విజయవాడ కారాగారాల్లో వారు 80 రోజులుగా ఉన్నారు. బెయిల్‌కు సంబంధించి ఒక్కొక్కరూ రూ.50 వేల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని, దేశం విడిచి వెళ్లరాదని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే కోర్టు అనుమతి తీసుకోవాలని, దర్యాప్తునకు సహకరించాలని, తిరిగి ఇటువంటి నేరాల్లో పాల్గొనకూడదని న్యాయస్థానం షరతులు విధించింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువు నకిలీ మద్యం కేసులోనూ జోగి సోదరులను ఎక్సైజ్ పోలీసులు నిందితులుగా చేర్చారు. ఆ కేసులోనూ వారు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు. భవానీపురం ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసులోనే ప్రస్తుతం వీరికి బెయిల్ వచ్చింది. ములకలచెరువు కేసులో జోగి రమేష్, రాము దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపై విచారణ సాగుతోంది. అందులో బెయిల్ వస్తేనే వారు జైలు నుంచి విడుదల అవుతారు.

(c) eenadu

దేవుడా!





పదో సంతానంగా పుట్టిన కుమారుడితో రీతూ ★ 10 మంది కుమార్తెల తర్వాత పుట్టిన వారసుడితో సంజయ్

నేడు ఆడ, మగ సమానమే అంటున్నా.. మగ సంతానం కోసం ఇప్పటికీ చాలా కుటుంబాలు పరితపిస్తూనే ఉన్నాయి అనేందుకు నిదర్శనాలివి. హరియాణాలోని జింద్ జిల్లా ఉచనా కలాన్‌లో సురేంద్ర, రీతూ దంపతులకు ఇప్పటికే 9 మంది కుమార్తెలు ఉండగా.. ఆదివారం సాయంత్రం రీతూ తన పదో ప్రసవంలో కుమారుడికి జన్మనిచ్చారు. సురేంద్ర సోదరుడికి కూడా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. దీంతో 12 మంది సోదరీమణులకు తమ్ముడు పుట్టాడంటూ ఆ ఉమ్మడి కుటుంబం మొత్తం సంబరాల్లో మునిగిపోతోంది. సురేంద్ర, రీతూల వివాహమై 24 ఏళ్లు అయిందని, తొమ్మిదిమంది కూతుళ్ల తర్వాత దేవుడు ఒక కుమారుడిని అనుగ్రహించాడని సమీప బంధువు వీణ సంతోషం వ్యక్తం చేశారు. బాబుకు 'దిల్ ఖుష్' అని పేరు పెడతామన్నారు.

■ ఇదే రాష్ట్రంలోని ఫతేహాబాద్ జిల్లా భునాలో సంజయ్, సునీత దంపతులకు 10 మంది కుమార్తెల తర్వాత.. జనవరి మొదటివారంలో కుమారుడు పుట్టాడు. రోజుకూలీగా పనిచేస్తున్న సంజయ్‌కు వివాహమై 19 ఏళ్లు అయింది.

తాత సమాధి మట్టితో.. 'సర్' విచారణకు మనవడు



పశ్చిమబెంగాల్‌లోని మాల్దా జిల్లా హరిశ్చంద్రాపుర్‌లో ఎన్నికల సంఘం అధికారులు చేపట్టిన 'ప్రత్యేక ముమ్మర సవరణ' (సర్) విచారణకు సోమవారం సలేక్ అనే వ్యక్తి తన తాత సమాధిలోని మట్టి తవ్వి తీసుకొచ్చాడు. అధికారులు తన కుటుంబసభ్యులను పలుమార్లు విచారణకు పిలవగా ఒకదాని తర్వాత మరొకటి తమ వద్ద ఉన్న భూమి పత్రాలు, ఆధారాలన్నీ ఆ వ్యక్తి చూపించారు. తాతకు సంబంధించిన ఆధారాల కోసం సమాధి మట్టిని తీసుకువచ్చి, తన భారతీయత నిర్ధారణకు డీఎన్ఏ పరీక్ష చేయాలని డిమాండ్ చేశారు. "పదే పదే ఇలా విచారణకు పిలిచి ఏదీ తేల్చి చెప్పడం లేదు. ఓటరు జాబితాలో మా పేర్లు ఉన్నాయో.. లేదో ఎలా తెలుస్తుంది! ఈ మట్టి పరీక్ష చేసి మా తాత భారతీయుడా.. బంగ్లాదేశీయా చెప్పండి" అన్నారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం తాము పనిచేస్తున్నామని, అవసరమైతే రెండోసారి విచారణకు నోటీసులు ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు.

దంపతుల పోట్లాటకు కోర్టులు వేదికలు కారాదు

విడాకులు మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్య

దిల్లీ: కలహించుకునే దంపతులు ఒకరిపై మరొకరు ప్రతీకారం తీర్చుకోవడానికి కోర్టులను వేదికలుగా మార్చడం తగదని, వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేయడమూ సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. వివాహమైన తర్వాత 65 రోజులు మాత్రమే కలిసి జీవించి, దశాబ్దకాలానికి పైగా దూరంగా ఉన్న దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వివాహ అనంతరం తలెత్తే విభేదాల పరిష్కారానికి కోర్టులను ఆశ్రయించడానికి ముందే మధ్యవర్తిత్వ ఐచ్ఛికాన్ని వినియోగించుకోవాలని హితవు పలికింది. న్యాయస్థానానికి వెళ్లి పరస్పర ఆరోపణలు చేసుకోవడం, వాటికి ఆధారాలు సృష్టించేందుకు యత్నించడం, గుణపాఠం చెప్పాలనే భావన వల్ల వారి మధ్య వైరం పెరుగుతుందే కాని తగ్గదని ధర్మాసనం తెలిపింది.

కేంద్ర ఉద్యోగిపై అవినీతి ఆరోపణలను

రాష్ట్ర పోలీసులు దర్యాప్తు చేయవచ్చు

- సుప్రీంకోర్టు తీర్పు



దిల్లీ: అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన లంచం, అవినీతి కేసుల వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై ఛార్జిషీటు నమోదుతో పాటు దర్యాప్తునూ రాష్ట్ర పోలీసు అధికారులు చేపట్టవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. ఆ ఉద్యోగిపై కేసు నమోదుకు సీబీఐ నుంచి ముందస్తు అనుమతి పొందాల్సిన అవసరం కూడా లేదని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం స్పష్టం చేసింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం.. కేంద్ర/రాష్ట్ర సంస్థలకు చెందిన నిర్ణీత హోదా కలిగిన పోలీస్ అధికారి ఎవరైనా ఆ నేరారోపణలపై దర్యాప్తు చేయవచ్చని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై వచ్చే అవినీతి, దుష్ప్రవర్తన ఆరోపణలపై రాష్ట్ర పోలీసులు లేదా ప్రత్యేక విభాగం దర్యాప్తును సెక్షన్ 17 అడ్డుకోబోదని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే, వేసులుబాటుతో పాటు ఒకే పనిని రెండు సంస్థలు చేయడాన్ని నివారించేందుకుగాను ఈ కేసుల్లో దర్యాప్తును సాధారణంగా సీబీఐకి అప్పగిస్తుంటారని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై నమోదైన అవినీతి కేసును కొట్టివేసేందుకు నిరాకరిస్తూ రాజస్థాన్ హైకోర్టు వెలువరించిన తీర్పును సమర్థిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ తీర్పు వెలువరించింది.

కోర్టు ధిక్కారమే...

- మేనకాగాంధీపై సుప్రీం గరంగరం



దిల్లీ: కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీపై సుప్రీం కోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. వీధి కుక్కల అంశంలో తాను ఇచ్చిన తీర్పును మేనకా గాంధీ తప్పుబట్టడాన్ని కోర్టు ధిక్కరణగా అభివర్ణించింది. "ఆమె ఏమాత్రం ఆలోచించకుండా అందరిపై అన్ని రకాల వ్యాఖ్యలు చేశారు" అంటూ జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "కోర్టు జాగ్రత్తగా మాట్లాడాలని మీరన్నారు. అయితే మీ క్లయింటు ఎలాంటి వ్యాఖ్యలు చేశారో ఆమెనే అడగండి. ఆమె పాడ్‌కాస్ట్ మీరు విన్నారా? ఏమాత్రం ఆలోచించకుండా ఆమె అందరిపై అన్ని రకాలుగా వ్యాఖ్యానించారు. ఆమె తీరును మీరు గమనించారా?" అని మేనకాగాంధీ తరఫు న్యాయవాది రాజు రామచంద్రన్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. ఆమె మాటలు కోర్టు ధిక్కారమే అయినప్పటికీ ఔన్నత్యంతో న్యాయస్థానం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంది. కేంద్ర మాజీమంత్రిగా మేనకా గాంధీ వీధి కుక్కల సమస్య పరిష్కారానికి ఎంత బడ్జెట్ కేటాయించారు? అని న్యాయవాది రామచంద్రన్‌ను ప్రశ్నించింది. తాను పాక్ ఉగ్రవాది అజ్మల్ కసబ్ తరఫున కూడా వాదించానని గుర్తుచేస్తూ బడ్జెట్ అనేది ప్రభుత్వ విధానానికి సంబంధించిన అంశమని న్యాయవాది రామచంద్రన్ బదులిచ్చారు. "కోర్టు ధిక్కారానికి పాల్పడింది అజ్మల్ కసబ్ కాదు.. అది మీ క్లయింటే" అని న్యాయమూర్తి జస్టిస్ విక్రంనాథ్ అన్నారు. వీధి శునకాలకు ఆహారం పెట్టేవారే కుక్క కాటేస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని తాను చేసిన వ్యాఖ్యలు వ్యంగ్యంగా అన్నవి కాదని జస్టిస్ విక్రంనాథ్ పేర్కొన్నారు. విచారణ జరుగుతున్న సమయంలో తీవ్రంగానే ఈ వ్యాఖ్యలు చేశానని తెలిపారు. కాగా.. వీధి శునకాల అంశంలో సుప్రీం కోర్టు ఆదేశాలు ఆచరణాత్మకమైనవి కాదని, కుక్కలపై సర్వోన్నత న్యాయస్థానం కరుణ చూపాలని గతంలో మేనకా గాంధీ వ్యాఖ్యానించారు.



ఆ పదార్థాలు అద్భుత ఔషధాలు!

పులియబెట్టిన ఆహార పదార్థాలను ఆరగించడం ఇప్పుడు కొత్తగా ట్రెండింగ్‌లోకి వచ్చిన ధోరణి ఏమీ కాదు. అద్భుత ఔషధాల్లా అవి అనాదిగా మానవులకు మేలు చేస్తున్నాయి. పులియబెట్టిన ఆహార పదార్థాలను తింటే-

- జీర్ణక్రియ మెరుగ్గా సాగుతుంది.
- రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఇన్‌ఫ్లమేషన్ ముప్పు తగ్గుతుంది.
- నాడీ వ్యవస్థ మెరుగ్గా పనిచేస్తుంది.
- ఇన్సులిన్ పనితీరు మెరుగవుతుంది.

– సుమిత్ శర్మ, వైద్యుడు

బంగ్లా నుంచి దౌత్య సిబ్బంది కుటుంబాల ఉపసంహరణ

భారత్ నిర్ణయం

దిల్లీ: బంగ్లాదేశ్‌లో పనిచేస్తున్న తమ దౌత్య సిబ్బంది కుటుంబాలను వెనక్కి రప్పించుకోవాలని భారత్ నిర్ణయించింది. ఆ దేశంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. బంగ్లాదేశ్‌లో త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. 'బంగ్లాదేశ్‌లో భద్రతా పరంగా ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల్లో మా హైకమిషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది కుటుంబాలను స్వదేశానికి తిరిగి వచ్చేయాల్సిందిగా సూచించాం' అని అధికార వర్గాలు తెలిపాయి. అయితే హైకమిషన్‌తో పాటు బంగ్లాదేశ్‌లో ఉన్న ఇతర దౌత్య కార్యాలయాలన్నీ యథావిధిగా పనిచేస్తాయని ఆ వర్గాలు స్పష్టం చేశాయి.

భారత విమానాలపై పాక్ నిషేధం మరో నెల

ఇస్లామాబాద్: భారతీయ విమానాలు తమ గగనతలాన్ని వినియోగించడంపై విధించిన నిషేధాన్ని పాకిస్థాన్ మరో నెలరోజుల పాటు పొడిగించింది. ఈనెల 23తో ముగియాల్సిన నిషేధం తాజా నిర్ణయం నేపథ్యంలో ఫిబ్రవరి 24 వరకూ అమలులో ఉంటుంది. గత ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్- భారతీయ విమానాలు తమ ఆకాశ మార్గంలో పయనించడంపై నిషేధం విధించింది. భారత్ కూడా పాక్ విమానాలపై ఇదే తరహా నిషేధాన్ని అమలుచేసింది.

రూ.658 కోట్ల నకిలీ జీఎస్టీ ఐటీసీ కేసు

దిల్లీ: అరుణాచల్‌ప్రదేశ్‌లో రూ.658 కోట్ల నకిలీ జీఎస్టీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ) కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) పలు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. ఝార్ఖండ్, పశ్చిమబెంగాల్, మణిపుర్‌లలో ఈ కేసుతో సంబంధం ఉన్న వ్యక్తులు, పలు కంపెనీల కార్యాలయాల్లో సోదాలు నిర్వహించినట్లు ఈడీ వెల్లడించింది.

పేదల సంక్షేమాన్ని మోదీ నీరుగారుస్తున్నారు

- రాహుల్‌గాంధీ విమర్శ



రాయ్‌బరేలీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారాన్ని కేంద్రీకృతం చేసి పేదలకు అందాల్సిన సంక్షేమ భద్రతను నీరుగారుస్తున్నారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మంగళవారం విమర్శించారు. ఇందులో భాగంగానే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీ నరేగా)ను బలహీనపరిచారని ఆరోపించారు. తన సొంత నియోజకవర్గం రాయ్‌బరేలీలో కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. "మహాత్మాగాంధీ పేరుమీద ఏర్పాటు చేసిన ఎంజీ నరేగా పేరు మార్చి ప్రభుత్వం ఆ మహాత్ముణ్ని అవమానించింది. అట్టడుగు వర్గాలకు అందించే భద్రతను వారికి దూరం చేసింది. ప్రజాస్వామ్య మూలాలపై కేంద్ర ప్రభుత్వం దాడి చేసింది" అని రాహుల్ అన్నారు. ఎంజీ నరేగాను పరిరక్షించేందుకు కాంగ్రెస్ దేశవ్యాప్తంగా ఉద్యమం సాగిస్తోందని పేర్కొన్నారు. తాము పేద ఉపాధి కార్మికుల హక్కులు పరిరక్షించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఉపాధి హామీ పథకానికి కేటాయించాల్సిన నిధుల్ని అదానీ, అంబానీ వంటి పారిశ్రామికవేత్తలకు మళ్లించేందుకే ప్రధాని ఆ పథకాన్ని నీరుగారుస్తున్నారని తెలిపారు.

రాహుల్ చేతికి తాతగారి లైసెన్సు

ఇందిరాగాంధీ భర్త ఫిరోజ్‌గాంధీ దశాబ్దాల క్రితం పోగొట్టుకున్న డ్రైవింగ్ లైసెన్సు మంగళవారం ఆయన మనవడు రాహుల్‌గాంధీ చేతికి వచ్చింది. రాయ్‌బరేలీ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహక కమిటీ సభ్యుడు వికాస్ సింగ్ ఆ డ్రైవింగ్ లైసెన్సును రాహుల్‌కు అందజేశారు. రాహుల్ నియోజకవర్గ పర్యటనలో రెండో రోజు ఈ పరిణామం చోటుచేసుకుంది. "చాలా ఏళ్ల క్రితం రాయ్‌బరేలీలో జరిగిన ఒక కార్యక్రమంలో మా మామగారికి ఫిరోజ్‌గాంధీ లైసెన్సు దొరికింది. మా మామగారు పోయాక అత్తయ్య లైసెన్సును భద్రపరిచారు. ఈరోజు ఆయన మనవడికి వారి సొత్తును తిరిగి ఇవ్వడం నాకెంతో ఆనందంగా ఉంది" అని వికాస్ సింగ్ అన్నారు. లైసెన్సును అందుకోగానే రాహుల్ దాన్ని జాగ్రత్తగా పరిశీలించి తన తల్లితో పంచుకున్నారు. మరోవైపు రాహుల్ తన నియోజకవర్గం రాయ్‌బరేలీలో క్రికెట్ అకాడమీ స్థాపించాల్సిందిగా బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాను కోరారు.

టోల్ బకాయిలుంటే ఎన్‌వోసీ రాదు

- రెన్యువల్, ఎఫ్‌సీ జారీ కూడా నిలిపివేత

ఈనాడు, దిల్లీ: ఏదైనా టోల్‌గేట్ నుంచి వాహనం వెళ్లినప్పటికీ దాన్నుంచి రావాల్సిన సుంకం రాకపోతే ఆ బకాయిలు పూర్తిగా చెల్లించే వరకూ వివిధ రకాల సేవలను నిలిపివేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర మోటారు వాహనాల నిబంధనల్లో సవరణలు చేసినట్లు 'రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ' మంగళవారం ప్రకటించింది. జాతీయ రహదారుల్లో టోల్‌మొత్తాల ఎగవేతను నివారించడానికి ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు ఉన్న నిబంధనల్లో 'చెల్లించని వినియోగ రుసుం' (అన్‌పెయిడ్ యూజర్ ఫీ) అనేది కొత్తగా చేర్చామని తెలిపింది. ఎలక్ట్రానిక్ టోల్ వసూలు వ్యవస్థ ద్వారా వాహనం వెళ్లినట్లు రికార్డయినా, జాతీయ రహదారి చట్టం-1956లోని నిబంధనల ప్రకారం సంబంధిత ఫీజు జమకాకపోతే దాన్ని అన్‌పెయిడ్ యూజర్ ఫీ కింద పరిగణించనున్నట్లు పేర్కొంది. పూర్తి బకాయిలు చెల్లించేంతవరకూ ఇలాంటి వాహనాలను విక్రయించడానికి, మరో జిల్లా/ రాష్ట్రానికి తరలించడానికి అవసరమైన నిరభ్యంతర పత్రాన్ని (ఎన్‌వోసీ) జారీ చేయబోరని తెలిపింది. ఈ మేరకు ఫారం-28లో మార్పులు చేసినట్లు వెల్లడించింది. వాహన రెన్యువల్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) జారీకీ ఇదే నిబంధన వర్తింపజేయనున్నట్లు పేర్కొంది. వాణిజ్య వాహనాలు జాతీయ పర్మిట్ కోరేటప్పుడు ఇలాంటి బకాయిలేమీ లేకుండా చూసుకోవాలని సూచించింది.

'సర్' కసరత్తు చాలా భిన్నమైనది

- సుప్రీంకోర్టుకు తెలిపిన ఎన్నికల సంఘం

దిల్లీ: వివిధ రాష్ట్రాల్లో చేపట్టిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తు కోసం జారీ చేసిన ఉత్తర్వులకు శాసన స్వభావం ఉందని, నిర్దిష్ట నిబంధనలు మార్గదర్శనం చేస్తాయని సుప్రీంకోర్టుకు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ ఉత్తర్వులు అస్సాం మినహా దేశమంతటికీ వర్తిస్తాయని పేర్కొంది. సర్ కసరత్తును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీ ధర్మాసనం ముందు ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ మంగళవారం వాదనలు వినిపించారు. ఓటర్ల జాబితాల తయారీ, సవరణ, ఎన్నికల సన్నాహాలు, వాటి నిర్వహణకు ఎన్నికల సంఘాని(ఈసీ)కి చట్టబద్ధమైన అధికారం ఉందని తెలిపారు. దేశ పౌరులను మాత్రమే ఓటర్లుగా గుర్తించాల్సిన రాజ్యాంగ బాధ్యత ఈసీ భుజస్కంధాలపైనే ఉందంటూ ఆయా అధికరణలను ప్రస్తావించారు. దాదాపు 20ఏళ్ల తర్వాత 'సర్' కసరత్తు జరుగుతోందని, సాధారణ ఓటరు జాబితాల తనిఖీకి, ప్రత్యేక సమగ్ర సవరణకు చాలా వ్యత్యాసం ఉందని వివరించారు. సాధారణ సవరణకు ఓటర్ల స్వీయ ధ్రువీకరణ సరిపోతుందని, సర్ కసరత్తులో సంబంధిత పత్రాలను సమర్పించాలని, గత ఓటరు జాబితాల్లో ఉన్న తల్లిదండ్రులతో అనుసంధానత కూడా సరిపోలాలన్నారు. విచారణ బుధవారం కొనసాగనుంది.

పశువులు పెంచేది పాడి కోసం కాదు

- అధ్యయన నివేదిక వెల్లడి



దిల్లీ: దేశంలోని పశుపోషకుల్లో మూడో వంతు మందికి పైగా పాడి కోసం పశువులు పెంచడం లేదని ఒక అధ్యయనంలో వెల్లడైంది. తమ కుటుంబానికి పోషకాహారం అందించడం, పేడ, బరువులు లాగడం, వ్యవసాయం వంటి అవసరాల కోసమే వారు పశువులు పెంచుతున్నారని మంగళవారం విడుదలైన అధ్యయన నివేదిక స్పష్టం చేసింది. దేశంలో పశుగణాభివృద్ధి ప్రధాన లక్ష్యం పాడి అమ్మకాలేనన్న భావనను ఈ నివేదిక పటాపంచలు చేసిందని అధ్యయనం నిర్వహించిన కౌన్సిల్ ఆన్ ఎనర్జీ ఎన్విరాన్‌మెంట్ అండ్ వాటర్ సంస్థ పేర్కొంది. దేశంలోని పశుసంపదలో 91 శాతం కేంద్రీకృతమైవున్న 15 రాష్ట్రాల్లో పశువులు పెంచుకుంటున్న 7,350 కుటుంబాలపై ఈ అధ్యయనం జరిపారు. పశు పాలక కుటుంబాల్లో 38 శాతం తాము పాలు అమ్ముకునేందుకు పశువులు పెంచడం లేదని పేర్కొన్నాయి. అనేక కుటుంబాలు పశువుల మందల్ని పెంచడం కోసమే వాటిని పెంచుకుంటున్నాయి, అని అధ్యయన నివేదిక పేర్కొంది. దాణా చవకైన ధరకు పొందలేకపోతున్నామని మూడో వంతు మంది పేర్కొన్నారు. దాదాపు 80 శాతం మంది పశుపోషకులకు ప్రభుత్వం వారి సంక్షేమం కోసం చేపట్టిన పథకాల గురించి ఏమీ తెలీదు. ప్రపంచంలో అత్యధిక పాలు ఉత్పత్తి చేస్తున్న, పాడి వినియోగిస్తున్న దేశంగా భారత్ పశువుల సంఖ్యలోనూ ప్రపంచంలోనే అగ్రభాగాన నిలిచింది. దేశంలో 30 కోట్లకు పైగా పశుసంతతి ఉన్నట్లు అంచనా.

ఇక సీట్ల వద్దే ఎంపీల హాజరు

- లోక్‌సభలో కొత్త వ్యవస్థ
- స్పీకర్ ఓం బిర్లా వెల్లడి



లఖ్‌నవూ: లోక్‌సభ సభ్యుల కోసం కొత్త హాజరు వ్యవస్థను తీసుకొచ్చినట్లు స్పీకర్ ఓం బిర్లా వెల్లడించారు. మునుపటిలా లాబీలో కాకుండా ఇకపై ఎంపీలు తమకు ఏర్పాటు చేసిన సీట్ల వద్దే హాజరును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నుంచి ఈ కొత్త వ్యవస్థను ప్రవేశపెడుతున్నామని మంగళవారం ఉత్తర్‌ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో జరిగిన 86వ అఖిల భారత ప్రిసైడింగ్ అధికారుల సదస్సులో స్పీకర్ వెల్లడించారు. హాజరు నమోదు చేయడానికి ఎంపీలు క్యూలో నిలబడుతుండటంతో చాలాసార్లు లాబీ రద్దీగా ఉంటోందని, మరికొన్ని సందర్భాల్లో ఎంపీలు సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా కేవలం హాజరు నమోదు చేసి వెళ్లిపోతున్నట్లు గుర్తించామని ఆయన వివరించారు. ఇందుకోసమే కొత్త వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. బడ్జెట్ సమావేశాల నుంచి ఎంపీలు తమ సీట్ల వద్ద ఏర్పాటు చేసిన మల్టీ మీడియా పరికరాన్ని ఉపయోగించి స్మార్ట్ ఐడీ కార్డు, బయోమెట్రిక్ లేదా వ్యక్తిగత గుర్తింపు సంఖ్యతో హాజరును నమోదు చేసుకోవచ్చని స్పీకర్ వెల్లడించారు.




ఐరాస సదుపాయాలపై ఇజ్రాయెల్ దాడులు

జెరూసలెం: పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్య సమితి(ఐరాస) ఏర్పాటు చేసిన రెండు సదుపాయాలపై ఇజ్రాయెల్ మంగళవారం దాడి చేసింది. తూర్పు జెరూసలెంలో ఐక్యరాజ్యసమితి పాలస్తీనా యువకుల కోసం నిర్వహిస్తున్న వృత్తి విద్యా పాఠశాలపై బలగాలు బాష్పవాయువు ప్రయోగించాయి. ఈ బలగాలు షేక్‌జర్రా ప్రాంతంలో ఉన్న ఐరాస పునరావాస పనుల సంస్థ (యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏ) ప్రధాన కార్యాలయ భవనాన్ని కూల్చివేశాయి. ఖలందియా ప్రాంతంలో పాలస్తీనీయుల కోసం ఐరాస నిర్వహిస్తున్న వృత్తివిద్యా పాఠశాలపై ఇజ్రాయెల్ బలగాలు దాడికి పాల్పడ్డాయని ఐరాస సంస్థ వెస్ట్‌బ్యాంక్ డైరెక్టర్ రోలాండ్ ఫ్రెడరిక్ వెల్లడించారు. ఈ పాఠశాలలో 300 మంది యువకులు వెల్డింగ్, తదితర సాంకేతిక పరిజ్ఞానంలో శిక్షణ పొందుతున్నారు.

సిరియా అంతర్యుద్ధానికి విరామం

డమాస్కస్: సిరియాలో సాగుతున్న అంతర్యుద్ధానికి విరామం లభించింది. కుర్దు బలగాలతో తాము సాగిస్తున్న పోరాటంలో నాలుగు రోజుల పాటు కాల్పులు విరమిస్తున్నట్లు సిరియా సైన్యం ప్రకటించింది. కుర్దు జాతీయుల నేతృత్వంలోని సిరియన్ డెమోక్రటిక్ ఫోర్స్ (ఎస్‌డీఎఫ్) బలగాలు దీనిపై తమ స్పందనను వెల్లడించాల్సి వుంది. గడచిన రెండు వారాలుగా ఇరు పక్షాల మధ్య తీవ్ర యుద్ధం సాగుతోంది.



రాజస్థాన్ రాజధాని జైపుర్‌లో అంధుల కోసం బ్రెయిలీ లిపిలో 'బ్రెయిలీ సమాచార పత్ర' పత్రికను ఇటీవల ప్రారంభించారు. దానిని చదువుతున్న ఆ పత్రిక సంపాదకులు చంద్రప్రకాశ్ శ్రీవాస్తవను ఈ చిత్రంలో చూడొచ్చు

ముగిసిన మండల- మకరవిలక్కు పూజలు

- శబరిమల ఆలయం మూసివేత



ఆలయం నుంచి తిరువాభరణాలతో ఊరేగింపుగా బయలుదేరిన పూజారులు

కొచ్చిన్: కేరళలోని శబరిమల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు నెలలకు పైగా కొనసాగిన మండల- మకరవిలక్కు తీర్థయాత్ర సీజన్ మంగళవారం ఉదయం ముగిసింది. ఉదయం 6.45 గంటలకు ఆలయ ద్వారాలను అధికారికంగా మూసివేసినట్లు ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధికారులు ప్రకటించారు. పందలం రాజ కుటుంబ ప్రతినిధి పునర్తం నాళ్ నారాయణ వర్మ అయ్యప్ప దర్శనం పూర్తిచేసుకున్న అనంతరం ఆలయాన్ని మూసివేయడం సంప్రదాయంగా జరుగుతోంది. సంప్రదాయ ప్రకారం ఆలయ తాళపు చెవులను పందలం రాజకుటుంబ ప్రతినిధికి అప్పగించారు. నెలవారీ పూజల ఖర్చుల కోసం ఉంచే డబ్బుల సంచిని కూడా అప్పగించినట్లు టీడీబీ అధికారులు వెల్లడించారు.

మళ్లీ ఎప్పుడు తెరుస్తారంటే?

ఫిబ్రవరి 2026లో జరిగే నెలవారీ పూజల కోసం ఆలయాన్ని మళ్లీ తెరవనున్నారు. టీడీబీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం, కుంభం మాసపు నెలవారీ పూజలు ఫిబ్రవరి 12 సాయంత్రం 5 గంటలకు ప్రారంభమై, ఫిబ్రవరి 17 రాత్రి 10 గంటలకు ముగుస్తాయి. ఈ సమయంలో కూడా భక్తులు స్వామిని దర్శించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. దర్శన టోకెన్లు, ఆన్‌లైన్ బుకింగ్, భద్రతా ఏర్పాట్లు గతంలో మాదిరిగానే కొనసాగుతాయని చెప్పారు.

పట్నా హైకోర్టులో ఒకేరోజు 510 కేసుల 'రికార్డు' విచారణ



ఈటీవీ భారత్: బిహార్‌లోని పట్నా హైకోర్టులో సోమవారం జస్టిస్ రుద్రప్రకాష్ మిశ్ర ఏకసభ్య ధర్మాసనం రాష్ట్ర మద్య నిషేధ చట్టం కింద రికార్డు స్థాయిలో 510 కేసులను విచారించింది. గతంలో అత్యధికంగా 500 లోపు కేసులను మాత్రమే విచారించినట్లు రికార్డుల్లో ఉంది. 510 కేసుల్లో 475 తక్షణ పరిష్కారాలకు నోచుకోగా, న్యాయవాదులు హాజరుకాని మిగతా కేసులను వాయిదా వేశారు. ఈ చట్టం కింద 90 శాతం కంటే ఎక్కువమంది దరఖాస్తుదారులకు బెయిలు లభించటం విశేషం.

తిలకం పెట్టుకున్నందుకు వివక్ష

- లండన్ స్కూల్‌లో 8 ఏళ్ల విద్యార్థికి తలెత్తిన సమస్య



ఇంటర్నెట్‌డెస్క్: బ్రిటన్ రాజధాని లండన్‌లోని ఓ పాఠశాలలో తిలకం పెట్టుకున్న కారణంగా ఎనిమిదేళ్ల విద్యార్థికి వివక్ష ఎదురైంది. చివరకు ఆ చిన్నారి పాఠశాల మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై స్థానికంగా తీవ్ర విమర్శలొచ్చాయి. బ్రిటన్‌లోని హిందువులు, భారతీయులకు ప్రాతినిధ్యం వహించే ఇన్‌సైట్ యూకే సంస్థ వివరాల ప్రకారం.. లండన్‌లోని ఓ పాఠశాలలో చదువుతున్న ఎనిమిదేళ్ల హిందూ విద్యార్థి తన సంప్రదాయాలకు అనుగుణంగా తిలకం ధరించి పాఠశాలకు వెళ్లడంతో యాజమాన్యం అభ్యంతరం వ్యక్తంచేసింది. అతడి మతపరమైన ఆచారాల గురించి పాఠశాల సిబ్బంది ఆరా తీసేవారు. పిల్లలు ఆడుకునే సమయంలో హెడ్‌టీచర్ ఆ విద్యార్థిపై ప్రత్యేకంగా దృష్టిసారించేవారు. దాంతో భయపడిపోయిన ఆ విద్యార్థి ఇతరులతో ఆడుకోవడానికి ఇబ్బందిపడినట్లు యూకే సంస్థ వెల్లడించింది. విద్యార్థి తల్లిదండ్రులు తమ మత విశ్వాసాల గురించి పాఠశాల యాజమాన్యానికి వివరించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయిందని తెలిపింది. ఏ విద్యార్థి తన మత విశ్వాసాల వల్ల ఒంటరితనాన్ని ఎదుర్కోవడం తగదని పేర్కొంది. ఇది రుజువైతే అక్కడి చట్టాల ప్రకారం మత వివక్షగా పరిగణిస్తారని, ఈ వివక్షాపూరిత చర్యల కారణంగా ఇప్పటివరకు ఈ స్కూల్ నుంచి నలుగురు విద్యార్థులు వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తంచేసింది.

'సర్' విచారణకు హాజరైన క్రికెటర్ మహమ్మద్ షమీ



కోల్‌కతా: ఓటరు నమోదు పత్రంలోని వివరాల్లో వ్యత్యాసం కారణంగా ఎన్నికల సంఘం నుంచి నోటీసు అందుకున్న టీమ్ ఇండియా స్టార్ పేసర్ మహమ్మద్ షమీ మంగళవారం అధికారుల ఎదుట హాజరయ్యారు. దక్షిణ కోల్‌కతాలోని విక్రమ్‌గఢ్ ప్రాంతానికి చెందిన ఓ పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో. ఎన్నికల సంఘం అధికారులకు సంబంధిత పత్రాలను అందజేసినట్లు షమీ వెల్లడించారు. గత 25 ఏళ్లుగా కోల్‌కతాలో ఉంటున్నానని తెలిపారు. అధికారులు తననేమీ ఇబ్బంది పెట్టలేదని, వాళ్లు మళ్లీ పిలిచినా వస్తానని చెప్పారు. ప్రతిఒక్క పౌరుడూ ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సహకరించాలని, ఇది అందరి బాధ్యత అని షమీ పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఈ క్రికెటర్ చాలా ఏళ్లుగా కోల్‌కతాలో నివసిస్తున్నారు. స్థానిక 93వ వార్డులో ఓటరుగా పేరు నమోదైంది.



రాష్ట్రపతి భవన్ ఆహ్వానపత్రం చూపుతున్న యశ్‌పాల్

3 రోజులు రాష్ట్రపతి భవన్ అతిథిగా హరియాణా రైతు

ఈటీవీ భారత్: హరియాణాలోని రేవాడీ జిల్లా కన్వాలీ గ్రామ రైతు యశ్‌పాల్ ఖోలా మూడు రోజులపాటు ప్రత్యేక అతిథిగా రాష్ట్రపతి భవన్‌కు వెళ్లనున్నారు. 77వ గణతంత్ర వేడుకలకు ఈయన హాజరవుతారు. ప్రకృతి సాగులో అద్భుతాలు సాధించిన యశ్‌పాల్‌ను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సత్కరించనున్నారు. ఈయన తండ్రి 2016లో క్యాన్సర్‌తో మరణించారు. ఈ ఉదంతంతో తీవ్రంగా కలత చెందిన యశ్‌పాల్ ఆనాటి నుంచీ రసాయన ఎరువులకు పూర్తిగా స్వస్తి చెప్పారు. చుట్టుపక్కల రైతులు కూడా ప్రకృతి సాగు వైపు మళ్లేలా వారిలో చైతన్యం నింపుతున్నారు. దేశవ్యాప్తంగా యశ్‌పాల్‌లా ఇతర రైతులకు ఆదర్శంగా ఉన్న మరో అయిదుగురికి రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానాలు అందాయి.

(c) eenadu

శ్రీనివాసుడి సన్నిధే పరిణయ వేదిక

- తిరుమలలో పదేళ్లలో ఒక్కటైన 26,777 జంటలు
- వివాహానంతరం స్వామివారి దర్శనం, రిజిస్ట్రేషన్


తిరుమల కల్యాణ వేదికలో వివాహం చేసుకుంటున్న జంటలు

తిరుమల, న్యూస్‌టుడే: నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా భాసిల్లే తిరుమల శ్రీనివాసుడి సన్నిధిలో వివాహం చేసుకోవాలన్న కుతూహలంతో ఎందరో వధూవరులు ఇక్కడ పెళ్లిపీటలపైకి ఎక్కుతున్నారు. పాపవినాశనం రోడ్డులోని కల్యాణ వేదిక వద్ద తితిదే గత పదేళ్లుగా సామూహిక పెళ్లిళ్లకు ఏర్పాట్లు చేస్తోంది. సీజన్‌ను బట్టి ఇక్కడ డిమాండ్ ఉంటోంది. 2016 ఏప్రిల్ నుంచి గతేడాది డిసెంబర్ వరకు 26,777 జంటలు ఈ వేదికగా ఒక్కటయ్యాయి. ఇక్కడ వివాహం చేసుకునే వధూవరులకు తితిదే స్వామివారి దర్శన భాగ్యాన్ని సులువుగా కల్పిస్తోంది. నూతన దంపతులు, తల్లిదండ్రులతో కలిపి మొత్తం ఆరుగురికి ఏటీసీ వద్దనున్న క్యూలైన్ మీదుగా ప్రత్యేక ప్రవేశ దర్శన మార్గం (రూ.300)లో ఉచితంగా అనుమతిస్తుంది. దర్శనానంతరం వివాహ రిసిప్ట్‌లో పేర్కొన్నవారి సంఖ్యను బట్టి ఉచితంగా లడ్డూలు ఇస్తుంది. వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసింది. ఇందుకోసం వధూవరులు తమ వయసు ధ్రువపత్రాలు, నివాస వివరాలు, వివాహ ఫొటో, పెళ్లి పత్రిక, కల్యాణ మండపం రసీదుతో పాటు అన్‌మ్యారీడ్ సర్టిఫికెట్ సమర్పించాలి. తిరుమలలో వివాహం చేసుకునేందుకు హిందువులై ఉండాలి. వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు నిండి ఉండాలి. రెండో పెళ్లి, పెద్దల సమ్మతి లేని వివాహాలను అనుమతించరు. వివాహానికి వధూవరుల తల్లిదండ్రులు రాలేని పక్షంలో తగిన కారణాలతో లేఖలు సమర్పించాలి. తల్లిదండ్రులు లేనివారు సంబంధిత సమ్మతి పత్రం అందివ్వాలి.

దరఖాస్తు సమర్పణ, నిబంధనలు ఇలా..

◆ వివాహానికి ముందుగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లోని కల్యాణ వేదిక కాలమ్‌లో వధూవరులు, వారి తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ తదితర వివరాలు, వివాహ తేదీ, సమయం అప్‌లోడ్ చేయాలి.

◆ ఎక్నాలెడ్జ్‌మెంట్ పత్రంతో పాటు వధూవరులు సంబంధిత తహసీల్దార్ నుంచి జారీ చేసిన అవివాహ (అన్‌మ్యారీడ్) అని ధ్రువపత్రం తీసుకుని ముహూర్తానికి ఆరు గంటల ముందు కల్యాణ వేదిక వద్దనున్న కార్యాలయంలో సంప్రదించాలి.

◆ ఆధార్ కార్డులు, వయసు ధ్రువపత్రం, ఇతర జిరాక్స్ పత్రాలు అక్కడి సిబ్బందికి ఇచ్చి ప్రవేశపత్రం పొందాలి. అవకాశాన్ని బట్టి రూ.50 గదిని సీఆర్వో ఎస్టేట్ కార్యాలయం వద్ద పొందవచ్చు.

◆ మేళతాళాలు, అర్చకులను తితిదే సమకూర్చి సామూహిక వేదిక నిర్వహిస్తుంది. ఇతర సామగ్రిని వధూవరులు తెచ్చుకోవాలి.

◆ వివరాలకు ఫోన్ నంబర్ 0877-2263433పై సంప్రదించవచ్చు.

ధర్మానికి చిరునామాగా వాసవీ పెనుగొండ క్షేత్రం

వాసవీ మాతకు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి నిమ్మల


విశేష అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు దంపతులు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

ఈనాడు డిజిటల్, భీమవరం; న్యూస్‌టుడే, వాసవీ పెనుగొండ: ధర్మం, అహింసాగుణానికి ప్రతీకగా నిలిచిన వాసవీ మాత జీవితం అందరికీ ఆదర్శం అని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ధర్మానికి చిరునామాగా పెనుగొండ క్షేత్రం నిలుస్తుందన్నారు. వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని వాసవీ పెనుగొండ శ్రీ నగరేశ్వరస్వామి, మహిషాసురమర్దని, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలోని అమ్మవారికి నిమ్మల దంపతులు, స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మంగళవారం ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. నిమ్మల మాట్లాడుతూ అన్యాయం ఎదుట తలవంచని ధైర్యమే అమ్మవారి పరమ లక్షణమని, ఇది సమాజానికి శాశ్వత సందేశమన్నారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యుల అభివృద్ధికి కట్టుబడి ఉందని, పెనుగొండ పేరును వాసవీ పెనుగొండగా మార్చిందని గుర్తుచేశారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్టు ఆధ్వర్యంలో నెలకొల్పిన వాసవీ శాంతిధామ్‌ను దర్శించారు. ఉదయం భక్తులు 102 కలశాలతో వాసవీ కన్యకాపరమేశ్వరి నామస్మరణ చేస్తూ ఆలయానికి చేరారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ పాల్గొన్నారు.

వారెవ్వా.. వారావ!



పదునైన ముళ్లతో ఆసక్తిగొలిపే రూపంతో ఉన్న ఈ చేపను మత్స్యకారులు వారావ అని పిలుస్తారు. మంగళవారం విశాఖలోని యకశీరంద బీచ్‌లో వేటకు వెళ్లిన వారి వలకు ఈ చేప చిక్కింది. సముద్రంలోపల మనుగడ సాగించే ఈ జీవి అరుదుగా వలలో పడుతుందని మత్స్యకారులు తెలిపారు. దీని ముళ్లు గుచ్చుకుంటే తీవ్ర నొప్పితో బాధపడతారని, వైద్యం తప్పనిసరని వివరించారు. రుచి అంతంతమాత్రమే కావడంతో ఎవరూ కొనుగోలు చేయరన్నారు.
- న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

గ్యాప్ 2 ప్రధాన డ్యాం ఆకృతులపై విదేశీ నిపుణుల చర్చలు

- పోలవరం ప్రాజెక్ట్ గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులనూ పర్యవేక్షించిన బృందం


గ్యాప్-1 డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో మట్టి సాంద్రతను పరిశీలిస్తున్న విదేశీ నిపుణులు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టులో గ్యాప్ 2 ప్రధాన డ్యాం పనులపై విదేశీ నిపుణుల బృందం మంగళవారం సమగ్రంగా చర్చించింది. ఈ ప్రాజెక్టులో గ్యాప్ 2 ప్రధాన డ్యాం నిర్మించాల్సిన చోట ఇసుకతో నిండిన ప్రాంతం, బంకమట్టితో నిండిన ప్రదేశాలు డయాఫ్రం వాల్‌కు అటూ ఇటూ ఉన్నాయి. ఇసుక నిండి ఉన్న ప్రాంతంలో ఇప్పటివరకూ 23.32 మీటర్ల వరకు ప్రధాన డ్యాం నిర్మించుకునేందుకు అవసరమైన ఆకృతులను కేంద్ర జల సంఘం ఆమోదం లభించింది. అక్కడ పనులు జరుగుతున్నాయి. ఇసుక నిండిన ప్రాంతంలో 45.72 మీటర్ల ఎత్తు వరకు, బంకమట్టి ఉన్న ప్రాంతంలో దిగువ నుంచి పై వరకు కూడా ప్రధాన డ్యాం నిర్మాణానికి అవసరమైన ఆకృతులు ఖరారు కావాల్సి ఉంది. పోలవరంలో ఆఫ్రి అంతర్జాతీయ డిజైన్ల సంస్థ ఈ సందర్భంగా ప్రజంటేషన్ ఇచ్చింది. ఎలాంటి ఆకృతులు అవసరం? అక్కడి భౌతిక పరీక్షల ఫలితాలు ఎలా వచ్చాయి? అందుకు అనుగుణంగా ఎలాంటి ఆకృతులతో ముందుకు సాగనున్నారన్నది ఈ ప్రజంటేషన్‌లో వివరించారు. విదేశీ నిపుణులు హించ్‌బెర్గర్, డేవిడ్ బి పాల్, ఫ్రాంకో డి సిస్కోలు వీటిపై చర్చలు జరిపారు. మధ్యలో అనేక సందేహాలు లేవనెత్తారు. ఒక్కో అంశంపై సమీక్షించారు. ప్రాథమికంగా అంగీకరించినా విదేశీ నిపుణులు వారి అభిప్రాయాన్ని తరువాత తెలియజేస్తారు.

గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులను మళ్లీ పరిశీలన..

విదేశీ నిపుణుల బృందం మంగళవారం మధ్యాహ్నం నుంచి గ్యాప్ 1 ప్రధాన డ్యాం పనులను పర్యవేక్షించింది. 'మీరు నిర్మాణం చేస్తుండగా ఆ పనులను పర్యవేక్షిస్తాం' అని వారు సోమవారం చెప్పడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. గ్యాప్ 1 ప్రధాన డ్యాంలో 20 మీటర్ల మేర ఒక లేయర్ నిర్మాణం చేపట్టారు. అక్కడ రోలింగ్ చేయించారు. పని చేసిన చోట కొంత మేర తవ్వించి ఆ లేయర్లు ఎలా ఉన్నాయి..పని ఎలా ఉందన్నది పరిశీలించారు. ఈ సందర్భంగా కూడా ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బుధవారం ఉదయం నాటికి మరో రెండు లేయర్ల నిర్మాణం పూర్తి చేయాలని, మళ్లీ తాము వచ్చి పరిశీలిస్తామని విదేశీ నిపుణులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ కార్యదర్శి రఘురామ్, జలవనరులశాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఇంజినీర్ ఇన్ చీఫ్ నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ రామచంద్రరావు, కేంద్ర జలసంఘం డిజైన్ల సీఈ సరబ్‌జిత్‌సింగ్ భక్షి, డైరెక్టర్ మనీష్ రాథోడ్, సీఎస్ఎంఆర్ఎస్ సంస్థ నుంచి మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి రామారావు, పోలవరం అథారిటీ డైరెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

రాజధానిలో ఎన్టీఆర్ విగ్రహం ప్రతిపాదనపై వైకాపా దుష్ప్రచారం

- కులాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తోందని ప్రభుత్వం ఆగ్రహం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు విషయంలో వైకాపా దుష్ప్రచారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. వైకాపా సోషల్ మీడియా టీం నకిలీ ఐడీలతో దుష్ప్రచారం చేస్తూ కులాల మధ్య చిచ్చుపెడుతోందని ప్రభుత్వం మండిపడుతోంది. గుజరాత్ ప్రైడ్ పేరుతో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్టే... తెలుగు ప్రైడ్ పేరుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. నిధుల సమీకరణపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, పీపీపీ విధానంలో విగ్రహం ఏర్పాటు, పార్క్ అభివృద్ధి ప్రతిపాదన పరిశీలనలో ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విగ్రహం ఏర్పాటులో అందర్నీ భాగస్వాముల్ని చేసేలా సమాలోచనలు జరుగుతున్నాయని వెల్లడించాయి. విగ్రహం ఏర్పాటు చేయాలని నీరుకొండ గ్రామస్థులూ కోరారని, అందుకే ఆ ప్రాంతాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నాయి. వాస్తవాల్ని మరుగున పెట్టి, నిత్యం కులాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరిస్తున్న వైకాపా తీరును తీవ్రంగా ఎండగట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగకుండానే ప్రాజెక్టు మధ్యలో వైఎస్ విగ్రహం పెట్టేందుకు గత వైకాపా ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని కూటమి నేతలు గుర్తుచేస్తున్నారు.

దత్తత గ్రామంలో సీఎస్ విజయానంద్ పర్యటన


ఎస్.ఉప్పలపాడులో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీఎస్ విజయానంద్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు మండలంలో పదేళ్ల కిందట దత్తత తీసుకున్న ఎస్.ఉప్పలపాడు గ్రామాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సందర్శించారు. దత్తతలో భాగస్వామి అయిన ప్యూజీ సంస్థ సీఈవో రామమనోహర్‌రెడ్డితో కలసి మంగళవారం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ.1.61 కోట్లతో నిర్మించిన కమ్యూనిటీ భవనం, డైనింగ్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. అలాగే గ్రామంలో రూ.2.45 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో ఏడు సీసీ రోడ్లు, ఒక బీఎం రోడ్డు, పంచాయతీ ఇంజినీరింగ్‌శాఖ రూ.2.78 కోట్లతో చేపట్టిన 11 సీసీ రోడ్లు, ఒక బీటీ రోడ్డు, ఆర్‌అండ్‌బీ శాఖ రూ.4.90 కోట్లతో నిర్మించిన రహదారులు, దేవాదాయశాఖ రూ.55 లక్షలతో చేపట్టిన శ్రీ గంగమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడారు. కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు భూపేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నారంటారు.. ఫోన్లు చేసి దోచుకుంటారు!

ఇదో నయా మోసం

ఈనాడు, కాకినాడ: ఇప్పటికే ఖాతాల్లోకి చొరబడి మరీ దోచుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు.. మానవీయ సాయం పేరుతో మభ్యపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు కొత్తరకం మోసగాళ్లు. 'మీ ప్రాంత మహిళలేనండి.. ఒడిశాలో చిక్కుకున్నారు. ప్రయాణంలో వారి బ్యాగులన్నింటినీ దొంగలు ఎత్తుకుపోయారు. వారి దగ్గర నయాపైసా లేదు. మూడు రోజులుగా భువనేశ్వర్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై ఉంటున్నారు. నేను ఒక పత్రికా విలేకరిని. ఒకరిద్దరికి భోజనాలు పెట్టించాను. అందరికీ ఆహారం ఇచ్చి వారి స్వగ్రామాలకు పంపించాలంటే నా దగ్గర డబ్బులు లేవు. మీరే మీ ప్రాంతంలోని అధికారులు, నాయకులకు చెప్పి ఆర్థికసాయం అందేలా చూడండి' అంటూ కొంతమందికి మోసగాళ్లు ఫోన్లు చేస్తున్నారు. వారి మాటలు నమ్మి.. 'అయ్యో పాపం మా జిల్లా వారే అంటున్నారు.. రైలు టికెట్లు, భోజనాలకే కదా.. మేం సాయం చేస్తాములే' అని చెప్పి అవతలి వ్యక్తి పంపిన స్కానర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బులు బదిలీ చేస్తున్నారు కొందరు. తర్వాత ఆరా తీస్తే వారు చెప్పిన పేర్లు నిజమేగానీ వారెవరూ భువనేశ్వర్ వెళ్లిందీ లేదు.. అక్కడ చిక్కుకున్నదీ లేదని తేలింది. ఇదో కొత్తరకం మోసమని తెలుసుకుని ముక్కున వేలేసుకుంటున్నారు. వైఎస్సార్ కడప, కర్నూలు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కాకినాడ జిల్లాల్లో కొంతమంది జిల్లా అధికారులు, విలేకర్లకు కొందరు ఆగంతకులు తాజాగా ఈ తరహా ఫోన్లు చేసి సాయం పేరుతో మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. ఒకరిద్దరు డబ్బులు పంపినా మిగతావారు జాగ్రత్తపడ్డారు.

మీపైనా నిఘా ఉంచారు తెలుసా?!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును ప్రశ్నించిన సిట్ అధికారులు
- దాదాపు ఏడున్నర గంటలపాటు కొనసాగిన విచారణ


సిట్ విచారణకు జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో తెలంగాణ మాజీ మంత్రి హరీశ్‌రావును ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) ఏడున్నర గంటలపాటు సుదీర్ఘంగా విచారించింది. పలు ప్రశ్నలకు ఆయన 'గుర్తు లేదు... తెలియదు... నేను నమ్మను' లాంటి సమాధానాలు ఇచ్చినట్లు తెలిసింది. ఈ కేసులో విచారణకు రావాలంటూ సిట్ నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో హరీశ్‌రావు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లోని సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. తొలుత తనను కేసులో ఇరికించే ప్రయత్నం చేయొద్దని... అవసరమైతే కోర్టుకు వెళ్తానని హరీశ్‌రావు సిట్‌లోని ముగ్గురు అధికారులను ఉద్దేశించిన అన్నట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు... '2018 శాసనసభ ఎన్నికల అనంతరం మీతోపాటు అప్పటి భారాస మరో సీనియర్ నేత ఫోన్లపై ఏడాదిపాటు నిఘా ఉంచిన విషయం తెలుసా' అని సిట్ అధికారులు ప్రశ్నించారు. దీనికి 'నేను నమ్మను' అని హరీశ్‌రావు చెప్పినట్లు తెలిసింది. అందుకు సంబంధించి కొన్ని ఆధారాలను అధికారులు ఆయన ముందుంచగా అవి నకిలీవి అయి ఉంటాయని అన్నట్లు సమాచారం. ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు నిందితులు ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులతో శ్రవణ్‌రావుకు మధ్య జరిగిన సంభాషణలు, లావాదేవీల గురించి సిట్ అధికారులు ప్రశ్నలడిగారు. ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావులకు శ్రవణ్‌రావును ఎందుకు పరిచయం చేయించాల్సి వచ్చిందనే కోణంలో ప్రశ్నించారు. శ్రవణ్‌రావు 2023 అక్టోబరులో తన మీడియా సంస్థతో చేయించిన సర్వేలో భారాసకు 40 సీట్లు దాటడం లేదని... నిఘా విభాగం సర్వేలో మాత్రం మరోసారి అధికారంలోకి వస్తుందని ఉండటంతో ఆ అంశంపై చర్చించేందుకే వారి మధ్య సమావేశం ఏర్పాటు చేయించానని హరీశ్‌రావు చెప్పినట్లు తెలిసింది. 'అందుకు సంబంధించి జిల్లాల్లో ప్రత్యర్థి పార్టీల నేతలపై నిఘా ఉంచాలని మీరు ఆదేశించలేదా' అని అధికారులు ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని చెప్పినట్లు సమాచారం. అయితే 2023 నవంబరు 30న శాసనసభ ఎన్నికలు జరగగా.. దానికి ముందురోజు వరకు శ్రవణ్‌రావు ఇచ్చిన ఫోన్ నంబర్లను ప్రభాకర్‌రావు, ప్రణీత్‌రావు ట్యాప్ చేయించడానికి కారణమేంటని అడగగా హరీశ్‌రావు సరైన సమాధానాలు ఇవ్వలేదని తెలిసింది. హరీశ్‌రావు విచారణ సుమారు ఏడున్నర గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఈ కేసులో హరీశ్‌రావును త్వరలో మరోసారి విచారణకు పిలవాలని సిట్ నిర్ణయించింది.

వేధిస్తున్నాడని.. భర్త మెడకు చున్నీ బిగించి హత్య

- మంచం కోడు తగిలి చనిపోయాడని నమ్మించే యత్నం
- శవపరీక్ష నివేదికలో వెలుగుచూసిన భార్య నిర్వాకం


సుధీర్‌రెడ్డి


బ్రహ్మ జ్ఞానప్రసన్న

హైదరాబాద్, న్యూస్‌టుడే: నిత్యం తనను వేధిస్తున్నాడని భర్త మెడకు చున్నీ బిగించి హత్య చేసిందో ఇల్లాలు. తాగిన మైకంలో మంచం కోడు తగిలి చనిపోయాడని నమ్మించింది. అయితే పోస్టుమార్టం నివేదిక ఆమె దురాగతాన్ని బయటపెట్టింది. హైదరాబాద్ కూకట్‌పల్లి ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. కూకట్‌పల్లి సీఐ కె.వెంకట సుబ్బారావు తెలిపిన వివరాలు.. ఏపీలోని ఏలూరు జిల్లా నూజివీడు సమీపంలోని తూర్పు దిగవల్లి గ్రామానికి చెందిన జగ్గవరపు సుధీర్‌రెడ్డి(44)కి అదే ప్రాంతానికి చెందిన బ్రహ్మ జ్ఞానప్రసన్నతో వివాహమైంది. కొన్నాళ్లుగా వారు హైదరాబాద్ కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో నివాసముంటున్నారు. ప్రైవేట్ సంస్థలో మార్కెటింగ్ మేనేజర్‌గా సుధీర్‌రెడ్డి పనిచేస్తుండగా భార్య ఇంట్లోనే ఉంటున్నారు. వీరిద్దరికీ ఒకరిపై ఒకరికి అనుమానం ఉండేది. దీంతో రోజూ గొడవలు జరుగుతుండేవి. ఈనేపథ్యంలో డిసెంబరు 23న రాత్రి తాగిన మైకంలో తన భర్త మంచం కోడుకు తగిలి ప్రాణాలు కోల్పోయినట్లు భార్య జ్ఞానప్రసన్న తన బంధువులు, ఇరుగు పొరుగువారిని నమ్మించింది. మృతుడి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల వచ్చిన పోస్టుమార్టం నివేదికలో సుధీర్‌రెడ్డి హత్యకు గురైనట్లు నిర్ధారణ అయింది. దీంతో పోలీసులు ప్రసన్నను అదుపులోకి తీసుకుని విచారించారు. రోజూ తాగొచ్చి వేధిస్తున్నందున.. తనభర్త గొంతుకు చున్నీ బిగించి హత్య చేసినట్లు అంగీకరించింది. నిందితురాలిని మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు తెలిపారు.

22 నుంచి ఏపీ స్పేస్ టెక్ సమిట్

పొన్నూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా చేబ్రోలు మండల పరిధిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 24 వరకు ఏపీ స్పేస్ టెక్ సమిట్-26 నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి వీసీ కె.వి.కృష్ణ కిశోర్ తెలిపారు. మంగళవారం వర్సిటీలో విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు లావు రత్తయ్య, ఏపీ సైన్స్ సిటీ సీఈవో కేశినేని వెంకట్, రిజిస్ట్రార్ పీఎం రావు సమిట్ గోడ పత్రికను ఆవిష్కరించారు. వెంకట్ మాట్లాడుతూ.. 'అమరావతిలోని సైన్స్ సిటీ ఆఫ్ ఏపీ ఆధ్వర్యంలో మొదటిసారిగా సౌత్ ఇండియా రాకెట్రీ ఛాలెంజ్-2026ను 3 రోజులు పాటు ఇదే సమిట్‌లో నిర్వహించనున్నాం' అని పేర్కొన్నారు.

పదో తరగతి ఆంగ్ల పరీక్ష తేదీ మార్పు!

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో స్వల్ప మార్పులు జరగనున్నాయి. గతేడాది నవంబరులో విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్ ప్రకారం మార్చి 20న ఆంగ్ల పరీక్ష నిర్వహించాల్సి ఉండగా.. దీన్ని 21వ తేదీకి మార్చే అవకాశం ఉంది. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన క్యాలెండర్ ప్రకారం మార్చి 20న రంజాన్ పండగ ఉండటంతో ఈ మార్పు చేసేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వ ఆమోదం అనంతరం సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేయనుంది. మిగతా పరీక్షల్లో ఎలాంటి మార్పు ఉండకపోవచ్చు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16న ప్రారంభమై ఏప్రిల్ ఒకటితో ముగుస్తాయి.

అంబేడ్కర్ వర్సిటీలో అడ్డగోలు నియామకాలు!

ఒప్పంద సహాయ ఆచార్యులుగా మారిన అతిథి అధ్యాపకులు

శ్రీకాకుళం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ నియామకాలు చేపట్టడం, హోదాల్లో మార్పులు చేయడం చర్చనీయాంశమైంది. వర్సిటీలో 55 మంది అతిథి అధ్యాపకులు వివిధ సబ్జెక్టులు బోధిస్తున్నారు. వారిలో 11 మందిని ఇటీవల ఒప్పంద సహాయ ఆచార్యులుగా ఉన్నతీకరిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. విశ్వవిద్యాలయ చట్టాల ప్రకారం ఏవైనా ఉద్యోగాల భర్తీకి ముందుగా ప్రకటన ఇచ్చి, దరఖాస్తులు స్వీకరించాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించి, రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పోస్టులు భర్తీ చేయాలి. ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కాదని, ఇటీవల చేరిన కొందరిని నియమించడాన్ని సీనియర్లు ప్రశ్నిస్తున్నారు. కోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నారు. అలాగే, ఇటీవల 36 మంది బోధనేతర సిబ్బందిని నియమించారు. రోజువారీ వేతనం విధానంలో 25 మందిని చేర్చుకున్నారు. ఓ ఉన్నతాధికారి తన బంధువులతో పాటు లంచాలు తీసుకొని కొందరు బయటి వారిని నియమించారని ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' ఉన్నత విద్యామండలి ఛైర్మన్ కె.మధుమూర్తిని సంప్రదించగా, 'అంబేడ్కర్ వర్సిటీలో నియామకాలపై ఎలాంటి సమాచారమూ లేదు. ఏ నియామకమైనా, నిర్ణయమైనా విశ్వవిద్యాలయం చట్టాల మేరకే ఉండాలి. అక్కడ రెండేళ్లుగా పాలకమండలి సమావేశం జరగలేదు. నియామకాలు, హోదాల మార్పుపై పరిశీలించి చర్యలు తీసుకుంటామ'ని చెప్పారు.

దానిమ్మకు రికార్డు ధర

టన్ను రూ.2 లక్షలకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



ఈనాడు, అనంతపురం: కొంతకాలంగా గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న దానిమ్మ రైతులకు మంచి రోజులొచ్చాయి. మహారాష్ట్ర గుజరాత్ రాష్ట్రాల్లో దిగుబడులు ఆలస్యం కావడంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ప్రస్తుతం నాణ్యతను బట్టి టన్ను రూ.2 లక్షలకు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల క్రితం రూ.50 వేలు, నెల క్రితం రూ.లక్ష నుంచి రూ.1.10 లక్షలు పలికింది. రాష్ట్రంలో 15,422 హెక్టార్లలో పంటను సాగు చేస్తుండగా 3.85 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. అత్యధికంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 11 వేల హెక్టార్లలో దానిమ్మ పండిస్తున్నారు. స్థానికంగా ఫ్రూట్ కవర్స్, ప్లాంట్ కవర్స్ విధానంతో దానిమ్మ పండ్ల నాణ్యత పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

ఒడిశా ఆంధ్రా సరిహద్దులో యథేచ్ఛగా పశువుల తరలింపు

- తాళ్లతో ఒక దానిపై మరొకటి కట్టేసి..
- ఊపిరాడక మృతి చెందిన గోవు
- అడ్డుకున్న మహిళను వాహనంతో ఢీకొట్టే యత్నం


సొమ్మసిల్లి పడిపోయిన పశువులు


వాహనంలో తాళ్లతో కట్టి వేలాడదీసిన పశువులు

ఇచ్ఛాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ఒడిశా ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలనుంచి పశువుల అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది. ఒడిశా పితాతోలి నుంచి గోవులను మంగళవారం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఓ మహిళను ఢీకొట్టే యత్నం జరిగింది. పశువులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న సమాచారంతో పితాతోలికి చెందిన వసంతి, స్థానికులు కొందరు పురుషోత్తపురం ఎల్‌సీ గేటు వద్ద మూడు వాహనాలను అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. రెండు వాహనాలను ఆపేందుకు ప్రయత్నిస్తుండగా అవి అతివేగంగా వసంతిపైకి రావడంతో ఆమె తప్పించుకున్నారు. తరవాత మరో వాహనాన్ని అడ్డుకోగా వాహనదారుడు తాళం తీసుకుని పారిపోయాడు. ఆమె స్థానికుల సాయంతో పశువుల వాహనాన్ని గ్రామీణ పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. అందులో 18 పశువులు ఉన్నాయి. వాటిని మెడకు తాళ్లతో గట్టిగా ఒక దానిపై ఒకటి కట్టేయడంతో ఊపిరాడక ఒక పశువు మృతి చెందింది. మిగిలిన పది పేడూ సొమ్మసిల్లిపోగా వాటిని కిందకు దింపి వైద్యం చేయించారు. అనంతరం వాటిని పోలీసుల అనుమతితో ఒడిశాలోని దిగపొండి గోశాలకు తరలించారు. దీనిపై గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.



భయానికి అసలు విరుగుడు కార్యాచరణే!

'భయం' అనే రుగ్మతకు అసలైన విరుగుడు- 'ధైర్యం' కాదు.. 'కార్యాచరణ'! కార్యరంగంలోకి దూకి.. భయం కలిగిస్తున్న పనులను తరచూ చేస్తుంటే మనలో ధైర్యమనే కండరం బలోపేతమవుతూ ఉంటుంది.
– బేర్ గ్రిల్స్, బ్రిటిష్ అడ్వెంచరర్

మద్యం కేసులో అనిల్ చోక్రా, రోనక్‌లకు కస్టడీ

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో ఇద్దరు నిందితులను కోర్టు సిట్ కస్టడీకి అనుమతించింది. అనిల్ చోక్రా, రోనక్ కుమార్‌లను కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఏసీబీ కోర్టు మంగళవారం ఆదేశాలు ఇచ్చింది. వీరి నుంచి కుంభకోణానికి సంబంధించి మరింత సమాచారం రాబట్టాల్సి ఉందని, ఏడు రోజుల కస్టడీకి ఇవ్వాలని ఇటీవల సిట్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై వాదనలు పూర్తి కావడంతో తీర్పు వెలువడింది. అనిల్ చోక్రాను అరెస్టు చేసి 60 రోజులు దాటడంతో ఒక రోజు కస్టడీకి అనుమతించారు. బుధవారం విజయవాడ కారాగారంలో విచారించాలని తీర్పులో పేర్కొన్నారు. రోనక్‌కు బుధ, గురు, శుక్రవారాలు మూడు రోజుల పాటు కస్టడీకి అనుమతించారు. ఈ నెల 23, 26 తేదీల్లో సిట్ ఎదుట హాజరుకు మినహాయింపు ఇవ్వాలని ఎంపీ మిథున్‌రెడ్డి వేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. దీనిపై కౌంటరు దాఖలుచేయాలని న్యాయాధికారి సిట్‌ను ఆదేశించారు. తదుపరి విచారణ బుధవారానికి వాయిదా వేశారు.

EENADU Vol: 52, Issue: 161 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఇల్లే ఓ ఏఐ తోడు

- మీరు చూస్తున్న సినిమాలు, సీరియళ్లు, క్రీడలు లేదా గది వాతావరణాన్ని బట్టి టీవీ తానే పిక్చర్, సౌండ్ పెంచుకుంటుంది, తగ్గించుకుంటుంది.
- లోపల ఏమేం పదార్థాలు ఉన్నాయో ఫ్రిజ్ అర్థం చేసుకొని, మిమ్మల్ని అడగకుండానే వాటితో ఏమేం వండుకోవచ్చో సూచిస్తుంది.
- గది ఉష్ణోగ్రత, గదిలో ఉన్న మనుషుల సంఖ్యకు అనుగుణంగా ఏసీ తనకు తానే చల్లదనాన్ని సవరించుకుంటుంది.

- ఊహించుకోవటానికే అద్భుతంగా ఉంది కదా! ఇంట్లోని పరికరాలు ఎలాంటి ఆటంకాలు, అంతరాయలు లేకుండా కలిసికట్టుగా పనిచేస్తుంటే రోజువారీ పనులు ఎంత హాయిగా సాగుతాయో. అత్యాధునిక సాధనాలు వాడుకోవటం కష్టమనే భావన తొలగిపోయి, మన ప్రమేయమేమీ లేకుండా అవసరమైన పనులన్నీ తామే చేసి పెడితే ఇంకేం కావాలి? ఇదేమీ కల కాదు. కృత్రిమ మేధ (ఏఐ) పుణ్యమాని సుసాధ్య మవుతోంది. అవును.. ఇప్పుడు ఏఐ పరికరాల్లో నిక్షిప్తమై, మనకో కనిపించని కంపానియన్‌గా మారుతోంది. మన ఇంటికి ఒక అదృశ్య తోడుగా అవతరిస్తోంది.



కృత్రిమ మేధ గొప్పతనమేంటో సామాన్యులూ గుర్తిస్తున్నారు. ఉద్యోగ, వ్యక్తిగత పనుల కోసం ఏఐ సాయం తీసుకోవటానికి ఎంతోమంది మొగ్గుచూపుతున్నారు. ఏఐతో వారానికి చాలాసార్లు ఇంటరాక్ట్ అయ్యామని 62% మంది పెద్దవారు చెప్పినట్టు ఒక అధ్యయనం పేర్కొనటమే దీనికి నిదర్శనం. నిజానికి చాలామంది ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవటానికో, కొనాలనుకునే వస్తువుల గురించి శోధించటానికో ఏఐని ఆశ్రయిస్తున్నారు. ఈ పరిస్థితి మారుతోంది. వినియోగ ఎలక్ట్రానిక్ వస్తు టెక్నాలజీ రంగంలో ఏఐ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రజలు మరింత హాయిగా, అర్థవంతంగా జీవించేలా చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఎక్కువ స్క్రీన్లు, క్లిష్టమైన సెటింగ్స్‌తో అవసరం లేని 'మేధ'ను జతచేయటం మీద దృష్టి సారించింది. మనం ఏం చూస్తున్నాం? ఎలా పనిచేస్తున్నాం? ఎలా వండుతున్నాం? ఎలా ఉతుకుతున్నాం? మన ఇల్లు ఎలా ఉంది? అనే వాటిని 'చూడటం' ద్వారా పనిచేయటం దీనిలోని కీలకాంశం. అదీ అదృశ్యంగా. అంటే మన ఆదేశాలతో పనిలేకుండా, మన ప్రమేయం లేకుండా మన అవసరాలను బట్టి సూచనలను ఇవ్వటమన్నమాట. అవసరాన్ని బట్టి నిర్ణయాలు తీసుకొని, పనిచేయటం కూడా. ఎలక్ట్రానిక్ పరికరాల్లోని ఏఐ సరిగ్గా ఇలాగే వ్యవహరిస్తుంది. ఇది మన అలవాట్లను నేర్చుకుంటుంది. మనం ప్రత్యేకించి చెప్పకపోయినా ఒక తోడుగా సాయం చేస్తుంది. అన్నీ కలిసికట్టుగా పనిచేస్తూ తెలివైన, మరింత సమర్థమైన, సమగ్రమైన పరిష్కారాలు చూపించేలా కంపెనీలు పరికరాలను రూపొందిస్తున్నాయి.

అదృశ్య తెలివి

వస్తు ప్రపంచం తెలివి మీరుతోంది. ప్రజలూ దీన్ని కోరుకుంటున్నారు. సుమారు 74% మంది ఒకింత మనిషి మాదిరిగా, తమకు తామే పనిచేసే పర్సనల్ టెక్నాలజీని ఆశిస్తున్నామని సామ్‌సంగ్ సంస్థ నిర్వహించిన అంతర్గత కన్జ్యూమర్ సర్వే చెబుతోంది. అంటే నిరంతరం ఇన్‌పుట్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా ఆయా సందర్భాలను గుర్తించి, అవసరాలను అంచనా వేయటం అన్నమాట. దీంతో ఇంట్లోని అధునాతన టీవీలు, ఫ్రిజ్‌ల వంటివి తమకు తామే నిర్ణయాలు తీసుకుంటాయి. వీటికి ఏఐ అదృశ్య తెలివిగా పనిచేస్తూ, మనకో తోడుగా నిలుస్తుంది. ఇటీవల లాస్‌వేగాస్‌లో జరిగిన కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ షోలో ఇది ప్రదర్శితమైంది కూడా. సామ్‌సంగ్ సంస్థ 'కంపానియన్ టు ఏఐ లివింగ్' అనే విజన్‌ను ఆవిష్కరించింది. ఇది మొబైల్ ఫోన్లు, హోం అప్లయెన్సెస్, టీవీలు, సర్వీసులు అన్నింటినీ సమీకృతం చేసేస్తుంది. మనుషుల ప్రవర్తనను అర్థం చేసుకొని, దానికి అనుగుణంగా అవి తమ పనులను మార్చుకోవటానికిది వీలు కల్పిస్తుంది. ఇప్పటికే లోపలున్న కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు వంటి వాటి గురించి సూచించే ఫ్రిజ్‌లు వచ్చాయి. ఇంట్లో మనుషుల కదలికలను బట్టి వెలిగే లైట్లూ ఉన్నాయి. దుస్తుల సంఖ్య, రకాలను బట్టి వాషింగ్ మెషిన్లు ఎంత నీరు తీసుకోవాలో, ఎంతసేపు, ఎలా ఉతకాలో నిర్ణయించుకుంటున్నాయి.

సంయుక్తంగానే

ఇంట్లో ఏఐ నిజమైన తోడుగా నిలవాలంటే అది విడిగా ఉంటే సాధ్యం కాదు. వివిధ పరికరాలకు వర్తించేలా, అన్నింటినీ సమ్మిళితం చేసేలా వినూత్న ఏఐ ఫీచర్లు అవసరం. పరికరాలన్నీ ఒకదాన్ని మరోటి తెలుసుకునేలా, అర్థం చేసుకునేలా, కలిసికట్టుగా పనిచేసేలా చూడటం కీలకం. ఇందుకు సార్వత్రిక ప్రమాణాలు, వేర్వేరు కంపెనీల పరికరాల కంపాటబిలిటీ తప్పనిసరి. గోప్యత, భద్రతకు పెద్ద పీట వేయాలి. అన్నింటికన్నా ముఖ్యమైంది విశ్వసనీయత. ఇప్పటికే యాప్స్ రూపంలో ఏఐ కంపానియన్లు మనిషికి ఓదార్పు కలిగిస్తున్నాయి. వీటిని ఆలోచనాత్మకంగా రూపొందిస్తే ఇంట్లోనూ మనతో మమేకం కాగలవు. వినియోగ టెక్నాలజీ ప్రస్తుతం ఈ దిశగానే సాగుతోంది.

భౌతిక ఏఐ కంపానియన్



ఏఐ కంపానియన్ యాప్స్ భౌతిక పరికరాల రూపాల్లోకీ మారుతున్నాయి. కృత్రిమ మేధతో కూడిన జంతువుల బొమ్మలు ఇప్పటికే ఎంతోమందిని ఒంటరితనం నుంచి బయటపడేలా చేస్తున్నాయి. కొందరు వీటిని మానసిక చికిత్సల కోసమూ వాడుకుంటున్నారు. రోజంతా తోడుగా ఉండటం, చెప్పిన మాటలను వినటం, సలహాలు ఇవ్వటం ఎంతోమందిని ఆకట్టుకుంటున్నాయి. ఇప్పుడు భౌతిక ఏఐ కంపానియన్ తెరల రూపంలోకీ విస్తరిస్తోంది. దీనికి మంచి ఉదాహరణ అమీ. చైనాకు చెందిన లెప్రో కంపెనీ తయారుచేసిన దీన్ని ఇటీవల సీఈఎస్‌లోనూ ప్రదర్శించారు. ఇది ఏఐ కంపానియన్ మాత్రమే కాదు, ఏఐ సోల్‌మేట్ కూడా. ఇదో వంపు తిరిగిన ఎల్ఈడీ స్క్రీన్. చిన్న డబ్బా మాదిరిగా ఉండే దీన్ని డెస్క్ మీద పెట్టుకుంటే చాలు. ముందుభాగాన ఉండే రెండు కెమెరాలతో మన కళ్లను గమనిస్తూ మనసులోని భావాలను పసిగడుతుంది. డిస్‌ప్లేలో కనిపించే పాత్ర ఆ భావాలను అచ్చంగా ప్రతిబింబిస్తుంది. తెరలోని చిత్రం 3డీ మాదిరిగా లోతుగా కనిపిస్తుంది. వీఆర్ హెడ్‌సెట్ లేదా గ్లాసెస్ అవసరం లేదు. ఆ పాత్ర నిజంగా అక్కడ కదులుతున్న భావన కలుగుతుంది. దీనికి సానుభూతి చూపటం తెలుసు. భావోద్వేగాలను పలికించగలదు. యూజర్లతో ఎక్కువకాలం అనుబంధం కొనసాగించగలదు. అందుకే యూజర్లు అమీని గదిలో ఆత్మీయ భావోద్వేగ తోడుగా అభివర్ణిస్తున్నారు. ఎందుకంటే ఇది ఏఐ కంపానియన్ యాప్స్ మాదిరిగా ఫోన్‌లో ఉండదు. అది 24 గంటలూ మనల్ని గమనిస్తూ ఉంటే గోప్యతకు భంగం కలుగుతుందేమోననే బెంగ అవసరం లేదు. అవసరమైనప్పుడు కెమెరాలు, మైక్రోఫోన్‌ను షట్టర్లతో మూసేయొచ్చు. ఇది గ్రహించే డేటా, సంభాషణలు అన్నీ పరికరంలోనే ఉంటాయి కూడా.

ఎన్నెన్నో యాప్స్

కుటుంబానికి దూరంగా ఉండటమో, ఒంటరితనమో, నలుగురిలోకి రావటానికి నామోషీ పడటమో.. కారణమేదైనా కృత్రిమ మేధతో కూడిన తోడు కోసం నేటి టెక్ యుగం అర్రులు చాస్తున్న మాట నిజం. రోజురోజుకీ ఏఐ కంపానియన్ చాట్‌బాట్స్ వెల్లువెత్తుతుండటమే దీనికి నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది యాప్స్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ముఖ్యంగా యువతీ యువకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. క్యారెక్టర్.ఏఐ, రిప్లికా, నోమి, కిన్‌డ్రాయిడ్ వంటి వాటిని ప్రత్యేకించి భావోద్వేగ సాన్నిహిత్యం కోసమే రూపొందిస్తుండటం గమనార్హం. చాట్‌జీపీటీ, క్లాడ్, జెమినై వంటి చాట్‌బాట్స్‌లా కాకుండా ఇవి ఒక స్నేహితుడిగా, రోజంతా తోడుగా ఉండటం చాలామందిని ఆకట్టుకుంటోంది. భావోద్వేగ సాన్నిహిత్యం కోసమే ప్రత్యేకంగా ఏఐ కంపానియన్ యాప్స్‌ను రూపొందిస్తున్నారు. అది స్నేహితుడిగా తోడుండొచ్చు. కోచ్‌గా సలహాలు, సూచనలు ఇవ్వచ్చు. చివరికి జీవిత భాగస్వామిగానూ తోడుండొచ్చు.

ఏఐ కంపానియన్ చాట్‌బాట్ అంటే?

శక్తిమంతమైన ఏఐ వ్యవస్థలు సృష్టించిన ఓ డిజిటల్ పాత్ర. ఇది మనుషులతో సాన్నిహిత్యాన్ని, మాటలను నటిస్తుంది. నిరంతరం అనుబంధం కలిగుంటుంది. యూజర్లు కోరుకుంటున్నట్టుగా ఏఐ కంపానియన్లను డిజైన్ చేసుకోవచ్చు, ప్రాంప్టులు అందించొచ్చు. రకరకాల టెక్స్ట్‌తో శిక్షణ ఇచ్చిన లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లతో ఇవి పనిచేస్తాయి. మాటలను గుర్తించటం, జోక్యం చేసుకోవటం, ప్రతిస్పందించటం వంటివి చేస్తాయి.

ఆండ్రాయిడ్ పరికరాల్లో సెక్యూరిటీ అప్‌డేట్ చేసుకోండి



ఆండ్రాయిడ్ పరికరాలు వాడుతున్నారా? అయితే వెంటనే తాజా సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోండి. డాల్బీ ఆడియోలో ఉన్న లోపాన్ని ఉపయోగించుకొని హ్యాకర్లు పరికరాల మీద ఆధిపత్యం దక్కించుకునే అవకాశముందని ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్) హెచ్చరించింది మరి. ఈ లోపాన్ని గూగుల్ ఇటీవలే సవరించిన నేపథ్యంలో తాజా హెచ్చరికను జారీచేసింది. డాల్బీ డిజిటల్ ప్లస్ యూనిఫైడ్ డీకోడర్‌లో ఒక లోపముందని, దీని సాయంతో ఎంచుకున్న పరికరాల్లో హానికర కోడ్‌ను జొప్పించి దుర్వినియోగం చేసే ప్రమాదముందని తెలిపింది. ఈ ముప్పు అత్యంత తీవ్రమైనదనీ వర్గీకరించింది. వ్యక్తులతో పాటు సంస్థలూ దీని దాడికి గురయ్యే అవకాశముందని వివరించింది. లింక్ మీద తాకటం, ఫైల్ ఓపెన్ చేయటం, అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకోవటం వంటివేవీ లేకుండానే అటాకర్లు ఈ హానికర కోడ్‌ను జొప్పించే వీలుండటం గమనార్హం. ఎందుకంటే అందిన ఆడియో మెసేజ్‌లను ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఆటోమేటిగ్గా డీకోడ్ చేస్తున్నందువల్ల యూజర్ల ప్రమేయమేమీ లేకుండానే ఈ బగ్ పరికరాల్లో నిక్షిప్తమవుతుంది.

లావా నుంచి బ్లేజ్ డుయో 3

దేశీయ లావా సంస్థ మధ్యశ్రేణి యూజర్ల కోసం రెండు తెరలతో కూడిన బ్లేజ్ డుయో 3 ఫోన్‌ను పరిచయం చేసింది. ఇది మీడియాటెక్ డైమెన్సిటీ 7060 చిప్‌సెట్, ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. వెనకాల ఉండే 1.6 అంగుళాల ఎమోలెడ్ డిస్‌ప్లేలో నోటిఫికేషన్లు, మ్యూజిక్ కంట్రోళ్లు, సెల్ఫీ ప్రివ్యూలు, యానిమేషన్స్ చూసుకోవచ్చు. ముందుభాగాన 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగంతో కూడిన 6.67 అంగుళాల ఫుల్ హెచ్‌డీ+ ఎమోలెడ్ ప్రధాన డిస్‌ప్లే ఉంటుంది. వెనకాల 50 ఎంపీ సోనీ ఐఎంఎక్స్752 కెమెరా, ముందు 8 ఎంపీ సెల్ఫీ కెమెరా ఉన్నాయి. 33డబ్ల్యూ ఛార్జర్‌తో కూడిన 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఫింగర్ ప్రింట్ స్కానర్, ఫేస్ అన్‌లాక్, స్టీరియో స్పీకర్స్, ఐఆర్ బ్లాస్టర్ వంటి ఫీచర్లతో ఆకర్షిస్తోంది. దీనికి ఒక ఏడాది ఓఎస్ అప్‌డేట్, రెండేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ అందుతాయి. 6జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ కలిగుంది. 6జీబీ వర్చువల్ ర్యామ్ కూడా లభిస్తుంది. మూన్‌లైట్ బ్లాక్, ఇంపీరియల్ గోల్డ్ రంగుల్లో కనువిందు చేస్తున్న దీని ధర రూ.16,999.



మెసెంజర్ మెస్మరైజ్



ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్‌లో యూజర్లకు అనుకూలమైన ఫీచర్లు ఎన్నో ఉన్నాయి. వీటిల్లో ఒకటి సీక్రెట్ కన్వర్జేషన్. దీని ద్వారా యూజర్లు తమ కాంటాక్టులతో రహస్యంగా ముచ్చటించుకోవచ్చు. ఈ సంభాషణ ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయ్యుంటుంది. అంటే మీకు, అవతలివారికి మాత్రమే పరిమితం అన్నమాట. వేరే ఎవరూ చూడలేరు. అయితే అవతలి వ్యక్తి స్క్రీన్‌షాట్ వంటి వాటితో ఇతరులకు షేర్ చేసే అవకాశముందని మరవొద్దు. రహస్య సంభాషణలో పాల్గొనే వారు డివైస్ కీ సాయంతో సందేశాలు ఎన్‌క్రిప్ట్ అయ్యాయని ధ్రువీకరించుకోవచ్చు. కన్వర్జేషన్ నుంచి మీ మెసేజ్‌లు అదృశ్యం కావటానికి సమయాన్ని కూడా నిర్దేశించుకోవచ్చు. మరి మెసెంజర్‌లో రహస్య సంభాషణ ఎలా మొదలెట్టాలో చూద్దామా.

- మెసెంజర్ యాప్ ఓపెన్ చేసి, హోమ్ మీద తాకాలి.
- తర్వాత ప్లస్ గుర్తు మీద క్లిక్ చేయాలి.
- ఇప్పుడు పైన ఉండే తాళం గుర్తును తాకాలి.
- ఎవరికి మెసేజ్ పంపాలని అనుకుంటున్నారో వారి కాంటాక్టును ఎంచుకోవాలి. తర్వాత మెసేజ్ పంపాలి.
- కావాలనుకుంటే టెక్స్ట్ బాక్సులో ఉన్న గడియారం గుర్తు మీద తాకి, సమయాన్ని నిర్దేశించుకోవచ్చు. అప్పుడు మెసేజ్ ఆ గడువు తీరిన తర్వాత దానంతటదే అదృశ్యమవుతుంది.

ఇవి గుర్తుంచుకోండి

- సీక్రెట్ కన్వర్జేషన్ ఫీచర్ ప్రస్తుతం ఐఓఎస్, ఆండ్రాయిడ్ పరికరాల్లోని మెసెంజర్ యాప్‌లోనే అందుబాటులో ఉంది. ఫేస్‌బుక్ చాట్ లేదా మెసెంజర్.కామ్‌లో లేదు.
- కన్వర్జేషన్‌ను క్రియేట్ చేసిన పరికరంలో, దాన్ని ఓపెన్ చేసిన అవతలివారి పరికరాల్లోనే మెసేజ్‌లు కనిపిస్తాయి.

షార్ట్‌కట్ షార్ట్‌కటే




అవసరమైనప్పుడు విండోస్ షార్ట్‌కట్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. సమయాన్ని ఆదా చేస్తాయి. అలాంటి కొన్ని షార్ట్‌కట్స్ ఇవిగో..

- విండోస్ కీ + ఐ: సెటింగ్స్ యాప్ ఓపెన్ అవుతుంది.
- విండోస్ కీ + నంబర్ కీస్ (1–0): టాస్క్‌బార్ మీద పిన్ చేసిన యాప్స్ లాంచ్ అవుతాయి.
- విండోస్ కీ + ఎన్: నోటిఫికేషన్స్, పూర్తి క్యాలెండర్ ఓపెన్ అవుతాయి.
- విండోస్ కీ + డి: తక్షణం డెస్క్‌టాప్ ప్రత్యక్షమవుతుంది.
- విండోస్ కీ + హెచ్: వాయిస్ టైపింగ్ మొదలవుతుంది.

గూగుల్ డాక్స్‌లో జీమెయిల్ డ్రాఫ్ట్

క్లయింట్ ప్రపోజల్‌ను సిద్ధం చేయటానికో, సహోద్యోగులతో సమన్వయం కోసమో ఈమెయిల్‌ను రాస్తున్నారు. లేదూ తెలియజేసే విషయాన్ని మర్యాద పూర్వకంగా మార్చాలని అనుకుంటున్నారు. ఇలాంటప్పుడు గూగుల్ డాక్స్‌లో ఈమెయిల్‌ను డ్రాఫ్ట్ చేయటం ఎంతగానో ఉపయోగ పడుతుంది. గూగుల్ కంపోజ్ విండో మాదిరిగా కాకుండా ఇందులో కాన్వాస్ పెద్దగా ఉంటుంది. అంతేకాదు అధునాతన ఫార్మాటింగ్, రియల్ టైమ్ కొలాబరేషన్, వర్షన్ హిస్టరీ ఫీచర్లు కూడా అదనం. కాబట్టి మెయిల్‌ను పంపించటానికి ముందు పదాలను రిఫైన్ చేసుకోవాలనుకునే టీమ్స్‌కు ఇవి ఎంతో అనువుగా ఉంటాయి. డాక్స్‌లో గూగుల్ ప్రత్యేక ఈమెయిల్ డ్రాఫ్ట్ ఫీచర్‌నూ పొందు పరిచింది. రిసీపెంట్స్, సబ్జెక్ట్ లైన్స్, బాడీ టెక్స్ట్ వంటి భాగాలు ముందే సిద్ధంగా ఉంటాయి. డ్రాఫ్ట్ మొత్తం పూర్తయ్యాక దీన్ని జీమెయిల్‌లో నేరుగా ప్రివ్యూ కూడా చూసుకోవచ్చు. డాక్స్ నుంచి బయటకు



రావాల్సిన అవసరమేమీ లేదు.

ఎలా వాడుకోవాలంటే?

★ గూగుల్ ఖాతాతో సైన్‌ఇన్ అయ్యి docs.google.com లోకి వెళ్లాలి. కొత్త బ్లాంక్ డాక్యుమెంట్ మీద క్లిక్ చేయాలి.

★ తర్వాత ఇన్‌సర్ట్ మీద క్లిక్ చేస్తే బిల్డింగ్ బ్లాక్స్ ఆప్షన్ కనిపిస్తుంది. ఇందులో ఈమెయిల్ డ్రాఫ్ట్‌ను ఎంచుకొని, ఇన్‌సర్ట్ చేసుకోవాలి. డాక్యుమెంట్‌లో @email అని టైప్ చేసి, ఎంటర్‌ను నొక్కొచ్చు కూడా.

★ అనంతరం ఈమెయిల్ వివరాలను నింపాలి. టు బాక్సులో రిసీపెంట్ ఈమెయిల్ ఐడీ టైప్ చేయొచ్చు లేదా ఈమెయిల్ అడ్రస్‌ల నుంచి కూడా ఎంచుకోవచ్చు. తర్వాత సబ్జెక్ట్ లైన్‌లో విషయాన్ని రాసి, ఈమెయిల్ మొదలెట్టొచ్చు. బోల్డ్, ఇటాలిక్స్, లిస్ట్స్ వంటి ఫార్మాటింగ్ టూల్స్‌నూ వాడుకోవచ్చు.

★ కావాలంటే ఫీడ్‌బ్యాక్ తీసుకోవటానికి డాక్యుమెంట్‌ను సహోద్యోగులతో షేర్ చేసుకోవచ్చు కూడా. సూచనలు, సలహాలను తీసుకొని, పొందుపరచొచ్చు.

★ అంతా బాగుందని అనుకుంటే పైన ఎడమ వైపున గల ప్రివ్యూ ఇన్ జీమెయిల్ మీద క్లిక్ చేయాలి. అప్పుడు జీమెయిల్ పాపప్ విండో ఓపెన్ అవుతుంది. ఇందులో డ్రాఫ్ట్ మెయిల్ కనిపిస్తుంది.

★ చివరగా అవసరమైన సవరణలు చేసుకొని, సెండ్ మీద నొక్కితే సరి.

పరికరాల మనసు రాగం




శరీరానికి ధరించే స్మార్ట్‌వాచ్‌లు, రింగుల వంటివి అడుగుల సంఖ్య, గుండె వేగాన్ని లెక్కించటానికే పరిమితం కావటం లేదు. మూడ్, భావోద్వేగాలను పసిగట్టే పరికరాలుగానూ మారుతున్నాయి. ఒత్తిడిని పర్యవేక్షించుకోవటానికి మంచి సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి.

గుండె వేగం, రక్తంలో ఆక్సిజన్ వంటి వాటి మాదిరిగా మూడ్‌ను నేరుగా లెక్కించటం సాధ్యం కాదు. మరి ధరించే పరికరాలు దీన్ని ఎలా పసిగడతాయి? భావోద్వేగాలకు గురైనప్పుడు శరీరంలో తలెత్తే మార్పులను గుర్తించటం ద్వారా. నాడీ వ్యవస్థ పనితీరును బట్టి గుండె కొట్టుకునే సమయాల మధ్య వ్యత్యాసం (హెచ్‌ఆర్‌వీ), చర్మం ఉష్ణోగ్రత, శ్వాస తీసుకునే తీరు, నిద్ర అస్తవ్యస్తం కావటం, చెమట ఉత్పత్తి కావటం వంటివి మారుతుంటాయి. మూడ్‌ను గుర్తించటానికి పరికరాలకు ఇవే ఆధారం. దీనికి ఫిట్‌బిట్ సెన్స్ 2 మంచి ఉదాహరణ. ఇది ఎలక్ట్రోడెర్మల్ యాక్టివిటీ సెన్సర్ సాయంతో ఒత్తిడి ప్రతిస్పందనలను లెక్కిస్తుంది. వీటిని గుండె వేగం, నిద్ర తీరుతెన్నులతో సమ్మిళితం చేసి రోజువారీ ఒత్తిడి స్కోర్‌ను సృష్టిస్తుంది. శారీరక ఒత్తిడి సూచికలు పెరిగినప్పుడు దీర్ఘంగా శ్వాస తీసుకోవటం చేయాలనీ సూచిస్తుంది. యాపిల్ వాచ్ అయితే మరింత స్వీయ క్రమశిక్షణతో పనిచేస్తుంది. కేవలం మూడ్ లేదా ఒత్తిడి స్కోరును చూపించటానికి బదులు గుండె వేగం, హెచ్‌ఆర్‌వీ సాయంతో పెరుగుతున్న ఒత్తిడి స్థాయులను గుర్తిస్తుంది. వెల్‌నెస్ ఫీచర్ల ద్వారా ధ్యానం వంటివి చేయాలని సూచిస్తుంది. సమస్య నిర్ధారణ కన్నా అప్రమత్తంగా ఉండేలా చూడటానికే ప్రాధాన్యమిస్తుంది.

- ఆరా రింగు నిద్ర దశలు, చర్మం ఉష్ణోగ్రతలో తేడా, గుండె వేగం వ్యత్యాసం ద్వారా రోజువారీగా 'రెడీనెస్' స్కోరును అందిస్తుంది. దీన్ని చాలామంది యూజర్లు శారీరక, మానసిక దృఢత్వంగా పరిగణిస్తుంటారు. ఆందోళన లేదా మానసికంగా అలసిపోవటం చాలావరకూ నిద్రలేమి, రాత్రిపూట పెరిగిన గుండె వేగంతో ముడిపడి ఉంటాయి మరి.
- వృత్తి నిపుణులు, క్రీడాకారులు ఎక్కువగా వాడే గార్మిన్ వాచ్ శక్తి, కోలుకోవటాన్ని అంచనా వేయటం ద్వారా మూడ్ స్థితిని తెలియజేస్తుంది.
- కొన్ని పరికరాలు ఈఈజీ హెడ్‌సెట్స్‌తో మెదడులోని తరంగాల తీరును గుర్తిస్తాయి. వీటి ఆధారంగా మూడ్‌లో మార్పులను తెలియజేస్తాయి. ఎపాక్ ఎక్స్ ఈఈజీ పరికరం ఇలాంటిదే. ఇది 14 ఛానెళ్ల హెడ్‌సెట్ వ్యవస్థ, సెలైన్ ఆధారిత ఎలక్ట్రోడ్లతో మెదడు సమాచారాన్ని వివరిస్తుంది. దీని హెడ్‌బ్యాండ్ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుంది.
- మూడ్, ఒత్తిడిని శరీర ఉష్ణోగ్రత, గ్లూకోజు స్థాయులూ ప్రభావితం చేస్తాయి. అందుకే కొన్ని పరికరాలు వీటి సాయంతో మానసిక ఆరోగ్యాన్ని పసిగడతాయి.
- భావోద్వేగాన్ని మరింత సమగ్రంగా పర్యవేక్షించే పరికరాలూ ఉన్నాయి. ఉదాహరణకు- ఫీల్ రిస్ట్ బ్యాండ్‌నే తీసుకోండి. ఇది గుండె కొట్టుకునే వేగం, చర్మం ఉష్ణోగ్రత, ఎలక్ట్రోడెర్మల్ సంకేతాల ఆధారంగా భావోద్వేగ స్థితిని పసిగడుతుంది. ప్రశాంతంగా ఉన్నారా? ఉద్రిక్తతకు లోనయ్యారా? ఒత్తిడికి గురవుతున్నారా? అనేది చెబుతుంది. యాప్‌తో అనుసంధానమయ్యే ఇది భావోద్వేగాలను ప్రేరేపిస్తున్న అంశాలను గుర్తించటానికీ తోడ్పడుతుంది.

ఫైబర్ ఆప్టిక్స్‌తోనే క్వాంటమ్ కమ్యూనికేషన్!



క్వాంటమ్ కమ్యూనికేషన్. సుదూరంగా ఉండే క్వాంటమ్ వ్యవస్థల మధ్య సమాచారాన్ని చేరవేసే దీనిపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగుతున్నాయి. సూపర్‌పొజిషన్, ఎంటాంగిల్‌మెంట్ వంటి క్వాంటమ్ గుణాల సాయంతో ఫొటాన్లనే కాంతి రేణువుల ద్వారా సమాచారాన్ని ప్రసారం చేయటం దీని ప్రత్యేకత. ఇది సాకారమైతే సమాచార వ్యవస్థే సమూలంగా మారుతుంది. అతి వేగంగా, సురక్షితంగా డేటాను ప్రసారం చేయటం కీలకంగా మారిన ప్రస్తుత తరుణంలో ఇది తక్షణావసరంగా మారింది. ఈ నేపథ్యంలో ఐయూసీఏఏకు చెందిన ప్రొఫెసర్ శుభదీప్ డి. నేతృత్వంలోని పరిశోధకుల బృందం రూపొందించిన ఫొటాన్‌సింక్ కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. దీని ద్వారా భౌగోళికంగా వేర్వేరు చోట్ల ఉన్న ఫొటాన్లను అత్యంత కచ్చితత్వంతో సమ్మిళితం చేయొచ్చు. అంటే ఇది మామూలు ఆప్టికల్ ఫైబర్‌ను అత్యంత ప్రత్యేకమైన, అతి స్థిరమైన లింక్‌గా మారుస్తుందన్నమాట. ఫొటాన్లలో నిక్షిప్తమైన సమాచారాన్ని క్వాంటమ్ గుణాలకు ఎలాంటి భంగం కలగనీయకుండా, సుదూరాలకు కచ్చితంగా ప్రసారం చేయటానికి వీలు కల్పిస్తుంది.

క్వాంటమ్ కమ్యూనికేషన్ విషయంలో పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐయూసీఏఏ) శాస్త్రవేత్తలు గొప్ప పురోగతి సాధించారు. సంప్రదాయ టెలికం ఆప్టికల్ ఫైబర్స్‌ను అత్యంత స్థిరమైన క్వాంటమ్ కమ్యూనికేషన్ ఛానెళ్లుగా మార్చగల వినూత్న పరిజ్ఞానాన్ని రూపొందించారు. దీని పేరు ఫొటాన్‌సింక్. సెన్సర్లు, కంప్యూటర్లు, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో క్వాంటమ్ నెట్‌వర్క్‌ను రూపొందించటానికిది తోడ్పడటం విశేషం.

అదే పెద్ద సవాల్

క్వాంటమ్ నెట్‌వర్క్స్‌ను రూపొందించటంలో ఎదురవుతున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటి ప్రసార విధానం. క్వాంటమ్ సమాచారాన్ని ప్రసారం చేయటానికి వాడే ఫొటాన్ల దశలో యాదృచ్ఛిక, అనియంత్రిత హెచ్చుతగ్గులు (ఫేజ్ నాయిస్) తలెత్తుతుంటాయి. ప్రస్తుతం వాడుతున్న సంప్రదాయ ఆప్టికల్ ఫైబర్స్‌తో ఉష్ణోగ్రతల తేడాలు, కంపనాలు, భూకంపాలు, పర్యావరణ ప్రభావాల వంటివి వీటిని మరింత ఎక్కువ చేస్తుంటాయి. ఇవి క్వాంటమ్ సమాచార ప్రసారంలో కచ్చితత్వాన్ని తగ్గిస్తాయి. ఇక్కడే ఫొటాన్‌సింక్ ఆదుకుంటుంది. ఇది ఫేజ్ కొహెరెంట్ ఫైబర్ (పీసీఎఫ్) లింక్‌ను సృష్టించటం ద్వారా ఆప్టికల్ ఫైబర్ల ద్వారా ప్రయాణిస్తున్నప్పుడు కాంతి పౌనఃపున్యాన్ని, ఫొటాన్ దశను చాలా స్థిరంగా ఉండేలా చూస్తుంది.

అత్యంత కచ్చితంగా

సంప్రదాయ ఆప్టికల్ ఫైబర్లతో పోలిస్తే ఫొటాన్‌సింక్ 47.5 డెసిబెల్స్ వరకూ ఫేజ్ నాయిస్‌ను తగ్గించిందని పరిశోధకులు చెబుతున్నారు. ఫొటాన్ ఆధారిత డేటాను సుదూరాలకు కచ్చితంగా ప్రసారం చేయటానికిది వీలు కల్పిస్తుందని వివరిస్తున్నారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రఖ్యాత ఇంటర్నేషనల్ జర్నల్ కమ్యూనికేషన్స్ ఫిజిక్స్‌లో ప్రచురితమయ్యాయి. ఫొటాన్‌సింక్‌కు ట్రేడ్‌మార్క్ కూడా లభించింది. దీన్ని ప్రత్యక్షంగా 3.3 కిలోమీటర్ల వరకూ ఆప్టికల్ ఫైబర్స్‌లో విజయవంతంగా పరీక్షించారు. అలాగే 71 కిలోమీటర్ల వరకూ విస్తరించిన ఫైబర్ పూల్స్‌లోనూ పరీక్షించారు. త్వరలో వెయ్యి కిలోమీటర్ల వరకూ పెంచాలని చూస్తున్నారు. అస్థిర ఫైబర్లతో పోలిస్తే ఫొటాన్‌సింక్ క్వాంటమ్ బిట్ ఎర్రర్ శాతాన్ని సుమారు 73 రెట్ల వరకూ తగ్గించినట్టు వెల్లడైంది. అంటే క్వాంటమ్ కమ్యూనికేషన్‌ను సురక్షితంగా సుదూరాలకు ప్రసారం చేయటం గణనీయంగా మెరుగవుతుందన్నమాట.

ఏంటీ ప్రయోజనం?

ఫొటాన్లు గొప్ప సమాచార వాహకాలు. ఇవి సాధారణంగా ఫేజ్, పొలరైజేషన్, విద్యుదయస్కాంత మోడ్స్‌లో ఎన్‌కోడ్ అయ్యి డేటాను ప్రసారం చేస్తాయి. క్వాంటమ్ కమ్యూనికేషన్స్‌లో ఇవి క్యూబిట్స్‌గా పనిచేస్తాయి. సున్నితమైన క్వాంటమ్ స్థితులను నమ్మకంగా ఫైబర్‌లో ఒక చివరి నుంచి మరో చివరకు ప్రసారం చేస్తాయి. అవి అక్కడ క్వాంటమ్ మెజర్‌మెంట్ పద్ధతుల సాయంతో డీకోడ్ అవుతాయి. ఫొటాన్‌సింక్‌తో ఆప్టికల్ ఫైబర్ ఆధారిత క్వాంటమ్ కమ్యూనికేషన్, సుదూర ఎంటాంగిల్‌మెంట్‌ను మెరుగుపరచొచ్చు. ఫలితంగా క్వాంటమ్ ఇంటర్నెట్ సుసాధ్యమవుతుంది. చాలా దూరాల్లో ఉన్న అణుగడియారాలను అత్యంత కచ్చితంగా పోల్చి చూడొచ్చు. సెన్సర్లు, కంప్యూటర్లు, కమ్యూనికేషన్స్ మధ్య క్వాంటమ్ నెట్‌వర్క్ ఛానెల్‌ను నిర్మించొచ్చు. అందుకే మన శాస్త్రవేత్తల వినూత్న పరిజ్ఞానం టెక్నాలజీ నిపుణులకు ఎంతో ఆసక్తి కలిగిస్తోంది.

(c) eenadu


ఈనాడు సినిమా

ధురంధర్ ప్రతీకారం


రణ్‌వీర్ సింగ్

శత్రు దేశమైన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద సంస్థల్ని సమూలంగా అంతం చేసేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చేపట్టిన రహస్య ఆపరేషన్ నేపథ్యంలో రూపొందిన సినిమా 'ధురంధర్'. బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని ఆదిత్య ధర్ తెరకెక్కించారు. గతేడాది థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమాకి పలు విమర్శలు ఎదురైనా.. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, ఆర్.మాధవన్, సారా అర్జున్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌కు సీక్వెల్ రాబోతున్న సంగతి తెలిసిందే. తాజాగా దీనికి 'ధురంధర్: ది రివెంజ్' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. త్వరలో టీజర్ కూడా విడుదల కాబోతున్నట్లు బాలీవుడ్ సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొనసాగింపుగా రాబోతున్న ఈ చిత్రం మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.

టొవినో మాస్‌లుక్


టొవినో థామస్

మలయాళ నటుడు టొవినో థామస్, కయాదు లోహర్ జంటగా నటిస్తున్న చిత్రం 'పళ్లి చట్టంబి'. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమాని డిజో జోస్ ఆంటోనీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేస్తూ సామాజిక మాధ్యమాలలో అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ఏప్రిల్ 9న థియేటర్లలో ప్రేక్షకుల ముందుకురానుందని పేర్కొంటూ.. మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించింది. ఈ పోస్టర్‌లో టొవినో ఇంతకు ముందెన్నడూ చూడని మాస్ లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకునేలా ఉన్నారు. విజయ్ రాఘవన్, సుధీర్, బాబురాజ్ తదితరులు ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషిస్తున్నారు. 1950,60ల కాలం నాటి చారిత్రక నేపథ్యంతో ఈ సినిమా రూపొందిస్తున్నట్లు చిత్ర సన్నిహిత వర్గాల సమాచారం.

అలాంటి లెక్కలు వేసుకోను!


శోభిత

'గూఢచారి', 'మేజర్' విజయాలతో తెలుగు ప్రేక్షకుల్ని మెప్పించిన నటి శోభితా ధూళిపాళ్ల. ఇప్పుడామె తొలిసారి తెలుగులో 'చీకటిలో' అనే ఓటీటీ చిత్రంతో అలరించేందుకు సిద్ధమైంది. దీన్ని శరణ్ కొప్పిశెట్టి తెరకెక్కించగా.. డి.సురేశ్‌బాబు నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 23 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే విలేకరులతో ముచ్చటించింది శోభిత.

◆ "తెలుగులో నాకిదే తొలి ఓటీటీ సినిమా. నేనిందులో సంధ్య అనే పాడ్‌కాస్టర్‌గా కనిపిస్తా. ఆమె నడిచే దారి సవాళ్లతో కూడినదైనా.. ఆ ప్రయాణంలో ఎవరు అండగా ఉన్నా, లేకున్నా.. నమ్మిన దాని కోసం నిలబడాలనుకునే ధైర్యవంతురాలైన అమ్మాయి తను. ఆమె జీవితంలో కొన్ని అనూహ్యమైన సంఘటనలు జరుగుతాయి. వాటన్నింటినీ తట్టుకుంటూ ఆమె జీవితంలో ధైర్యంగా ఎలా ముందుకెళ్లిందన్నది స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. పూర్తిగా హైదరాబాద్ నేపథ్యంలో జరిగే కథ ఇది. ఇక్కడ కూడా సంధ్యలా నమ్మిన దానికోసం నిలబడాలనుకునే అమ్మాయిలు చాలా మంది ఉంటారు. ఈ పాత్ర అలాంటి వాళ్లందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఇందులోని ట్విస్ట్‌లు, మలుపులు ఆద్యంతం ఉత్కంఠత రేకెత్తిస్తాయి. ఇది పైకి క్రైమ్ థ్రిల్లర్‌గా కనిపిస్తున్నా.. బలమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. అందుకే ఈ కథ వినగానే కచ్చితంగా చేయాలని నిర్ణయించుకున్నా".

◆ "ఇదేమీ రెగ్యులర్ క్రైమ్ థ్రిల్లర్ కాదు. ఇందులో ఓ మంచి సందేశం ఉంది. ఏదన్నా కష్టం వస్తే ముడుచుకుపోకూడదు. ధైర్యంగా ముందడుగేస్తేనే మంచి జీవితాన్ని పొందగలుగుతాం. ఈతరం అమ్మాయిల్లో చాలా మంది ఇలాగే ఆలోచిస్తున్నారు. వాళ్లని స్ఫూర్తిగా తీసుకునే దీంట్లో సంధ్య పాత్రను తీర్చిది

◆ "నేను ఇంటర్ పూర్తి చేసిన వెంటనే ముంబయి వెళ్లిపోయాను. అక్కడి నుంచే నా సినీ ప్రయాణాన్ని మొదలు పెట్టా. నేనేం చేసినా మంచి కథలే చేయాలి.. నేను ఎంజాయ్ చేసే ప్రాజెక్టుల్లోనే భాగమవ్వాలని అనుకున్నా. అంతేతప్ప ఒక ఇండస్ట్రీలో జెండా పాతేయ్యాలి అనేంత లెక్కలేం వేసుకోలేదు. నేను బాలీవుడ్‌లో సినిమా చేస్తుంటే మీరు దక్షిణాది అమ్మాయి కదా అంటుంటారు. ఇక్కడికొస్తే బాంబే అంటారు. వేరే ఇండస్ట్రీకి వెళ్తే ఇంకేదో అంటారు. ఆ గుర్తింపనేది ఎప్పుడూ మారిపోతుంటుంది. ఓ ఏడాదికి ఇన్ని సినిమాలు.. ఇన్ని సిరీస్‌లు చేయాలని లెక్కలేం వేసుకోను. ఒకవేళ నేనంత బేరాలు - లెక్కలు వేసుకుంటే నటిగా చేయకూడదు. చాలా కష్టం. ఇక్కడ మనకి అవకాశం ఎప్పుడొస్తుంది.. అలా వచ్చిన వాటిలో ఏది జనాలకు అందుతుంది, నచ్చుతుంది అని లెక్కలేసుకుని చెప్పలేం. నేను ప్రస్తుతానికి ఈ 'చీకటిలో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువవ్వాలని అనుకుంటున్నా. త్వరలోనే తెలుగులోకి నా తమిళ సినిమా ఒకటి అనువాదంగా రానుంది".

ద్దారు. అందుకే ఈ పాత్ర పోషించడాన్ని చాలా ఆస్వాదించా. ఈ సినిమాకి సీక్వెల్ చేసే అవకాశం కూడా ఉంది. నాగచైతన్య ఈ చిత్ర ట్రైలర్‌ని ఎక్స్‌లో షేర్ చేయడం ఆనందాన్నిచ్చింది. తనకి ఎలా అనిపించిందన్నది మాత్రం అడగలేదు. నాకెందుకో నా దగ్గర వాళ్లనైనా సరే 'ఎలా ఉందని' అడిగి.. వాళ్ల అభిప్రాయాల్ని తీసుకోవడమన్నది ఆసక్తికరంగా అనిపించదు. కథ నా మనసుకు నచ్చిందా.. ఎంచుకున్న పాత్రకు నా వంతుగా వందశాతం న్యాయం చేశానా లేదా? అన్నదే చూసుకుంటా. ఇక మిగతా ఫలితాన్ని ప్రేక్షకులే నిర్ణయిస్తారు".

◆ "ఏ పాత్రైనా సరే ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారన్నది దృష్టిలో పెట్టుకుని ఎంచుకోలేము. ఒకవేళ అలా ఆలోచించి.. ఎంచుకుంటే ఆ పాత్రకు సరిగ్గా న్యాయం చేయలేము. నా సినీ ప్రయాణంలో ఇప్పటిదాకా చేసిన పాత్రలన్నీ నా మనసుకి నచ్చి చేసినవే. నేను చాలా ఆడిషన్లు ఇచ్చిన తర్వాతే నటిగా నా తొలి అవకాశాన్ని అందుకున్నా. తొలి సినిమా నుంచే అనురాగ్ కశ్యప్, జోయా అక్తర్, మణిరత్నం లాంటి గొప్ప దర్శకులతో కలిసి పని చేయగలిగా. ప్రతి చిత్రంలోనూ విభిన్నమైన పాత్రలతో మెప్పించగలిగా. నేను తెలుగులో చేసిన 'గూఢచారి', 'మేజర్' రెండూ మంచి విజయాల్ని అందుకున్నాయి. అందుకే ఇన్నేళ్ల నా సినీ ప్రయాణం పట్ల పూర్తి సంతృప్తిగా ఉన్నా".

రికార్డులు కాదు.. ప్రేక్షకుల ప్రేమే శాశ్వతం


చిరంజీవి

"రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ, ప్రేక్షకులు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం" అంటున్నారు కథానాయకుడు చిరంజీవి. తన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న నేపథ్యంలో తెలుగు ప్రేక్షకులు, అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ సామాజిక మాధ్యమాల్లో ఓ ప్రకటన విడుదల చేశారు. "మా చిత్రానికి ప్రేక్షక దేవుళ్ల ఆదరణ, అపూర్వమైన విజయాన్ని చూస్తుంటే నా మనసు కృతజ్ఞతా భావంతో నిండిపోతోంది. నేను ఎప్పుడూ నమ్మేది ఒకటే. నా జీవితం మీ ప్రేమ, అభిమానాలతో ముడిపడింది. మీరు లేనిదే నేను లేను. ఈరోజు మళ్లీ అదే నిజమని నిరూపించారు. ఈ విజయం పూర్తిగా నా ప్రియమైన తెలుగు ప్రేక్షకులది. నా ప్రాణ సమానమైన అభిమానులది, డిస్ట్రిబ్యూటర్లది, సినిమాకి ప్రాణం పెట్టి పని చేసిన ప్రతి ఒక్కరిది. ముఖ్యంగా దశాబ్దాలుగా నా వెంట నిలిచిన వారందరిది. వెండితెరపై నన్ను చూడగానే ప్రేక్షకులు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే నా శక్తి. ఈ బ్లాక్‌బస్టర్ విజయం వెనుక ఎంతో కృషి చేసిన మా దర్శకుడు అనిల్ రావిపూడికి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెలతో పాటు చిత్ర బృందం మొత్తానికి ధన్యవాదాలు. ఈ సంబరాన్ని అలాగే కొనసాగిద్దాం" అంటూ చిరు తన లేఖలో రాసుకొచ్చారు.

● 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలో 'హై... హై' అంటూ సాగే పాట అభిమానులను అలరించింది. ఈ పాట పాడింది చిరంజీవి మేనకోడలు నైరా అని తెలియచేస్తూ అనిల్ రావిపూడి పోస్ట్ పెట్టారు. నైరా... చిరు సోదరి మాధవి కుమార్తె అని వెల్లడించారు.

ఫన్నీ పర్వతాలు


నరేశ్

నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ప్రధాన పాత్రధారులుగా బద్రప్ప గాజుల తెరకెక్కిస్తున్న చిత్రం 'క్రేజీ కల్యాణం'. బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. మంగళవారం నరేశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. అందులో తను పర్వతాలు అనే పాత్రలో ఫన్నీ లుక్‌తో కనిపించారు. "పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో రూపొందిన చిత్రమిది. ఆద్యంతం వినోదాత్మకంగా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.

ఆ అవసరం వస్తుందనుకోను!

"స్వచ్ఛమైన హాస్యంతో నేను సినిమా చేసిన ప్రతిసారీ వాళ్లు విజయాన్ని కట్టబెడుతున్నారు. 'నారీ నారీ నడుమ మురారి' సినిమా నేను అనుకున్న ఫలితాన్ని రాబట్టడం ఎంతో తృప్తినిచ్చింది" అన్నారు శర్వానంద్. ఆయన హీరోగా, రామ్ అబ్బరాజు తెరకెక్కించిన సినిమానే 'నారీ నారీ నడుమ మురారి'. సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శర్వానంద్ మంగళవారం హైదరాబాదులో విలేకర్లతో ముచ్చటించారు.


శర్వానంద్

"తొలి రోజు ఈ కథ విన్నప్పుడు... చిత్రీకరణలో ఉన్నప్పుడూ ఈ సినిమాతో కచ్చితంగా పెద్ద విజయాన్ని అందుకుంటామని చెప్పేవాణ్ని. ఇక సంక్రాంతి సీజన్‌లో ఇలాంటి సినిమాల్ని ఇంకా బాగా ఆదరిస్తారు. ఆ విషయం ఎప్పుడో రుజువైంది. అందుకే నాలుగు సినిమాలు విడుదలవుతున్నా, కథపై నమ్మకంతో మేం కూడా వచ్చాం. పైగా ఈ సంక్రాంతికి సుదీర్ఘమైన వారాంతాలు చాలానే కలిసొచ్చాయి. ఇలా పక్కా ప్రణాళికలతోనే మేం సినిమాని విడుదల చేశాం. బాగుందనే మాట వినిపించగానే మా చిత్రానికి థియేటర్లు పెరిగాయి. ప్రతి సినిమా కథ నచ్చే చేస్తాం. విజయం సాధించాలనే కష్టపడతాం. కానీ అన్నీ కుదరాలి. ఈ సినిమాకి అలా అన్నీ కుదిరాయి".

❏ ఆ లుక్ నాకే నచ్చలేదు


"కొత్త లుక్‌లో నేను కనిపిస్తున్న తీరు అందరికీ నచ్చింది. 'బైకర్' కోసమే ఇలా మారిపోయాను. 'సూర్య సన్నాఫ్ కృష్ణన్'లో సూర్య ఎలా కనిపిస్తారో అలా 'బైకర్'లో రెండు రకాల లుక్స్‌లో కనిపించాల్సి వచ్చింది. అందుకే బరువు తగ్గి కొత్త లుక్‌లోకి మారిపోయా. 'జాను' సమయంలో నాకు ప్రమాదం జరిగింది. దాంతో బరువు పెరిగా. 'శ్రీకారం', 'ఆడవాళ్లూ మీకు జోహార్లు' సినిమాల్లో బొద్దుగా కనిపించా. వాటిలో నా లుక్ నాకే నచ్చలేదు. 'భోగి' సినిమాలో పొడవాటి జుట్టుతో మరింత కొత్తగా కనిపించబోతున్నా".

❏ "హాస్య ప్రధానమైన కథల్లో నటించడం నాకు కొత్త కాదు. అయితే ఒక సినిమా హిట్టయ్యిందని, మళ్లీ అలాంటి కథలే చేయాలనుకోను. ఒక నటుడిగా, ఓ కథకుడిగా ప్రతి సినిమాతోనూ ఓ కొత్త కథనే చెప్పాలని ఉంటుంది. అందుకే నేనెప్పుడూ ఒక జానర్‌కి పరిమితం కాలేదు. స్వచ్ఛమైన హాస్యంతో కూడిన కథలు చాలా అరుదు. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ కథ చెప్పగానే నాకు ఎంత ముచ్చటేసిందో! పరిశ్రమకు తనలాంటి దర్శకులు చాలా అవసరం. కథ ఎంత బాగా రాసుకున్నాడో, అంతే స్పష్టతతో చిత్రాన్ని తెరకెక్కించాడు. తన 'సామజవరగమన' సినిమా అంటే కూడా అంతే ఇష్టం. ఈ కథకు 'నారీ నారీ నడుమ మురారి' పేరైతేనే బాగుంటుందని బాలకృష్ణని సంప్రదించాం. అంత గొప్ప పేరు పెట్టుకున్నప్పుడు ఆ పేరు నిలబెట్టకపోతే బాగుండదు కదా. నిన్ననే మళ్లీ బాలకృష్ణకు ఫోన్ చేశా. ఆయన అభినందనలు చెబుతూ, నా పరువు నిలబెట్టావ్ శర్వా అన్నారు (నవ్వుతూ)".

❏ "నాకు ఇలాంటి కథ కావాలని నేనెప్పుడూ ప్రత్యేకంగా కథలు రాయించలేదు. ఇకపై అలాంటి అవసరం వస్తుందని కూడా నేననుకోను. దర్శకులు సిద్ధం చేసి తీసుకొచ్చిన కథలతోనే ప్రయాణం చేశా. అలాంటి మంచి కథలు నా దగ్గరకు రావడం నా అదృష్టం. తదుపరి నా సినిమా 'బైకర్' భారతదేశం గర్వపడేలా ఉంటుంది. ఇది తెలుగు సినిమా అని కాలర్ ఎగరేసి చెప్పేంత గొప్పగా ఉంటుంది. సంపత్ నంది దర్శకత్వంలో చేస్తున్న 'భోగి' కూడా మంచి కథ. ఆ తర్వాత శ్రీనువైట్లతో కలిసి పూర్తిస్థాయి హాస్య ప్రధానమైన సినిమా చేయబోతున్నా. అది మరింతగా నవ్విస్తుంది".

'స్లమ్ డాగ్'లో దునియా విజయ్

విజయ్ సేతుపతి - పూరి జగన్నాథ్ కలయికలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్లమ్ డాగ్. 33 టెంపుల్ రోడ్'.. అన్నది ఉపశీర్షిక. పూరి, ఛార్మి, జెబి నారాయణరావు కొండ్రోళ్ల నిర్మిస్తున్నారు. సంయుక్త, టబుతో పాటు దునియా విజయ్ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మంగళవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌లో విజయ్ రఫ్‌లుక్‌లో స్టైలిష్‌గా కనిపించారు. ఆయన కెరీర్‌లో ఇప్పటి వరకు చేయని విధంగా చాలా కొత్తగా ఈ పాత్ర ఉండనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతమందిస్తున్నారు.


దునియా విజయ్, పూరి జగన్నాథ్

'మరొక్కసారి' చూసేలా...


నరేశ్ అగస్త్య, సంజనా సారథి

ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో ఉన్న గురుడోంగ్మార్ సరస్సు దగ్గర చిత్రీకరించిన తొలి భారతీయ సినిమాగా మా 'మరొక్కసారి' నిలుస్తుందని, సాయుధ దళాల ప్రత్యేక అనుమతులతో అక్కడ చిత్రీకరణ జరిపామని తెలిపారు నితిన్ లింగుట్ల. ఆయన దర్శకత్వంలో... నరేశ్ అగస్త్య, సంజనా సారథి జంటగా నటించిన చిత్రమిది. బి.చంద్రకాంత్ రెడ్డి నిర్మాత. ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకొంటోంది. దక్షిణాదికి చెందిన నాలుగు ప్రధానమైన భాషల్లో సినిమాని విడుదల చేయనున్నారు. "అనుభూతిని పంచే ఓ మంచి ప్రేమకథతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని అరుదైన లొకేషన్లలో చిత్రీకరించాలని ముందే అనుకున్నాం. పేరుకి తగ్గట్టే మరొక్కసారి చూద్దాం అనిపించేలా సినిమా ఉంటుంది" అన్నారు నిర్మాత.

ప్రణాళిక లేకపోతే అంతే సంగతా?



ప్రకటించిన తేదీకి ప్రేక్షకుల ముందుకు వచ్చే తెలుగు సినిమాల్ని వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. భారీ స్థాయిలో రూపొందే పాన్ ఇండియా సినిమాలైతే ఏళ్లకు ఏళ్లు వాయిదా పడుతుంటాయి. వస్తుందని ఊరించి... ఆఖరి నిమిషంలో వాయిదా పడుతూ, మిగతా సినిమాల ప్రణాళికల్నీ పక్కదారి పట్టిస్తుంటాయి. ఏ సినిమా ఎప్పుడొస్తుందో తెలియని ఒక అనిశ్చిత వాతావరణం చిత్రసీమలో కనిపిస్తుంటుంది. అలా ఏటా ఎన్నో సినిమాలు దెబ్బ తింటున్నాయి. సినిమా టికెట్ ధరల పెంపు అనుమతులపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతోనైనా ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందా? తమ సినిమాలకు టిక్కెట్ ధరల్ని పెంచుకోవడానికైనా చిత్రసీమ విడుదల విషయంలో ఇకపై పక్కాగా వ్యవహరిస్తుందా? అలా జరగకపోతే టిక్కెట్ ధరల్ని పెంచుకోవడం కష్టమేనా? ఈ విషయాలే ఇప్పుడు తెలుగు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి.

● తెలంగాణలో ఇకపై టికెట్ ధరల పెంపునకు సంబంధించిన ఉత్తర్వుల జారీ ప్రక్రియ ఆయా సినిమాల విడుదలకు 90 రోజుల ముందే పూర్తి కావాలని రాష్ట్ర హోం శాఖని మంగళవారం హైకోర్టు ఆదేశించింది. న్యాయస్థానం తీర్పుతో సినీ నిర్మాతలు, వ్యాపారులు ఆలోచనలో పడిపోయారు. చిత్ర నిర్మాణాన్ని మరింత పకడ్బందీగా, ప్రణాళికతో సాగించడం తప్ప మరొక మార్గం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. పక్కా ప్రణాళిక ఉంటేనే విడుదల తేదీపై స్పష్టమైన ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం, 90 రోజుల ముందే ప్రభుత్వం నుంచి టిక్కెట్ ధరలపై అనుమతులు పొందేందుకు వీలు కలుగుతుంది. విడుదలపై స్పష్టత లేకపోతే మాత్రం సాధారణ టిక్కెట్ ధరలతోనే సరిపెట్టుకోవల్సి ఉంటుంది. ఈమధ్య కాలంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న సినిమాలే ఎక్కువ. ఆ స్థాయిలో వసూళ్లు తిరిగి రాబట్టుకోవాలంటే ముందస్తు ప్రదర్శనలు, టిక్కెట్ ధరలు పెంపు తప్పనిసరి అంటున్నారు నిర్మాతలు. వాళ్లు కోరుకుంటున్నట్టుగా ధరల్ని పెంచుకోవాలంటే కొబ్బరికాయ కొట్టినప్పుడే విడుదల తేదీని ప్రకటించి, ఆ మేరకు సినిమాల్ని పక్కాగా సిద్ధం చేయాల్సిందే. న్యాయస్థానం ఆదేశాలతో పెద్ద సినిమాలపై తీవ్ర ఒత్తిడి పెరిగినట్టయింది. అయితే ఈ ఆదేశాలు పక్కాగా అమలైతే చిన్న సినిమాలకి మాత్రం ఎంతో మేలు జరుగుతుందని, పెద్ద సినిమాలు అనుకున్న తేదీకి వస్తే చిన్న సినిమాల విడుదలకు పెద్దగా ఆటంకాలు ఉండవని పరిశ్రమలోని పలువురు నిర్మాతలు అభిప్రాయపడుతున్నారు.

కొన్ని జ్ఞాపకాలు.. మసకబారవు

"కొన్ని జ్ఞాపకాలు మసకబారిపోవు.. రక్తం చిందిస్తాయి" అంటూ సిరీస్ ప్రియుల్లో ఉత్కంఠతని రేకెత్తిస్తోంది బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సిరీస్ 'దల్దాల్'. సైకలాజికల్ క్రైమ్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సిరీస్‌కు అమృత్ రాజ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. విక్రమ్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. ఈ సిరీస్ ఈ నెల 30 నుంచి ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రసారం కానుంది. ఈ నేపథ్యంలో సిరీస్ బృందం తాజాగా ఇన్‌స్టాలో ఓ పోస్టర్‌ను పంచుకుంది. ఈ పోస్టర్‌లో భూమి తెగిపడి ఉన్న చేతుల మధ్య కనిపిస్తూ. . వీక్షకులలో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ముంబయి నేపథ్యంలో సాగే ఈ సిరీస్‌లో డీసీపీ రీటా ఫెరీరా పాత్రలో కనిపించనుంది భూమి. ఆమె ఓ సీరియల్ కిల్లర్‌ని ఎలా వేటాడిందనే కథాంశంతో రూపొందిందీ సిరీస్.


భూమి పెడ్నేకర్

ప్రేమ... డ్రామా


శ్రేయాసి సేన్, సౌమిత్

సౌమిత్ పోలాడి కథా నాయకుడిగా నటిస్తూ... సాయి.కె వెన్నంతో కలిసి దర్శకత్వం వహించిన చిత్రం 'నిలవే'. శ్రేయాసి సేన్ కథానాయిక. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా, రూపేష్ మారాపు కీలక పాత్రలు పోషించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కె.వెన్నం నిర్మాతలు. ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. "ప్రేమ, డ్రామా, సంగీతం ప్రధానంగా రూపొందిన చిత్రమిది. ఈ ప్రేమకథ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుంద"ని సినీ వర్గాలు చెప్పాయి.

కథాలోచన మాత్రమే తీసుకున్నాం


సజీవ్

భార్యాభర్తల నేపథ్యంలో మనసుల్ని హత్తుకునే భావోద్వేగాలు, సరదా సంఘటనల సమాహారంగా 'ఓం శాంతి శాంతి శాంతిః' సాగుతుందన్నారు ఎ.ఆర్.సజీవ్. ఆయన దర్శకుడిగా పరిచయమవుతూ... తరుణ్‌భాస్కర్, ఈషా రెబ్బా జంటగా తెరకెక్కించిన సినిమానే 'ఓం శాంతి శాంతి శాంతిః'. మలయాళంలో విజయవంతమైన 'జయ జయ జయ జయహే'కి రీమేక్‌గా రూపొందింది. ఎస్.ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఏఆర్ సజీవ్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ... "నా తొలి సినిమానే తరుణ్‌భాస్కర్, ఈషారెబ్బాతోపాటు ఓ పెద్ద బృందంతో కలిసి చేయడం అదృష్టంగా భావిస్తున్నా. మలయాళంలో రూపొందిన 'జయ జయ జయ జయహే' కథ అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. ఆ కథలోని ప్రధానమైన అంశాన్ని తీసుకొని మన సంస్కృతికి తగ్గట్టుగా, గోదావరి నేపథ్యాన్ని ఎంచుకుని సినిమాని తెరకెక్కించా. మాతృక నుంచి కథాలోచన మాత్రమే తీసుకున్నాం. మిగతాదంతా మనదైన శైలిలోనే సాగుతుంది" అన్నారు.


ఆకాశమే హద్దుగా..


వితిక, వరుణ్‌సందేశ్

నిజ జీవితంలో భార్యాభర్తలైన వరుణ్‌సందేశ్, వితికా షేరు నాయకానాయికలుగా తెరకెక్కుతున్న చిత్రం... 'డియర్ ఆస్ట్రోనాట్'. కార్తీక్ భాగ్యరాజా దర్శకత్వం వహిస్తూ, యువన్‌కృష్ణ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై స్వయంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా తొలి పోస్టర్‌ని ఇటీవలే విడుదల చేశారు. "చిన్నప్పటి నుంచి ఆకాశమే హద్దుగా ప్రయాణం చేసి, నక్షత్రాల మధ్య విహరించాలని కలలు కన్న ఓ మహిళ కథే ఈ చిత్రం. వ్యోమగామి కావాలనే తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఆ మహిళ ఎదుర్కొన్న సవాళ్లు, చేసిన పోరాటం ఎలాంటిదన్నది తెరపైనే చూడాలి. ఇదొక స్ఫూర్తిదాయకమైన కథ. చాలా కొత్తగా ఉంటుంది. వరుణ్, వితికా జోడీ చాలా బాగా నటిస్తోంది. ఉన్నతమైన నిర్మాణ విలువలతో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. పోస్టర్‌కి మంచి స్పందన లభిస్తోంద"ని సినీ వర్గాలు చెప్పాయి.

(c) eenadu

ఏఐ ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలి: సత్య నాదెళ్ల



దావోస్: కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా కలిగే ప్రయోజనాలు అందరికీ సమానంగా దక్కాలని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల అభిప్రాయపడ్డారు. 'విద్య లేదంటే ప్రభుత్వ విధానాల ద్వారా కావచ్చు.. ప్రతి ఒక్కరి జీవన విధానాన్ని మెరుగుపర్చడమే కృత్రిమ మేధ లక్ష్యంగా ఉండాలని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సదస్సులో నాదెళ్ల పేర్కొన్నారు. ఏఐపై చర్చంతా సాంకేతిక కంపెనీల కేంద్రంగానే జరిగితే.. అది గాలిబుడగ లాగా అవుతుందని అన్నారు. కీలక ఔషధాలను మార్కెట్లోకి తేవడంలో, క్లినికల్ ట్రయల్స్‌ను వేగవంతం చేయడంలో ఫార్మా కంపెనీలకు కృత్రిమ మేధ ఎలా ఉపయోగపడుతుందో చూడాలన్నారు. రోజువారీ జీవితాన్ని ఏఐ ఏ విధంగా మెరుగుపరుస్తుందో పరిశీలించాల్సిన అవసరం ఉందని నాదెళ్ల వివరించారు. కేవలం వినియోగాన్ని పెంచడం పైనే కాకుండా.. ఏఐ ఆధారిత ఆర్థిక వృద్ధిపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్పాదకతను పెంచడంలో, పని విధానాల్లో మార్పులు తేవడంలో ఏఐ, ఇతర ఆధునాతన సాంకేతికతలు ఎలా ఉపయోగపడుతున్నాయో ఆయన వివరించారు. ప్రజలు, సమాజం, దేశాలు, పరిశ్రమలకు కొంతైనా ప్రయోజనం కలిగేలా మనం ఏఐను వాడుతున్నామా? లేదా? అనే విషయాన్ని గమనిస్తూ ఉండాలని తెలిపారు.

సైయెంట్ డీఎల్‌ఎం లాభం రూ.11.23 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: సైయెంట్ డీఎల్‌ఎం, డిసెంబరు త్రైమాసికంలో రూ.303.35 కోట్ల ఆదాయంపై రూ.11.23 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.444.24 కోట్లు, నికర లాభం రూ.10.99 కోట్లుగా ఉన్నాయి. వీటితో పోలిస్తే ఈసారి ఆదాయం 31.7% తగ్గినా, నికర లాభం 2.2% పెరిగింది. ఏప్రిల్-డిసెంబరులో సంస్థ ఆదాయం రూ.892.4 కోట్లు, నికర లాభం రూ.50.8 కోట్లుగా ఉన్నాయి. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1091.57 కోట్లు, నికర లాభం రూ.37 కోట్లుగా ఉన్నాయి. ఐపీఓ నిధుల వినియోగం, కొన్ని క్యాపిటల్ సబ్సిడీల మార్పులకు బోర్డు ఆమోదం తెలిపింది. కొత్త లేబర్ కోడ్ నేపథ్యంలో, ఉద్యోగుల ప్రయోజనాల కోసం రూ.1.6 కోట్లు కేటాయించినట్లు కంపెనీ వెల్లడించింది.

'ఫోన్ పే ఐపీఓ'కు సెబీ ఆమోదం



దిల్లీ: ఫోన్ పే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దేశీయంగా మదుపర్లు ఎదురు చూస్తున్న ఐపీఓల్లో ఇదీ ఒకటిగా చెబుతున్నారు. పబ్లిక్ ఇష్యూ కోసం సవరించిన ముసాయిదా పత్రాలను సెబీ త్వరలోనే ఫోన్‌పే సమర్పించనున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ కేవలం ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) లోనే ఉండనుంది. దేశీయంగా యూపీఐ లావాదేవీల్లో ఫోన్ పే 45 శాతానికి పైగా మార్కెట్ వాటా కలిగి ఉంది. 2025 డిసెంబరులో ఈ సంస్థ 980 కోట్ల లావాదేవీలను నిర్వహించిందని ఎన్‌పీసీఐ గణాంకాల ద్వారా తెలుస్తోంది.

కోడి గుడ్డు

21న పౌల్ట్రీ వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100 గుడ్లకు రూపాయల్లో)

హైదరాబాద్	500
వరంగల్	502
విజయవాడ	500
తూ/ప గోదావరి	495
విశాఖపట్నం	500
చిత్తూరు	523

రెండు రోజుల్లో.. రూ.12 లక్షల కోట్లు ఆవిరి

సెన్సెక్స్ ▼1066 82180 | నిఫ్టీ ▼353 25233

వాణిజ్య యుద్ధ భయాల వల్లే


భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, విదేశీ మదుపర్ల వరుస అమ్మకాలతో దేశీయ సూచీలు మంగళవారం భారీగా నష్టపోయాయి. గ్రీన్‌లాండ్ విషయంలో తనకు సహకరించకపోతే టారిఫ్‌లు విధిస్తానని ఐరోపా సమాఖ్య (ఈయూ) దేశాలను, గాజా శాంతిమండలిలో చేరేందుకు తిరస్కరించిన ఫ్రాన్స్‌పై 200% సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించడంతో.. మార్కెట్లలో వాణిజ్య యుద్ధ భయాలు తీవ్రమయ్యాయి. ఈ ప్రభావం మన మార్కెట్లపైనా పడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 7 పైసలు నష్టపోయి 90.97 వద్ద ముగిసింది. అంతకుముందు 91.00కు చేరింది కూడా. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు 0.09% పెరిగి 63.91 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, షాంఘై, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి. ఐరోపా మార్కెట్లూ ప్రతికూలంగా కదలాడాయి.

● బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.9.86 లక్షల కోట్లు తగ్గి, రూ.455.82 లక్షల కోట్ల (5.01 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది. సోమ, మంగళవారాల్లో కలిపి రూ.12 లక్షల కోట్ల విలువను మదుపర్లు కోల్పోయారు.

● సెన్సెక్స్ ఉదయం 83,207.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,246.18) ప్రతికూలంగా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడిన సూచీ ఒక దశలో 82,010.58 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరింది. చివరకు 1,065.71 పాయింట్ల నష్టంతో 82,180.47 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సైతం 353 పాయింట్లు కోల్పోయి 25,232.50 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,585-25,171.35 పాయింట్ల మధ్య కదలాడింది.

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.2,938.33 కోట్లు

డీఐఐ కొనుగోళ్లు: రూ.3,665.69 కోట్లు



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మినహా..

సెన్సెక్స్ 30 షేర్లలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (+0.38%) మినహా మిగతా షేర్లన్నీ నష్టపోయాయి. ఎటర్నల్ 4.02%, బజాజ్ ఫైనాన్స్ 3.88%, సన్ ఫార్మా 3.68%, బజాజ్ ఫిన్‌సర్వ్ 3.05%, ఇండిగో 3.04%, ట్రెంట్ 2.89%, ఎం అండ్ ఎం 2.83%, ఏషియన్ పెయింట్స్ 2.75%, టాటా స్టీల్ 2.5%, అదానీ పోర్ట్స్ 2.4%, టెక్ మహీంద్రా 2.32%, అల్ట్రాటెక్ సిమెంట్ 1.96%, ఐటీసీ 1.95%, మారుతీ 1.85%, టీసీఎస్ 1.74%, టైటన్ 1.67%, ఎల్ అండ్ టీ 1.54%, హిందుస్థాన్ యూనిలీవర్ 1.52%, హెచ్‌సీఎల్ టెక్ 1.48%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.4%, ఎస్‌బీఐ 1.38%, ఇన్ఫోసిస్ 1.35%, పవర్‌గ్రిడ్ 1.24%, యాక్సిస్ బ్యాంక్ 1.11% డీలా పడ్డాయి.

● రంగాల వారీ సూచీలన్నీ స్థిరాస్తి, సేవలు, భారీ యంత్ర పరికరాలు, మన్నికైన వినిమయ వస్తువులు, టెలికాం, వాహన, విద్యుత్ రంగాలు 5.21% వరకు నష్టపోయాయి. బీఎస్‌ఈలో 707 షేర్లు సానుకూలంగా, 3,590 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 105 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

మార్కెట్ పతనానికి ఇవీ కారణాలు..

- వాణిజ్య యుద్ధ భయాలు
- ఎఫ్ఐఐల వరుస విక్రయాలు
- దేశీయంగా అంచనాలు అందుకోని కొన్ని కార్పొరేట్ సంస్థల త్రైమాసిక ఫలితాలు
- బలహీన అంతర్జాతీయ సంకేతాలు
- భారత విక్స్ (ఒడుదొడుకుల సూచీ) 7% పెరగడం
- బలహీన రూపాయి
- ట్రంప్ టారిఫ్‌లపై అమెరికా సుప్రీం కోర్టు నిర్ణయం కోసం మదుపర్ల ఎదురుచూపులు
- ముడి చమురు ధరలు పెరగడం
- నిఫ్టీ జనవరి కాంట్రాక్టులు ముగింపు దశకు రావడం
- పీఎస్‌యూ బ్యాంక్ సూచీ తగ్గడం

గ్రో నుంచి గ్రో ప్రైమ్

మదుపర్లు తమ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను మరింత సమర్థంగా నిర్వహించడంలో సాయపడటానికి రూపొందించిన గ్రో ప్రైమ్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించినట్లు ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గ్రో మంగళవారం వెల్లడించింది. ఈ సేవను ఎంచుకోవడం ద్వారా మదుపర్లు 24/7 చాట్ మద్దతు, లోతైన పోర్ట్‌ఫోలియో ఇన్‌సైట్స్, మెరుగైన పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడంలో సాయం పొందవచ్చని గ్రో తెలిపింది.

ఒక ఛార్జింగ్‌తో 543 కి.మీ. ప్రయాణం

'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా' విడుదల



తమ తొలి బ్యాటరీ విద్యుత్ ఎస్‌యూవీ 'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) మంగళవారం ఆవిష్కరించింది. ఈ ఎస్‌యూవీకి 49-61 కిలోవాట్ అవర్ బ్యాటరీలు అమర్చినందున, ఒకసారి ఛార్జ్ చేస్తే 543 కి.మీ.ల వరకు ప్రయాణించవచ్చని టీకేఎం డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తడషి అసజుమా తెలిపారు. 8 ఏళ్ల బ్యాటరీ వారంటీతో పాటు బ్యాటరీ-యాజ్-ఎ-సర్వీస్ పద్ధతిలోనూ ఈ కారు లభిస్తుంది. రూ.25,000తో బుకింగ్ చేసుకోవచ్చని, ఫిబ్రవరి నుంచి డెలివరీ చేయవచ్చని సమాచారం. ఈ వాహన ధరలు రూ.20.79-24.49 లక్షల శ్రేణిలో ఉండొచ్చని అంచనా. ఇప్పటికే ఇ-విటారా పేరుతో ఈ వాహనాన్ని మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) విడుదల చేసింది.

టాటా నుంచి 17 కొత్త ట్రక్కులు

వాణిజ్య వాహనాల అమ్మకాలు పెరిగేందుకు జీఎస్‌టీ 2.0 ఉపకరిస్తుందనే భావనతో, టాటా మోటార్స్ కొత్తగా 17 తదుపరి తరం ట్రక్కులను ఆవిష్కరిస్తోంది. ఇందులో సంప్రదాయ ఇంధనాలతో నడిచేవి, 7-55 టన్నుల సరకు రవాణాకు ఉపయోగపడే విద్యుత్తుతో నడిచేవి ఉన్నాయని టాటా మోటార్స్ ఎండీ గిరీశ్ వాఘ్ తెలిపారు. కొత్తగా రూపొందించిన అజూరా వాహనాలు, ఇంటెలిజెంట్ మాడ్యులర్ ఎలక్ట్రికల్ వెహికల్ ఆర్కిటెక్చర్ (ఐఎంఓఈవీ)పై తెస్తున్నవి ఉంటాయని వెల్లడించారు.

అరుదైన ఔషధాల తయారీ

హెచ్‌ఆర్‌వీ ఫార్మా-హాలియోస్ ల్యాబ్స్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: అరుదైన వ్యాధుల చికిత్సలో వాడే పలు ఔషధాలు, ప్రత్యేకమైన ఏపీఐల తయారీ కోసం హెచ్‌ఆర్‌వీ ఫార్మా, హాలియోస్ ల్యాబ్స్ (ఎస్ఎంఎస్ లైఫ్ సైన్సెస్) కీలక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఇందులో భాగంగా ఇరు సంస్థలు అరుదైన వ్యాధులు, సీఎన్‌ఎస్ రుగ్మతలు, మెటబాలిక్ సమస్యల చికిత్స కోసం ఏటా 5-7 కొత్త మాలిక్యూల్స్ అభివృద్ధి చేసి, మార్కెట్లోకి తేనున్నాయి. హాలియోస్ తయారీ నైపుణ్యం, హెచ్‌ఆర్‌వీకి 50 దేశాల్లో ఉన్న అంతర్జాతీయ నెట్‌వర్క్ ద్వారా అమెరికా, ఐరోపా వంటి దేశాలకూ ఈ ఔషధాలను సరఫరా చేస్తారు. ఇప్పటికే ప్రాథమిక ప్రాజెక్టులతో పనులు ప్రారంభమయ్యాయని, అమెరికా డ్రగ్ మాస్టర్ ఫైల్ (డీఎంఎఫ్) ఫైలింగ్‌లూ పూర్తయ్యాయని హెచ్‌ఆర్‌వీ ఎండీ హరి కిరణ్ చేరెడ్డి, హాలియోస్ ల్యాబ్స్ ఈడీ ప్రవీణ్ టి తెలిపారు.

రూ.300 కోట్లతో ఆయుధ తయారీ కేంద్రం

అపోలో మైక్రో సిస్టమ్స్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని టీఎస్ఐఐసీ హార్డ్‌వేర్ పార్క్-2లో సమీకృత ఆయుధ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.300 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు అపోలో మైక్రో సిస్టమ్స్, స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమిని రూ.27.58 కోట్లకు కొనుగోలు చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త ప్లాంటులో గ్రాడ్ రాకెట్లు, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్లు, యాంటీ ట్యాంక్ మైన్స్ వంటివి తయారు చేస్తామంది. నిర్మాణంలో ఉన్న యూనిట్‌తో కలిపి 10.68 ఎకరాల్లో ప్లాంటు ఉంటుందని సంస్థ ఎండీ కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

యూపీలో ఏఐ హబ్

● ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రూపు



ఈనాడు, హైదరాబాద్: గ్రీన్‌కో గ్రూపు వ్యవస్థాపకుల నేతృత్వంలోని ఏఎం గ్రూపు, ఉత్తరప్రదేశ్ గ్రేటర్ నోయిడా ప్రాంతంలో 1 గిగావాట్ సామర్థ్యంతో కర్బన రహిత, అధిక సామర్థ్యంతో కూడిన కృత్రిమమేధ (ఏఐ) కంప్యూటింగ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో అంతర్జాతీయ అవసరాలను తీర్చే విధంగా ఇది ఉంటుందని పేర్కొంది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో భాగంగా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ విభాగమైన 'ఇన్వెస్ట్ యూపీ'తో ఏఎం గ్రూపు ఈ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ ప్రాజెక్టు కోసం సంస్థ దాదాపు రూ.2.25 లక్షల కోట్ల (25 బిలియన్ డాలర్ల) పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టును దశల వారీగా అభివృద్ధి చేస్తారు. మొదటి దశ 2028 నాటికి పూర్తవుతుందని, 2030లో పూర్తి స్థాయి 1 గిగావాట్ సామర్థ్యాన్ని సాధించాలని ఏఎం గ్రూప్ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు 5 లక్షల అత్యాధునిక అధిక సామర్థ్యం గల చిప్‌సెట్‌లతో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్టు.. దేశంలోనే ఇప్పటి వరకు చేసుకున్న అతి పెద్ద పెట్టుబడి ఒప్పందాల్లో ఒకటిగా నిలవనుంది. ఏఎం గ్రూపు ఛైర్మన్ అనిల్ చలమలశెట్టి మాట్లాడుతూ.. గ్లోబల్ ఏఐ వ్యవస్థ పరిణామం ప్రస్తుత, భవిష్యత్ తరాలకు ఎంతో కీలకం కానుందన్నారు. ఎలక్ట్రాన్ ఏజెంట్లను ఇంటెలిజెంట్ టోకెన్లుగా మార్చడంపై దృష్టి సారించినట్లు తెలిపారు. ఏఎం గ్రూపు ప్రెసిడెంట్ మహేష్ కొల్లి మాట్లాడుతూ.. 1 గిగావాట్ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని 24/7 హరిత ఇంధనంతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. దీనిద్వారా ఏఐ మౌలిక వసతుల కల్పనలో సుస్థిర నమూనాను ఆవిష్కరిస్తున్నట్లు వెల్లడించారు.

4 నెలల గరిష్ఠానికి కీలక రంగాల వృద్ధి



దిల్లీ: దేశంలోని 8 కీలక రంగాల ఉత్పత్తి, గత నెలలో 3.7% పెరిగింది. ఇది 4 నెలల గరిష్ఠం. ఎరువులు, సిమెంటు రంగాల్లో ఉత్పత్తి పెరగడం ఇందుకు కారణమని ప్రభుత్వం తెలిపింది. 2025 నవంబరులో ఈ రంగాల ఉత్పత్తిలో వృద్ధి 2.1 శాతమే. 2024 డిసెంబరులో నమోదైన వృద్ధి 5.1 శాతంతో పోలిస్తే.. 2025 డిసెంబరులో 8 కీలక రంగాల వృద్ధి నెమ్మదించినట్లే.
✦ 2025 డిసెంబరులో ముడి చమురు, సహజవాయువు, శుద్ధి ఉత్పత్తుల రంగాల ఉత్పత్తిలో ప్రతికూల వృద్ధి నమోదైంది. ✦ ఎరువులు, సిమెంటు రంగాల ఉత్పత్తిలో వరుసగా 4.1%, 13.5% చొప్పున వృద్ధి ఉంది. ✦ బొగ్గు రంగ ఉత్పత్తి 3.6 శాతానికి, ఉక్కు ఉత్పత్తి 6.9 శాతానికి, విద్యుదుత్పత్తి 5.3 శాతానికి పరిమితమైంది. ✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరులో 8 రంగాల ఉత్పత్తిలో వృద్ధి 2.6 శాతానికి తగ్గింది. 2024-25 ఇదే కాలంలో ఇది 4.5 శాతంగా నమోదైంది.

హైదరాబాద్‌లో మరిన్ని విద్యుత్తు వాహనాలు: జిప్ ఎలక్ట్రిక్

విద్యుత్తు వాహనాలను అద్దెకు ఇచ్చే సంస్థ జిప్ ఎలక్ట్రిక్, హైదరాబాద్‌లో తమ వాహనాల సంఖ్యను 10,000కు, జయపురలో 5,000కు పెంచుతామని ప్రకటించింది. ఈ 2 నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభించిన నెలలోపే తమ వాహనాల సంఖ్య 1,000కి చేరినట్లు వివరించింది. గతేడాదిలో చూస్తే, దేశ వ్యాప్తంగా ఈ సంస్థ నిర్వహిస్తున్న వాహనాల సంఖ్య 22,000గా ఉంది. 1,500 బ్యాటరీ స్వాప్ కేంద్రాలు కూడా నిర్వహిస్తోంది. 2030 నాటికి దేశంలోని 25 నగరాల్లో 1,00,000 వాహనాలు నిర్వహించాలన్నది సంస్థ లక్ష్యం.

ఆరోహణ్ ఫైనాన్షియల్ రూ.1500 కోట్ల ఐపీఓ

ఎన్‌బీఎఫ్‌సీ-ఎంఎఫ్ఐ ఆరోహణ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ వచ్చే ఆర్థిక సంవత్సరం మధ్యలో రూ.1,500 కోట్ల పబ్లిక్ ఇష్యూకు వచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు కంపెనీ ఎండీ మనోజ్ కుమార్ నంబియార్ వెల్లడించారు. ఈ ఐపీఓకు మర్చంట్ బ్యాంకర్లను నియమించుకున్నామని, 2 నెలల్లో మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి ముసాయిదా పత్రాలు దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

అత్యంత విలువైన ఐటీ బ్రాండ్లలో టీసీఎస్, ఇన్ఫోసిస్





అంతర్జాతీయంగా అత్యంత విలువైన ఐటీ సేవల బ్రాండ్లలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఇన్ఫోసిస్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ 'ఐటీ సర్వీసెస్ 25 (2026)' నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. 25 సంస్థలతో విడుదల చేసిన ఈ జాబితాలో అమెరికా, భారత్ నుంచి చెరి 8 సంస్థలున్నాయి. గత 8 ఏళ్లుగా మొదటి స్థానంలో నిలుస్తున్న యాక్సెంచర్, ఈసారీ 42.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.3.80 లక్షల కోట్ల) బ్రాండ్ విలువతో అగ్ర స్థానంలో కొనసాగింది. టీసీఎస్ వరుసగా అయిదో సంవత్సరమూ 21.2 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.91 లక్షల కోట్ల)తో రెండోస్థానంలో నిలిచింది. బ్రాండ్ విలువను ఏటా 15% చొప్పున పెంచుకుంటూ, గత ఆరేళ్లుగా అత్యంత వేగవంతమైన వృద్ధి సంస్థగా నిలిచిన ఇన్ఫోసిస్, 16.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.48 లక్షల కోట్ల)తో మూడో స్థానంలో నిలిచింది. అత్యంత విశ్వసనీయ, నమ్మదగిన బ్రాండ్‌గా టీసీఎస్ నిలిచింది. ఈ జాబితాలోని తొలి 10 సంస్థల్లో హెచ్‌సీఎల్ టెక్, విప్రో కూడా ఉన్నాయి. 12వ స్థానంలో టెక్ మహీంద్రా, తర్వాత స్థానాల్లో ఎల్‌టీఐమైండ్‌ట్రీ, పర్సిస్టెంట్ సిస్టమ్స్, హెగ్జావేర్ టెక్నాలజీస్ ఉన్నాయి.

✦ ఈ జాబితాలోని 25 ఐటీ కంపెనీల బ్రాండ్ల విలువ కలిపి 167.2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.05 లక్షల కోట్లు) అని నివేదిక తెలిపింది. బహుళజాతి సంస్థలైన క్యాప్‌జెమినీ, ఎన్‌టీటీ డేటా, కాగ్నిజెంట్, ఈపామ్, జెన్‌ప్యాక్ట్ వంటి సంస్థలూ ఈ జాబితాలో ఉన్నాయి.

భారత్-ఈయూ వాణిజ్య ఒప్పందం అతిత్వరలో ఖరారు

యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్

దావోస్: భారత్‌తో చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు ఐరోపా కూటమి (ఈయూ) సిద్ధమవుతోందని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా వాన్ డెర్ లెయెన్ అన్నారు. ఈ ఒప్పందం వల్ల 200 కోట్ల మందికి ప్రయోజనం కలగడమే కాకుండా, ప్రపంచ జీడీపీలో నాలుగో వంతుకు సమానమైన మార్కెట్‌ను ఇది సృష్టిస్తుందని వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశంలో మాట్లాడుతూ ఆమె తెలిపారు. 'దావోస్‌లో సమావేశం తర్వాత నేను భారత్‌కు వెళ్తున్నాను. వాణిజ్య ఒప్పందం దిశగా ఇంకా కొంత పనిచేయాల్సి ఉంది. అయితే చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే దిశగా మనం సిద్ధమవుతున్నాం. కొందరు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా పిలుస్తున్నార'ని చెప్పారు. ప్రస్తుతం వృద్ధికి కేంద్రాలుగా ఉన్న దేశాలతో, ఈ శతాబ్దపు శక్తిమంత ఆర్థికవ్యవస్థలతో వ్యాపారాలు చేయాలని భారత్ - ఈయూ కోరుకుంటున్నట్లు తెలిపారు. యూరోపియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ ఆంటోనియో కోస్టా, వాన్ డెర్ లెయెన్ ఈ నెల 25-27 తేదీల్లో భారత్‌లో పర్యటించడమే కాక, భారత గణతంత్ర దినోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. వాణిజ్య ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోదీతోనూ చర్చలు జరుపుతారు. భారత్-ఈయూ మధ్య వాణిజ్య ఒప్పంద చర్చల ముగింపుపై జనవరి 27న ఇరు దేశాల ప్రతినిధులు ప్రకటిస్తారు. భారత్‌కు ఐరోపా కూటమి అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా ఉంది. 2023-24లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 135 బిలియన్ డాలర్లుగా ఉంది. స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య బంధం మరింతగా బలపడే అవకాశం ఉంది.

ఐకియా మరిన్ని చిన్న స్టోర్లు

స్వీడన్‌కు చెందిన ఫర్నిచర్ సంస్థ ఐకియా, మనదేశంలో మరిన్ని స్టోర్లు ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం అదనపు పెట్టుబడులు పెడతామని ఐకియా ఇండియా సీఈఓ ప్రతీక్ తెలిపారు. తమిళనాడులో ఆన్‌లైన్ విక్రయాలు ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంప్రదాయంగా పెడుతున్న భారీ స్టోర్లతో పాటు 2,000-5,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో పలు చిన్న స్టోర్లు నెలకొల్పుతామన్నారు. 2013లో రూ.10,500 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ)కి భారత ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చిందని, ప్రస్తుతం ఏకబ్రాండ్ కింద 100% ఎఫ్‌డీఐ పెట్టుకునేలా నిబంధనలు సవరించారని గుర్తు చేశారు.

సీబీఆర్650ఆర్ బైక్‌లు వెనక్కి: హెచ్ఎంఎస్ఐ

వైరింగ్‌లో లోపాలను సవరించేందుకు సీబీఆర్ 650ఆర్ మోటార్‌సైకిళ్లను వెనక్కి పిలిపిస్తున్నట్లు హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తెలిపింది. 2024 డిసెంబరు 16 నుంచి 2025 మే 4 మధ్య తయారైన ఈ బైక్‌లలో వైరింగ్ లోపం వల్ల షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం ఉందని, లైట్లు సరిగా పనిచేయకపోవచ్చని గుర్తించామంది. ఈ తేదీల్లో తయారైన బైక్‌లను కలిగిన యజమానులు సమీపంలోని బిగ్‌వింగ్ డీలర్‌షిప్‌ను సంప్రదిస్తే, మరమ్మతుకు గురయిన విడిభాగాలను వారెంటీ లేకపోయినా ఉచితంగా మార్చి ఇస్తారని సంస్థ తెలిపింది.

నాణ్యతా ధ్రువీకరణ రుసుము రాయితీ కొనసాగింపు

ఉత్పత్తి రంగంలో నాణ్యతకే ప్రాధాన్యం ఇచ్చే విధానాన్ని మన దేశం అనుసరిస్తున్న నేపథ్యంలో.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ (ఎస్ఎంఈ)లకు మద్దతుగా నాణ్యతా ధ్రువీకరణ రుసుము రాయితీలను 2026 మధ్యకాలపు గడువుకు అదనంగా మరో 3 ఏళ్ల పాటు పొడిగించనున్నట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. సూక్ష్మ సంస్థలకు 80%, చిన్న సంస్థలకు 50%, మధ్య స్థాయి సంస్థలకు 20% రాయితీని మరికొంతకాలం పొడిగించే ప్రతిపాదనను భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) చేసిందని పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యక్రమంలో పాల్గొన్న వినియోగదారు వ్యవహారాల మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి భరత్ ఖేరా వెల్లడించారు.

సంక్షిప్తంగా

✦ మహారాష్ట్రలోని కవలాపూర్ అరుదైన భూ ఖనిజాల (ఆర్ఈఈ) క్షేత్రం కోసం గనుల మంత్రిత్వ శాఖ నుంచి ఖనిజ రాయితీ లైసెన్స్ పొందినట్లు **కోల్ ఇండియా** మంగళవారం తెలిపింది.

✦ ఒడిశాకు చెందిన **త్రివేణి పెల్లెట్స్**లో 50.01% ఈక్విటీ వాటాను రూ.636 కోట్లతో కొనుగోలు చేయాలనే **టాటా స్టీల్** ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది.

✦ **ఆర్‌బీఎల్ బ్యాంక్**లో మెజార్టీ వాటా కొనుగోలు చేయాలనే **ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్** ప్రతిపాదనను సీసీఐ మంగళవారం ఆమోదించింది. 2025 అక్టోబరులో ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్, ఆర్‌బీఎల్ బ్యాంక్ బోర్డులు కుదుర్చుకున్న కచ్చితమైన ఒప్పందం తర్వాత ఈ అనుమతి లభించింది. ఇందుకోసం ఆర్‌బీఎల్ బ్యాంకులోకి 3 బిలియన్ డాలర్ల (సుమారు రూ.27,000 కోట్ల)ను ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ ప్రాథమికంగా చొప్పించనుంది.

✦ డిసెంబరు త్రైమాసికంలో లాభం 10.5% తగ్గడంతో **ఎల్‌టీఐమైండ్‌ట్రీ** షేరు బీఎస్ఈలో 6.67% తగ్గి రూ.5,977.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 7.68% నష్టపోయి రూ.5,912.80 స్థాయినీ తాకింది. మార్కెట్ విలువ రూ.12,625.52 కోట్లు తగ్గి, రూ.1,77,236.82 కోట్లకు పరిమితమైంది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
జేఅండ్‌కే బ్యాంక్	587	532	3593	3448
ఐటీసీ హోటల్స్	237	216	1231	1015
ఎస్ఆర్ఎఫ్	433	271	3713	3491
టాటాటెలి (మహారాష్ట్ర)	(150)	315	294	333
న్యూజెన్ సాఫ్ట్‌వేర్	63	89	400	381
పెర్సిస్టెంట్ సిస్టమ్స్★	439	373	3778	3062
ఏయూస్మాల్‌ఫైనాన్స్ బ్యాంక్	668	528	3065	2641
విక్రమ్ సోలార్	98	19	1106	1026
ఇండియామార్ట్	188	121	402	354
యునైటెడ్ స్పిరిట్స్	418	335	7942	7732
టీబీజడ్	81	30	1063	929
పీటీసీ ఇండియా	49	67	125	158
షాపర్స్‌స్టాప్	16	52	1416	1379

★ మధ్యంతర డివిడెండ్ రూ.22

ఈనాడు - హైదరాబాద్

హామీలు నెరవేర్చాం

కొత్త బడ్జెట్ వేళ.. ఆర్థిక శాఖ 'ప్రోగ్రెస్ రిపోర్టు'

కేంద్ర బడ్జెట్ 2026-27 సమర్పణకు సమయం ఆసన్నమవుతున్న వేళ, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కీలక ప్రకటన చేసింది. గత బడ్జెట్‌లలో ప్రకటించిన ప్రత్యక్ష పన్ను సంస్కరణల అమలులో పురోగతిని వెల్లడించింది. పన్ను చెల్లింపుదారులు, పెట్టుబడిదారులకు కల్పించిన వెసులుబాట్లను తెలిపింది. పెట్టుబడులకు భరోసా కల్పించడం, పన్ను నిబంధనల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా పలు చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. పన్ను చెల్లింపుదారులు, సీనియర్ సిటిజన్లకు ఊరటనిచ్చే పలు నిర్ణయాల గురించి ఆర్థిక శాఖ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో వెల్లడించింది.



వ్యక్తులకు వరాలు..

సామాన్య ప్రజల పొదుపు, పింఛను పథకాలు, ఇళ్లకు సంబంధించిన పన్ను నిబంధనల్లో కీలక సడలింపులు చేసినట్లు గుర్తు చేసింది.

ఎన్ఎస్ఎస్: నేషనల్ సేవింగ్స్ స్కీం ఖాతాదారులు 2024 ఆగస్టు 29 లేదా ఆ తర్వాత ఎన్ఎస్ఎస్ ఖాతాల నుంచి వెనక్కి తీసుకుంటున్న మొత్తంపై పన్ను ఉండదు. ఇవి పూర్తిగా పన్ను మినహాయింపు పరిధిలోకి వస్తాయి.

ఎన్‌పీఎస్ వాత్సల్య: పిల్లల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు/సంరక్షకులు చేసే పొదుపును ప్రోత్సహించేందుకు ఎన్‌పీఎస్ (జాతీయ పింఛను పథకం) వాత్సల్య పథకంలో అదనపు ప్రయోజనం కల్పించారు. సెక్షన్ 80సీ కింద లభించే ప్రామాణిక పరిమితికి అదనంగా, సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000 వరకు అదనపు మినహాయింపు పొందొచ్చు.

ఇంటి విషయంలో: సొంత అవసరాలకు వాడుకునే రెండు ఇళ్ల విషయంలో 'నిల్ యాన్యువల్ వ్యాల్యూ' సౌకర్యాన్ని కల్పించింది. గతంలో ఉద్యోగ రీత్యా వేరే ఊర్లో ఉంటూ, సొంత ఊర్లోని ఇంటిని ఖాళీగా ఉంచినా.. దానికి అద్దె వస్తున్నట్లుగా భావించి పన్ను వేసేవారు. ఆ నిబంధనను తొలగించారు.

అంకురాలకు అండగా...

దేశీయంగా అంకుర సంస్థలను ప్రోత్సహించేందుకు, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని బలోపేతం చేసేందుకు పన్ను రాయితీలు పొడిగించారు. ఇందులో భాగంగా..

✦ అర్హత కలిగిన స్టార్టప్‌ల ఏర్పాటు గడువును 2030 మార్చి 31 వరకు పొడిగించారు. ఈ సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి పదేళ్లలో, వరుసగా ఏవేని మూడేళ్లపాటు లాభాలపై 100% పన్ను మినహాయింపు తీసుకోవచ్చు.

✦ దేశాన్ని ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్, తయారీకి 'గ్లోబల్ హబ్'గా మార్చేందుకు సెక్షన్ 44బీబీడీ కింద ప్రిజెంప్టివ్ పన్ను విధానాన్ని ప్రవేశపెట్టారు. ఎలక్ట్రానిక్స్ యూనిట్లకు సేవలు లేదా సాంకేతికత అందించే ప్రవాసులకు, వారి స్థూల రాబడిలో 25 శాతాన్నే లాభంగా పరిగణించి పన్ను విధిస్తారు.

ఏఐఎఫ్‌లపై స్పష్టత..

ప్రత్యామ్నాయ పెట్టుబడి నిధుల (ఏఐఎఫ్) ఆదాయ వర్గీకరణలో స్పష్టతనిచ్చింది. ఈ సంస్థలకు పన్ను భరోసా కల్పించేందుకు ఫైనాన్స్ చట్టం-2025 ద్వారా సెక్షన్ 2(14)ను సవరించారు. దీని ప్రకారం కేటగిరీ-1, కేటగిరీ-2 ఏఐఎఫ్‌లున్న సెక్యూరిటీలను స్పష్టంగా మూలధన ఆస్తులుగా పరిగణిస్తారు. వీటి బదిలీ ద్వారా వచ్చే ఆదాయంపై వ్యాపార లాభాల కింద కాకుండా.. మూలధన లాభాల కింద పన్ను విధిస్తారు. 2026 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానుంది.

(c) eenadu

దరఖాస్తు చేశారా?
☛ ఎన్టీపీసీ లిమిటెడ్‌లో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు
చివరి తేదీ: 27-01-2026
☛ యుకో బ్యాంక్‌లో జనరలిస్ట్ & స్పెషలిస్ట్ ఆఫీసర్స్
చివరి తేదీ: 02-02-2026

కరెంట్ అఫైర్స్



★ హీ-మ్యాన్ ఆఫ్ బాలీవుడ్‌గా పేరుగాంచిన ప్రఖ్యాత బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర డియోల్ (89) 2025 నవంబరు 24న ముంబయిలో మరణించారు. 2012లో ధర్మేంద్ర ఏ పురస్కారాన్ని గెలుచుకున్నారు?

జ: పద్మభూషణ్ (ధర్మేంద్ర తొలి చిత్రం - దిల్ భీ తేరా హమ్ భీ తేరే. చివరి చిత్రం - ఇక్కీస్. ప్రసిద్ధ చిత్రాలు షోలే, ఫూల్ ఔర్ పత్థర్, చుప్కే చుప్కే.)

మాదిరి ప్రశ్నలు

★ అంతర్జాతీయ పురుషుల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు? ('సెలబ్రేటింగ్ మెన్ అండ్ బాయ్స్' అనే థీమ్‌తో ఈ ఏడాది దినోత్సవాన్ని నిర్వహించారు.)

జ: నవంబరు 19

★ క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ సస్టెయినబిలిటీ ర్యాంకింగ్స్ 2026 నివేదికలో ఏ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచింది?


జ: లండ్ యూనివర్సిటీ, స్వీడన్ (తర్వాతి స్థానాల్లో వరుసగా టొరంటో విశ్వవిద్యాలయం-కెనడా, యూనివర్సిటీ కాలేజ్ లండన్ - యూకే, ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయం - యూకే, బ్రిటిష్ కొలంబియా విశ్వవిద్యాలయం-కెనడాలు నిలిచాయి.)

★ దేశంలో ప్రముఖ సాంస్కృతిక కార్యక్రమమైన హార్న్‌బిల్ ఫెస్టివల్‌కు 2025లో ఏ రెండు దేశాలు అధికారిక భాగస్వాములుగా వ్యవహరించాయి?

మరింత సమాచారం

జ: స్విట్జర్లాండ్, ఐర్లాండ్ (ఈ రెండు దేశాలను ఏటా హార్న్‌బిల్ ఫెస్టివల్‌ను నిర్వహించే నాగాలాండ్ ఎంపిక చేసింది.)

ప్రశ్న మారుతోంది.. పద్ధతి మారాలి!



పెరుగుతున్న పోటీకి అనుగుణంగా అంకగణితం ప్రశ్నల సరళిలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా కసాగు-గసాభా, వడ్డీలు, కాలం-పని, పైపులు-ట్యాంకులు, నిష్పత్తి-అనుపాతం తదితర అధ్యాయాల నుంచి గతంలో ప్రశ్నలు నేరుగా వచ్చేవి. కానీ, ఇప్పుడు అభ్యర్థి తార్కిక ఆలోచనా శక్తిని పరీక్షించే విధంగా క్లిష్టంగా అడుగుతున్నారు. అధికమవుతున్న పోటీని తట్టుకుని విజయం సాధించాలంటే, పాత పద్ధతులకు పరిమితం కాకూడదు. గత పరీక్షల ప్రశ్నపత్రాలను క్షుణ్ణంగా విశ్లేషించి అభ్యర్థులు తమ ప్రిపరేషన్ శైలిని మార్చుకోవాలి. సంప్రదాయ పద్ధతులతో పాటు సమయాన్ని ఆదా చేసే సంక్షిప్త పద్ధతులనూ నేర్చుకోవాలి. నిరంతర ప్రాక్టీస్ చేస్తూ వేగాన్ని, కచ్చితత్వాన్ని పెంపొందించుకోవాలి.

జనరల్ స్టడీస్ - అరిథ్‌మెటిక్

1 రెండు సంఖ్యల కసాగు, వాటి గసాభాకు 20 రెట్లు. వాటి కసాగు గసాభాల మొత్తం 2520. మొదటి సంఖ్య 480 అయితే మొదటి, రెండో సంఖ్యల మధ్య నిష్పత్తి ఎంత? (ఏపీ ఎస్ఐ-2023)

1) 3 : 4 2) 4 : 5 3) 5 : 6 4) 3 : 5

సాధన: కసాగు = l గసాభా = h అనుకుంటే దత్తాంశం ప్రకారం

$l = 20h \Rightarrow l + h = 2520 \Rightarrow 20h + h = 2520 \Rightarrow 21h = 2520$

$h = \frac{2520}{21} = 120 \Rightarrow l = 20h = 20 \times 120 \Rightarrow l = 2400 \Rightarrow l \times h = F \times S$

(రెండు సంఖ్యల లబ్ధం = రెండు సంఖ్యల కసాగు × గసాభా)

$2400 \times 120 = 480 \times S$

$S = \frac{2400 \times 120}{480} \Rightarrow F : S = 480 : 600 = 4 : 5$

సంక్షిప్త పద్ధతి:


4 —20— 5
×120 ×120
480 : 600
4 : 5



జ: 2

2 కొంత సొమ్మును 5% వడ్డీరేటుతో మూడేళ్ల కాలానికి చక్రవడ్డీ, బారువడ్డీకి ఇచ్చారు. రెండు వడ్డీల మధ్య తేడా 305 అయితే అసలు ఎంత? (ఏపీ ఎస్ఐ-2023)

1) రూ.40,000
2) రూ.32,000
3) రూ.80,000
4) రూ.72,000



సాధన: 3 సంవత్సరాల కాలానికి చక్రవడ్డీ, బారువడ్డీల మధ్య తేడా

$P = \frac{D \times 10^6}{R^2(300 + R)}$

$= \frac{305 \times 10,00,000}{25(305)} = 40,000$

జ: 1

3 కొంత సొమ్మును 5% బారువడ్డీకి ఇస్తే రెండేళ్లలో మొత్తం రూ.132 అవుతుంది. అయితే అసలు ఎంత? (టీఎస్ ఎస్ఐ-2023)

1) రూ.120 2) రూ.122
3) రూ.112 4) రూ.118.80

సాధన: ఇచ్చినవి మొత్తం A = 132

కాలం T = 2 సంవత్సరాలు

వడ్డీరేటు R = 5%, అసలు P = x అనుకుంటే

$A = P\left(1 + \frac{TR}{100}\right) \Rightarrow 132 = x\left(1 + \frac{2 \times 5}{100}\right)$

$132 = x\left(\frac{100 + 10}{100}\right) \Rightarrow x = 132 \times \frac{100}{110} = 120$

సంక్షిప్త పద్ధతి:

$\frac{132 \times 100}{100 + 2 \times 5} \Rightarrow \frac{132 \times 100}{110} = 120$

జ: 1

మాదిరి ప్రశ్నలు

4 రెండు సమాన మొత్తాలను ఒక భాగం 4% వడ్డీరేటు, మరొక $4\frac{1}{2}$% వడ్డీ రేటుతో బారు వడ్డీకి ఏడేళ్లకు ఇస్తే రెండు వడ్డీల మధ్య తేడా 94.50 అయితే ప్రతి భాగం సొమ్ము ఎంత? (టీఎస్ ఎస్ఐ-2023)

1) రూ.2600 2) రూ.2700
3) రూ.2700.50 4) రూ.2685

సాధన: అసలు P = X అనుకుంటే

దత్తాంశం ప్రకారం

$\frac{P \times 7 \times 4\frac{1}{2}}{100} - \frac{P \times 7 \times 4}{100} = 94.50$

$\frac{P \times 7 \times 9}{200} - \frac{P \times 7 \times 4}{100} = \frac{9450}{100}$

$\frac{63P - 56P}{200} = \frac{9450}{100} \Rightarrow 7P = 9450 \times 2$

$P = \frac{9450 \times 2}{7} = 2700$

సంక్షిప్త పద్ధతి:

$\frac{94.50 \times 100}{(4.50 - 4) \times 7} \Rightarrow \frac{9450 \times 100}{7 \times 50}$

P = 2700

జ: 2



5 రెండు సంఖ్యల మధ్య నిష్పత్తి 11 : 13. ప్రతి సంఖ్య నుంచి 12 ను తీసివేస్తే, వాటి మధ్య నిష్పత్తి 7 : 9. అందులో చిన్న సంఖ్య ఎంత? (టీఎస్ ఎస్ఐ-2023)

1) 11 2) 22 3) 33 4) 39

సాధన: రెండు సంఖ్యలు 11x, 13x అనుకుంటే దత్తాంశం ప్రకారం

$\frac{11x - 12}{13x - 12} = \frac{7}{9}$

$99x - 108 = 91x - 84$

$99x - 91x = 108 - 84$

$8x = 24 \Rightarrow x = \frac{24}{8} = 3$

చిన్న సంఖ్య $11x = 11 \times 3 = 33$

సంక్షిప్త పద్ధతి:

$11 : 13^{-12}$
$7 : 9$
(2)

$\frac{11 \times 12 \times 2}{99 - 91}$

$= \frac{11 \times 12 \times 2}{8} = 33$



జ: 3

6 ఒక పైపు ఒక ట్యాంకును 2 గంటల్లో నింపుతుంది. అడుగు భాగంలో లీకేజీ కారణంగా $2\frac{1}{3}$ గంటల్లో నింపుతుంది. అయితే నిండి ఉన్న ట్యాంకును లీకేజీ ఎంత సమయంలో ఖాళీ చేస్తుంది? (టీఎస్ ఎస్ఐ-2023)

1) 8 2) 7 3) 10 4) 14

సాధన: లీకేజీ x అనుకుంటే

దత్తాంశం ప్రకారం $\frac{1}{2} - \frac{1}{x} = \frac{1}{2\frac{1}{3}}$

$\frac{1}{2} - \frac{1}{x} = \frac{1}{\frac{7}{3}}$

$\frac{1}{2} - \frac{1}{x} = \frac{3}{7} \Rightarrow \frac{1}{2} - \frac{3}{7} = \frac{1}{x}$

$\frac{7 - 6}{14} = \frac{1}{x} \Rightarrow \frac{1}{14} = \frac{1}{x}$

x = 14



సంక్షిప్త పద్ధతి:

$\frac{2 \times 2\frac{1}{3}}{\frac{1}{3}} = 2 \times \frac{7}{3} \times \frac{3}{1} = 14$

జ: 4

7 A, B అనే రెండు పైపులు ఒక ట్యాంకును వరుసగా 24, 48 నిమిషాల్లో నింపుతాయి. రెండు పైపులను ఒకేసారి తెరచినా ట్యాంకు సరిగ్గా 16 నిమిషాల్లో నిండాలంటే B పైపును ఎంత సమయం తర్వాత మూసేయాలి? (ఎన్‌టీపీసీ 2023)

1) 8 2) 10 3) 12 4) 16

సాధన: $x\left(\frac{1}{24} + \frac{1}{48}\right) + (16 - x) \times \frac{1}{24} = 1 \Rightarrow \frac{x(2 + 1) + (16 - x)2}{48} = 1$

$\Rightarrow 3x + 32 - 2x = 48 \Rightarrow x = 48 - 32 \Rightarrow x = 16$

సంక్షిప్త పద్ధతి:

$\frac{16}{24} \times 48 \Rightarrow \frac{8}{24} \times 48 = 16$

జ: 4



రచయిత: బిజ్జుల విష్ణువర్ధన్ రెడ్డి

జూనియర్ ఇంటర్ - భౌతికశాస్త్రం: గమన నియమాలు



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2 మార్కులు

1. జడత్వం అంటే ఏమిటి? జడత్వం కొలతను ఏది ఇస్తుంది?

జ: ఒక వస్తువు దాని స్థితిలో మార్పును వ్యతిరేకించే ధర్మాన్నే జడత్వం అంటారు. వస్తువు ద్రవ్యరాశి జడత్వానికి కొలమానంగా ఉంటుంది.

2. ఒక తుపాకీ నుంచి బుల్లెట్‌ను పేల్చినప్పుడు, తుపాకీని వెనుకకు నెట్టివేసినట్లు అనిపిస్తుంది. వివరించండి.

జ: ద్రవ్యవేగ నిత్యత్వ నియమం ప్రకారం, తుపాకీ నుంచి బుల్లెట్‌ను పేలిస్తే తుపాకీ ద్రవ్యవేగం, బుల్లెట్ ద్రవ్యవేగానికి సమానమై వ్యతిరేక దిశలో ఉంటుంది. కాబట్టి బుల్లెట్ ముందుకు, తుపాకీ వెనుకకు చలిస్తుంది.

3. నిశ్చల స్థితిలో ఉన్న బాంబు రెండు ముక్కలుగా పేలితే, ఆ ముక్కలు వ్యతిరేక దిశకి ప్రయాణిస్తాయి. వివరించండి.

జ: పేలుడుకు ముందు మొత్తం ద్రవ్యవేగం సున్నా. ద్రవ్యవేగ నిత్యత్వ నియమం ప్రకారం, పేలుడు తర్వాత కూడా ద్రవ్యవేగం సున్నా.

$\therefore m_1v_1 + m_2v_2 = 0$

$m_1v_1 = -m_1v_2 \Rightarrow p_1 = -p_2$

కాబట్టి రెండు భాగాలు వ్యతిరేక దిశల్లో కదులుతాయి.

4. బలాన్ని నిర్వచించండి. ప్రకృతిలోని ప్రాథమిక బలాలు ఏమిటి?

జ: వస్తువు స్థితిని మార్చేది (లేదా) మార్చడానికి ప్రయత్నించేదే బలం. ప్రకృతిలోని నాలుగు ప్రాథమిక బలాలు ఉన్నాయి. గురుత్వాకర్షణ బలం, విద్యుదయస్కాంత బలం, బలమైన కేంద్రక బలం, బలహీనమైన కేంద్రక బలం.

5. రేఖీయ ద్రవ్యవేగం SI యూనిట్లు, మితి పేర్కొనండి.

జ: కిలోగ్రాము. మీ./సె., MLT^{-1}

6. ప్రచోదనం SI యూనిట్లు, మితి పేర్కొనండి.

జ: న్యూటన్. సెకన్, MLT^{-1}

7. ఘర్షణ గుణకం విలువ ఒకటి కంటే ఎక్కువగా ఉంటుందా?

జ: ఘర్షణ బలం ఒకటి కంటే ఎక్కువగా ఉండవచ్చు. తలాలను అధికంగా నునుపు చేసినప్పుడు, రెండు తలాలు ఒక దానితో ఒకటి పెనవేసుకున్నప్పుడు ఘర్షణ గుణకం 1 కంటే ఎక్కువగా ఉంటుంది.

8. గాలి నిండిన టైర్లు ఉన్న కారు కంటే గాలి లేని టైర్లు ఉన్న కారు తొందరగా ఆగుతుంది. ఎందుకు?

జ: విరూపణ అధికంగా ఉన్న దొర్లుడు వస్తువులకు దొర్లుడు ఘర్షణ అధికంగా ఉంటుంది. ఇందువల్ల గాలిలేని టైరు శీఘ్రంగా నిశ్చల స్థితికి వస్తుంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: డాక్టర్ అల్లు రాంబాబు

అది విషం కాదు.. ఎన్నటికీ తరిగిపోదు!




శక్తి వనరుల్లో బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు ముఖ్యమైనవి. నిత్యం అందరూ ఉపయోగించే వాహనాలు, వంటగ్యాస్‌లతో పాటు పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రక్రియలకు ఈ సంప్రదాయ శిలాజ ఇంధన వనరులే కీలకం. ప్రధానంగా బొగ్గు, పెట్రోలియం లేకుండా ఆధునిక జీవనాన్ని ఊహించడం కష్టం. వాటి వినియోగంతోనే పారిశ్రామిక విప్లవం, ఆధునిక జీవనశైలి మొదలయ్యాయి. ఇటీవలి కాలంలో సౌరశక్తి, పవనశక్తి, హైడ్రోజన్ శక్తి తదితర సంప్రదాయేతర ఇంధనాలు అందుబాటులోకి వస్తున్నప్పటికీ సమీప భవిష్యత్తులో శిలాజ ఇంధనాల స్థానాన్ని భర్తీ చేయగలిగే అవకాశం కనిపించడం లేదు. ఈ క్రమంలో సంప్రదాయ శక్తి వనరుల ప్రాధాన్యం, అవి ఉత్పన్నమయ్యే తీరు, వాటి ఉప ఉత్పత్తులు, శుద్ధి, వినియోగం, వెలువడే కాలుష్యం గురించి పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. వీటిని జాగ్రత్తగా వాడుకుంటూనే, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన అవసరాన్నీ అర్థం చేసుకోవాలి.



జనరల్ స్టడీస్ - రసాయన శాస్త్రం

• నేలబొగ్గు, పెట్రోలియం •

1. కింది వాటిలో తరిగిపోయే ఇంధన వనరు?
   1) బొగ్గు 2) పెట్రోలియం
   3) సహజ వాయువు 4) పైవన్నీ



2. కింది వాటిలో శిలాజ ఇంధనం కానిది?
   1) బొగ్గు 2) పెట్రోలియం
   3) సహజ వాయువు 4) బయోగ్యాస్

3. నిశ్చితం-(ఎ): బొగ్గు, పెట్రోలియం, సహజవాయువు శిలాజ ఇంధనాలు.
   కారణం-(ఆర్): కోట్ల సంవత్సరాల క్రితం జీవుల అవశేషాల నుంచి ఏర్పడ్డాయి.
   1) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్, సరైన వివరణ
   2) ఎ, ఆర్ సరైనవి; ఎ కు ఆర్, సరైన వివరణ కాదు
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది

4. తరిగిపోని ఇంధన వనరు : బయోగ్యాస్ :: సంప్రదాయ ఇంధన వనరు : ....
   1) సౌరశక్తి 2) అలల శక్తి
   3) సహజవాయువు 4) బయోడీజిల్

5. కిందివాటిని జతపరచండి.
   ఎ) నేలబొగ్గు 1) ప్లాంక్టన్
   బి) పెట్రోలియం 2) కార్బొనైజేషన్
   సి) పెట్రోల్ 3) అంశిక స్వేదనం - ఉత్పన్నం
   1) ఎ-2, బి-1, సి-3 2) ఎ-2, బి-3, సి-1
   3) ఎ-3, బి-1, సి-2 4) ఎ-1, బి-2, సి-3

6. వాక్యం-(ఎ): బొగ్గును నిర్వాత స్వేదనం చేస్తే కోల్, కోల్‌గ్యాస్, కోల్‌తార్ ఉత్పన్నాలు లభిస్తాయి.
   వాక్యం-(బి): బొగ్గును నిర్వాత స్వేదనం చేస్తే కోక్, కోల్‌గ్యాస్, కోల్‌తార్ ఉత్పన్నాలు లభిస్తాయి.
   1) ఎ, బి సత్యం
   2) ఎ సత్యం, బి అసత్యం



   3) ఎ అసత్యం, బి సత్యం
   4) ఎ, బి అసత్యం

7. కిందివాటిలో సరికానివి.
   ఎ) బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు సంప్రదాయ ఇంధన వనరులు.
   బి) బయోమాస్, బయోగ్యాస్, బయోడీజిల్ తరిగిపోని శక్తివనరులు.
   సి) యురేనియం, థోరియం, ప్లుటోనియం అణు ఇంధనాలు.
   డి) సౌరశక్తి, తరంగ శక్తులు సంప్రదాయ ఇంధన వనరులు.
   1) ఎ, బి 2) ఎ, బి, సి 3) డి 4) బి, డి

8. కిందివాటిలో పర్యావరణానికి హాని కలిగించని శిలాజ ఇంధనం?
   1) పెట్రోలియం 2) సహజ వాయువు
   3) ఎల్‌పీజీ 4) బొగ్గు

9. కిందివాటిలో దేనిని కాలుష్య రహిత ఇంధనంగా పరిగణిస్తారు?
   1) పెట్రోల్
   2) డీజిల్
   3) ఆవు పిడక
   4) హైడ్రోజన్ వాయువు



10. పెట్రోలియం లేదా ముడి చమురును కొలవడానికి ఉపయోగించే ప్రమాణం?
    1) కిలోగ్రామ్ 2) లీటర్లు
    3) టన్నులు 4) బారెల్

11. కింది వాక్యాలను ఒక క్రమంలో అమర్చండి.
    పి: ప్రకృతి వైపరీత్యాల వల్ల అడవుల్లో చెట్లు కూలిపోవడం.
    క్యూ: అధిక ఉష్ణోగ్రత, పీడనాలకు గురవడం.
    ఆర్: కార్బొనైజేషన్ జరిగి నేలబొగ్గు ఏర్పడటం.
    ఎస్: చెట్లు, ఆకులు, కొమ్మలు మట్టితో కప్పబడటం.
    1) పి-క్యూ-ఆర్-ఎస్
    2) ఎస్-పి-క్యూ-ఆర్
    3) పి-ఎస్-క్యూ-ఆర్ 4) పి-క్యూ-ఆర్-ఎస్

12. కిందివాటిలో సరికాని వాక్యం.
    1) కార్బొనైజేషన్ వల్ల కోల్ ఏర్పడుతుంది.
    2) ప్లాంక్టన్ వల్ల పెట్రోలియం ఏర్పడుతుంది.
    3) జీవుల మృత అవశేషాల నుంచి సహజ వాయువు లభిస్తుంది.
    4) వంట అవసరాలకు ఎల్‌పీజీ కంటే సీఎన్‌జీ మేలైన ఇంధనం.

13. శిలాజ ఇంధనమైన నేలబొగ్గు ద్వారా లభించే ఉప ఉత్పన్నాలు?
    1) కోక్, కోల్‌తారు, కోల్ వాయువు
    2) కోల్, కోల్‌తారు, కోల్ వాయువు
    3) బొగ్గు, కోల్ వాయువు, పెట్రోలియం
    4) కోక్, పెట్రోలియం, సహజ వాయువు

14. వాక్యం-ఎ: కోల్‌తార్ దుర్వాసనతో ఉండే నల్లటి చిక్కనైన ద్రవం.
    వాక్యం-బి: కోల్‌తార్‌ను నాప్తలీన్ ఉండలు, పరిమళ ద్రవ్యాల తయారీకి వాడతారు.
    1) ఎ, బి సత్యం
    2) ఎ సత్యం, బి అసత్యం
    3) ఎ అసత్యం, బి సత్యం
    4) ఎ, బి అసత్యం



15. కిందివాటిలో ఏది విషపదార్థం కాని తరిగిపోని ఇంధనం?
    1) సీఎన్‌జీ 2) ఎల్‌పీజీ
    3) బయోడీజిల్ 4) పెట్రోల్

16. కృత్రిమ అద్దకాలు, ఔషధాలు, పరిమళద్రవ్యాలు, పేలుడు పదార్థాల తయారీలో వాడే పదార్థం?
    1) కోక్ 2) కోల్‌గ్యాస్
    3) కోల్‌తార్ 4) పెట్రోరసాయనాలు

17. కిందివాటిని జతపరచండి.
    ఎ) స్టీల్ తయారీ, లోహపు సంగ్రహణాలు 1) పారాఫిన్ మైనం
    బి) కృత్రిమ దారాలు, డిటర్జెంట్స్ 2) కోక్
    సి) కృత్రిమ రబ్బరు, ఎరువులు 3) పెట్రోరసాయనాలు
    డి) ఆయింట్‌మెంట్, ఫేస్‌క్రీమ్ 4) పెట్రోలియం గ్యాస్
    1) ఎ-3, బి-4, సి-2, డి-1
    2) ఎ-2, బి-4, సి-3, డి-1
    3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-2, బి-1, సి-4, డి-3

18. కేవలం గృహ, పారిశ్రామిక ఇంధనంగానే కాకుండా ఎరువుల తయారీలో కూడా ఉపయోగించే పదార్థం?
    1) సీఎన్‌జీ
    2) ఎల్‌పీజీ
    3) సహజవాయువు
    4) కోల్‌తార్



19. సహజవాయువు, బయోగ్యాస్‌లలో ప్రధానంగా ఉండే వాయువు?
    1) హైడ్రోజన్ 2) మీథేన్
    3) ప్రోపేన్ 4) బ్యూటేన్

20. ఈ పదార్థం కోల్‌తార్ నుంచి తయారవ్వదు.?
    1) నాఫ్తలీన్ 2) క్రిమిసంహారకాలు
    3) కృత్రిమ దారాలు 4) అద్దకాలు

21. కార్బన్ డై ఆక్సైడ్ : భూతాపం :: .... : నాసియా.
    1) సల్ఫర్ డై ఆక్సైడ్
    2) పెయింట్‌ల నుంచి విడుదలయ్యే విషపదార్థం
    3) ఆక్సిజన్ 4) మీథేన్

22. కిందివాటిలో మీథేన్ వాయువు కలిగి ఉండనిది?
    1) గోబర్‌గ్యాస్ 2) సహజవాయువు
    3) బయోగ్యాస్ 4) వాటర్‌గ్యాస్

23. కిందివాటిలో సరైనవి?
    1) కోల్‌తార్ దుర్వాసన లేని నల్లని చిక్కటి ద్రవం.
    2) పెట్రో రసాయనాలను కృత్రిమ రబ్బరు, కృత్రిమ అద్దకాల తయారీకి వాడతారు.
    3) సీఎన్‌జీను గృహ, పారిశ్రామిక ఇంధనంగానే కాకుండా ఎరువుల తయారీలో వాడతారు.
    4) కోల్‌తార్‌ను పరిమళ ద్రవ్యాలు, పెయింట్స్ తయారీకి వాడతారు.

24. కిందివాటిని జతపరచండి.
    ఎ) డ్రైక్లీనింగ్ ద్రవం 1) బిట్యుమిన్
    బి) పెట్రోలియం జెల్లీ 2) పెట్రోల్
    సి) తారు, పెయింట్స్ 3) పెట్రోరసాయనాలు
    డి) కృత్రిమ దారాలు 4) పారాఫిన్ వ్యాక్స్
    1) ఎ-3, బి-4, సి-1, డి-2 2) ఎ-2, బి-4, సి-3, డి-1
    3) ఎ-2, బి-4, సి-1, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

25. పెట్రోలియం అంశిక స్వేదనం చేయడం ద్వారా చివరకు మిగిలిపోయే పదార్థం?
    1) పెట్రోల్ 2) కిరోసిన్
    3) డీజిల్ 4) ఆస్ఫాల్ట్

26. థర్మల్ విద్యుత్తు శక్తి ఉత్పత్తి చేసే కర్మాగారాలు మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలిగించే గ్రీన్ హౌస్ వాయువుతో పాటు వేటిని వాతావరణంలోకి విడుదల చేస్తాయి?
    1) పాదరసం 2) సెలీనియం, సీసం
    3) ఆర్సెనిక్ 4) పైవన్నీ

27. కింది వాటిలో కాలుష్యపరంగా ఆదర్శ ఇంధనం ఏది?
    1) సహజవాయువు 2) ఎల్‌పీజీ
    3) కిరోసిన్ 4) పెట్రోల్

28. భారతదేశంలో మొదటి చమురుబావి ఎక్కడ ఉంది?
    1) అస్సాం (మాకుమ్)
    2) మహారాష్ట్ర (బాంబే హై)
    3) గుజరాత్ (అంకేశ్వర్)
    4) ఆంధ్రప్రదేశ్ (కృష్ణా-గోదావరి బేసిన్)

29. కిందివాటిని జతపరచండి.
    ఎ) డ్రైక్లీనింగ్ ద్రవం 1) పారాఫిన్ వ్యాక్స్
    బి) పెట్రోలియం జెల్లీ 2) బిటుమిన్
    సి) పెయింట్, తారు 3) పెట్రోల్
    డి) డిటర్జంట్స్ 4) పెట్రోరసాయనాలు
    1) ఎ-3, బి-1, సి-2, డి-4
    2) ఎ-4, బి-1, సి-3, డి-2
    3) ఎ-4, బి-3, సి-2, డి-1 4) ఎ-3, బి-1, సి-4, డి-2

30. పాలిస్టర్, నైలాన్, ఆక్రలిక్, పాలిథిన్‌ల తయారీలో వాడే ముడి పదార్థం?
    1) పెట్రోలియం 2) పెట్రోరసాయనాలు
    3) సహజవాయువు 4) కోల్‌తార్

31. నిత్యం వినియోగించే గ్రీజు, కొవ్వొత్తి, ముఖానికి రాసుకునే క్రీము లాంటివి వేటి నుంచి తయారు చేస్తారు?
    1) కోల్‌తార్
    2) కోక్
    3) పారఫిన్ వ్యాక్స్ 4) పెట్రోల్



32. పెట్రోలియం అనేది కిందివాటిలో వేటి మిశ్రమం?
    1) కార్బోహైడ్రేట్స్ 2) ఆల్కహాల్
    3) హైడ్రోకార్బన్‌లు 4) ఈథర్‌లు




రచయిత: ఎస్.రామకృష్ణ

సమాధానాలు

1-4; 2-4; 3-1; 4-3; 5-1; 6-3; 7-3; 8-2; 9-4; 10-4; 11-3; 12-4; 13-1; 14-1; 15-3; 16-3; 17-3; 18-2; 19-2; 20-3; 21-2; 22-4; 23-4; 24-3; 25-4; 26-4; 27-1; 28-1; 29-1; 30-2; 31-3; 32-3.

(c) eenadu



రీజనింగ్ విభాగం నుంచి తరచుగా అక్షర సంఖ్యా మిశ్రమ శ్రేణికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతుంటారు. ఇందులో ఆంగ్ల అక్షరమాలతో పాటు సంఖ్యలతో కూడిన సమస్యలు సంధిస్తుంటారు. అక్షర, సంఖ్యా శ్రేణి మాదిరిగానే దీనిలోనూ ఒక శ్రేణిని ఇస్తారు. ఏదో ఒక చోట ఆ క్రమాన్ని విడదీసి, ఆ స్థానంలో ప్రశ్న గుర్తు ఇస్తారు. ఈ శ్రేణి ఒక నిర్దిష్ట నియమాన్ని అనుసరిస్తుంది. అభ్యర్థి దాన్ని కనిపెట్టి శ్రేణికి వర్తింపజేస్తే ప్రశ్నార్థకం స్థానంలో రావాల్సిన పదం/క్రమాన్ని తెలుసుకోవచ్చు. ఈ ప్రశ్నలు కొన్నిసార్లు గందరగోళానికి గురిచేస్తాయి. దాన్ని అధిగమించాలంటే అక్షరమాల, సంఖ్యలపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలి.

Word of the Day 897

Coalesce

Telugu meaning: ఒక్కటవ్వు, కలగలుపు

English meaning: The word coalesce (కోలెస్) is a verb that means to come together or unite to form a single group or entity.

Synonyms: Merge, Combine

Antonyms: Separate, Divide

Usage: 1. Several small political groups decided to coalesce to strengthen their influence.

2. Over time, individual ideas coalesced into a comprehensive reform plan.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం — రీజనింగ్

అక్షరాలు.. సంఖ్యలు.. తెచ్చిపెట్టేను మార్కులు

అక్షర సంఖ్యా మిశ్రమ శ్రేణి

సూచన (ప్ర. 1 – 8): దిగువ ఇచ్చిన శ్రేణుల్లో ప్రశ్నార్థకం స్థానంలో వచ్చే క్రమాన్ని గుర్తించండి.

1. 27m225, 35o250, 62s266, 126u275, ?

1) 251y279 2) 261y280

3) 257a279 4) 225x280

సాధన: ఇచ్చిన శ్రేణిలో మొదటి స్థానంలోని సంఖ్యలు 27, 35, 62, 126

27 + 8 = 35, 35 + 27 = 62, 62 + 64 = 126

$126 + 5^3 = 126 + 125 = 251$ ..... (1)

$8 = 2^3$, $27 = 3^3$, $64 = 4^3$, $125 = 5^3$

రెండో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు m, o, s, u,

m + 2 = o, o + 4 = s, s + 2 = u, u + 4 = y ..... (2)

మూడో స్థానంలోని సంఖ్యలు 225, 250, 266, 275

225 + 25 = 250, 250 + 16 = 266, 266 + 9 = 275

$25 = 5^2$, $16 = 4^2$, $9 = 3^2$, $2^2 = 4$

275 + 4 = 279 ..... (3)

పై మూడు సమీకరణాలను గమనిస్తే శ్రేణిలో తర్వాత వచ్చే క్రమం 251y279

సమాధానం: 1

2. K - 256, M - 196, P - 121, T - 49, ?

1) U - 36 2) V - 25 3) Y - 4 4) W - 16

సాధన: K - ఆంగ్ల అక్షరమాలలో చివరి నుంచి 16వ అక్షరం $= 16^2 = 256$

M - ఆంగ్ల అక్షరమాలలో చివరి నుంచి 14వ అక్షరం $= 14^2 = 196$

P - ఆంగ్ల అక్షరమాలలో చివరి నుంచి 11వ అక్షరం $= 11^2 = 121$

T - ఆంగ్ల అక్షరమాలలో చివరి నుంచి 7వ అక్షరం $= 7^2 = 49$

అక్షరాల క్రమాన్ని పరిశీలిస్తే...

K + 2 = M, M + 3 = P, P + 4 = T, T + 5 = Y

Y - ఆంగ్ల అక్షరమాలలో చివరి నుంచి 2వ అక్షరం $= 2^2 = 4$

ప్రశ్నార్థకం స్థానంలో ఉండాల్సిన క్రమం Y - 4

సమాధానం: 3

3. 5S425, 11W394, ?, 61E342, 138I323

1) 38A360 2) 26A365 3) 39Z369 4) 39Z359

సాధన: ఇచ్చిన శ్రేణిలో మొదటి స్థానంలోని సంఖ్యలు 5, 11, ..., 61, 138

$5 \times 2 + 1 = 11$, $11 \times 2 + 4 = 26$, $26 \times 2 + 9 = 61$,

$61 \times 2 + 16 = 138$

రెండో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు S, W, ..., E, I

S + 4 = W, W + 4 = A, A + 4 = E, E + 4 = I

మూడో స్థానంలోని సంఖ్యలు 425, 388, ..., 336, 317

425 – 31 = 394, 394 – 29 = 365, 365 – 23 = 342, 342 – 19 = 323 (31, 29, 23, 19 ప్రధాన సంఖ్యలు)

శ్రేణిలో తర్వాత వచ్చే క్రమం 26A365

సమాధానం: 2

4. s216, v125, y64, b27, ?

1) e8 2) f8 3) c27 4) d8

సాధన: +3 +3 +3 +3

s216, v125, y64, b27, e8

↓ ↓ ↓ ↓ ↓

6^3 5^3 4^3 3^3 2^3

సమాధానం: 1

5. RL12, TQ20, WU32, AX48, ?

1) EZ68 2) HZ68 3) GZ68 4) FZ68

సాధన: శ్రేణిలో మొదటి స్థానంలోని ఆంగ్ల అక్షరాలు R, T, W, A, ...

R + 2 = T, T + 3 = W, W + 4 = A, A + 5 = F

రెండో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు L, Q, U, X

L + 5 = Q, Q + 4 = U, U + 3 = X, X + 2 = Z

మూడో స్థానంలోని సంఖ్యలు 12, 20, 32, 48

12 + 8 = 20, 20 + 12 = 32, 32 + 16 = 48, 48 + 20 = 68

ప్రశ్నార్థకం స్థానంలో ఉండాల్సిన క్రమం FZ68

సమాధానం: 4

6. V2R, Y8T, B15V, E76X, ?

1) F350Z 2) G452Z 3) H355Z 4) H355B

సాధన: మొదటి స్థానంలోని ఆంగ్ల అక్షరాలు V, Y, B, E

V + 3 = Y, Y + 3 = B, B + 3 = E, E + 3 = H

రెండో స్థానంలోని సంఖ్యలు 2, 8, 15, 76

$2 \times 2 + 2^2 = 8$, $8 \times 3 - 3^2 = 15$, $15 \times 4 + 4^2 = 76$,

$76 \times 5 - 5^2 = 355$

మూడో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు R, T, V, X

R + 2 = T, T + 2 = V, V + 2 = X, X + 2 = Z

శ్రేణిలో తర్వాత వచ్చే క్రమం H355Z

సమాధానం: 3

7. KA13, NE30, RI49, ?, CU101

1) TO74 2) VO123

3) WO72 4) VO78

సాధన: శ్రేణిలో మొదటి స్థానంలోని ఆంగ్ల అక్షరాలు K, N, R, ..., C

K + 3 = N, N + 4 = R, R + 5 = W, W + 6 = C

రెండో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు A, E, I, ..., U

ఇవి అచ్చులు. కాబట్టి ? స్థానంలో O ఉండాలి

మూడో స్థానంలోని సంఖ్యలు 13, 30, 49, ..., 101

13 + 17 = 30, 30 + 19 = 49, 49 + 23 = 72, 72 + 29 = 101

ప్రశ్నార్థకం స్థానంలో ఉండాల్సిన క్రమం WO72

సమాధానం: 3

8. Q331T, U442X, Y553A, ?

1) Z664D 2) C664C

3) B664D 4) B664F

సాధన: శ్రేణిలో మొదటి స్థానంలోని ఆంగ్ల అక్షరాలు Q, U, Y

Q + 4 = U, U + 4 = Y, Y + 4 = C

రెండో స్థానంలోని సంఖ్యలు 331, 442, 553

331 + 111 = 442, 442 + 111 = 553, 553 + 111 = 664

మూడో స్థానంలోని ఆంగ్ల అక్షరాలు T, X, A

T + 4 = X, X + 3 = A, A + 2 = C

సిరీస్‌లో తర్వాతి క్రమం C664C

సమాధానం: 2



రచయిత
రాజేశ్ మధు, విషయ నిపుణులు

కరెంట్ అఫైర్స్



భారత మహిళా స్టార్ బ్యాడ్మింటన్ షట్లర్ సైనా నెహ్వాల్ ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు 2026 జనవరి 19న ప్రకటించారు. ఈమె 2008లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచారు. 2009లో బీడబ్ల్యూఎఫ్ సూపర్ సిరీస్ గెలిచారు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించారు. ఈ ఘనత సాధించిన భారత తొలి షట్లర్‌గా పేరొందారు. 2014లో ఆసియా క్రీడల్లో కాంస్యం సాధించారు. 2015లో ప్రపంచ ఛాంపియన్‌షిప్, ఆల్ ఇంగ్లండ్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచారు. అదే ఏడాది ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానం దక్కించుకున్నారు. 2017 ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, 2018 ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలుపొందారు. సైనాకు 2009లో అర్జున అవార్డు, 2010లో అత్యున్నత క్రీడా పురస్కారం ఖేల్‌రత్న ప్రకటించారు.



దేశంలోనే మొట్టమొదటి వందేభారత్ స్లీపర్ (ఏసీ) రైలును 17 జనవరి 2026న ప్రధాని నరేంద్ర మోదీ మాల్దా టౌన్ రైల్వేస్టేషన్‌లో ప్రారంభించారు. ఇది హావ్‌డా (పశ్చిమ బెంగాల్) - గువాహటి (అస్సాం) మధ్య నడుస్తుంది. దీంతోపాటు న్యూజల్పాయ్‌గుడి నుంచి నాగర్‌కోయిల్, తిరుచిరాపల్లిలకు, అలీపుర్‌ద్వార్ నుంచి బెంగళూరు, ముంబయి వెళ్లే నాలుగు అధునాతన అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ప్రధాని మోదీ వర్చువల్‌గా పచ్చజెండా ఊపారు.

బాధ్యతాయుత దేశాల అంతర్జాతీయ సూచీలో భారత్ 16వ స్థానంలో నిలిచింది. దిల్లీకి చెందిన వరల్డ్ ఇంటలెక్చువల్ ఫౌండేషన్ (డబ్ల్యూఐఎఫ్) తయారుచేసిన ఈ సూచీని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 19 జనవరి 2026న ఆవిష్కరించారు. ఈ జాబితాలో సింగపూర్, స్విట్జర్లాండ్, డెన్మార్క్‌లు వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. పాకిస్థాన్‌కు 99వ స్థానం లభించింది.

ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 750 టోర్నీలో అన్ సియంగ్ (కొరియా), లిన్ చున్ యి (చైనీస్ తైపీ) విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ సియంగ్ టైటిల్ నిలబెట్టుకున్నారు. పురుషుల విభాగంలో లిన్ చున్ యి మొదటిసారిగా ఛాంపియన్ అయ్యాడు. 18 జనవరి 2026న న్యూదిల్లీలో జరిగిన ఫైనల్స్‌లో సియంగ్ యింగ్ జి యి (చైనా)పై విజయం సాధించగా, లిన్ జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై గెలుపొందాడు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జానకి అమ్మల్ — శాస్త్రవేత్తలు విశేషాలు

ఈమె భారతదేశానికి చెందిన ప్రముఖ వృక్షశాస్త్రవేత్త. జన్యుశాస్త్రం, కణశాస్త్రం, పరిణామం మొదలైన రంగాల్లో విశేష పరిశోధనలు చేసి జీవశాస్త్ర అభివృద్ధికి తోడ్పాటు అందించారు. సైటోజెనెటిక్స్‌లో ప్రయోగాలు చేసి, అందులో నిపుణురాలిగా పేరొందారు. వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పొందిన మొదటి భారతీయ మహిళగా నిలిచారు. అధిక దిగుబడి ఇచ్చే చెరకు వంగడాన్ని సృష్టించారు. బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాను పునర్వ్యవస్థీకరించడంలోనూ ఆమె కీలక భూమిక పోషించారు. తనకున్న జన్యుశాస్త్ర అవగాహనతో పర్యావరణ పరిరక్షణకూ పూనుకున్నారు. కేరళలో 'సేవ్ ది సైలెంట్ వ్యాలీ' ఉద్యమాన్ని ముందుండి నడిపారు.

బాల్యం – వృత్తి జీవితం

జానకి అమ్మల్ 1897, నవంబరు 4న కేరళలోని తలస్సేరిలో జన్మించారు. పాఠశాల విద్యను గ్రామంలోని సేక్రెడ్ హార్ట్ కాన్వెంట్‌లో పూర్తి చేశారు.

- మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ నుంచి 1921లో వృక్షశాస్త్రంలో ఆనర్స్ డిగ్రీ పొందారు.
- అమెరికాలోని మిచిగన్ యూనివర్సిటీ నుంచి 1924లో బార్బర్ స్కాలర్‌షిప్ పొందారు.
- 1926లో మిచిగాన్ యూనివర్సిటీ నుంచి వృక్షశాస్త్రంలో మాస్టర్ ఆఫ్ సైన్స్ పట్టా పొందారు.
- మళ్లీ ఆమె ఓరియంటల్ బార్బర్ ఫెలోషిప్ పొంది డాక్టోరియల్ డిగ్రీ కోసం మిచిగాన్ యూనివర్సిటీకి వెళ్లారు. Chromosome Studies in Nicandra Physaloides పేరుతో థీసిస్ రాశారు. ఇందుకుగానూ 1931లో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.
- 1951లో నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆహ్వానం మేరకు తిరిగి భారత్‌కు వచ్చారు.



బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా (బీఎస్ఐ)ను పునర్నిర్మించాల్సిందిగా ఆయన జానకిని కోరారు.

చివరగా


జానకి ఎన్నో కష్టనష్టాలకు ఓర్చి, కట్టుబాట్లను ఎదిరించి ప్రఖ్యాత శాస్త్రవేత్తగా ఎదిగారు. భారత పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ 2000లో జానకి అమ్మల్ నేషనల్ అవార్డ్ పేరుతో పురస్కారాలు ఇవ్వడం ప్రారంభించింది. రాయల్ హార్టికల్చరల్ సొసైటీ సృష్టించిన ఒక రకమైన మాగ్నోలియాకు 'జానకి అమ్మల్' అని పేరు పెట్టింది. నూతన వంగడాల సృష్టితోపాటు పర్యావరణ పరిరక్షణలోనూ ఆమె ముందున్నారు. జానకి 1984, ఫిబ్రవరి 7న మరణించారు.

జానకి అమ్మల్ చేసిన పరిశోధనలు, సైలెంట్ వ్యాలీ రక్షణ ఉద్యమం, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Eenadu Epratibha

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం

సహజ రేడియోధార్మికత



విశ్వంలో శక్తికి మూలమైన కేంద్రకం అస్థిరంగా ఉంటే అది స్థిరత్వాన్ని పొందే ప్రయత్నంలో విచ్ఛిత్తి చెందడమో లేదా తనకు తానుగా వికిరణాలను వెదజల్లడమో చేస్తుంది. వికిరణాల వల్ల కొన్ని దుష్ప్రభావాలతో పాటు మానవాళికి అనేక ఉపయోగాలు ఉన్నాయి. రేడియోధార్మికతను ప్రదర్శించే మూలకాల ఐసోటోప్‌లను వైద్య, పారిశ్రామిక, పర్యావరణ రంగాల్లో విరివిగా ఉపయోగిస్తారు.

న్యూట్రినో

బీటా క్షయాన్ని, దాని అవిచ్ఛిన్న శక్తి వర్ణపటాన్ని వివరించే ప్రక్రియలో భాగంగా పౌలీ అనే శాస్త్రవేత్త 1930లో మరొక అదృశ్య కణం ఉంటుందని ప్రతిపాదించాడు. ఫెర్మీ అనే శాస్త్రవేత్త ఆ కణాన్ని న్యూట్రినో అని పిలిచాడు.

పాజిట్రాన్

ఎలక్ట్రాన్ ప్రతికణం పాజిట్రాన్. ఇది ఎలక్ట్రాన్ ప్రతిద్రవ్యం.

కేంద్రక సంలీనం

రెండు లేదా అంతకంటే ఎక్కువ తేలికైన కేంద్రకాలు అధిక ఉష్ణోగ్రతల వద్ద కలిసి ఒక స్థిర కేంద్రకంగా ఏర్పడే ప్రక్రియను 'కేంద్రక సంలీనం' అంటారు.

ఆల్ఫా కిరణాలు, బీటా కిరణాలు, గామా కిరణాలు, రేడియో ఐసోటోప్‌లు, రేడియోధార్మిక శ్రేణులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో ఈ-బుక్ రూపంలో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

NCHM JEE

NCHM JEE 2026 is a national-level entrance examination conducted by the National Testing Agency (NTA) on behalf of the National Council for Hotel Management & Catering Technology (NCHMCT). Admission is offered to the B.Sc. (Hospitality & Hotel Administration) program in affiliated Institutes of Hotel Management across India for the academic session 2026-27. Application fee is Rs.1000. Last date for online applications is 25 January 2026.

Consultant Posts

NewSpace India Limited, Bengaluru (NSIL) is inviting applications to fill Consultant positions in various departments on a temporary basis. Total no.of posts is 15. Last date for online applications 31 January 2026.

Teaching Posts

Sri Konda Laxman Telangana Horticultural University (SKLTGHU), Mulugu (V&M), Siddipet District, Telangana, has released an official notification inviting applications for Assistant Professor posts in various horticulture-related disciplines on Regular basis. Total no.of posts is 79. Application Fee is Rs.3000. The last date for application is 31 January 2026.

Did You Apply..?

Today (January 21) is the last date for the following Jobs

☛ 20 Technician posts in CSIR-CMERI. ***Eligibility:*** 10th pass, ITI.

☛ 18 Project Assistant Jobs at Cotton University. ***Eligibility:*** M.Sc./M.Tech/MCA.

For more information and other notifications - scan QR code

Bank Exams — English

Word Swapping

Directions (Qs. 1 - 9): *In the questions given below, a paragraph is given with four words labelled (A), (B), (C) and (D), arranged not necessarily in the correct order. You have to find the correct order of arrangement from the options given below. In case, the sentence is correct in its original form, please select (E) as your answer. Ignore the errors in punctuation, if any.*

1. Rapid technological innovation has transformed the modern workplace. Automation and artificial intelligence have increased efficiency but also raised concerns about job security. To remain competitive, employees must focus on **workplace (A)** adaptability, **continuous (B)** learning, **skill (C)** resilience, and long-term **career (D)** growth.

A) BCAD B) CBAD

C) ACBD D) DBAC

E) No correction required

2. Financial inclusion plays a vital role in reducing economic inequality. Access to banking services enables individuals to save, invest, and manage risks more effectively. Governments must promote **financial (A)** outreach, improve **digital (B)** literacy, expand **credit (C)** transparency, and ensure **banking (D)** access in underserved regions.

A) BADC B) CBAD

C) ACBD D) DCAB

E) No correction required

3. Climate change poses serious threats to global ecosystems and human livelihoods. Rising temperatures and extreme weather events demand urgent action. Nations must adopt **sustainable (A)** policies, strengthen **global (B)** cooperation, invest in **technological (C)** innovation, and enhance **economic (D)** resilience to address longterm environmental challenges.

A) BDAC B) CBAD

C) ACBD D) DCAB

E) No correction required

4. Investor confidence is crucial for the stability of financial markets. Uncertainty and misinformation often lead to panic-driven decisions. Regulators must enhance **public (A)** transparency, strengthen **investor (B)** protection, enforce **financial (C)** regulations, and maintain **market (D)** trust to ensure long-term stability.

A) CBAD B) BDCA

C) DBCA D) DCBA

E) No correction required

5. Education systems play a foundational role in national development. Quality education enhances productivity, innovation, and social mobility. Policymakers must focus on **curriculum (A)** reform, **institutional (B)** training, **teacher (C)** accountability, and **inclusive (D)** access to improve learning outcomes.

A) BCAD B) DBAC

C) CABD D) ACBD

E) No correction required

6. Public health systems play a crucial role in ensuring the well-being of citizens. During health emergencies, efficient coordination becomes essential. Authorities must strengthen **medical (A)** infrastructure, improve **emergency (B)** response, ensure timely **resource (C)** allocation, and enhance **healthcare (D)** accessibility to manage crises effectively.

A) ACBD B) BDCA

C) CBAD D) DACB

E) No correction required

7. Digital transformation has altered the way businesses operate across industries. Companies increasingly rely on data-driven insights to remain competitive. This shift requires robust **technological (A)** security, ethical **cyber (B)** usage, advanced **workforce (C)** infrastructure, and continuous **data (D)** upskilling.

A) ACBD B) CBAD

C) BDAC D) DACB

E) No correction required

8. Environmental degradation has become a major concern for policymakers worldwide. Deforestation, pollution, and climate change threaten ecological balance. To address these challenges, governments must enforce **environmental (A)** conservation, promote renewable **energy (B)** adoption, regulate **industrial (C)** emissions, and encourage sustainable **resource (D)** management.

A) ACBD B) BCAD

C) CABD D) DBAC

E) No correction required

9. In a democratic society, transparency and accountability are essential for effective governance. Lack of oversight often leads to misuse of power. Governments should strengthen **democratic (A)** mechanisms, promote **citizen (B)** participation, ensure **administrative (C)** accountability, and uphold **institutional (D)** values to maintain public trust.

A) DBCA B) BDCA

C) CBAD D) DACB

E) No correction required

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

(c) eenadu

చాగోస్‌పై ట్రంప్ మెలికలో ఆంతర్యం?

- ఒప్పందం కుదిరిన 8 నెలల తర్వాత వ్యతిరేకత ఎందుకు..
- అసలేంటీ ఒప్పందం
- బ్రిటన్ ఎందుకు అప్పగించింది..



లండన్: చాగోస్ ద్వీపాలను మారిషస్‌కు అప్పగిస్తూ బ్రిటన్ కుదుర్చుకున్న ఒప్పందాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా తెరమీదకు తెచ్చారు. అదో తెలివి తక్కువ నిర్ణయమంటూ భగ్గుమన్నారు. 8 నెలల కిందట బ్రిటన్ దీనిపై ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు స్వాగతించిన ఆయనే ఇప్పుడు వ్యతిరేకించడం కలకలం రేపింది. వాస్తవానికి చాగోస్‌లోని డీగో గార్షియాలో బ్రిటన్-అమెరికా సంయుక్త స్థావరం ఉంది. ఒప్పంద సమయంలో దానికి ఇబ్బంది లేకుండా 100 సంవత్సరాలపాటు అది కొనసాగేలా నిర్ణయం జరిగింది. దీనికి అప్పట్లో అమెరికా అంగీకారం తెలిపింది. కానీ ఇప్పుడు గ్రీన్‌లాండ్‌ను అడ్డం పెట్టుకుని ట్రంప్ దీనిపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చాగోస్ ద్వీపాలను మారిషస్‌కు అప్పగించడంవల్ల చైనా, రష్యాల ముందు తలవంచుకోవాల్సి వస్తోందని ఆయన వాదిస్తున్నారు. వాటి ముందు బలహీనపడ్డామని ఆయన అంటున్నారు.

600 దీవుల సముదాయం..

హిందూ మహా సముద్రంలో 600కుపైగా దీవులతో కూడిన సముదాయం చాగోస్. ఇది 6 అటాల్స్‌గా ఉంటుంది. మాల్దీవులకు 500 కిలోమీటర్ల దూరంలో, ఆఫ్రికా, ఇండోనేసియాలకు సమాన దూరంలో ఉంది. దీనిని 1814లో మారిషస్‌తోపాటు బ్రిటన్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడ సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయడానికి వీలుగా 1960, 70లలో 2,000 మంది చాగోసియన్లు, ఇలోయిస్‌లను బ్రిటన్ బలవంతంగా అక్కడి నుంచి తరలించింది. వారంతా వ్యవసాయ కార్మికులే. ప్రస్తుతం అక్కడ స్థానికులెవరూ లేరు. ఈ దీవుల్లో ప్రస్తుతం 4,000 మంది నివసిస్తున్నారు.



ఇదీ ఒప్పందం

అంతర్జాతీయంగా వచ్చిన ఒత్తిళ్లతో చాగోస్‌పై ఆధిపత్యాన్ని వదులుకునేందుకు 2024 అక్టోబరులో బ్రిటన్ అంగీకరించింది. 1968లో తమ నుంచి స్వాతంత్ర్యం పొందిన మారిషస్‌కు దానిని అప్పగించాలని నిర్ణయించింది. కొంత మంది చట్టసభ సభ్యులు, డీగో గార్షియాలో జన్మించిన బ్రిటిషర్లు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. అయినా 2025 మే నెలలో చాగోస్‌ను అప్పగిస్తూ మారిషస్‌తో బ్రిటన్ ఒప్పందం కుదుర్చుకుంది. డీగో గార్షియాలో సైనిక స్థావరాన్ని కొనసాగించేందుకు ఏటా 10.1 కోట్ల పౌండ్లు (రూ.1,226.5 కోట్లు) చెల్లించేందుకు అంగీకరించింది. మొత్తంగా 99 ఏళ్లకు 3.4 బిలియన్ పౌండ్లు (రూ.41,644 కోట్లు) బ్రిటన్ చెల్లించనుంది. ఈ ఒప్పందానికి అప్పట్లో ట్రంప్ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, భారత్ ఈ ఒప్పందానికి మద్దతు తెలిపాయి.

ఎంతో కీలకం

బ్రిటన్, అమెరికాలకు హిందూ మహా సముద్రంలోని డీగో గార్షియా సైనిక స్థావరం ఎంతో కీలకం. 2024, 2025లలో యెమెన్‌లోని హూతీలపై దాడులకు ఈ కేంద్రాన్నే అమెరికా వినియోగించుకుంది. గాజాకు మానవతా సాయాన్ని ఇక్కడి నుంచే పంపింది. 2001లో అఫ్గానిస్థాన్‌లోని అల్‌ఖైదా స్థావరాలపై దాడులకూ దీనిని ఉపయోగించుకుంది.

- మారిషస్‌తో వాణిజ్య సంబంధాలున్న చైనా ఇక్కడ క్రమంగా బలాన్ని పెంచుకుంటోంది.

కోర్టు ఏమందంటే..

1965లో మారిషస్ నుంచి చాగోస్ ద్వీపాలను బ్రిటన్ వేరు చేసింది. ఆ తర్వాత మూడేళ్లకు మారిషస్‌కు స్వాతంత్ర్యం ఇచ్చింది. 2019లో ఐక్యరాజ్య సమితి విజ్ఞప్తితో అంతర్జాతీయ న్యాయస్థానం.. ఈ ప్రాంతంపై బ్రిటన్ తన నియంత్రణను వదులుకోవాలని సూచించింది. అక్కడి స్థానికులను తొలగించడాన్ని తప్పుబట్టింది.

ఆందోళనలు ఎందుకు?

ఈ ప్రాంతంలో చైనా ఆధిపత్యం పెరగడంవల్ల అమెరికా స్థావరానికి ముప్పు తప్పదని 2025 ఫిబ్రవరిలో అమెరికా విదేశాంగశాఖ మంత్రి మార్కో రుబియో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాథమిక ఒప్పందం కుదిరిన తర్వాత మారిషస్ ప్రధానిగా ఎన్నికైన నవీన్ రామ్‌గులాం ఒప్పందాన్ని ప్రశ్నించారు. ఈ ఒప్పంద ప్రణాళికను ట్రంప్ చూడాలని, అది సరైన ఏర్పాటేనని ఆయన చెప్పాలని ఆకాంక్షించారు. బ్రిటన్‌లో ఉంటున్న చాగోసియన్లూ.. ఒప్పందాన్ని నిరసిస్తూ ఆందోళన చేశారు. ఒప్పందానికి ముందు తమను సంప్రదించలేదని విమర్శించారు.

- ఈ ఒప్పందం అమెరికా, నాటోలను బలహీనపరుస్తుందని బ్రిటన్ ప్రతిపక్ష నేత కెమీ బడెనాక్ మంగళవారం స్పష్టం చేశారు.

న్యాయపరమైన సవాల్

ఒప్పందంపై సంతకం చేయడానికి ముందు చివరి నిమిషంలో బ్రిటన్ హైకోర్టు జడ్జి ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. చాగోసియన్లను గమనంలోకి తీసుకోకుండా ఒప్పందం కుదుర్చుకోవడాన్ని సవాలు చేస్తూ డీగో గార్షియాలో జన్మించిన బ్రిటిష్ పౌరులు బెర్నార్డెట్ డుగాసీ, బెట్రీస్ పాంప్ ఈ పిటిషన్ వేశారు. అయితే జడ్జి ఉత్తర్వులను హైకోర్టు ధర్మాసనం పక్కనబెట్టింది. ఒప్పందానికి మార్గం సుగమం చేసింది.

నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళ్తున్నాం

ట్రేడ్ బజూకాకు సిద్ధం కావాలి ● ఈయూకు మెక్రాన్ పిలుపు



దావోస్: మనం నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళ్తున్నామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ ఆందోళన వ్యక్తంచేశారు. సుంకాల ద్వారా ఐరోపాను అణగదొక్కే అమెరికా ప్రయత్నం అర్థం లేనిదని వ్యాఖ్యానించారు. ట్రంప్ గ్రీన్‌లాండ్ హెచ్చరికల నేపథ్యంలో ట్రేడ్ బజూకాను (అమెరికా సంస్థల, వ్యక్తులపై ఆంక్షలు) సిద్ధంగా ఉంచుకోవాలని ఐరోపా కూటమికి పిలుపునిచ్చారు. దావోస్‌లోని ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొన్న ఆయన ట్రంప్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'ఇది నిబంధనల్లేని ప్రపంచంలోకి వెళ్లడమే. అంతర్జాతీయ చట్టం బలవంతుల పదఘట్టనల కింద నలిగిపోతోంది. సామ్రాజ్యవాదం మళ్లీ పురుడుపోసుకుంటోంది. ట్రంప్ అంతులేని సుంకాలు మోపడం ఆమోదయోగ్యం కాదు. ఐరోపా నెమ్మదిగా సాగవచ్చు. కానీ అది బెదిరింపులకు లొంగదు. [illegible] పని చేస్తుంది. మేము బెదిరింపులకు కాకుండా గౌరవానికి ప్రాధాన్యమిస్తాం. ట్రేడ్ బజూకా అమల్లో రెండో ఆలోచన చేయవద్దు. మనం నిర్బంధ వ్యతిరేక చర్యలను చేపట్టాల్సిన పరిస్థితుల్లో ఉన్నాం. ప్రస్తుత కఠిన పరిస్థితుల్లో మనం ఈ విధానాన్ని అనుసరించడానికి వెనుకాడకూడదు. ఈ విధానం రాజకీయ బ్లాక్‌మెయిల్ నుంచి రక్షణ రూపొందించింది. మనం దీనిని అమలుచేస్తే అమెరికాపై 81 బిలియన్ పౌండ్ల సుంకాలు పడతాయి. అయితే ఇది అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మనసును మార్చడానికి ఎంతవరకు ఉపయోగపడుతుందన్న భయాలూ ఉన్నాయి' అని మెక్రాన్ వ్యాఖ్యానించారు.

'గ్రీన్‌లాండ్' సుంకాలను వ్యతిరేకిస్తున్నాం: కెనడా

గ్రీన్‌లాండ్ విషయంలో సహకరించని దేశాలపై అదనపు సుంకాలు విధిస్తానని ట్రంప్ హెచ్చరించడాన్ని కెనడా ప్రధాని మార్క్ కార్నీ తీవ్రంగా ఖండించారు. తాము గ్రీన్‌లాండ్, డెన్మార్క్‌లకు అండగా ఉంటామని దావోస్‌లో స్పష్టం చేశారు. నాటో రాజ్యాంగంలోని ఆర్టికల్ 5 ప్రకారం.. కూటమిలోని ఏ ఒక్క దేశంపై దాడి చేసినా మొత్తం కూటమిపై దాడి చేసినట్లేనని తేల్చి చెప్పారు.

ట్రంప్ చర్యలతో నాటోలో సంక్షోభం: రష్యా

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను చేజిక్కించుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు నాటో కూటమిలో తీవ్ర సంక్షోభానికి దారితీస్తున్నాయని, తాజా పరిణామాల నేపథ్యంలో నాటో ఒక రాజకీయ, సైనిక కూటమిగా ఇక నిలిచి ఉంటుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్ మంగళవారం అన్నారు. ఇలా జరుగుతుందని గతంలో ఊహించలేదని తెలిపారు. భారత్, చైనాలతో తమకు బలమైన ద్వైపాక్షిక సంబంధాలున్నాయని లవ్రోవ్ ప్రకటించారు. రష్యా, భారత్, చైనా (ఆర్ఐసీ)ల మధ్య త్రైపాక్షిక చర్చలు తిరిగి ప్రారంభించాలని పిలుపునిచ్చారు.

300 డ్రోన్‌లు, క్షిపణులతో రష్యా దాడి


కీవ్‌లో 5,600 అపార్ట్‌మెంట్లకు నిలిచిన విద్యుత్తు సరఫరా

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ నగరంపై రష్యా మరోసారి విరుచుకుపడింది. సోమవారం రాత్రి జరిపిన దాడిలో 300 డ్రోన్లు, బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులను మాస్కో సైన్యం వినియోగించిందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ మంగళవారం వెల్లడించారు. [illegible] కీవ్ నగరంలో 5,600 అపార్ట్‌మెంట్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని మేయర్ విటాలి క్లిచ్కో తెలిపారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు చలిలో గజగజ వణుకుతున్నారు.

ఈడీ ఒక వ్యక్తిగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయవచ్చా?

కేసు పరిశీలనకు సుప్రీంకోర్టు సమ్మతి

దిల్లీ: చట్టపరమైన వ్యక్తిగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తన హక్కుల పరిరక్షణ కోసం రిట్ పిటిషన్‌ను రాజ్యాంగ అధికరణం 226 ప్రకారం హైకోర్టులలో దాఖలు చేయవచ్చా? అనే న్యాయపరమైన అంశాన్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. అలాంటి అర్హత ఈడీకి ఉందన్న కేరళ హైకోర్టు ఉత్తర్వును సవాల్‌చేస్తూ కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు దాఖలు చేసిన అప్పీలు పిటిషన్‌పై దర్యాప్తు సంస్థకు జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం నోటీసు జారీ చేసింది. దౌత్య మార్గాల ద్వారా బంగారం స్మగ్లింగ్ జరుగుతుందన్న 2020నాటి ఆరోపణల కేసులో ఈడీ దర్యాప్తుపై కేరళ ప్రభుత్వం న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈడీ అధికారులు నిందితులను బెదిరించి ఈ కేసులో ముఖ్యమంత్రి సహా ఇతర రాజకీయ నాయకుల పేర్లను అక్రమంగా చేర్చారనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశించింది. ఈ న్యాయ కమిషన్ ఏర్పాటును నిలిపివేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఉత్తర్వులివ్వడాన్ని కేరళ హైకోర్టు సమర్థించింది. రాష్ట్ర ప్రభుత్వ అభ్యంతరాలను తోసిపుచ్చింది. దీంతో ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



పంజాబ్ కేసరి పత్రిక ముద్రణను అడ్డుకోవద్దు

'పంజాబ్ కేసరి' దిన పత్రిక ముద్రణను అడ్డుకోరాదని, ఆ పత్రిక ప్రచురణకు ఎలాంటి ఆటంకం కలిగించరాదని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలిని మంగళవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రతిక ప్రచురణ సంస్థ కొన్ని ఉల్లంఘనలకు పాల్పడిందని పేర్కొంటూ విద్యుత్ సరఫరా నిలిపివేతకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్ణయించింది. ఈ అంశాన్ని పత్రిక యాజమాన్యం మంగళవారం సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ విపుల్ పంచోలి ధర్మాసనం ముందు అత్యవసర విషయంగా ప్రస్తావించింది. పంజాబ్-హరియాణా హైకోర్టులో యాజమాన్య సంస్థ పిటిషన్‌పై తీర్పు వెలువడే వరకూ తమ మధ్యంతర ఉత్తర్వులు వర్తిస్తాయని, ఈ తీర్పు వల్ల నష్టపోయే పక్షం అప్పీలుకు వెళ్లేందుకు ఆపై మరో వారం వరకూ గడువు ఇస్తున్నట్లు సుప్రీం ధర్మాసనం పేర్కొంది.

విద్వేష ప్రసంగ నేరం కేసుల మూసివేత యోచనలో సుప్రీంకోర్టు

దిల్లీ: విద్వేష ప్రసంగాలకు సంబంధించి 2021 నుంచి పెండింగులో ఉన్న ఎక్కువ భాగం వ్యాజ్యాలను సుప్రీంకోర్టు మూసివేయనుంది. ఈ కేసుల్లో పోలీసులు తమంత తాముగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని కోర్టు ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. కోర్టు ఆదేశాలను అమలు చేశామంటూ కేంద్ర ప్రభుత్వం, దిల్లీ పోలీసులు, ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం పేర్కొన్న నేపథ్యంలో విద్వేష ప్రసంగ నేరాలకు సంబంధించిన పలు రిట్ పిటిషన్‌లపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడుకున్న ధర్మాసనం తన తీర్పును రిజర్వు చేసింది. ఈ కేసుల్లో పిటిషనర్లు చట్ట ప్రకారం పరిష్కారాలు పొందవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే నొయిడాలో ఒక ముస్లిం మత గురువుపై 2021లో జరిగిన నేరంపై ఫిబ్రవరిలో విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది.

భాజపా ఖాతాల్లో రూ.10 వేల కోట్ల నిధులు

ఈసీకి సమర్పించిన వార్షిక నివేదికలో వెల్లడి

దిల్లీ: కేంద్రంతో పాటు అత్యధిక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ(భాజపా)కి నగదు, డిపాజిట్ల రూపంలో దాదాపు రూ.10వేల కోట్ల నిధులున్నాయి. ఎన్నికల సంఘాని(ఈసీ)కి ఇటీవల సమర్పించిన వార్షిక నివేదికలో ఆ పార్టీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే ఆ పార్టీ నిధులు రూ.2,882.32 కోట్ల మేర పెరిగాయి. అదే ఏడాది దిల్లీ, ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం రూ.3,335.36 కోట్లను వెచ్చించినట్లు నివేదికలో భాజపా పేర్కొంది. 2025, మార్చి 31వ తేదీతో ముగిసిన ఆర్థిక సంవత్సరాంతానికి ఆ పార్టీకి చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.12,164 కోట్ల మేర నిధులు ఉన్నాయి. అంతకుముందు ఏడాదిలో అదే సమయానికి ఉన్న నిధులు రూ.9,169 కోట్లు.

- 2024-25లో పార్టీకి విరాళాలుగా అందిన నిధులు రూ.6,125 కోట్లు. అంతకుముందు ఏడాది వరకు ఉన్న నిధులు రూ.3,967 కోట్లకు ఇవి అదనం.
- రూ.9,390 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 2024-25లో రూ.634 కోట్ల మేర వడ్డీని బ్యాంకులు చెల్లించాయి.
- అదే ఏడాది ఆదాయపు పన్ను రిఫండ్ కింద రూ.65.92 కోట్లు, దానిపై వడ్డీగా రూ.4.40 కోట్లు అందాయి.

అమృత్‌భారత్-2 రైళ్లలోనూ
టికెట్ల రద్దు నిబంధనలు కఠినతరం

దిల్లీ: వందేభారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు అమృత్‌భారత్-2 రైళ్లలో టికెట్ల రద్దు నిబంధనల్ని రైల్వేశాఖ కఠినతరం చేసింది. మిగిలిన రైళ్ల విషయంలోనైతే అవి బయల్దేరడానికి నాలుగు గంటల కంటే తక్కువ వ్యవధిలో టికెట్లు రద్దు చేసుకుంటే సొమ్ము వాపసురాదు. వందేభారత్ స్లీపర్ రైళ్లకు ఈ వ్యవధిని ఎనిమిది గంటలుగా నిర్ణయిస్తూ రైల్వేశాఖ ఈ నెల 16న నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. అమృత్ భారత్-2 రైళ్లకూ ఇదే వర్తిస్తుందని రైల్వే వర్గాలు మంగళవారం తెలిపాయి. "ఇతర రైళ్లలా కాకుండా ఈ రెండు రకాల రైళ్లలో ప్రతి ప్రయాణికుడికి ఖాయమైన బెర్తు ఉండాలి. ఇతర రైళ్లలో.. ఒక కుటుంబంలో ఆరుగురు సభ్యులుంటే, వారిలో ముగ్గురికే బెర్తులు ఖాయమైతే మిగిలిన ముగ్గురు వారితోపాటు సర్దుకుని కూర్చొని ప్రయాణం చేయవచ్చు. వందేభారత్ స్లీపర్, అమృత్‌భారత్-2 రైళ్లలో అలా కుదరదు. ఆ కుటుంబంలో ఆరుగురికీ బెర్తులు దొరకడమో, ఏ ఒక్కరికీ దొరక్కపోవడమో జరుగుతుంది' ' అని తెలిపాయి. ఈ నెల నుంచి ప్రవేశపెడుతున్న అమృత్‌భారత్ రైళ్లను అమృత్‌భారత్-2గా పిలుస్తున్నారు. కొత్తరకం రైళ్లలో బెర్తులు తీసుకుని ప్రయాణానికి 72 గంటల కంటే ఎక్కువ సమయం ఉంటుండగా వాటిని రద్దు చేసుకుంటే 25% రుసుమును కోల్పోవాల్సి వస్తుంది. 8-72 గంటల్లోపు రద్దు చేసుకుంటే 50% నష్టపోవాల్సి ఉంటుంది. ఇతర రకాల రైళ్లకైతే 12-48 గంటల్లోపు 25%, 12-4 గంటల్లోపు 50% కోల్పోవాలి.

అస్సాంలో మళ్లీ హింస.. ఒకరి మృతి

పలు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేత



కోక్రాఝర్‌లో మోహరించిన భద్రతా బలగాలు

గువాహటి: అస్సాంలో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. బోడో, ఆదివాసీ తెగల మధ్య తలెత్తిన వివాదం హింసకు దారితీసింది. దీంతో రాష్ట్రప్రభుత్వం అప్రమత్తమైంది. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్(ఆర్ఏఎఫ్)ను మోహరించింది. హింస చెలరేగిన కోక్రాఝర్, చిరాంగ్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపేయడంతో పాటు నిషేధాజ్ఞాలు విధించారు. తదుపరి ఆదేశాల వరకు ఈ నిబంధనలు అమలులో ఉంటాయని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ స్పష్టంచేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. కోక్రాఝర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరిగావ్ అవుట్‌పోస్ట్ వద్ద.. ముగ్గురు బోడో వ్యక్తులతో వెళ్తోన్న వాహనం.. ఇద్దరు ఆదివాసీలను సోమవారం ఢీకొట్టింది. దీంతో ఆగ్రహించిన స్థానిక ఆదివాసీలు.. నిందితులపై దాడి చేశారు. వాహనానికి నిప్పంటించారు. ఈ ఘర్షణల్లో నిందితుల్లో ఒకరు చనిపోయారు. ఈ క్రమంలో కరిగావ్ అవుట్‌పోస్ట్ వద్ద ఇరు తెగలు మంగళవారం ఘర్షణకు దిగాయి. జాతీయ రహదారిపై బైఠాయించాయి. టైర్లను కాల్చేశాయి. కొన్ని ఇళ్లకు నిప్పంటించాయి. ఈ ఘర్షణను అదుపులోకి తెచ్చేందుకు నిరసనకారులపై పోలీసులు లాఠీ ఛార్జీ చేశారు. టియర్ గ్యాస్‌ను ఉపయోగించారు. ఈ క్రమంలో ప్రజలతోపాటు, కొందరు పోలీసులూ గాయపడ్డారు. ఘటనాస్థలంలో సైన్యాన్ని మోహరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని 'ఎక్స్' వేదికగా సీఎం హిమంత పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన దావోస్‌లో జరుగుతోన్న వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ సమావేశంలో ఉన్నారు.

ఇరాన్ నిరసనల్లో 4,029 మంది మృతి

దుబాయ్: ఇరాన్ దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనల్లో దాదాపు 4,029 మంది నిరసనకారులు మృతి చెందినట్లు ఉద్యమకారులు తెలిపారు. మృతుల్లో 3,786 మంది నిరసనకారులు, 180 మంది భద్రతా సిబ్బంది, 28 మంది పిల్లలు, 35 మంది సామాన్యులు ఉన్నట్లు అమెరికాకు చెందిన మానవ హక్కుల వార్తా సంస్థ వెల్లడించింది. ఈ అణచివేతలో భాగంగా 26 వేల మందికి పైగా నిర్బంధంలో ఉన్నారని పేర్కొంది.

నోబెల్ మా ప్రభుత్వ నిర్ణయం కాదు

ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించిన నార్వే



జోనస్ గా స్టోర్

ఓస్లో: నోబెల్ శాంతి బహుమతి తనకు ఇవ్వకూడదని నార్వే నిర్ణయించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పంపిన సందేశంపై ఆ దేశ ప్రధాని జోనస్ గా స్టోర్ స్పందించారు. నోబెల్ అవార్డులను నిర్ణయించే అధికారం నార్వే ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఆ అధికారం పూర్తిగా నోబెల్ కమిటీదేనని స్పష్టం చేశారు. "నోబెల్ శాంతి బహుమతిని స్వతంత్ర నోబెల్ కమిటీ ప్రదానం చేస్తుంది. దీనిపై నార్వే ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదు. ఈ విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్‌నకు కూడా స్పష్టంగా వివరించా. నోబెల్ శాంతి బహుమతి దక్కకపోవడం వల్ల తన ప్రపంచ రాజకీయ దృక్పథం, మైత్రి దేశాలపై విధానం మారిందని ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు" అని జోనాస్ వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ విషయంలో నార్వే వైఖరి స్పష్టంగా ఉందని తెలిపారు. గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌లో భాగమని జోనాస్ అన్నారు. ఈ విషయంలో నార్వే పూర్తిగా డెన్మార్క్‌కు మద్దతుగా నిలుస్తుందని చెప్పారు.



మాఘమేళా సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మంగళవారం విద్యుత్తు వెలుగులో కాంతులీనుతున్న త్రివేణి సంగమం

ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే ఆ ప్రమాదం

- నొయిడా టెకీ మరణంపై రాహుల్
- రోడ్లు, నీళ్లు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయని ఆవేదన



దిల్లీ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని నొయిడాలో నీటిగుంతలో పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి యువరాజ్ మెహతా మరణించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగానే ఆ ఘటన చోటుచేసుకుందని ఆరోపించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని ఇందౌర్‌లో చోటుచేసుకున్న కలుషిత నీటి మరణాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరైన జవాబుదారీతనం లేకపోవడంవల్లే దేశంలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. "రోడ్లు (నొయిడా ఘటనను ఉద్దేశిస్తూ).. నీళ్లు (ఇందౌర్ ఘటన).. అగ్నిప్రమాదాలు (గోవా ప్రమాదం) ప్రాణాలు తీస్తున్నాయి. వంతెనలు, కాలుష్యం, అవినీతి.. ఇలా అనేక కారణాలతో ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. పట్టణాల్లో ఇలాంటి ఘటనలకు నిధులు, సాంకేతికత, పరిష్కారం లేకపోవడం కారణం కాదు. సరైన సమయంలో ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవడమే అసలైన సమస్య. ప్రభుత్వ పట్టింపు లేని చర్యలే ఈ మరణాలకు కారణం" అని మండిపడ్డారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోన్న యువరాజ్ గతవారం విధులు ముగించుకొని ఇంటికి తిరిగొస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. నొయిడాలోని సెక్టార్-150లోని ఏటీఎస్ లే గ్రాండియోస్ కూడలి వద్ద ఆయన ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి మురుగుకాలువ గోడను ఢీకొట్టి పక్కనే ఉన్న నీటి గుంతలో పడింది. ఊపిరాడక ఆ టెకీ ప్రాణాలు కోల్పోయారు. ఈ నీటి గుంత గురించి గతంలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా.. ఎలాంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపించారు.

న్యాయ విద్యార్థులకు ఊరట

దిల్లీ: న్యాయశాస్త్ర పట్టభద్రులు (ఎల్.ఎల్.బి) మాత్రమే అఖిల భారత బార్ పరీక్ష (ఏఐబీఈ) రాయడానికి అర్హులనే నిబంధనను తొలగించి, ఎల్ఎల్‌బీ చివరి సెమిస్టర్ విద్యార్థులు కూడా పరీక్ష రాయడానికి వీలుగా కొత్త నిబంధనలను తెచ్చామని 'బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (బీసీఐ) మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఏఐబీఈ పరీక్షను సంవత్సరానికి రెండుసార్లు నిర్వహిస్తామని తెలిపింది. పూర్వ నిబంధనల ప్రకారం న్యాయశాస్త్ర పట్టభద్రులు ఏఐబీఈ పరీక్షలో ఉత్తీర్ణులైతేనే న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేపట్టగలుగుతారు. 2024 నవంబరులో తొమ్మిదిమంది న్యాయశాస్త్ర విద్యార్థులను ఈ పరీక్ష రాయడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. విద్యార్థులు పట్టభద్రులైన తర్వాత మాత్రమే ఏఐబీఈ పరీక్ష రాయాలంటే, ఒక సంవత్సరం వృథా అయిపోతుందని, చివరి సంవత్సరంలోనే పరీక్ష రాస్తే సమయం ఆదా అవుతుందని అప్పట్లో పిటిషనర్లు కోర్టు దృష్టికి తెచ్చారు. కోర్టు దాన్ని మన్నించింది.

పెరోల్ ఇస్తే అబూసలేం పారిపోతాడు

హైకోర్టులో మహారాష్ట్ర ప్రభుత్వం



పుణె: ముంబయి పేలుళ్ల(1993) కేసులో దోషిగా తేలి జైలుశిక్ష అనుభవిస్తున్న మాఫియా నేత అబూసలేంకు పెరోల్ ఇవ్వడాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. అతడిని పెరోల్‌పై విడుదల చేయడం పోర్చుగల్‌కు, భారత్‌కు మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలకు దారి తీస్తుందని మంగళవారం బాంబే హైకోర్టులో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. తన సోదరుడు అబూ హకీమ్ అన్సారీ మరణించిన నేపథ్యంలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఆజంగఢ్‌కు వెళ్లేందుకు 14 రోజుల పెరోల్ కోరుతూ సలేం బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో అబూసలేంకు పెరోల్ ఇస్తే పారిపోతాడని మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయస్థానంలో అఫిడవిట్‌ను దాఖలు చేసింది. 1993లో అబూసలేం పోర్చుగల్‌కు పారిపోయిన అంశాన్ని గుర్తుచేసింది. అవసరం అనుకుంటే రెండు రోజుల అత్యవసర పెరోల్ ఇవ్వొచ్చని సూచించింది. సలేంను తాత్కాలికంగా పెరోల్‌పై విడుదలచేస్తే రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) హైకోర్టుకు తెలిపింది. ఆజంగఢ్ మతపరంగా సున్నితమైన ప్రాంతం కావడంతో అక్కడికి అబూసలేం వెళ్లడం ప్రమాదకరమని ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు సైతం వ్యతిరేకతను తెలిపారు. తదుపరి విచారణను న్యాయస్థానం జనవరి 28కి వాయిదా వేసింది. ముంబయి పేలుళ్ల అనంతరం నకిలీ పాస్‌పోర్టుతో అబూసలేం పోర్చుగల్‌కు పారిపోయాడు. సలేంకు మరణ శిక్ష విధించరాదని, 25 ఏళ్లకు ఎక్కువ జైలు శిక్ష విధించవద్దనే షరతులతో అతడిని 2005లో పోర్చుగల్ అధికారులు భారత్‌కు అప్పగించారు. పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు.

లండన్‌లో చైనా ఎంబసీకి స్థలం

లండన్: ప్రతిపక్షంతోపాటు కొందరు పాలక లేబర్ పార్టీ సభ్యులు కూడా వ్యతిరేకిస్తున్నా కీర్ స్టార్మర్ ప్రభుత్వం లండన్‌లో సరికొత్తగా బృహత్తర చైనా రాయబార కార్యాలయ భవన నిర్మాణ ప్రణాళికకు మంగళవారం అనుమతి ఇచ్చింది. ప్రస్తుతం లండన్‌లో ఏడు చోట్ల నుంచి చైనా రాయబార కార్యాలయం పని చేస్తోంది. వీటన్నింటినీ ఒక్కచోటకు తీసుకురావాలని డ్రాగన్ తలపెట్టింది. చారిత్రక టవర్ ఆఫ్ లండన్ సమీపంలో 20,000 చదరపు మీటర్ల స్థలాన్ని 2018లో 22.5 కోట్ల పౌండ్లకు కొనుగోలు చేసి కొత్త నిర్మాణం కోసం దరఖాస్తు పెట్టింది. ఈ భవనం లండన్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్టుకు దగ్గరగా ఉందనీ, చైనా కమ్యూనిస్టు పార్టీ గూఢచర్యం జరపడానికి అనువుగా ఉందని ప్రతిపక్షానికి చెందిన భారత సంతతి నాయకురాలు ప్రీతి పటేల్ అభ్యంతరపెట్టారు. వియన్నా ఒప్పందం ప్రకారం శత్రుదేశమైనా, మిత్ర దేశమైనా రాయబార కార్యాలయ భవనం కోసం స్థలం అందించాల్సిందేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

గుమ్మడి సాగులో గృహిణుల విజయం

మహారాష్ట్రలో కరవు ప్రాంతమైన బీడ్ జిల్లాలోని ఆష్టీ మండలం మెహెకరి గ్రామ మహిళలు సామూహిక సాగుతో ఆర్థిక విప్లవానికి నాంది పలికారు. గ్రామంలోని మహిళా స్వయం సహాయక సంఘం సభ్యులు పండించిన 'డోంగర్ భోపలా' (గుమ్మడికాయ) ఇప్పుడు అయిదు రాష్ట్రాలకు ఎగుమతి అవుతోంది. మందాకిని అనే మహిళ నాయకత్వంలో ఈ సంఘం సభ్యులు ఒక్కో కాతకు ఎకరాకు కేవలం రూ.7 వేల చొప్పున పెట్టుబడితో ఈ పంటను పండించారు. ఒకే ఏడాదిలో ప్రతిసారి 15 టన్నుల చొప్పున మూడుసార్లు మొత్తం 45 టన్నుల దిగుబడి సాధించారు. "మేము పూర్తిగా రసాయన ఎరువులకు దూరంగా ఉన్నాం. పొలాల్లోని చెత్త, ఆకులు, పాడైన మొక్కలతోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకున్నాం. పిచికారీకి కూడా సేంద్రియ ద్రావణాలనే వాడాం. అందుకే గుమ్మడికాయలు చాలా నాణ్యంగా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా ఆర్డర్లు వస్తున్నాయి" అని మందాకిని వివరించారు. మధ్యవర్తుల మీద ఆధారపడకుండా నేరుగా కొనుగోలుదారులతో ఒప్పందాలు చేసుకొని అమ్మకాలు జరుపుతున్నారు.



ముస్లింల వివాహాల్లో రాముడి పాటలు, సిందూరం

బిహార్‌లోని గయా, ఔరంగాబాద్ సరిహద్దులో గల పీరు, బంతారా గ్రామాలు భారతీయ సంస్కృతిలోని వైవిధ్యానికి సజీవ సాక్ష్యాలు. ఈ గ్రామాల ముస్లింలు ఇస్లాం మతాన్ని అనుసరిస్తున్నప్పటికీ, వారి ఇళ్లలో శుభకార్యాలు హిందూ పద్ధతుల్లోనే జరుగుతాయి. మసీదులో నికాహ్ జరిపాక, ఇంటి వద్ద హిందూ ఆచారాలే పాటిస్తారు. వధువు నుదుట సిందూరం అలంకరిస్తారు. పెళ్లిపందిరిలో నాగలితో భూమిని దున్నుతారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు వెయ్యి ముస్లిం కుటుంబాలు ఉన్నాయి. వీరి ఇళ్లలో వివాహ వేడుకలు మొదలైతే శ్రీరాముడి కీర్తనలు వినిపిస్తాయి. హల్దీ వేడుకలో మహిళలు జానపద గీతాలను ఆలపిస్తారు. ఈ ఆచారాల వెనుక 600 ఏళ్ల చరిత్ర ఉందని గ్రామస్థులు చెబుతారు. 14వ శతాబ్దంలోని ఫిరోజ్ షా తుగ్లక్ పాలనలో స్థానిక జమీందార్ల కుటుంబాలు ఇస్లాం మతాన్ని స్వీకరించాయి. మతం మారినా, తమ పూర్వీకుల నుంచి వస్తున్న హిందూ సంప్రదాయాలను కొనసాగించిన వీరు తాము హిందూ భూమిహార్ల వంశస్థులమని చెబుతారు.



ఈటీవీ భారత్

ఐవీఎఫ్‌లోకీ ఏఐ

సంతాన సాఫల్య సక్సెస్ రేటు పెంచడం.. నిమిషాల్లో సికిల్‌సెల్ రుగ్మతను గుర్తించడం.. ఫోన్‌తోనే నోటి, కంటి పరీక్షలు చేయడం ఇలా కృత్రిమమేధ(ఏఐ) సాయంతో రూపొందించిన ఆవిష్కరణలు బిరా అనిపించాయి. ఏఐపై దిల్లీలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశం జరగనుంది. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా వేర్వేరు నగరాలు, సంస్థల్లో ముందస్తుగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ సమావేశాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్(ఏఐసీ), సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ)తో కలిసి 'ఏఐ రీ ఇమాజినింగ్ హెల్త్‌కేర్' సదస్సును మంగళవారం నిర్వహించింది. ఇందులో ఏఐ ఆధారిత ఆవిష్కరణల ప్రదర్శనను ఏర్పాటు చేశారు.

- సెల్‌ఫోన్‌తోనే నోటి, కంటి పరీక్షలు
- 'ఏఐ రీ ఇమాజినింగ్ హెల్త్‌కేర్' సదస్సులో వినూత్న ఆవిష్కరణల ప్రదర్శన



సంతాన సాఫల్య సక్సెస్ రేటు పెరిగేలా..

సహజంగా సంతానం పొందలేకపోతున్న వారికి ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) చికిత్స ఆశాకిరణంలా మారింది. ఇందులోనూ సఫలీకృతమయ్యేది 30-35 శాతమే ఉండటంతో పదే పదే చికిత్స అవసరం పడుతోంది. ఇప్పుడు వీటి చికిత్సల్లో ఏఐ ప్రవేశపెట్టడంతో సక్సెస్ రేటు గణనీయంగా పెరగడంతోపాటు చికిత్స ఖర్చు తగ్గుతుందని హైదరాబాద్‌కు చెందిన గ్రోత్ ఏఐ అంకుర సంస్థ వ్యవస్థాపకులు భరణికుమార్ దేవుర తెలిపారు. సాధారణంగా ఐవీఎఫ్ చికిత్సలో పిండం నాణ్యతను వైద్యులు మైక్రోస్కోప్ ద్వారా చూసి ఎ, బి, సి గ్రేడింగ్ ఇస్తారు. మనుషుల అంచనా కొన్నిసార్లు తప్పయ్యే అవకాశం ఉంది. ఏఐ సాంకేతికతతో పిండం చిత్రాలను విశ్లేషిస్తే అది ఎంత ఆరోగ్యంగా ఉందో కచ్చితంగా చెబుతుంది. పురుషుల వీర్య కణాల నాణ్యత, స్త్రీల గర్భాశయ స్థితిగతులను కూడా ఇది విశ్లేషిస్తుంది. దీంతో ఇప్పుడున్న సఫలీకృతమయ్యే రేటు 30-35 శాతం కంటే మరింత పెరుగుతుందని భరణికుమార్ వివరించారు.

ఫొటోలను అప్‌లోడ్ చేస్తే..

నోటి ఆరోగ్యం, కంటి శుక్లాల గుర్తింపు, ఇతర ప్రాథమిక వ్యాధులను ఏఐ సాయంతో స్మార్ట్‌ఫోన్ ద్వారా గుర్తించే ఆవిష్కరణ చేసినట్లు లాగీ ఏఐ సహ వ్యవస్థాపకులు, సీఈవో ప్రియాంజిత్ ఘోష్ తెలిపారు. నోటి ఫొటోలను అప్‌లోడ్ చేయడం ద్వారా కేవలం నిమిషాల్లోనే రిపోర్ట్ పొందే వెసులుబాటు కల్పించామని అలాగే వైద్యుల ఫొటో తీయగానే శుక్లాలు ఉన్నాయా లేదో ఏఐ కనిపెడుతుందని చెప్పారు.

4 నిమిషాల్లో సికిల్‌సెల్ రుగ్మత గుర్తించేలా..

చుక్క రక్తం సేకరించకుండా సికిల్‌సెల్ వ్యాధిని నిర్ధారించే థర్మల్ స్క్రీనింగ్ పరికరాన్ని హైదరాబాద్‌కు చెందిన క్రైజెక్ ఆరోగ్య బయోటెక్ సంస్థ అభివృద్ధి చేసింది. నాలుగే నిమిషాల్లో రుగ్మతను గుర్తించవచ్చు. చేతి వేలిని పరికరంలో ఉంచి దానిపై వేడిని ప్రయోగిస్తారు. సాధారణంగా ఉన్న వ్యక్తుల రక్తప్రసరణ ఉష్ణోగ్రత మార్పులకు భిన్నంగా స్పందిస్తుంది. సికిల్‌సెల్ ఉంటే ఎలాంటి మార్పులకు లోనవ్వకుండా ఉంటుందని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎ.ఆర్.పుంగోత్తయ్ అన్నారు.



సికిల్‌సెల్ రుగ్మతను చేతి వేలితో గుర్తించే పరికరం

మూర్ఛ గుర్తించే గడియారం

చర్మ ఉష్ణోగ్రత, గుండె కొట్టుకునే రేటు వంటి వేర్వేరు పారామితుల ద్వారా మూర్ఛను ముందే గుర్తించే ఏఐ ఆధారిత గడియారాన్ని తయారుచేసింది హైదరాబాద్‌కు చెందిన హెపిరి లీఫ్ హెల్త్‌కేర్ సంస్థ. ఈ రంగంలో అనుభవం కలిగిన డాక్టర్ కేవీ శివానందరెడ్డి సహ వ్యవస్థాపకుడిగా ఉన్న సంస్థ దీన్ని అభివృద్ధి చేసింది.



– ఈనాడు, హైదరాబాద్

మెట్ట ప్రాంతాలకు అనుకూలం.. త్రివిధ సజ్జ



ఈనాడు, హైదరాబాద్: ఇక్రిశాట్, భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐకార్), రాజస్థాన్ వ్యవసాయ పరిశోధన సంస్థలు సంయుక్తంగా ఆర్‌హెచ్‌బీ 273 పేరిట ప్రపంచంలోనే మొట్టమొదటి త్రివిధ సజ్జ సంకర(త్రీ వే పెర్ల్ మిల్లెట్ హైబ్రిడ్) రకాన్ని రూపొందించాయి. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తాజాగా దీనిని విడుదల చేశారు. సాధారణ హైబ్రిడ్ రకాలు రెండు మాతృకల నుంచి తయారైతే, ఈ త్రివిధ హైబ్రిడ్ మూడు మాతృకల కలయికతో రూపొందింది. అధిక దిగుబడి, నాణ్యమైన పశుగ్రాస లక్షణాలు దీని ప్రత్యేకతలని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ హిమాన్షు పాఠక్, ప్రధాన శాస్త్రవేత్త ఎస్‌కే గుప్తా మంగళవారం వెల్లడించారు. త్రివిధ సజ్జ రకం.. 400 మి.మీ. కంటే తక్కువ వర్షపాతం ఉండే రాజస్థాన్, గుజరాత్, హరియాణాల్లోని మెట్ట ప్రాంతాలకు అనుకూలమైందన్నారు. దానిని మరింత అభివృద్ధి చేసి ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తామన్నారు. ఈ సజ్జ సగటున హెక్టారుకు 2,230 కిలోల దిగుబడి వచ్చిందన్నారు.



చినజీయర్‌స్వామికి నాగలి బహూకరిస్తున్న నల్లమల వెంకటేశ్వరరావు, వేదికపై విజయ్‌రాం, పద్మారామచంద్రారావు, రైతునేస్తం వెంకటేశ్వరరావు, ఏర్నేని రామారావు, గున్నా రాజేందర్‌రెడ్డి తదితరులు

సహజ సాగు విధానాలే శ్రేయస్కరం

- త్రిదండి చినజీయర్‌స్వామి
- నేలకొండపల్లిలో రైతు సుఫలా యాత్ర

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: సహజ సాగు విధానాలే సమాజానికి శ్రేయస్కరమని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి చినజీయర్‌స్వామి అన్నారు. అధిక ఎరువుల వాడకంతో భూమి సారం కోల్పోయి రసాయనమయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సు, సహజ సాగు విధానాలపై అవగాహన కోసం ఆయన మంగళవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ప్రధాన కూడలి వరకూ రైతు సుఫలా యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక బౌద్ధమహా స్తూపం వద్దనున్న సిద్ధార్థ యోగా విద్యాలయంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని చినజీయర్ మాట్లాడారు. దేశీయ ఆవుల పాలు, సహజంగా పండిన పంటను తిని జీవించిన పూర్వీకులెవ్వరికీ క్యాన్సర్ సోకలేదన్నారు. కలుషిత, రసాయనమయమైన పంట ఉత్పత్తుల్ని తినడంతోనే రోగాలు వస్తున్నాయని వివరించారు. భూమికి సైతం విరామం అవసరమని, పంటల మార్పిడి, వ్యవధి పాటించడం వంటి పద్ధతులతో ముందుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. సేంద్రియ ఎరువుల వాడకంతో సగానికి పైగా సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు చినజీయర్‌కు నాగలి బహూకరించారు. ఈ కార్యక్రమాల్లో ప్రకృతి వైద్యులు డా.పద్మారామచంద్రారావు, పర్యావరణవేత్తలు విజయ్‌రాం, సీపీఐ నాయకుడు నారాయణ, రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీనివాస్, ఏర్నేని రామారావు, రైతునేస్తం వెంకటేశ్వరరావు, గున్నా రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేలకొండపల్లిలోని భక్తరామదాసు ధ్యానమందిరంలో ఈనెల 23 నుంచి నిర్వహించనున్న భక్తరామదాసు జయంతి ఉత్సవాల కరపత్రాలను చినజీయర్‌స్వామి ఆవిష్కరించారు. భద్రాచల దేవస్థాన ఈవో దామోదర్‌రావు, ఆలయార్చకులు సౌమిత్రి రమేశ్ ఆయనకు స్వాగతం పలికారు.





'కాసు' పహారా చూడు బాసు..

స్థానికంగా కాసులని పిలిచే పెద్ద జాతి బాతులు (మగవి).. తమ జతైన ఆడ బాతులతో పాటు పిల్లల సంరక్షణలో కీలకంగా వ్యవహరిస్తాయి. నిర్మల్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జాలీలో ఆడ బాతు, పిల్లలు ఉండగా... మగ బాతు పహారా కాస్తోంది. ఆ గూడు దగ్గరకు పొట్టేలు రావడం గమనించిన మగ బాతు.. ఆగ్రహంగా దాని మీదకు దూకి.. వెనక్కి వెళ్లే వరకు అరుస్తూ ముక్కుతో పొడిచింది. "మగ బాతు.. జీవితాంతం ఒకే ఆడ బాతుతో ఉంటుంది. దీంతో ఆ ఆడ బాతు, పిల్లల సంరక్షణ బాధ్యతలు చూస్తుంది. ఆడ బాతు గుడ్లను పొదుగుతున్నప్పటి నుంచి మగ కాసు రోజంతా పహారా కాస్తూ ఉంటుంది" అని ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర సహాయ ఆచార్యులు విజయ్‌కుమార్ తెలిపారు.

– న్యూస్‌టుడే, మామడ

గుంట నక్కను.. గడ్డి భూముల నేస్తాన్ని

అమాయకపు చూపులతో ఆకట్టుకుంటున్న ఈ చిన్న నక్క.. మంచిర్యాల జిల్లా కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పరిధిలోని జన్నారం అటవీ ప్రాంతంలో వన్యప్రాణి పరిశోధకుడు డా.ఎనగందుల వెంకట్ కెమెరాకు చిక్కింది. గడ్డి మైదానాలు వీటికి ఆవాసాలు. అందులోని గుంటలు, బొరియలలో నివాసం ఉండటంతో వీటికి గుంట నక్కలనే పేరు వచ్చిందని జన్నారం అటవీ డివిజనల్ అధికారి రామ్‌మోహన్ వివరించారు. "గడ్డి భూమి ఆవరణ వ్యవస్థ సమతౌల్యాన్ని కాపాడటంలో ఇవి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ఎలుకలు, పక్షులు, వాటి గుడ్లు, బల్లులు, తొండలతో పాటు జెరిగొడ్డు వంటి పాములను ఆహారంగా తీసుకుంటాయి. వివిధ రకాల పండ్లనూ తింటాయి. గడ్డి భూములు అంతరిస్తుండడంతో ఇవి వాటి ఆవాసాలను కోల్పోతున్నాయి. ఇటీవల వీటి సంఖ్య గణనీయంగా తగ్గుతోంది" అని తెలిపారు.



– న్యూస్‌టుడే, జన్నారం

మహేస్వరం వినిపించండి

పంచాయతీలో సమస్యల పరిష్కారానికి కాల్‌సెంటర్

సమస్యలపై ఫిర్యాదుకు, వివిధ సేవలు పొందడానికి సంస్థలకు, ప్రభుత్వ శాఖలకు వేదికగా నిలుస్తున్న 'కాల్‌సెంటర్'ను తమ పంచాయతీలో అందుబాటులోకి తెచ్చారు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం సర్పంచి మునగపాటి నవీన్. 20 వేల జనాభా ఉన్న ఈ పంచాయతీలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 90008-81020 నంబరుతో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. తాగునీరు రాకున్నా.. వీధిలైట్లు వెలగకున్నా.. చెత్త పేరుకుపోయినా.. పింఛను రాకున్నా.. ఇలా సమస్య ఏదైనా.. పంచాయతీ కార్యాలయం వరకు వెళ్లకుండానే.. కాల్‌సెంటర్‌కు ఫోన్ చేసి చెబితే పరిష్కరిస్తామని చెబుతున్నారు. దీని నిర్వహణకు సొంతంగా నెలకు రూ.10 వేల జీతం ఇస్తూ ఓ మహిళను నియమించారు. ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేయడంతోపాటు.. ఎన్ని రోజుల్లో పరిష్కరించింది కూడా రికార్డు చేస్తామని సర్పంచి వివరించారు. ఇంటర్ వరకూ చదువుకున్న నవీన్.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీ కార్యాలయంలో ఈ కాల్‌సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఫోన్‌లో ఫిర్యాదును స్వీకరిస్తున్న ఉద్యోగిని, సర్పంచి నవీన్, ఉపసర్పంచి రమేష్ లను చిత్రంలో చూడవచ్చు.



– న్యూస్‌టుడే, మహేశ్వరం

మఠం భూముల కబ్జా..!

- తిరుపతిలో 74 ఎకరాల ఆక్రమణకు పావులు
- కోర్టు స్టే ఉన్నా ఆగని నిర్మాణాలు

ఈనాడు డిజిటల్, తిరుపతి : ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో భూకబ్జాదారులు పంజా విసురుతున్నారు. దేవుడి మాన్యాలు, మఠం ఆస్తుల్నీ వదలడం లేదు. తిరుపతి, చంద్రగిరిలోని కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు వారికి కవచంగా తయారయ్యారు. మఠం యాజమాన్యాలు ప్రశ్నించినా బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తిరుపతి అర్బన్, రూరల్ పరిధిలోని సర్వే నంబర్లు 242-బీ, 243, 145, 147/1, 148/2, 321, 323 లలో హథీరాంజీ మఠం, పరకాల మఠానికి చెందిన 74.23 ఎకరాలున్నాయి. 43-బీ రిజిస్టర్ (ఎండోమెంట్ రికార్డు) ప్రకారం ఈ భూములు వందేళ్లుగా మఠాల ఆధీనంలోనే ఉన్నాయి. రెవెన్యూ రికార్డుల్లోనూ ఇదే ఉంది. కానీ కబ్జాదారులు బినామీలను ముందు పెట్టి ఆక్రమించడం, తర్వాత ప్లాట్లు వేసి అక్రమ నిర్మాణాలు చేయడంలో మునిగిపోయారు.

ప్రజాప్రతినిధులు, పోలీసుల కనుసన్నల్లోనే..

ఎంఆర్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎదురుగా.. సర్వే నంబరు 242-బిలో దాదాపు 9 ఎకరాల 89 సెంట్లు, సర్వే నంబరు 243లో ఒకటిన్నర ఎకరా భూమి ఉంది. వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రజాప్రతినిధులు, పోలీసులు కలిసి దీన్ని ఆక్రమించే ప్రయత్నం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్నాళ్లు ఆ ప్రయత్నాలు నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ అక్కడ ప్లాట్లు వేశారు. సర్వే నం. 147/1లో మఠాలకు చెందిన పదెకరాల్లోనూ ఆక్రమణలు కొనసాగుతున్నాయి.

పట్టపగలే యంత్రాలతో పనులు

సర్వే నంబరు 145 (అవిలాల గ్రామం)లో 6.56 ఎకరాల భూమిపై న్యాయస్థానం 'స్టేటస్ కో' (యథాతథ స్థితి) విధించింది. అక్కడ ఎలాంటి నిర్మాణాలూ చేపట్టకూడదు. కానీ పట్టపగలే యంత్రాలతో పనులు సాగుతున్నాయి. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేస్తే.. అధికారులు వచ్చినప్పుడు కాసేపు పనులు నిలిపేశారు. తర్వాత మళ్లీ మొదలు పెట్టారు.

- '1990 నుంచి ఈ భూములకు సంబంధించి పోరాడుతున్నాం. మా దగ్గర డాక్యుమెంట్లు, కోర్టు ఆర్డర్లు అన్నీ ఉన్నాయి. కానీ అవతలి వైపు నుంచి చంపేస్తామని బెదిరిస్తున్నారు' అనేది మఠాలకు చెందిన కొందరి ఆవేదన. 'మా భూమిలో నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా కాంపౌండ్ నిర్మిస్తున్నారు. అడ్డుకునే శక్తి మాకు లేదు' అని హక్కుదారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి, మఠం భూములపై 'సిట్' వేయాలని, 43-బి రిజిస్టర్ ఆధారంగా సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అవిలాల గ్రామంలో సర్వేనంబరు 145, 147/1లో అక్రమ లేఅవుట్

ఆక్రమణలు తొలగిస్తాం

– డా.వెంకటేశ్వర్, కలెక్టర్, తిరుపతి

గతంలో ఈ మఠం భూముల్లో ఆక్రమణలు, అక్రమ కట్టడాలు జరుగుతున్నాయని సర్వే చేయించి నిలువరించాం. ప్రస్తుతం అక్రమ కట్టడాలు చేపడుతున్నారని మా దృష్టికొచ్చింది. వాటిపై వెంటనే చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలను తొలగిస్తాం.

రోకలితో తలపై మోది..

ఆపై స్టేటస్‌గా పెట్టుకొని..

- భార్యపై అనుమానంతో హత్య చేసిన భర్త

రహ్మత్‌నగర్, న్యూస్‌టుడే: కడదాకా కలసి ప్రయాణం చేస్తామని.. ప్రమాణం చేసిన భర్త అనుమానంతో కట్టుకున్న ఆలిని దారుణంగా కడతేర్చాడు. తలపై రోకలి బండతో బలంగా మోది పాశవికంగా హత్య చేశాడు. అక్కడే నిద్రపోతున్న పిల్లలు మేల్కొనడంతో అమ్మ పడుకుందని.. మీరూ నిద్రపోండని బయటకు వెళ్లి.. తన భార్యను చంపేశానంటూ మొబైల్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధి రాజీవ్‌గాంధీ నగర్‌లో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..



సరస్వతి, అంజనేయులు

వనపర్తి జిల్లా చింతకుంట గ్రామానికి చెందిన ఆంజనేయులు, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన సరస్వతి(34)లకు 2013లో వివాహమైంది. కొన్నేళ్లుగా రాజీవ్‌గాంధీ నగర్‌లోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. వీరికి 12 ఏళ్ల కుమారుడు, 9 ఏళ్ల కుమార్తె ఉన్నారు. ఆంజనేయులు కారు డ్రైవర్‌గా, సరస్వతి హైటెక్ సిటీ ప్రాంతంలోని ఒక కంపెనీలో హౌస్‌కీపింగ్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేది. దీనికి తోడు భార్యపై ఆంజనేయులు అనుమానం పెంచుకున్నాడు. ఉద్యోగం మానేసి జులాయిగా తిరగసాగాడు. సరస్వతి పలుమార్లు కొలువుకు వెళ్లాలని సూచించినా ప్రయోజనం లేకపోయింది. డబ్బుల్లేకపోవడంతో పిల్లలను సైతం బడికి పంపడం మాన్పించేశారు. అయినా ఆంజనేయులు బుద్ధి మారకపోవడంతో నీతో బతకలేనంటూ ఇటీవల పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లారు. తాను మారిపోతానని.. మంచిగా ఉంటానని.. మాయమాటలు చెప్పి ఈనెల 17న భార్య, పిల్లలను ఇంటికి తీసుకొచ్చాడు. సోమవారం విధులు ముగించుకొని వచ్చిన సరస్వతి.. పిల్లలకు భోజనం పెట్టి పడుకున్నారు. ఆ సమయంలో ఆంజనేయులు నిద్రిస్తున్న భార్య తలపై రోకలిబండతో పలుమార్లు బలంగా మోదడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు. అక్కడే నిద్రపోయిన పిల్లలు దుస్తులు సైతం రక్తంతో తడిసిపోయాయి. ఆ సమయంలో వారిద్దరూ నిద్రలేవడంతో.. అమ్మ పడుకుంది.. మీరు నిద్రపోండి అని ఆంజనేయులు బయటికి వెళ్లిపోయాడు. ఆ వెంటనే భయంతో పిల్లలు నిద్ర లేచి లైట్ వేసి తల్లి రక్తపుమడుగులో పడి ఉండటాన్ని చూశారు. వెంటనే సమీపంలో ఉంటున్న మేనమామ సుధాకర్‌కు ఫోన్‌చేసి చెప్పారు. ఆయన అక్కడికి చేరుకొని 100కు సమాచారం అందించారు. భార్యను చంపిన నిందితుడు తన మొబైల్ స్టేటస్‌లో 'నా జీవితంలో సగభాగమైన నిన్ను నా చేతులారా చంపుకొన్నాను' అని స్టేటస్ పెట్టుకోవడం గమనార్హం. ఆంజనేయులు గతంలో సరస్వతి మరో సోదరుడైన ప్రశాంత్‌ను కత్తితో గాయపరచడంతో కేసు నమోదైనట్లు సమాచారం. సరస్వతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

24న సీఎం నగరి పర్యటన

పుత్తూరు, నగరి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు ఈ నెల 24న నగరిలో పర్యటించనున్నట్లు చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. సీఎం శనివారం ఉదయం 11.30 గంటలకు నగరి జూనియర్ కళాశాలకు చేరుకుంటారని, అక్కడి నుంచి చింతలపట్టెడలో నిర్వహించే స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వాటాకు మించి కృష్ణా జలాలను వినియోగించుకున్న ఏపీ: తెలంగాణ ఈఎన్సీ

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత నీటి సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే ఆ రాష్ట్ర వాటాకు మించి కృష్ణా జలాలను వినియోగించుకుందంటూ కృష్ణా బోర్డుకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్(ఈఎన్సీ) అంజద్ హుస్సేన్ మంగళవారం లేఖ రాశారు. 'శ్రీశైలం, సాగర్‌ల నుంచి ఏపీ తనకు కేటాయించిన వాటాకు మించి నీటిని మళ్లించుకుంది. తెలంగాణ తన వాటాను పూర్తిస్థాయిలోవినియోగించుకోలేదు' అని లేఖలో కోరారు.

కర్మకాండల కోర్సు @ కోటా వర్సిటీ

రాజస్థాన్ కోటాలోని వర్ధమాన్ మహావీర్ ఓపెన్ యూనివర్సిటీ (వీఎంవోయూ)లో హిందూ వివాహ తదితర ఆచార వ్యవహారాలకు సంబంధించిన కర్మకాండల అధ్యయన కోర్సును ప్రారంభించారు. 'ఆర్నెల్ల ఈ కోర్సును విద్యార్థులు గరిష్ఠంగా ఏడాది లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. కులం, మతం, వయసు ఆంక్షలు ఏమీ లేవు. సీట్లు అపరిమితం. 12వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులు రూ. 4,800 రుసుం కట్టాలి. హిందూ మతంలోని 16 కర్మలు ఇందులో ఉంటాయి" అని కోర్సు కోఆర్డినేటరు వివరించారు.

– ఈటీవీ భారత్

గత ప్రభుత్వంలో అవినీతిపై విచారణ ఏదీ?

- అధిక ధరకు ట్రాన్స్‌ఫార్మర్లు కొన్నా చర్యలుండవా?
- తిరుపతిలో ప్రజాభిప్రాయ సేకరణలో సీపీఎం నేత ధ్వజం

ఈనాడు-తిరుపతి, తిరుపతి (గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: 'గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోళ్లలో రూ.వేలకోట్ల అవినీతి జరిగింది. నాటి ప్రభుత్వ పెద్దలు ఓ సంస్థకు అనుకూలంగా వ్యవహరించి దోపిడీకి సహకరించారు. రూ.40 వేల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్‌ను రెండుమూడు రెట్ల అధిక ధరకు కొని ఆ భారాన్ని వినియోగదారులపై మోపారు. అయినా ప్రస్తుత ప్రభుత్వం అప్పటి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడంలేదు' అని సీపీఎం నేత కందారపు మురళి ధ్వజమెత్తారు. ఏపీ ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) మంగళవారం తిరుపతిలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ హాజరయ్యారు. ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అంశాలను పరిశీలించాక మార్చి 31లోపు ఏపీ ఈఆర్సీ టారిఫ్‌లను ప్రకటిస్తుంది.



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో కాంపెండియమ్ ఆఫ్ రెగ్యులేషన్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈఆర్సీ ఛైర్మన్ పీవీఆర్ రెడ్డి, ఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ ఇతర ఉన్నతాధికారులు

ఐస్ తయారీదారులను ఆదుకోవాలి

'జగన్ ప్రభుత్వం వినియోగదారులపై రూ.32 వేల కోట్ల అదనపు భారాన్ని మోపితే ప్రస్తుతం దాన్ని రూ. 16-17వేల కోట్లకు తగ్గించడం అభినందనీయం. ట్రాన్స్‌ఫార్మర్లను విక్రయించే సంస్థలే వాటిని మరమ్మతులు చేయాలి' అని మురళి డిమాండ్ చేశారు. ఆక్వాకు అనుబంధంగా ఉన్న ఐస్ తయారీదారులను విద్యుత్ సంస్థలు ఆదుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన వ్యాపారులు కోరారు.

రూ.7,923.50 కోట్ల రెవెన్యూ లోటు

2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏపీ ఎస్పీడీసీఎల్‌కు ఎల్‌టీ, హెచ్‌టీ కనెక్షన్ల ద్వారా రూ.15,854.37 కోట్ల ఆదాయం వస్తుందని ఎస్పీడీసీఎల్ అధికారులు అంచనా వేశారు. అదే సమయంలో రూ.23,777.87 కోట్ల రాబడి అవసరమని వారు పేర్కొన్నారు. ఇందులో విద్యుత్తు కొనుగోలు/సేకరణకే రూ.14,966.67 కోట్ల అవసరమని తెలిపారు. రూ.7,923.50 కోట్ల మేర లోటు తలెత్తుతుందని వెల్లడించారు.



పంతంగి టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

నగరానికి తిరుగు ప్రయాణం..

విజయవాడ-హైదరాబాద్ మార్గంలో పెరిగిన రద్దీ

చౌటుప్పల్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు రాజధాని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతున్నారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు వరుసగా 4 రోజుల పాటు విజయవాడ నుంచి హైదరాబాద్ మార్గంలో వాహనాల రద్దీ పెరిగింది. ఏపీ నుంచి వచ్చే వాహనాలతో చిట్యాల, పెద్దకాపర్తి, పంతంగి టోల్‌ప్లాజా, చౌటుప్పల్‌లో వాహనాలు బారులు తీరాయి. యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా మీదుగా శుక్రవారం 52,500, శనివారం 65,112, ఆదివారం 65,057, సోమవారం 67,379 వాహనాలతో కలిపి నాలుగు రోజుల్లో 2.50లక్షల వాహనాలు రాకపోకలు సాగించాయి. మంగళవారం వాహనాల రద్దీ సాధారణంగానే ఉంది. సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే సమయంలో 5 రోజుల్లో 3.04లక్షల వాహనాలు వెళ్లాయి. విజయవాడ రహదారిపై బ్లాక్‌స్పాట్స్ ప్రాంతాల్లో అండర్‌పాస్ వంతెనల పనుల మూలంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో పోలీసులు వాహనాల మళ్లింపును చేపట్టారు. దీంతో పంతంగి టోల్‌ప్లాజా మీదుగా నిరుడు సంక్రాంతి కంటే తక్కువ వాహనాలు రాకపోకలు సాగించాయి.

అపార్థం చేసుకుంటున్నారని ఆగిపోకండి



మిమ్మల్ని కొంతమంది అపార్థం చేసుకుంటున్నారని చింతిస్తూ కూర్చోకండి. మీ గురించి వాస్తవాలు అందరికీ తెలియాల్సిన అవసరం లేదు. మీ ప్రేమానురాగాలు, దయను పొందే అర్హత అందరికీ ఉండదు. జీవితంలో ఎదగడం కోసం కృషి చేస్తున్నప్పుడు.. మీరు మారిపోయారంటూ చాలామంది పెదవి విరుస్తుంటారు. మిమ్మల్ని అపార్థం చేసుకోవడమే పనిగా పెట్టుకుంటారు. అలాంటివారికి వివరణలు ఇస్తూ ఆగిపోకండి. నిజమైన శ్రేయోభిలాషులు అభివృద్ధి పథంలో మిమ్మల్ని వెన్నుతట్టి ప్రోత్సహిస్తారు.

– కరుణ్ పాల్, గ్రోత్ మెంటార్

(c) eenadu



అమరావతిలో మంత్రి నారాయణతో భేటీ అయిన బ్రిటన్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్. చిత్రంలో అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్

మంత్రి నారాయణతో బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ భేటీ

ఈనాడు, అమరావతి: పురపాలక శాఖ మంత్రి పి.నారాయణతో బ్రిటన్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ మంగళవారం అమరావతిలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. అమరావతి నిర్మాణ పనుల పురోగతిని ఓవెన్‌కు మంత్రి వివరించారు. అమరావతి అభివృద్ధిలో ఏపీ ప్రభుత్వంతో కలసి పనిచేస్తామని ఓవెన్ తెలిపారు. రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, అంతర్జాతీయ స్పోర్ట్స్‌సిటీ ప్రాజెక్టులపై ఆయన ఆసక్తి కనబరిచినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో అమరావతి గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఆ తల్లి త్యాగాన్ని గౌరవిస్తూ ఆత్మార్పణ దినం

ముఖ్యమంత్రి చంద్రబాబు


ఈనాడు, అమరావతి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం ఆడబిడ్డల ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని చాటేలా నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. "ఆ తల్లి త్యాగాన్ని గౌరవిస్తూ ఆత్మార్పణ దినాన్ని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించాం. ఆ తల్లి చల్లని దీవెనలతో అందరికీ మేలు జరగాలని కోరుకున్నా" అని 'ఎక్స్' వేదికగా మంగళవారం సీఎం పేర్కొన్నారు.

నితిన్ నబీన్‌కు పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: భాజపా జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ నబీన్‌కు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. "రెండు దశాబ్దాల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఆయన పని చేసిన తీరు పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణకు అద్దం పట్టింది. ఈ నియామకం ఆయనపై భాజపాకు ఉన్న నమ్మకానికి నిదర్శనం. నూతన బాధ్యతలు చేపడుతున్న నితిన్ నబీన్‌కు అభినందనలు తెలియజేస్తున్నా" అని 'ఎక్స్'లో పవన్‌కల్యాణ్ మంగళవారం పేర్కొన్నారు. ఇంతకుముందు భాజపా అధ్యక్షుడిగా వ్యవహరించిన కేంద్రమంత్రి జేపీ నడ్డా పార్టీకి, కూటమికి అందించిన సేవలను కూడా పవన్‌కల్యాణ్ కొనియాడారు.



స్విట్జర్లాండ్ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెనె బడ్లిగర్ ఆర్టీడాను సత్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో స్విస్ ఎంపీ నిక్ గగ్గర్, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి, రాయబారి ఆండ్రియా రౌబర్



దావోస్‌లో జ్యూరిచ్ హౌవెన్ ప్రెసిడెంట్, సీఈవో విలియం ఎల్.మీనితో భేటీ అయిన మంత్రి లోకేశ్

సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దడంలో సహకరించండి

ఇజ్రాయెల్ ప్రతినిధి బృందాన్ని కోరిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సైబర్ సెక్యూరిటీ నగరంగా అమరావతిని తీర్చిదిద్దేందుకు సాంకేతిక సహకారం అందించాలని ఇజ్రాయెల్ దేశ ప్రతినిధి బృందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఆ దేశ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్, ట్రేడ్ కమిషనర్ గాయ్ ఫిషర్, స్విట్జర్లాండ్‌లో ఇజ్రాయెల్ ట్రేడ్ మిషన్ ప్రతినిధి షిర్లీ బ్లూటో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో డ్రోన్ తయారీ, తీర ప్రాంత గస్తీ, వ్యవసాయ రంగంలో వినియోగించే డ్రోన్ల తయారీ సాంకేతికత అందించే విషయమై వారితో చర్చించారు. డీశాలినేషన్, పారిశ్రామిక అవసరాల కోసం వ్యర్థ జలాల రీసైక్లింగ్ సాంకేతికతపై సహకారం అందించాలని కోరారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌తోపాటు సెమీకండక్టర్ల తయారీ, జపాన్, కొరియా పారిశ్రామిక క్లస్టర్ల మాదిరిగా ఇజ్రాయెల్ కూడా ఒక పారిశ్రామిక క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని సీఎం ప్రతిపాదించారు.

స్విస్ ప్రతినిధి బృందంతోచంద్రబాబు భేటీ

ఏపీ-స్విట్జర్లాండ్ మధ్య వివిధ రంగాల్లో వాణిజ్య సంబంధాలు.. ఏపీలో స్విస్ కంపెనీల కార్యకలాపాల.. విస్తరణ అంశాలపై సీఎం చంద్రబాబు ఆ దేశ ప్రతినిధి బృందంతో దావోస్‌లో చర్చించారు. ఆ దేశ ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి హెలెనె బడ్లిగర్ ఆర్టీడా, ఆర్థిక వ్యవహారాల ప్రతినిధి అంబాసిడర్ ఆండ్రియా రౌబర్, స్విస్ పార్లమెంటు సభ్యుడు నిక్ గగ్గర్, సీఈవో సలహాదారు మార్టినా బైటెన్వాదర్‌తో సీఎం భేటీ అయ్యారు.



ఇజ్రాయెల్ వాణిజ్య, పరిశ్రమల మంత్రి నిర్ బర్కత్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆత్మీయ కరచాలనం

మూడోరోజూ దావోస్‌లో సీఎం బిజీ

దావోస్ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు మూడో రోజు (బుధవారం) కీలక సమావేశాల్లో పాల్గొననున్నారు. ప్రముఖ కంపెనీల సీఈవోలతో ముఖాముఖి భేటీ కానున్నారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం కాంగ్రెస్ సెంటర్‌లో పారిశ్రామిక పురోగతిపై నిర్వహించే సెషన్‌లో పాల్గొంటారు. హురైసన్ ఛైర్మన్ ఫ్రాంక్ రిబర్‌తో సమావేశం కానున్నారు. తమారా హోస్పిటాలిటీ సంస్థ ఫౌండర్ శృష్టి శిబులాల్, ఆ సంస్థ సీఈవో ఉమ్మన్ అవస్తి, కాలిబో ఏఐ అకాడమీ సీఈవో రాజ్ వట్టికుట్టి ముఖ్యమంత్రితో సమావేశమై చర్చిస్తారు. ఏపీ సీఎన్ఎఫ్ నిర్వహించే హీలింగ్ ప్లానెట్ త్రూ రీజనరేటివ్ ఫుడ్ సిస్టమ్స్ పేరిట జరిగే చర్చలో పాల్గొంటారు. ట్రిలియన్ డాలర్ పివోట్ రీరైటింగ్ మార్కెట్ సిగ్నల్స్ ఫర్ నేచర్ పాజిటివ్ గ్రోత్ అనే అంశంపై చర్చలో పాల్గొంటారు. బ్లూమ్‌బర్గ్ సంస్థ నిర్వహించనున్న ట్రిలియన్స్ ఆఫ్ డాలర్స్ ఏఐ మూవ్‌మెంట్ ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ సెషన్‌లో ముఖ్యవక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే బిల్డింగ్ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమంలో కేంద్రమంత్రులతో కలిసి పాల్గొంటారు. వాతావరణ మార్పులపై ఫైనాన్సింగ్ రీజనరేషన్ మొబిలైజింగ్ కేపిటల్ పేరిట నిర్వహించే కార్యక్రమానికి సీఎం హాజరవుతారు.

కడప ఉక్కు ప్లాంటు నిర్మాణాన్ని త్వరగా చేపట్టండి

జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఎండీతో లోకేశ్

ఈనాడు, అమరావతి: కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని జేఎస్‌డబ్ల్యూ సంస్థ ప్రతినిధులను మంత్రి లోకేశ్ కోరారు. దావోస్‌లో ఆ సంస్థ సిమెంట్, పెయింట్స్ విభాగం ఎండీ పార్థ్ జిందాల్‌తో మంత్రి సమావేశమయ్యారు. ప్లాంటుకు భూమి పూజ నిర్వహించే విషయమై వారితో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ.. 'ఏపీలో డెకొరేటివ్, ఇండస్ట్రియల్ పెయింట్స్ ప్లాంట్ ఏర్పాటు చేయాలి. భారత్‌లో జేఎస్‌డబ్ల్యూ-ఎంజీ భాగస్వామ్యంతో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు శ్రీసిటీ లేదా విశాఖ ప్రాంతాన్ని పరిశీలించాలి. జేఎస్‌డబ్ల్యూ చేపట్టిన వారసత్వ సంపద దత్తత కార్యక్రమంలో ఏపీలోని గండికోట, ఉండవల్లి గుహలను స్వీకరించాలి' అని కోరారు. ప్రతిపాదనలపై ఉన్నత స్థాయి బృందంతో చర్చించనున్నట్లు జిందాల్ తెలిపారు.

స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బందికి జనగణన విధులు

ఈనాడు, అమరావతి: జనగణన-2027లో స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డుల సిబ్బంది సేవల్ని వినియోగించుకునేందుకు భారత రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ రాష్ట్ర ప్రభుత్వానికి అనుమతిచ్చారు. ఏ ఇంటినీ విడిచిపెట్టకుండా, ఏ ఒక్కరినీ మినహాయించకుండా వివరాలు నమోదు చేయాలని, వివరాలు పక్కాగా సేకరించాలని, సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, జనగణన జాతీయ ప్రాధాన్య అంశం అన్న విషయాన్ని గమనంలో ఉంచుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని షరతులు విధించారు.

మహిళా డ్యాన్సర్లపై వైకాపా నాయకుడి అనుచిత వ్యాఖ్యలు..

- మహిళా కమిషన్ సీరియస్.. విచారణకు రావాలని నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం గోగన్నమఠం గ్రామంలో మహిళా డ్యాన్సర్లపై వైకాపా నాయకుడు భూపతిరాజు వెంకట సత్యనారాయణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఏపీ మహిళా కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 23న కమిషన్ ముందు హాజరుకావాలని కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ మంగళవారం ఆయనకు సమన్లు జారీ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "గోగన్నమఠం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటుచేసిన నృత్య ప్రదర్శనలో భూపతిరాజు వెంకట సత్యనారాయణరాజు డ్యాన్సర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల ద్వారా కమిషన్ దృష్టికి వచ్చాయి. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. మహిళల గౌరవం కాపాడే విషయంలో కమిషన్ మౌనంగా ఉండదు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడం, వారి వీడియోలు రికార్డు చేయడం, డ్యాన్సర్లను అసభ్యకరంగా నృత్యం చేయాలంటూ ఒత్తిడి చేయడం అత్యంత సిగ్గుచేటు. ఇలాంటి వ్యాఖ్యలు, ప్రవర్తన మహిళల వ్యక్తిగత గౌరవం, స్వేచ్ఛ, భద్రతపై ప్రత్యక్ష దాడిగా కమిషన్ అభిప్రాయపడుతోంది. ఈ ఘటన సమాజం తలదించుకునే స్థితికి తీసుకెళ్లింది. ఇప్పటికే నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. పూర్తి వివరాలు, సాక్ష్యాలు తక్షణమే సమర్పించాలని పోలీసు అధికారులను ఆదేశించాం" అని ఆమె పేర్కొన్నారు.

జపాన్ అతిథుల కోసం.. ఏపీలో మరెన్నో రుచులున్నాయి

'ఎక్స్'లో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: సుషీ, సాషిమితోపాటు ప్రపంచ ప్రసిద్ధి చెందిన జపనీస్ వంటకాలు ఎలా ఆ దేశ క్రమశిక్షణ, సమతుల్యతను ప్రతిబింబిస్తాయో.. ఆంధ్రప్రదేశ్ వంటకాలు కూడా తమ రుచుల ద్వారా ఆప్యాయత, ఉదారతను చాటి చెబుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. దిల్లీలోని ఏపీ భవన్‌లో తమ బృందం రుచికరమైన ఆంధ్రా భోజనం ఆస్వాదించారని, అది ఘాటైన రుచులు, మసాలాలతో ఉందని జపాన్ రాయబార కార్యాలయ బృందం 'ఎక్స్'లో పేర్కొంది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. 'ఏపీ భవన్‌లో సంప్రదాయ ఆహారాన్ని ఆస్వాదించడం సంతోషంగా ఉంది. అందరికీ నా అభినందనలు. ఆంధ్రప్రదేశ్ సందర్శించాలనుకునే జపాన్ అతిథులకు మరెన్నో రుచులు వేచి ఉన్నాయి. మీ రెండో ఇంటికి మిమ్మల్ని ఆహ్వానించేందుకు ఎదురుచూస్తున్నాం' అని పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌కేల్లో ఏఈవోలను నియమించబోమని మంత్రి హామీ ఇచ్చారు: ఏఈవోల సంఘం

ఈనాడు, అమరావతి: రైతు సేవా కేంద్రాల్లో(ఆర్‌ఎస్‌కే) ఏఈవోలను నియమించబోమని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారని రాష్ట్ర వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం అధ్యక్షుడు వేణుమాధవరావు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా 2026 డైరీని వారు విడుదల చేయించారు. ఈ సందర్భంగా విస్తరణాధికారులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రం మంత్రికి అందజేశారు.

ఇంటర్ విద్యార్థులకు నేడు నైతిక విలువల పరీక్ష

ఈనాడు, అమరావతి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. 21న నైతికత, మానవ విలువలు, 23న పర్యావరణ పరీక్ష నిర్వహిస్తారు. వీటిలోనూ విద్యార్థులు ఉత్తీర్ణులవ్వాలి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఫిబ్రవరి 1 నుంచి 10 వరకు జరుగుతాయి. వృత్తివిద్యా కోర్సులకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు పరీక్షలుంటాయి. ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడతలుగా ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్మీడియట్ ప్రధాన పరీక్షలు ఫిబ్రవరి 23న ప్రారంభమై మార్చి 24తో ముగుస్తాయి.

మైనింగ్‌కు ఈసీ రద్దుపై ఎన్జీటీ ఆదేశాలు సబబే

- నెల్లూరు జిల్లాలో లీజు వివాదంపై హైకోర్టు తీర్పు
- ఎన్జీటీ.. సుమోటోగా ఆదేశాలు ఇవ్వొచ్చని స్పష్టత

ఈనాడు, అమరావతి: జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) అప్పీల్‌లో జారీచేసిన ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేయొచ్చని, ఆ వ్యాజ్యాలకు విచారణార్హత ఉంటుందని హైకోర్టు ధర్మాసనం స్పష్టంచేసింది. ఎన్జీటీ చట్టంలోని సెక్షన్ 22 ప్రకారం ఎన్జీటీ ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి ఉన్నప్పటికీ.. ప్రత్యామ్నాయంగా హైకోర్టులో వ్యాజ్యం దాఖలు చేయడంపై నిషేధమేమీ లేదని పేర్కొంది. పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఎన్జీటీది కీలక పాత్ర అని, ఆ ట్రైబ్యునల్ సుమోటోగా సైతం ఆదేశాలు ఇవ్వొచ్చని తెలిపింది. సుప్రీంకోర్టు తాజా తీర్పులు, చట్ట నిబంధనలు, ఎన్జీటీ ఆదేశాలను పరిగణనలోకి తీసుకొని శ్రీకుమారస్వామి సిలికా మైనింగ్ సంస్థకు పర్యావరణ అనుమతులు(ఈసీ) జారీ చేయడంపై నిర్ణయం తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రవినాథ్ తిల్హరి, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది.

◆ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం మోమిడి గ్రామంలో మైనింగ్ నిర్వహించేందుకు వీలుగా శ్రీకుమారస్వామి సిలికా మైనింగ్ సంస్థకు ఈసీ ఇస్తూ 2020 ఏప్రిల్ 16న కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దీనిపై అదే గ్రామానికి చెందిన మదన్‌కుమార్‌రెడ్డి చెన్నైలోని ఎన్జీటీలో అప్పీల్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ఎన్జీటీ.. ఈసీ అమలును తాత్కాలికంగా పక్కనపెడుతూ (అబయన్స్) 2021 నవంబర్‌లో ఉత్తర్వులిచ్చింది. వీటిని సవాలు చేస్తూ, ఆ మైనింగ్ సంస్థ వ్యాపార భాగస్వామి 2021 డిసెంబర్‌లో హైకోర్టులో పిటిషన్ వేశారు. మదన్‌కుమార్‌రెడ్డి బాధితుడు కానందున కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ జారీచేసిన ఈసీని సవాలు చేసే అర్హత అతనికి లేదని, అతని అప్పీల్‌పై ఎన్జీటీ విచారణ జరపడానికి వీల్లేదని వాదించారు.

◆ మదన్‌కుమార్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ 'ఎన్జీటీ ఉత్తర్వులపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలి తప్ప, హైకోర్టులో వ్యాజ్యం వేయడానికి వీల్లేదు. ఎన్జీటీ జారీచేసిన ఉత్తర్వులు సరైనవే. ఈ విషయంలో జోక్యం చేసుకోవద్దు. పైగా, పిటిషనర్ స్థానిక గ్రామస్థుడు. మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడంతో బాధితుడిగా మారారు. అందుకే ఎన్జీటీలో అప్పీల్ వేసే అర్హత మదన్‌కుమార్‌రెడ్డికి ఉంది' అని పేర్కొన్నారు. ఇరువైపు వాదనలు విన్న ధర్మాసనం.. ఎన్జీటీ ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. మదన్‌కుమార్‌రెడ్డి 'బాధితుడు' అన్న నిర్వచనం కిందకు వస్తారని స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ఆయన ఎన్జీటీలో దాఖలు చేసిన అప్పీల్‌కు విచారణ అర్హత ఉందని, ట్రైబ్యునల్ ఉత్తర్వులు సరైనవేనని పేర్కొంది. ఎన్జీటీ ఉత్తర్వులు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయన్న శ్రీకుమారస్వామి మైనింగ్ సంస్థ వాదనలను తోసిపుచ్చింది. వ్యాజ్యాన్ని కొట్టేసింది.

వైద్యులు ప్రభుత్వ సేవలకు కట్టుబడాలి

- ప్రైవేటు రంగానికి వెళ్లిన వారిపై చర్యలు
- శాసనసభ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్ తోట త్రిమూర్తులు




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ ఛైర్మన్ తోట త్రిమూర్తులు, చిత్రంలో ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, గాలి భానుప్రకాశ్, బండారు శ్రావణిశ్రీ, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (వైద్య విభాగం), న్యూస్‌టుడే: 'ప్రభుత్వ రాయితీలతో పీజీ పూర్తిచేసిన వైద్యులు నిబంధనలకు కట్టుబడి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు సేవలందించాలి. అందుకు విరుద్ధంగా ప్రైవేటురంగానికి వెళ్లిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 57 మంది వైద్యులకు నోటీసులు జారీచేసి, కొందరి నుంచి సొమ్ము రికవరీ ప్రారంభించామ'ని రాష్ట్ర శాసనసభ సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ ఛైర్మన్ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి కలెక్టరేట్‌లో వివిధ శాఖలతో సమీక్షించారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహించారు. జీవోలు 85, 127, 311 అమలుపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కమిటీ చర్చించిందని, జీవో 85లో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా జీవో 127లో కొన్ని సవరణలు చేశామని చెప్పారు. వాటిని క్షేత్రస్థాయిలో అమలుపరచాలని ఆదేశించారు. ఇన్‌సర్వీస్ అభ్యర్థులకు 30 శాతం రిజర్వేషన్ అంశంపై మార్పులు జరిగాయని చెప్పారు. పీజీ వైద్యులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే విద్యార్హత డిగ్రీ రద్దు, ప్రభుత్వ రాయితీలను వడ్డీతో సహా వసూలు చేయడంతో పాటు అవసరమైతే రూ.50 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీలు లేనందున కొంతమంది ఎంబీబీఎస్ వైద్యులకు అవకాశాలు కల్పించలేకపోతున్నామని, దీనిపై ప్రభుత్వం అధ్యయనం చేసి నిర్ణయం తీసుకోవాలని కమిటీ అభిప్రాయపడినట్లు త్రిమూర్తులు చెప్పారు. రాష్ట్రంలో హెచ్‌ఐవీ కేసులు గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గినప్పటికీ, గ్రామాలు, జాతరలు జరిగే ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు పెంచాలని సభ్యులు సూచించారు. కమిటీ సభ్యులు.. పీలేరు, శింగనమల, నగరి, సత్తెనపల్లి, కావలి ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, శ్రావణిశ్రీ, గాలి భానుప్రకాశ్, కన్నా లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, డీఎంఈ రఘునందన్, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

జగన్ హయాంలో 'రీసర్వే 1.0' అంతా తప్పుల తడకే

- 'రీసర్వే 2.0'తో అన్నీ సరిదిద్ది, మెరుగ్గా తీసుకొస్తున్నాం
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వం 'రీసర్వే 1.0'లో చేసిన తప్పుల్ని సరిదిద్దుతున్న కూటమి ప్రభుత్వం.. 'రీసర్వే 2.0'లో సమూల మార్పులు చేసిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. రైతులకిచ్చే భూహక్కు పత్రాలపై జగన్ బొమ్మ ముద్రించి రైతుల్లో ఆందోళన పెంచారని, అప్పట్లో ఇచ్చిన పత్రాల్లో అనేక తప్పులు ఉన్నాయని ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్ హయాంలో జరిగిన రీసర్వే అంతా తప్పుల తడకే అని అన్నారు. 'జగన్ పాలనలో ప్రచురించిన క్యూఆర్ కోడ్‌తో అప్పటికి ఉన్న సమాచారమే కన్పిస్తుంది. మ్యుటేషన్, సబ్‌డివిజన్ వివరాలు ఉండవు. నావిగేషన్ సిస్టమ్ కూడా లేదు. ఇప్పుడిచ్చే క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఎల్‌పీఎంతోపాటు దానికి దారి చూపే నావిగేషన్ విధానం అందుబాటులో ఉంటుంది. తాజా సమాచారం తెలుస్తుంది. పాస్‌పుస్తకాల్లో తప్పులు సరిదిద్ది పంపిణీ చేస్తున్నాం. ట్యాంపరింగ్‌కు వీలులేకుండా బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం' అని వెల్లడించారు. . 'రీసర్వే 2.0 ద్వారా కూటమి ప్రభుత్వం అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తోందని కేంద్రం ప్రశంసించింది. ఇప్పటి వరకు మూడు దశల్లో 2,097 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేశాం. నాలుగో దశలో 1,613 గ్రామాల్లో నిర్వహిస్తున్నాం. రీసర్వే సమయాన్ని 90 రోజుల నుంచి 143 రోజులకు పెంచాం' అని వివరించారు.



చిరుత మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వ్యవసాయ క్షేత్రంలో చిరుత మృతి

జుక్కల్, న్యూస్‌టుడే: వ్యవసాయ క్షేత్రంలో చిరుత మృతి చెందిన ఘటన తెలంగాణలో కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలో కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జుక్కల్ మండలం బంగారుపల్లి, దోస్త్‌పల్లి శివారులో కొన్నిరోజులుగా రెండు చిరుతలు సంచరిస్తున్నాయి. ఈ క్రమంలో బంగారుపల్లి శివారులోని వ్యవసాయ క్షేత్రంలో చనిపోయిన చిరుత మృతదేహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు వీడియో తీసి సోమవారం సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. జిల్లా ఇన్‌ఛార్జి అటవీశాఖ అధికారి అరవింద్ సమక్షంలో పశువైద్యాధికారి పండరీనాథ్ మంగళవారం అక్కడకు చేరుకొని చిరుతకు పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే దహనం చేశారు. శాంపిల్స్‌ల్యాబ్‌కు పంపించామని, నివేదిక వచ్చాకే మృతికి కారణం తెలుస్తుందని అరవింద్ చెప్పారు.

భారత్‌లోకి పాక్ ఎయిర్‌లైన్స్ చిహ్నమున్న బెలూన్

ఇంటర్నెట్ డెస్క్: పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ (పీఐఏ) చిహ్నం కలిగిన విమానం ఆకారపు బెలూన్ హిమాచల్‌ప్రదేశ్‌లో కలకలం రేపింది. కులు జిల్లా బష్లా గ్రామంలోని ఓ పొలంలో అనుమానాస్పదంగా ఇది కనిపించింది. భయాందోళనలకు గురైన స్థానిక ప్రజలు సర్పంచి ద్వారా ఇచ్చిన సమాచారంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఆ బెలూన్‌ను స్వాధీనం చేసుకుని పరిశీలించారు. దానిపై పీఐఏ లోగోతో పాటు ఉర్దూ, ఇంగ్లిష్‌లో ఎస్‌జీఏ అని రాసి ఉన్నట్లు గుర్తించారు. ఇలా జరగడం మొదటిసారి కాదని, ఇదివరకు ఇలాంటివి లభించాయని తెలిపారు. అవి ఎందుకు, ఎలా వస్తున్నాయనేది తెలియడం లేదని చెబుతున్నారు.

అన్ని పాఠశాలల్లో బాలికల మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు

ఈనాడు, అమరావతి: ప్రతి పాఠశాలలో బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు నిధులనూ మంజూరు చేసింది. గతేడాది డిసెంబరు 27న జరిగిన జాతీయ ప్రధాన కార్యదర్శుల సమావేశంలో అన్ని బాలికలు, కోఎడ్యుకేషన్ పాఠశాలల్లో బాలికల మరుగుదొడ్లను ఈ ఏడాది మార్చి 8నాటికి పూర్తి చేసేటట్లు చూడాలని ప్రధానమంత్రి ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా పాఠశాల మౌలిక సదుపాయాల కల్పన కమిషనర్ జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.1,302 కోట్లను విడుదల చేశారు.

తుపాకులు, మత విద్వేషం నిరోధానికి ఆస్ట్రేలియా బిల్లులు

మెల్బోర్న్: గత నెలలో సిడ్నీలో 15 మంది యూదులను ఇద్దరు మతోన్మాదులు కాల్చిచంపిన దరిమిలా తుపాకుల కొనుగోలుపై ఆంక్షలు విధించే బిల్లుతోపాటు విద్వేష ప్రసంగాల నిషేధ బిల్లును ఆస్ట్రేలియా పార్లమెంటు మంగళవారం ఆమోదించింది. ఆ కాల్పులకు తెగబడిన ఇద్దరూ తండ్రీ కొడుకులే. కుమారుడు నవీద్ అక్రమ్ (24) ఆస్ట్రేలియా పౌరుడు కాగా, తండ్రి సాజిద్ అక్రమ్ (50) భారతదేశంలో జన్మించి ఆస్ట్రేలియాకు వలసవచ్చిన వ్యక్తి.

182 గజాల స్థలాన్ని..18 గజాలుగా మార్చేశారు..

- రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంపై తెదేపా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వారసత్వంగా తనకు వచ్చిన 182 చదరపు గజాల ఖాళీ స్థలానికి కొలతలు వేసి హద్దులు నిర్ణయించమని దరఖాస్తు చేస్తే.. వేరొకరి వద్ద రూ.10 లక్షలు లంచం తీసుకుని తనకు కేవలం 18 గజాల స్థలం మాత్రమే ఉందని తహసీల్దారు, సర్వేయర్ తప్పుడు నివేదిక ఇచ్చారని కృష్ణా జిల్లా వల్లూరుపాలెం గ్రామానికి చెందిన మంగపతి ఆరోపించారు. న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. పలు ప్రాంతల నుంచి వచ్చిన బాధితుల నుంచి వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఏపీ హజ్ కమిటీ ఛైర్మన్ షేక్ హసన్ బాషా వినతులు స్వీకరించారు.

◆ పూర్వీకుల నుంచి సంక్రమించిన 98 సెంట్ల భూమిని రికార్డుల్లో నమోదు చేయకుండా అధికారులు వేరొకరికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని అనకాపల్లికి చెందిన శ్రీనివాసరావు అర్జీ ఇచ్చారు.

◆ ప్రభుత్వం 45 ఏళ్ల క్రితం ఇచ్చిన ఎసైన్‌మెంట్ భూమికి నీరందక పంటలు ఎండిపోతున్నాయని, సాగునీటి కోసం సమీప వాగు నుంచి పైపులు వేసుకుందామంటే అడ్డుకుంటున్నారని తిరుపతి జిల్లా బాలాయపల్లికి చెందిన రమణమ్మ వినతిపత్రం అందించారు.

◆ తాను రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమికి తహసీల్దారు కార్యాలయంలో పేరు నమోదు చేసినప్పుడు తప్పులు దొర్లాయని, సరిచేయమని తహసీల్దారు, కలెక్టర్‌కు అర్జీలు ఇస్తున్నా ఫలితంలేదని విశాఖ జిల్లా పరవాడకు చెందిన రమేష్ ఫిర్యాదు చేశారు.

◆ లంచం ఇవ్వలేదన్న కక్షతో రికార్డుల నుంచి తమ పేర్లు తొలగించి పూర్వీకుల నుంచి తమ ఆధీనంలోఉన్న భూమిని దేవాదాయ శాఖ రికార్డుల్లో చేర్చారని అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన అప్పారావు ఫిర్యాదు చేశారు.

◆ తన తల్లి మరణానంతరం సంక్రమించిన భూమికి చట్టబద్ధంగా మ్యూటేషన్ చేయాలని కోరుతూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదని పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం ప్రాంతానికి చెందిన సన్యాసిరావు వినతిపత్రం ఇచ్చారు.

◆ ఈనాం భూములు సాగు చేసుకుంటూ వచ్చే ఆదాయంతో స్వామివారి ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తూ, జీవనం సాగించడం కష్టంగా ఉందని, ఆ భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి ప్రభుత్వ పథకాలు, రాయితీలు వర్తించేలా చర్యలు తీసుకోవాలని అమలాపురం పట్టణానికి చెందిన పవన్‌కుమార్, రామనాథశర్మ అర్జీలు ఇచ్చారు. ◆ తనకు, పిల్లలకు న్యాయం చేస్తానంటూ న్యాయవాదిగా పరిచయమైన వ్యక్తి ఒంటరి మహిళనైన తనను నమ్మించి, మోసం చేసి ఇల్లు రాయించుకుని, బంగారంతో పరారయ్యాడని అనంతపురం జిల్లా రాయదర్గానికి చెందిన లక్ష్మి వాపోయారు. న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.

అవాస్తవ నివేదికలతో తప్పుదోవ పట్టిస్తున్నారు

వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

ఈనాడు, అమరావతి: ఐవీఆర్ఎస్ కాల్స్‌లో వస్తున్న ఫలితాలు వాస్తవం కాదని, తప్పుడు రిపోర్టులతో ముఖ్యమంత్రిని కొందరు అధికారులు తప్పుదోవ పట్టిస్తున్నారని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు విమర్శించారు. ఈ నెల 2 నుంచి సెలవులు కూడా తీసుకోకుండా పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామని.. అయినా ఐవీఆర్ఎస్ కాల్స్‌లో ఫీడ్‌బ్యాక్ సరిగా రాలేదని మెమోలు ఇస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల నిజాయతీగా పనిచేసే ఉద్యోగుల మనోభావాలు దెబ్బతింటున్నాయని తెలిపారు.

'సర్పంచుల సమస్యలు పరిష్కరించండి'

ఈనాడు, అమరావతి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి, సర్పంచుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌ను కోరారు. ఈ మేరకు సచివాలయంలో పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, ముఖ్య సలహాదారు జాస్తి వీరాంజనేయులు, కార్యవర్గ సభ్యుడు సాంబశివరావు, కడప జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి పాల్గొన్నారు.

(c) eenadu